



జ్ఞాన యోగం


విచారణ

అద్వైత సిద్ధి








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **మోహన్ పబ్లికేషన్స్** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **మోహన్ పబ్లికేషన్స్** వారి వెబ్ సైట్: http://www.mohanpublications.com/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని
సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt


ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

మోహన్ పబ్లికేషన్స్ వారి వెబ్ సైట్:

http://www.mohanpublications.com/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓం తత్ సత్

అద్వైతసిద్ధి

"జ్ఞానమేకం బ్రహ్మైకం ముక్తిరేకా"

జ్ఞాన మనునది ఒక్కటే. బ్రహ్మ మొక్కటే
కనుక ముక్తియు ఒక్కటే.

ప్రజ్ఞానం బ్రహ్మ

అయమాత్మా బ్రహ్మ

అహం బ్రహ్మాస్మి

తత్త్వమసి

సంపాదకులు :

శ్రీ ఈశ్వరానంద స్వాముల వారు



శ్లో॥ శంకరం శంకరాచార్యమ్ కేశవం బాదరాయణం ।
సూత్ర భాష్య కృతౌ వందే భగవంతౌ పునః పునః ॥

ఉపోద్ఘాతము

అద్వైత సిద్ధాంతాన్ని ఉపనిషత్తులు ప్రతిపాదించుచున్నవను విషయము సర్వవిదితం అద్వైత సిద్ధాంతం అంటే ఏమిటి? ఉపనిషత్తులలోను, మహాభారత ములోను, స్మృతులలోను, పురాణములలోను ప్రధానంగా ప్రతిపాదించబడేది అద్వైతమే. ఒక గ్రంథంలో ద్వైతాన్ని ప్రతిపాదించే వాక్యాలు ఎన్ని ఉన్నా ఆ గ్రంథంలో అద్వైతాన్ని ప్రతిపాదించే ఒకటి రెండు వాక్యాలున్నా గూడ మొత్తం ఆ గ్రంథం అద్వైతాన్నే ప్రతిపాదిస్తునట్లు అంగీకరించాలి. ద్వైత ప్రతిపాదక వాక్యాలన్నీ చిత్తశుద్ధికి ఉపయోగించే కర్మానుష్ఠాన-ఉపాసనలను బోధించడానికి అద్వైతతత్త్వ సాక్షాత్కారానికి ఉపయుక్తములైన సాధనచతుష్టయాదులను బోధించడానికి ఉద్దేశించబడినవి. ఆ విధంగా ద్వైత వాక్యాలను సమన్వయము చేసుకొనవచ్చును. కాని అద్వైత వాక్యాలకు ద్వైతవాక్యాలతో సమన్వయంకుదరదు.

అద్వైతంలోని మూల సిద్ధాంతాలు ఇవి. 1.బ్రహ్మమే అందరికి ఆత్మ 2. ప్రపంచం పైకి కనబడుచున్నది. వాస్తవంలో ఇది మిథ్య 3. మోక్షం జ్ఞానం వలననే లభిస్తుంది 4. జీవాత్మ, పరమాత్మ ఒక్కటే 5. జీవించి యుండగానే ముక్తి పొందవచ్చును 6. ప్రాతిభాసిక సత్యమనియు, వ్యావహారిక సత్యమనియు, పారమార్థిక సత్యమనీ సత్యం మూడు విధాలు 7. హరిహరుల మధ్య భేదం లేదు. ఈ అంశములు ఏ గ్రంథంలో కనబడినా అది అద్వైతత్త్వ ప్రతిపాదక గ్రంథమని నిర్ణయించాలి.

అద్వైత విద్య అనాది సంప్రదాయం ద్వారా లభించినది. అద్వైత విద్య నారాయణ-బ్రహ్మ దేవ-వశిష్ట-పరాశర-వ్యాసాదుల ద్వారా సంక్రమించిన మహావిద్య.

అద్వైత సిద్ధాంత స్వరూప నిరూపణ:

అద్వైత సిద్ధాంతంలో స్వప్న సుషుప్తులకు మంచి సమంజసత్వముంది. స్వప్న సుషుప్త్యవస్థలు అద్వైతసిద్ధాంత జ్ఞానానికిబాగా ఉపకరిస్తాయి. స్వప్నంలో కారణంలేకుండగానే అనేక కార్యాలు కనబడుతుంటాయి. ఎక్కడికి వెళ్లకుండగానే

మనం ఎక్కడికో వెళ్లినట్లు అనుకొంటాము. నిజంగా అక్కడలేని వస్తువులను చూస్తూంటాం. లేనివస్తువులు కనబడడం అనేది స్వప్నావస్థ యొక్క వైశిష్ట్యం. దీని ఉదాహరణతో జాగ్రదవస్థలోని అనుభూతులు గూడ ఇలాంటివేయని మనం గ్రహింపవచ్చును. సుషుప్తిలో జీవునకు బ్రహ్మానికి అభేదం అనుభవంతో కనబడుతుంది. దీనిని బట్టి జాగ్రత్-స్వప్న-సుషుప్త్యాతీతమైన తురీయ స్థితితో నిర్గుణ బ్రహ్మ స్వరూపమే సత్యమనే అద్వైత సిద్ధాంతం పరిపుష్టం అవుతున్నది. బ్రహ్మ సత్యం జగన్మిథ్యా: ఇది అద్వైత సిద్ధాంతంలో ప్రధానమైన అంశం. బ్రహ్మమే సత్యమైనది. జగత్తు మిథ్యా ఇది అద్వైత సిద్ధాంతం.

5. సిద్ధి గ్రంథములు

"సిద్ధి" అను శబ్దమును తమ నామధేయమునకు అంటించుకొన్న 5 గ్రంథములు. ప్రతి ఒకటి ఉపనిషత్తుయందు ఉపదేశించియున్న నిజమైన అద్వైత వేదాంత క్రమమునకు తానే ప్రతినిధిననే హక్కును స్థాపించుకొన్నాయి.

1. బ్రహ్మసిద్ధి: మండన మిశ్రులు
2. నైష్కర్మ్యసిద్ధి: సురేశ్వరాచార్యులు
3. ఇష్టసిద్ధి: విముక్తాత్ములు
4. అద్వైతసిద్ధి: మధుసూదనులు

5. స్వారాజ్యసిద్ధి: గంగాధరేంద్ర సరస్వతి స్వారాజ్యసిద్ధి. పై నాల్గింటివలే ప్రచారములో లేదు. అయినను ఈ అయిదును అద్వైత సిద్ధాంతమునే ప్రతిపాదించుచున్నవి. అ అయిదింటిలో స్వారాజ్యసిద్ధి. సర్వులకు గ్రహించుటకు సులభ ముగా యున్నదను భావనచే ఎక్కువగా స్వారాజ్యసిద్ధి ననుసరించి గ్రంథవిస్తీర్ణ గాకుండుటకు, శ్లోకములను తగ్గించుచు, అర్థమునే ముఖ్యముగా తీసుకొని జిజ్ఞాసువులకు ఉపయోగపడునట్లుగా సులభశైలిలో వ్రాయడమైనది.

"సిద్ధి" యనగా ఎవడైతే బ్రహ్మమును, బ్రహ్మభావమును, పొందుచున్నాడో, అనగా విద్వాంసునకు బ్రహ్మప్రాప్తి అనగా సంశయ, అసంభావనా విపరీత భావనాది వికల్పములు లేకుండ చక్కగా అపరోక్షము చేసికొనినదియు తనకు

నిజరూపమును, నిత్యశుద్ధ, బుద్ధముక్త సచ్చిదానందైకరసమును, నిర్విశేషమును, అద్వితీయమునగు పరబ్రహ్మమునందు ఇదియే నేను అని ఆత్మత్వ బుద్ధిని చేయుటయే. ఆరోపిత దోషముచేత తనను తనకంటె వేరుగా గ్రహించి "దేవదత్తుడు" ఆ దోషమును వర్తింపగా దేవదత్తుడనే నేను అని స్వాత్మయందు ఆత్మబుద్ధి నెట్లు చేయుచున్నాడో అట్లే స్వకీయ అజ్ఞానముచేత నిజరూపమయిన బ్రహ్మమును మరచి గురుకృపచే లభించిన విజ్ఞానముచేత ఆ అజ్ఞానము నివర్తింపగా స్వస్వరూపమగు బ్రహ్మమునందు ఆత్మబుద్ధిని చేయుచున్నాడు. ఆత్మబుద్ధిని చేయుటయే అనగా ఇదియే నేను అనెడి దృష్టి గలవాడగుటయే విద్వాంసునకు బ్రహ్మప్రాప్తి అగును. కాని, ధనమువలె ప్రాప్తించునది కాదు. ఎట్లనగా బ్రహ్మమును పొందునట్టి విద్వాంసునకు బ్రహ్మము నిజరూపమే యైయున్నందున నిత్యప్రాప్తమే యైనవస్తువు ప్రాప్తించునను ఈ కల్పన అయుక్తమగును. కావున మరచిన కంఠాభరణమును పరామర్శ చేసి, ఇదిగో ఉన్నది దొరికినది. అనునట్లే అజ్ఞానంచే భిన్నముగా గ్రహింపడిన స్వస్వరూపమగు బ్రహ్మమునందు విచారజన్య జ్ఞానంచేత మరల ఈ బ్రహ్మమే నేననెడి నిశ్చయమేర్పడుటయే బ్రహ్మసిద్ధియగును. ఇట్టి యీ అద్వైతసిద్ధిని బ్రహ్మవేత్తయైన యతి, సన్యాసంచేత నిరంతర బ్రహ్మనిష్ఠచేత ఏర్పడిన సమ్యదర్శనము చేతనే పొందుచున్నాడు.

ఏ పద్ధతిచేతనైతే విశుద్ధ బుద్ధి ద్వారా బ్రహ్మమును పొందుచున్నాడో, అట్లు ఆ జ్ఞాన నిష్ఠ సిద్ధించు పద్ధతిని, విశుద్ధ బుద్ధిగల సూక్ష్మగ్రాహికి పెక్కు సాధనలు ఆవశ్యకము గాన విస్తారముగాగాక, సంక్షిప్తముగానే స్వల్ప గ్రంథము చేతనే బాగుగా దెలుసుకొనుము. పుట్టుకలవారికి అందరకు ఉపకారం చేయు వానిలో పరమార్థ ప్రకాశికమైన అద్వైతవిద్య పరమోపకారిణి. తత్త్వ జిజ్ఞాసువులకు ఆనందపరాకాష్ఠ దేనిచో కలుగునో అది పరమార్థము. క్లేశముల ననుభవించు జీవుల యొక్క క్లేశములన్నింటిని నివారించునదియే పరమోపకారము. ఏకతత్త్వమును దర్శించువానికి మోహము శోకము అనునది యుండవు.

ఈగ్రంథమునందు అధ్యాసగురించి ఎక్కువగా వ్రాయుట జరిగినది. సర్వ అనర్థములకు అధ్యాసమే కారణము కావున ఈ అధ్యాస యథార్థజ్ఞానం వలననే నశించును గాన అధ్యాసయననేమో విచారించుదాము.

అధ్యాస విచారణ

1. అధిష్ఠానము కంటె విషమ సత్తాగల అవభాసమును అనగా విషయము విషయజ్ఞానము అధ్యాసయనబడును. (అధ్యస్తమగు విషయమును, ఆ విషయము యొక్క జ్ఞానమును కూడియే అధ్యాస) అనగా అధిష్ఠానమైన రజ్జువు వ్యవహారిక సత్తాగలది. రజ్జువునందు దోచిన సర్పము ప్రాతిభాసిక సత్తాగలది. రజ్జువు సర్పము ఇవి రెండును సమసత్తలు కావు. విషమ సత్తాలు. రజ్జువునందు సర్పము తోచినపుడు ఇదమాకారమగు వృత్త్యవచ్ఛిన్న చైతన్యమునకు అభిన్నమగు రజ్జ్వవచ్ఛిన్న చైతన్యము సర్పమునకు అధిష్ఠానమగును. కాసరజ్జువు అధిష్ఠానము కాదు. సకల పదార్థములకు చైతన్యమొక్కటి మాత్రమే అధిష్ఠానముగా నుండ వలయును. కాని జడపదార్థము మరియొక జడపదార్థమునకు ఎప్పటికినీ అధిష్ఠానముగా నుండజాలదు. కావున ఆచైతన్యమే పారమార్థిక సత్తయనబడును. ఆ రజ్జ్వవచ్ఛిన్న చైతన్యమునందు అధ్యస్తములైన సర్పమును, సర్పజ్ఞానమును ప్రాతిభాసిక సత్తా గలదియగును. కావున అది సత్తకంటె విషమసత్త గలదిగా నుండుటచే అధ్యాస అనబడును.

2. తన అభావము యొక్క అధికరణమందు ఏ అవభాసము గలదో దానిని "అధ్యాస" అనియందురు. అనగా తానులేనిచోట (అధికరణములో) తానున్నట్లు తోచుటను 'అధ్యాస' అని చెప్పుదురు.

ఉదా: అధికరణమైన శుక్తియందు రజతము లేదు. కాని వున్నట్లు తోచినది. అదియే అధ్యాస. రజ్జువునందు సర్పము అభావము. అయినను అధికరణమైన రజ్జువునందు సర్పము తోచినది. ఇట్టిదానినే "అధ్యాస" అనియందురు.

అధికరణము: భ్రాంతి కలుగుటకు ఆశ్రయమైన పదార్థమును అధికరణము (అధిష్ఠానము) అనియందురు. అది వ్యావహారిక సత్తా కలదిగానైనను,

పారమార్థిక సత్తాగలదిగానైనను వుండవచ్చును. కేవలము రజ్జువుగాని, బ్రహ్మముగాని సర్పమునకును, లేక జగత్తునకును అధిష్ఠానముగా లేదు. తూలా అవిద్యతో కూడిన రజ్జువు సర్పమునకును, మూలవిద్యతో కూడిన బ్రహ్మచేతనము జగత్తు నకును అధిష్ఠానములై యున్నవి.

కారణకార్యాధ్యాసలు: ప్రపంచమునకు కారణమైన ఏ అధిష్ఠాన విశేషరూప అజ్ఞానముగలదో దాని అధ్యాసమును కారణాధ్యాసము అందురు. అజ్ఞాన కృతమైన స్థూలసూక్ష్మ ప్రపంచముయొక్క భ్రమయేది గలదో, దానిని కార్యాధ్యాస యనియు చెప్పుదురు.

అధ్యాసయొక్క సామాన్య లక్షణము: ఒక వస్తువునందు మరియొక వస్తు జ్ఞానము మిథ్యా జ్ఞానమనబడును. రజ్జువునందు యిది సర్పమనెడి జ్ఞానము మిథ్యాజ్ఞానము. ఈ మిథ్యాజ్ఞానమునకు భ్రాంతి జ్ఞానమని పేరు కూడా కలదు. కావున భ్రాంతి జ్ఞానమునకు విషయమైన మిథ్యా వస్తువు మరియు భ్రాంతి జ్ఞానము యీ రెండునుచేరి అధ్యాసయని చెప్పబడును. ఈ అధ్యాస 'అర్థాధ్యాస' 'జ్ఞానాధ్యాస' అని రెండు విధములు. అందు కేవలము (భ్రాంతి జ్ఞాన విషయ మైన సర్పాది) మిథ్యా వస్తువు అర్థాధ్యాసమని చెప్పబడును. మరియు **1.** అర్థా ధ్యాస, స్వరూపాధ్యాసము **2.** సంసర్గాధ్యాసము అని రెండు విధములు. జ్ఞానాధ్యాస పరోక్ష, అపరోక్షాది భేదము వలన అదియు రెండు విధములు. అందులో అర్థాధ్యాస యొక్క భేదములైన **1.** స్వరూపాధ్యాస **2.** సంసర్గాధ్యాస అను రెండును కలసి **1.** కేవల సంబంధా ధ్యాసము (సంసర్గా ధ్యాసము) **2.** సంబంధసహితసంబంధి అధ్యాసము **3.** కేవలధర్మాధ్యాసము **4.** ధర్మసహిత ధర్మ్యధ్యాసము **5.** అన్యోన్యాధ్యాసము **6.** అన్యతరాధ్యాసము అని ఆరువిధములు.

స్వభూపాధ్యాసము: ఏ పదార్థము యొక్క స్వరూపము అనిర్వచనీయమై పుట్టుచున్నదో దానిని స్వరూపాధ్యాసమందురు. అనగా జ్ఞానముచే బాధ యగుటకు యోగ్యమైన వస్తువు అధిష్ఠానమునందు స్వరూపముచే అధ్యస్తమగు చున్నది.

ఉదా: రజ్జువునందు సర్పము స్వరూపతః అనిర్వచనీయము పుట్టుచున్నది. ఆలాగున ఆత్మయందు అహంకారాద్యనాత్మ పదార్థములు స్వరూపతః అనిర్వచనీయములై పుట్టుచున్నవి. అనగా దేహాదులైన అనాత్మ పదార్థములకు ఎప్పటికిని అధిష్ఠానాత్మయందు స్వరూపాధ్యాసమే యగుచున్నది.

1) కేవల సంబంధాధ్యాస (సంసర్గాధ్యాసము): జ్ఞానముచే బాధయగుటకు అయోగ్య వస్తువు యొక్క స్వరూపము అధిష్ఠానమునందు అధ్యస్తము కానేరదు. అయినను దానియొక్క సంబంధము మాత్రము అధ్యస్తమగుచున్నది. కనుక అనాత్మయందు ఆత్మయొక్క సంసర్గాధ్యాస కలుగుచున్నది. అనగా పూర్వసిద్ధమైన స్వరూపముగల పదార్థము వ్యవహారికమైనదిగాని, పారమార్థికమైనదిగాని యేదైనను దానితో అనిర్వచనీయ సంబంధము యేర్పడినచో దానిని సంసర్గా ధ్యాసమనియు లేక కేవల సంబంధాధ్యాస యనియు చెప్పుదురు.

ఉదా: ముఖమును, అద్దమును యీ రెండు పదార్థములు పూర్వ సిద్ధములై వ్యావహారిక సత్తాగలవిగా నున్నవి. ముఖమునకు అద్దముతో యెట్టి సంబంధము లేకపోయినను అద్దమునందు ముఖము యొక్క అనిర్వచనీయ సంబంధము తోచుచున్నది. అనగా అద్దమునందు ముఖమునకుగాని, ముఖమునందు అద్దమునకుగాని అధ్యాసకలుగకున్నను అద్దమునందు ముఖము యొక్క ప్రతిబింబరూప సంబంధము మాత్రము ప్రతీతి యగుచున్నది. ఇట్లు సంబంధము మాత్రమే అనిర్వచనీయముగా పుట్టినచో, దానిని సంసర్గా ధ్యాసయనియు కేవల సంబంధాధ్యాసయనియు అందురు.

ఉదా: "లోహితఃస్ఫటిక": ఈ స్థానమునందు దాసాని పుష్పము, స్ఫటికము పూర్వ సిద్ధములై వ్యావహారిక సత్తాగలవిగా నున్నవి. అయితే పుష్పము యొక్క రంగు ఎఱుపు. స్ఫటికముయొక్క రంగు తెలుపు. ఈ రెండు పదార్థములకు పరస్పరము సంబంధము కూడా లేదు. అయినను ఒకదాని దగ్గర ఇంకొకటి జేర్చినప్పుడు స్ఫటికము ఎఱ్ఱగా కన్పించును. వస్తువులు ఒకదానియందొకటి అధ్యాసకాకున్నను పుష్పము యొక్క యెఱ్ఱదనము మాత్రము స్ఫటికమునందు అధ్యాసయైనది. ఇట్లు పదార్థముల స్వరూపము అనిర్వచనీయముగా పుట్టక

సంబంధము మాత్రము అనిర్వచనీయమై తోచినయెడల దానిని సంసర్గా ధ్యాసయనియు కేవల సంబంధా ధ్యాసయనియు చెప్పుదురు.

అట్లే అధిష్ఠానాత్మ (కూటస్థ చైతన్యము) పారమార్థిక సత్తాగలది. అహంకారము వ్యావహారిక సత్తాగలది. కూటస్థ చైతన్యమునకు అహంకారముతో అధ్యాస కలుగకపోయినను చైతన్యము యొక్క అనిర్వచనీయమగు సంబంధము అహంకారమునందు అధ్యస్తమగుచున్నది. అందువలన చైతన్యమునందున్న అధిష్ఠానాత్మత్వము అహంకారములో ప్రతీతమగుచున్నది. చైతన్యము కల్పితము కాదు. కాని అహంకారాదులలో అధిష్ఠానాత్మ చైతన్యమునకు గల తాదాత్మ్య సంబంధము మాత్రము కల్పితము. ఈ విధంగా అనాత్మలగు అహంకారాదులతో ఆత్మచైతన్యమునకు స్వరూపముగా అధ్యాస కలుగుటలేదు. తాదాత్మ సంబంధము మాత్రమే అధ్యస్తమగుచున్నది. దీనిని సంసర్గా ధ్యాసయనియు, కేవల సంబంధా ధ్యాసయనియు అందురు.

2. సంబంధ సహితసంబంధి అధ్యాస: అధిష్ఠానాత్మయందు అనాత్మ పదార్థముల యొక్క సంబంధమును, స్వరూపమును రెండును అధ్యస్థములగు చున్నవి. బ్రహ్మాత్మ స్వయముగా అసంగ పదార్థమగుట వలన దానితో ఏ అనాత్మ పదార్థము యొక్క సంబంధమును ఘటిల్లదు. అయినను గ్రహమైత్రీన్యాయమున బ్రహ్మ రూపాత్మతో అవిద్యయొక్క తాదాత్మ్య సంబంధమును, సంబంధియైన అవిద్యయు బ్రహ్మాత్మయందు అధ్యస్తములగుటచే ఆత్మయందు అనాత్మ పదార్థముల యొక్క స్వరూపమును, సంబంధమును అనిర్వచనీయముగ కలుగు చున్నవి. కాన నిదిసంబంధసహిత సంబంధ్యధ్యాసయని చెప్పబడును.

గ్రహమైత్రీన్యాయమనగా జ్యోతిశ్శాస్త్రమునందు గ్రహమైత్రి ప్రకరణములో ఒక గ్రహము యింకొక గ్రహముతో మిత్రత్వము ఎఱుంగుచున్నది. అయినను ఆగ్రహము దీనితో మిత్రత్వము ఎఱుగదు. అట్లే అవిద్య తాను బ్రహ్మముతో సంబంధము కలదగుచున్నది. కాని బ్రహ్మము అవిద్యతో సంబంధపడలేదు. ఇట్లు వేదాంతశాస్త్రకారులచేత బ్రహ్మ–అవిద్యలయొక్క సంబంధము కల్పితముగ చెప్పబడినది. పైజెప్పిన కల్పిత సంబంధముచేత బ్రహ్మము యొక్క అసంగత్వ

మునకు లేశము కూడా దోషములేదు. ఇట్టి కల్పిత సంబంధమునకు గ్రహమైత్రీ న్యాయమని పేరుకలదు.

3. కేవల ధర్మాధ్యాస: “నేను కుంటివాడను – నేను గ్రుడ్డివాడను. నేను మూగవాడను, నేను చెవిటివాడను” అని లోకానుభవములో ఇంద్రియ ధర్మములు ఆత్మయందు ఆరోపితములైనట్లు కన్పించుచున్నవి. కాని ‘నేను కాలు, నేను కన్ను, నేను చెవి, నేను వాక్కు’ అని ఎవరికిగాని ఇంద్రియములందు అధ్యాస కలిగినట్లు కానము. అట్లే “నేను నల్లనివాడను, ఎఱ్ఱనివాడను, నేను పొట్టివాడను, నేను పొడగరిని, నేను పురుషుడను, నేను స్త్రీని, నేను బ్రాహ్మణుడను” అని దేహధర్మములు మాత్రము అధిష్ఠానాత్మయందు అధ్యస్తమైనట్లు లేదు. నిజమునకు సమస్త ప్రపంచమును తత్పదార్థమగు బ్రహ్మ చైతన్యమునందు అధ్యస్తమైనట్లు, దేహేంద్రియాదులును త్వం పదార్థమగు ప్రత్యగాత్మ యందు అధ్యస్తమైనట్లు లేదు. నిజమునకు సమస్త ప్రపంచమును తత్పదార్థమగు బ్రహ్మ చైతన్యమునందు అధ్యస్తమైనట్లు, దేహేంద్రియాదులును త్వం పదార్థమగు ప్రత్యగాత్మయందు అధ్యస్తములైనట్లు అగుపడక వాని ధర్మములు మాత్రమే అధ్యస్తములైనట్లు లోకానుభవమున తెలియబడుచున్నది. ఇట్లు ధర్ములగు ఇంద్రియములును, దేహమునకును అధ్యాసకలుగక, దేహేంద్రియాదుల యొక్క ధర్మములు మాత్రమే ప్రత్యగాత్మయైన తనయందు అధ్యస్తమగుటచే నిది కేవల ధర్మాధ్యాస యనబడును.

4. ధర్మసహిత ధర్మ్యధ్యాస: సంకల్పించుట మనస్సుయొక్క ధర్మము. మనస్సు ధర్మి. నిశ్చయించుట బుద్ధి ధర్మము. బుద్ధి ధర్మి. జ్ఞప్తికి తెచ్చుకొని చింతించుట చిత్తము యొక్క ధర్మము. చిత్తము ధర్మి, నేను కర్తను, నేను భోక్తను అని కర్మల యందలి కర్తృత్వమును, కర్మఫలములయందలి భోక్తృత్వమును, అభిమానించుట అహంకారము యొక్క ధర్మము. అహంకారము ధర్మి. ఇట్లు అంతఃకరణ ధర్మములు స్వరూపముతో అధిష్ఠానాత్మయందు అధ్యస్తములగుట వలన అధిష్ఠానాత్మయగు తానే సంకల్పించినట్లును, నిశ్చయించినట్లును, చింతించినట్లును, నేను నేనని అభిమానించినట్లును, అధ్యాస కలుగుచున్నది. లోకములో

నేననెడి అహంకారము అట్లే నేను కర్తను, నేను భోక్తను అను అహంకార ధర్మములు కూడా ఆత్మయందు అధ్యస్తములైనట్లు తెలియబడుచున్నది. కావున అంతఃకరణము తన ధర్మములతో కూడా తాను అధిష్ఠానాత్మయందు అధ్యస్త మగుటయే ధర్మసహిత ధర్మ్యధ్యాసమనబడును.

5. అన్యోన్యాధ్యాసము: లోహాగ్ని న్యాయమున అధిష్ఠానాత్మ యందు అనాత్మ పదార్థముల యొక్క అనిర్వచనీయ సంబంధమును కూడి అన్యోన్యాధ్యాస యన బడును. అనగా అనాత్మయొక్క ధర్మములు ఆత్మయందు, ఆత్మయొక్క ధర్మములు అనాత్మయందు ప్రతీతమగుట అన్యోన్యాధ్యాసము.

ఉదా: దుఃఖము–ద్వైతము ఇవి అనాత్మయైన అంతఃకరణ ధర్మములు. ఇవి ఆత్మయొక్క ఆనందము. అద్వైతము అనువీనియందు స్వరూపముచే అధ్యస్తమై వీనిని మూయుచున్నవి. మరియు సత్తు, చిత్తు ఇవి ఆత్మధర్మములు. అనగా ఆత్మలక్షణములు. ఇవి అనాత్మయొక్క అసత్తు, జడములయందు సంబంధ ద్వారమున అధ్యస్తములై వానిని మూయుచున్నవి. ఇదియే అన్యోన్యా ధ్యాస. ఈ అధ్యాసయందు సంసర్గాధ్యాసము, స్వరూపాధ్యాసము రెండును చేరియున్నవి.

6. అన్యతరాధ్యాసము: అన్యోన్యాధ్యాసయందు ఒకదాని యొక్క స్వరూపా ధ్యాసకు "అన్యతరాధ్యాస" అనిపేరు. అనగా అనాత్మలైన అహంకారాదులందు (అంతఃకరణమునందు) ఆత్మ యొక్క స్వరూపము అధ్యస్తము కానేరదు. కాని అధిష్ఠానాత్మ యందు మాత్రము అహంకారాద్య నాత్మ పదార్థముల యొక్క స్వరూపము అధ్యస్తమగుచున్నది. కావున నిది అన్యతరాధ్యాసము అనబడును.

ఈ చెప్పబడిన అధ్యాసలు ఆరును అర్థాధ్యాస యొక్క భేదములు. ఇందు "కేవల ధర్మాధ్యాసము, ధర్మసహిత ధర్మ్యధ్యాసము, అన్యతరాధ్యాసము" అను యీ మూడును స్వరూపాధ్యాసలో అంతర్భూతములు. కేవల సంబంధాధ్యాసము మాత్రము సంసర్గాధ్యాస యగును. సంబంధసహిత సంబంధ్య ధ్యాసము, సంసర్గా ధ్యాస సహితమగు స్వరూపాధ్యానమగును. అనగా అనాత్మ లక్షణములు అధిష్ఠానాత్మ యందు అనిర్వచనీయములుగా పుట్టుట సంసర్గా ధ్యాసముగను, అనాత్మయొక్క స్వరూపము అధిష్ఠానాత్మ యందు అనిర్వచనీయముగా బుట్టుట

స్వరూపాధ్యాసముగాను వున్నది. కనుక సంబంధ సహిత సంబంధ్య ధ్యాసమున **1.** స్వరూపా ధ్యాసమును **2.** సంసర్గా ధ్యాసమును ఈ రెండును జేరియున్నవి. స్వరూప సంసర్గాధ్యాసలు రెండును చేరి అన్యోన్యాధాసయగును. ఈ చెప్పబడిన అధ్యాసన్నియు అనోన్యాధాసయందు అంతర్భూతములై యున్నవి.

సత్యమైన అధిష్ఠాన రూపపరశివతత్త్వము, అసత్యమైన అహంకారాద్య నాత్మలు చీకటి వెలుతురువలె అత్యంత విరుద్ధ స్వభావములు గలవి. అయినను అహంకారము ఆత్మానాత్మల గ్రంథి కాబట్టి అహంకారమునందు ఆత్మయును, అనాత్మయును కలిసియున్నట్లు పరస్పరము అన్యోన్యాధ్యాసచేత ప్రతీతమగు చున్నది. కాని నిజమును విచారించి చూచినచో, ఆత్మానాత్మలకు ఎట్టి సంబంధమును లేదు. "అహం" శబ్దము కర్తృత్వ భోక్తృత్వములతో కూడిన చిదాభాసుని (జీవుని) చెప్పుచున్నది. ఆత్మకేవల జ్ఞాన స్వరూపుడు. సర్వసాక్షి. సర్వాంతరము (ప్రత్యక్కు) అది సూర్యకాంతివలె అనాత్మను, అనాత్మయొక్క ధర్మములను ప్రకాశింప చేయుచున్నది. తనచేత ప్రకాశింపబడు లోక వ్యవహార ముతో సూర్యునకు యెట్టి సంబంధములేదు. కాబట్టి సూర్యుడు లోక వ్యవహార మునకు కర్తకానట్లే తన వలన ప్రకాశింపబడు అనాత్మ యొక్క వ్యవహారము నకును అధిష్ఠానాత్మ యనబడు పరబ్రహ్మము కర్త కాదు. కనుక తత్ఫల భోక్త కూడా కాడు లోకమున సాక్షి యగువాడు తన సాన్నిధ్యమునందు జరుగు వ్యవహారము నందెట్టి సంబంధము లేక దానిని చూచుచు మాత్రముండినట్లుగా, అధిష్ఠానాత్మ కూడా సాక్షిమాత్రుడు. సర్వవ్యాపి. కర్తృత్వ భోక్తృత్వములు లేని వాడు. దేహేంద్రియమనోబుద్ధి రూప సంఘాతము కర్తృత్వ భోక్తృత్వ విశిష్టమగు అహంకారము కూడా అనాత్మయే. అందువలన అనాత్మ విషయము, ఆత్మ విషయము, సత్యజ్ఞానానందాద్వితీయములు నాలుగును ఆత్మ లక్షణములు. అనృత జడదుఃఖద్వైతములు నాలుగు అనాత్మ లక్షణములు. కావున అనాత్మ యందు ఆత్మబుద్ధిని విడిచిపెట్టి ఆత్మయైన తాను బ్రహ్మమని తెలిసి నిత్యముక్తులై ఆత్యంతిక దుఃఖ నివృత్తి–పరమానంద ప్రాప్తి రూపమోక్షమును స్వానుభవమున తెలిసి బ్రహ్మానంద స్వరూపులై విరాజిల్లుదురుగాక!

– ఈశ్వరానంద స్వామి

: ఓం తత్ సత్ :

ఓం తత్సత్

అద్వైతసిద్ధి

అధ్యారోపప్రకరణము

అథమోక్ష సాధనోపదేశ విధిం వ్యాఖ్యాస్యామో ।
ముముక్షుణాం శ్రద్ధ ధానానా మర్థినా మర్థాయ ॥

అథశబ్దము, ఓంకారము అను ఈ రెండును పూర్వకాలమున బ్రహ్మ కంఠము నుండి వెలువడుట వలన మంగళప్రదములు. విస్తారముగా అనేక శాస్త్రములను వివరించిన పిమ్మట అని అథశబ్దమున కర్థము. మోక్షమనగా ప్రపంచరహిత బ్రహ్మాత్మత్వ స్ఫురణము. దీనికి సాధనము ఉపనిషత్ప్రతిపాద్యమగు ఆత్మజ్ఞానము. నామరూపరహితమైన పరబ్రహ్మమే విషయము. సాధన సాధ్యమగు అజ్ఞాన నివృత్తియే ఫలము. ఎట్లనగా సిద్ధవస్తువైన బ్రహ్మము ఇతర సాధనములతో సాధ్యము కానందున ఆ సిద్ధవస్తువును ఆవరించిన అజ్ఞానము తొలగి బ్రహ్మ భావప్రాప్తి కలుగుటయే ప్రయోజనము! శ్రద్ధ కలిగి తత్త్వార్థమును దెలియగోరు ముముక్షువు అధికారి. ముముక్షువనగా ధర్మార్థ, కామమోక్షములనెడి పురుషార్థములలో మోక్షమునే కోరువాడు. శ్రద్ధ గలవారనగా కర్మోపాసనలు చేయుటయందుగాని, ఇతర శాస్త్రములను చదువుట యందు గాని శ్రద్ధ లేక తత్త్వశాస్త్రమునందే మిగుల ఆసక్తి గలవారలు. పాండిత్యము వలన కీర్తిని కోరు వారికి ఈ తత్త్వశాస్త్రము నందధికారము లేదు. కృషివలన గలిగిన సస్యాదులును, యాగము వలన గలిగిన స్వర్గాదులు ఇవన్ని సాధనములచే బుట్టింపబడినందున అనిత్యములగుటచే వీని యందు వాంఛలేనివాడును, పుత్రార్థమై వివాహమందు వాంఛ పుత్రేషణ, యాగాది కార్యములు చేయుటకు ధనమందును, అపరవిద్య యందునుగల కోరిక విత్తేషణ, పుత్రులచేతను, యాగాది హేతువగు అపరవిద్య చేతను ఈ లోకమును, పితృలోకమును, దేవలోకమును గోరుట లోకేషణ వీనిని వదిలినవాడు అధికారి. "నకర్మణా, నప్రజయా, ధనేన త్యాగేనైకేన అమృతత్త్వ మానశుః" అను శ్రుతి దీనికి ప్రమాణము. 'సన్యాసమును గ్రహించినవాడు'

అను విశేషణముచే ద్వైతవాదులకు అద్వితీయాత్మ తత్త్వోపదేశ గ్రహణమంద ధికారము లేదని తెలియవలెను. అధికారికి, విచారణమునకు కర్తృ కర్తవ్య భావసంబంధము కలదు. అధికారికిని, ప్రయోజనమునకును ప్రాప్యప్రాపక భావసంబంధము ఉన్నది. అజ్ఞాన నివృత్తి-బ్రహ్మభావప్రాప్తి రూపప్రయోజనము ప్రాప్యము. అధికారి ప్రాపకుడు. గ్రంథమునకు జ్ఞానమునకు జనకజన్య భావసంబంధముకలదు. జ్ఞానమునకు గ్రంథము జనకము. జ్ఞానము జన్యము. ఇట్లు వేదాంత ప్రక్రియాను సారము జిజ్ఞాసువులకు గ్రంథపఠనమున ప్రవర్తింప చేయుటకై అనుబంధ చతుష్టయమును మంగళాచరణ రూపమున నిరూపించ డమైనది.

అవతారిక: నమస్కారమను మిషచే వస్తునిర్దేశమను మంగళము చేయుచు ఈ గ్రంథమున చెప్పబోవు విషయమును ప్రయోజనమును సూచించుచున్నారు.

యస్మాద్విశ్వముదేతి యత్ర నివసత్యంతే యదప్యేతియ
తత్త్వజ్ఞాన సుఖ స్వరూపమనఘ ద్వైత ప్రణాశోజ్ఝితమ్ ।
యజ్జాగ్రత్స్వపన ప్రసుప్తిషు విభాత్యేకం విశోకం పరం
ప్రత్యగ్బ్రహ్మత దస్మియస్య కృపయాతందేశి కేంద్రం భజే ॥

"యతోవా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి యత్ప్రయం త్యభి సంవిశంతి ॥" అను శ్రుత్యానుసారముగా ఈసకల ప్రపంచము పర బ్రహ్మము నుండి పుట్టును. పరబ్రహ్మమందే స్థితి కలిగి యుండును. అవసాన కాలమందా పరబ్రహ్మమందే లయమగును. పరబ్రహ్మము జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయములకు కారణమయి ఉన్నను దేశకాల వస్తుపరిచ్ఛేదములు లేక సత్యజ్ఞానానంద రూపమయి ఉండును. ఇట్టి పరబ్రహ్మము ఈ జగములను బుట్టించి తాను జీవుల శరీరములో ప్రవేశించి జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడ వస్థలలో ఒకే రూపమున ఎల్లప్పుడు భాసించుచుండును. అట్టి పరబ్రహ్మ మును గురూపదేశముననే దెలియ వలెను గాని ఇతర సాధనములచే సాధ్యము కాదు. అట్టి గురుదేవులను ఎల్లవేళల సేవింతును.

యస్యదేవే పరాభక్తిర్యథాదేవే తథా గురౌ ।
తస్యైతే కదితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥

అను శ్రుతియు, పరమార్థమును దెలియుటకు దైవభక్తియు, గురుభక్తియు కారణమనుచున్నది. అట్లు గురువును దైవతుల్యముగ సేవించు శిష్యునకు సంసారమందలి జననమరణాది దుఃఖములు నశించి వైరాగ్యమంకురించును. హృదయమున నెలకొనియున్న పర మాత్మను నిరంతరము ధ్యానింప జ్ఞానముదయించునుగాని యెప్పుడో ఒకప్పుడు ధ్యానింపఫలము పుట్టజాలదు. జ్ఞానఫలము కేవల సుఖ రూపమగు స్వప్రకాశాత్మరూపము కాని, కర్మఫలమువలె నశాశ్వతమైనది కాదు.

"యావదాయుస్త్రయో వంద్యా వేదాంతో గురురీశ్వరః।"

అను శ్రుతియు ఆయుష్యందు పర్యంతము గురువేదాంతములు గౌరవింపదగినవి యనుచు యావజ్జీవము గురుసేవ చేయవలయుననుచున్నది. యావజ్జీవము గురుసేవ సల్పుచూ బ్రహ్మచర్యమాచరించు నతడు నైష్ఠిక బ్రహ్మచారి యనబడును. "పరీక్షలోకాన్" అను శ్రుతి తెలిపినట్లు జనన మరణాదులందలి వేదనలను పలుసార్లు పరికింప వైరాగ్య ముదయించును. వైరాగ్య సంపన్నులు "సతద్విజ్ఞానార్థం గురు మేవాభి గచ్ఛేత్" అను శ్రుత్యర్థానుసారము తత్త్వమును తెలుసుకొనగోరి గురువు చెంతకు చేరుదురు. గురువను గ్రహము బడసి గురుముఖతః శ్రవణ మననాదులను ఆచరించి జీవన్ముక్తులయి విదేహ కైవల్యమును బొందుదురు. దృఢముగ గ్రహింపబడిన విద్య తన శ్రేయస్సు కొరకును శిష్య పరంపరోపయోగము కొరకును ఉపయోగించును. శిష్యపరంపరకిచ్చిన విద్య తాను నదిని దాటుటకుపయోగించుకొను నావ సముద్రములో మునిగిపోవు ఇతరులను కూడ ఉద్ధరించునట్లుగా ఇతరులను కూడ పరమపదమును పొందించుటకై ఉపయోగించును. ఇదియే విద్యా సంతతి. ఇట్లు పరీక్షితుడగు శిష్యునకు విద్యనియ్యవలెను గాని, ధనలోభాధికముచేత ఎవరికో ఒకనికి ఇయ్యగూడదు. ఎవరైన సముద్ర పర్యంతమును ధనపూర్ణమునగు భూమి ఇచ్చినాగాని వారికి కూడ ఈ బ్రహ్మవిద్యను ఇయ్యరాదు. ఏలయనగా ఈ బ్రహ్మవిద్య విత్తపూర్ణ భూదానము కంటె అధికము. ఆకాశాది పంచభూతములకును భౌతికములకును ఆధారమగు బ్రహ్మమును బోధించుటకు నీ భూమాత్ర దానము సమానము కాదని భావము. "పాదోనస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి" అను

శ్రుతి సకల ప్రపంచముకంటె బ్రహ్మ మతీతమని చెప్పుచున్నది. గురుకృపచే విద్యనుపదేశింపనేల? శాస్త్ర ప్రమాణము వలన నేర్చుకొనరాదా? అనిన అట్లు స్వయముగ నేర్చు కొనిన విద్య జార గర్భమువలె వన్నెకెక్కదనియు, ఆచార్యుని వలన నేర్చుకొనిన విద్యయే స్థిరమగునదనియు శ్రుతులు చెప్పుచున్నవి. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా, ఉపదేక్ష్యంతితే జ్ఞానంజ్ఞానినస్తత్త్వదర్శినః" వినయపూర్వకముగ ప్రార్థించిన యెడల సద్గురువులు నీకు తత్త్వమునుపదేశింతురని గీతావాక్యము చెప్పుచున్నది. పూర్వజన్మ మందు, ఈ జన్మమునందును సంపాదింపబడినట్టి అధర్మము, స్వేచ్ఛాచారము, స్వేచ్ఛా సంభాషణము, స్వేచ్ఛాభక్షణ రూపమగు ప్రమాదమును, స్తుతినిందలవలన కలిగెడి ఆనందము ను, దుఃఖములనెడి దేహాభిమానమును, అహంకారము, దంభము, ద్వేషము, అసూయలనెడి జ్ఞానవిరుద్ధ గుణములను వదలునట్లు ఏ శ్రవణానిశ్చయము గలదో దానిని మంచి యుక్తులచే దొలగించి వివేకమును కలిగింపవలయును. త్వం పదముయొక్క లక్ష్యార్థమును బోధించుటచేత జాతి, కులాభిమానములను విడిపించవలెను. ఇతరులను ధిక్కరింపకుండుట ఆది పదముచే గ్రహింపవలెను. తీర్థయాత్రాచాంద్రాయణాధికములును, ఉపవాసాధికములును దేహాభిమానము ను పెంచుచూ జ్ఞానమున కవరోధముగ నుండును గాన జ్ఞాని వీని నాదరింప రాదు. తత్త్వజ్ఞానమును దెలియగోరినవారు ఇటువంటి గురువును ఆశ్రయింప వలెనని యిచట నియమింపబడుచున్నది. కాని ఇంతకు మునుపే కృతార్థుడయిన గురువునకీ నియమములతో పనియేలేదు. శిష్యునకుపదేశించునపుడు బోధాను కూలములగు యుక్తులను గల్పించుట, సిద్ధాంత ప్రతికూల వాక్యములను నిరాకరించు శక్తి, శిష్యుడు చేయు ప్రశ్నములను, ఆక్షేపములను వెంటనే నిశ్చ యించు శక్తి, దుఃఖమును దొలగింపబూనుట, ఆది పదముచే శరణు పొందిన శిష్యుని కరుణచే విడువకుండుట మొదలగునవి ఆచార్యుని గుణములు. మహావాక్యార్థ శ్రవణమువలన ప్రత్యగాత్మ తత్త్వము నెఱింగినవాడును, "బ్రహ్మై వాహమస్మి" అని దృఢమైన అపరోక్షాత్మానుభవము గలవాడు గురువనబడును. సచ్ఛిష్యునకు బోధించుట కంటె నన్యమగు కర్తవ్యాంశము ఏమియు లేనివాడును, విద్యను

నశింపక కాపాడువాడునై యుండవలెనని భావము. ఏ జ్ఞానము వలన సర్వమును విడిచెనో ఆ జ్ఞానమును కూడ విడువవలెనని "త్యజ ధర్మమధర్మం చ ఉభే సత్యానృ తేత్యజ, ఉభేసత్యానృతేత్యక్త్వాయేన త్యజసి తత్త్యజ" అని శాస్త్రము చెప్పుచున్నను మూర్తిమంతము కాని జ్ఞానమునెట్లు విడువవగునని యాక్షేపింప రాదు. ఏలనగా వినయ వైరాగ్యాది సద్గుణశాలియగు శిష్యునకా విద్య నుపదే శించుటయే జ్ఞాన త్యాగమనబడును. "సత్, బ్రహ్మ, భూమా" అనునవి బ్రహ్మ నామములు.

ఏది పరిచ్ఛేదరహితమో అది బ్రహ్మము. పరిచ్ఛేదము దేశకృతమనియు, వస్తుకృతమనియు, కాలకృతమనియు మూడు విధములు. దేశకృత పరిచ్ఛేద మనగా ఒకచోట ఉన్నది మరియొకచోట లేకుండుట. ఆకాశము సకల దేశము లందు యుండును. కావున దేశమువలన సంభవించే పరిచ్ఛేదము ఆకాశమునకు లేదని చెప్పవచ్చును. ఇట్లే బ్రహ్మము పరిపూర్ణమయి బ్రహ్మాండమంతటా నిండి యున్నది. కావున దేశకృతపరిచ్ఛేదము బ్రహ్మమునకు లేదు. కాలపరిచ్ఛేదమనగా ఒక కాలమునందుండి మరియొక కాలమున లేకపోవుట లోకమునందలి సకల వస్తువులు ఉత్పత్తి వినాశములు కలవి కావున అవి నశించిన పిదప నుండజాలవు. "జాతస్య హి ధ్రువో మృత్యుః" పుట్టిన వస్తువులు గిట్టుటచే ఒక కాలమందున్నవి మరియొక కాలము నందుండనందున అవి కాల పరిచ్ఛేదములైయున్నవి. బ్రహ్మ మునకు పుట్టుకలేదు. అది అజము. కావున గిట్టదు. సర్వకాలములందు యున్నం దున బ్రహ్మమునకు కాలపరిచ్ఛేదము సంభవింపజాలదు. వస్తుకృత పరిచ్ఛేద మనగా ఒక వస్తువు తానైయుండి మరియొక వస్తువు తాను గాకుండుట. లోక మందలి ఘటపటాది సకల వస్తువులు వేఱువేఱుగా యుండుటచే వాటికి వస్తు పరిచ్ఛేదము కలదు. బ్రహ్మము ఈసకల బ్రహ్మాండమునకు కారణము. కార్యము కారణము కన్న వేఱొండు వస్తువు కానేరదు. అనగా కార్యకారణములకు బేధము లేదు. బ్రహ్మము ఈ బ్రహ్మాండమందలి సకల వస్తుస్వరూపమైనందున వస్తువుల వలన కలుగు పరిచ్ఛేదము బ్రహ్మమునకు సంభవింపదు.

"తత్త్వమసి" అనే మహావాక్యముచే చెప్పబడిన "నీవు ఆ ఆత్మ స్వరూపు డవయి వున్నావు" అను తత్త్వమీ గ్రంథమున చెప్పబోవు విషయము. తత్, త్వం పదముల వాచ్యార్థమును, లక్ష్యార్థమును జూచి అసి పదముచే అభేదమును తెలుపును. తెలియని వస్తువును తెలుపునపుడు లక్షణాల ద్వారా తెలుపుదురు. తటస్థ లక్షణమని, స్వరూప లక్షణమని రెండు రకములు. తెలుపదగిన వస్తువు నందుండ నేరక తెలుపదగిన వస్తువు తోడ ఏదేని సంబంధము గల మఱియొక వస్తువునందుండి తెలుపదగిన వస్తువును దెలుపు లక్షణము తటస్థలక్షణ మన బడును. తెలుపదగిన వస్తువునందుండు లక్షణము స్వరూప లక్షణమనబడును. తత్ అను శబ్దమునకు తటస్థ లక్షణము గల బ్రహ్మము వాచ్యార్థము. సృష్టి, స్థితి లయములు బ్రహ్మమునకు తటస్థలక్షణము నిర్గుణము, అద్వితీయమైన బ్రహ్మము నిజముగ ఈ జగముల పుట్టుకకుగాని, పాలనకుగాని, లయమునకు కారణము కానేరదు. కావున ఈ లక్షణము పరబ్రహ్మమునందు సమన్వయము బొందజాలదు. జగముల సృష్టి, స్థితి, లయములకు కారణమగు చతుర్ముఖ బ్రహ్మయందు సమన్వయము కాగలదు. అద్వితీయపరబ్రహ్మము తోడ సంబం ధము గల చతుర్ముఖుని యందివ్విధమున సమన్వయమగుచు అద్వితీయ బ్రహ్మ మును నీ తటస్థ లక్షణము బోధింపగలదు. ఇట్లు జగత్కారణమని తటస్థ లక్షణ ముచే బోధింపబడిన బ్రహ్మము తత్త్వమసి వాక్యమందు "తత్" అను శబ్దము నకు వాచ్యార్థము.

"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని తైత్తిరీయోపనిషత్తు బ్రహ్మము సచ్చి దానంద రూపమనియు "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అను శ్రుతి బ్రహ్మమా నందమనియు చెప్పుచున్నది. ఇదియే బ్రహ్మమునకు స్వరూప లక్షణము. ఈ స్వరూప లక్షణముచే బోధింపబడిన బ్రహ్మమే తత్త్వమసి వాక్యమునందలి "తత్" శబ్దమునకు లక్ష్యార్థము. జాగ్రత, స్వప్న, సుషుప్తులను మూడవస్థల యందు తిరుగు జీవుడు "త్వం" శబ్దమునకు వాచ్యార్థము. అవస్థలలో తిరుగుచున్నను అవస్థాధర్మములు తన్నంట రాకుండుటచే జీవుడు నిజముగ అవస్థల ధర్మములను బొందనేరడు. మరియు ఆ పరబ్రహ్మమే ఈ సకలమును

బుట్టించి తానన్నింటి యందు ప్రవేశించెననియు, ఈ శరీరములందు ప్రవేశించి జీవుడయ్యెనని వెల్లడిం చెను. కాగా జీవుడు బ్రహ్మమగుటచే నతనికి అవస్థాధర్మములు సంభవింపవు. జీవుడు యథార్థముగా సచ్చిదానందరూపుడు పరిచ్ఛేదహీనుడు. ఇట్టి జీవరూపము 'త్వం' శబ్దమునకు లక్ష్యార్థము. జీవుని యందున్న వాచ్యార్థ లక్ష్యార్థములను, బ్రహ్మమందున్న వాచ్యార్థ లక్ష్యార్థ ములను రెండింటిని విడిచిపెట్టి ఇరువురిలో నున్న చైతన్యమును గుర్తించవలెను. ఇట్లు 'అసి' అపదముచే జీవబ్రహ్మములొక్కటే అని తెలిపెను. బ్రహ్మ సాక్షాత్కారమును పొందవలెనన్న గురుకృప కారణమగును. గురుకటాక్షము లేకుండా బ్రహ్మతత్త్వమును దెలియుట దుస్సాధ్యము.

అవ: ఇపుడు వేదాంత శ్రవణము చేయదగు అధికారిని వెల్లడించుచు, చెప్పదలచిన విషయమును ప్రతిజ్ఞ చేయుచున్నారు.

వేదాంత శ్రవణము చేయదలచిన పురుషుడు సాధన చతుష్టయ సంపద కలిగి యుండవలెను. ఆత్మానాత్మ వస్తు వివేకము. ఇహపరలోకము లందలి భోగములందు వైరాగ్యము. శమదమాదులు, మోక్షమును బొందవలయు నను వాంఛయు సాధనచతుష్టయ సంపత్తి అనబడును. చిత్తశుద్ధి గల వారికి శమదమాదులంకురించును. చిత్తశుద్ధి కొరకై కామ్య నిషిద్ధకర్మలు చేయక విహిత మగు నిత్యకర్మలను ఆచరించవలెను. శుద్ధ చిత్తులీ ప్రపంచము సారవిహీనమని తలంతురు. సారము గల బ్రహ్మమును దెలియగోరుదురు. "తమేతం వేదాను వచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపస్యానాశకొన" అను శ్రుతియు వేదాధ్యయనాదులచే పరబ్రహ్మమును దెలియగోరుచున్నారని తెలుపుచున్నది. అంతియేగాని తెలియుచున్నారని చెప్పుటలేదు. వైదిక కర్మములు చిత్తశుద్ధి మూలకముగ జ్ఞానముదయించుటకు కారణముకాగలవు. జ్ఞానము ముక్తిహేతువు కాగలదు. కాని కర్మలు మోక్షమునకు సాక్షాత్కారణములు కానేరవు.

"కషాయ పంక్తిః కర్మాణి జ్ఞానంతు పరమాగతిః ।
కషాయే కర్మభిః పక్వేతతో జ్ఞానం ప్రవర్తతే" ॥

అను శ్రుతియు కర్మలాచరించుటచే చిత్త మాలిన్యము తొలగుననియు,

కర్మాచరణము ముక్తి సాధనము కానేరదనియు, జ్ఞానసాధనము కాగలదనియు తెలుపుచున్నది. "తమే వవిది త్వాతి మృత్యుమేతి నాన్యః పందా అయనాయ విద్యతే" ముక్తిపొందుటకు జ్ఞానము తప్ప వేఱొండు మార్గము లేదని ఎలుగెత్తి చెప్పుచున్నది. "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అను బ్రహ్మసూత్రమందు అథ శబ్దము నకు శంకరులు సాధనచతుష్టయ సంపద కలిగిన పిమ్మట అను అర్థమును స్పష్టము చేసిరి. ధర్మతత్త్వమును తెలియాలని కోరువారు వేదాధ్యయనముచేసి యుండవలయును. కావుననే "అథాతో ధర్మజిజ్ఞాసా" అనే ధర్మసూత్రము వేదాధ్య యనముచేసిన పిమ్మట అనే అర్థము కాగా, ధర్మ, బ్రహ్మజిజ్ఞాసలు రెండు వేర్వేరు అనియు, ఆయా విచారణచేయు పురుషులు భిన్నాధికారులనియు స్పష్టమగు చున్నది. వేదాధ్యయనము చేసినంత మాత్రమున బ్రహ్మవిచారము చేయుటకు అర్హుడుకాడు. సాధనసంపద గలిగినవాడే బ్రహ్మవిచారమునకు అర్హుడు. వేదాంతుల మతమున ధర్మబ్రహ్మ మీమాంసా శాస్త్రములు రెండు కాని ఒకే శాస్త్రము కాదు. ధర్మజిజ్ఞాసా చేయగోరువారు ధర్మమీమాంసా శాస్త్రమును, బ్రహ్మ జిజ్ఞాసా చేయగోరువారు బ్రహ్మమీమాంసా శాస్త్రమును చదువనర్హులు. ఆత్మ స్వరూపమును దెలుసుకొనినచో ముక్తుడు కాగలడనియు విడుదల బొందుటకు జ్ఞానము తప్ప మరొక మార్గము లేదనియు స్పష్టమగుచున్నది. ముక్తిని దేగల జ్ఞానమునకు కర్మాదుల తోడ్పాటును కనిపించదు. జ్ఞానమునకు మరియొక సహాయ నిరపేక్షముగ గారణమను అంశము వేదాంతములందు తెలియుచున్నం దున సంసారమను బంధము ఆరోపితమని వేఱుగ చెప్పనక్కరలేదు. ఇట్లే ప్రపంచము ఆరోపితమేనని తెలియుచున్నది. "ఈ ప్రపంచము సారశూన్యమని నిర్ణయము చేయువారు ఆత్మానాత్మ వివేకముగలవారని తెలియుచున్నది. "అరాగ ద్వేషాణామ్" రాగద్వేషములు లేనివారనుటచే ఇహపర సుఖములందు కోరికయు, తదుపాయములందు ప్రవృత్తియు లేకపోవుట స్పష్టము." ప్రాణికోటికి భీతి కలిగించు నడతలేని వారనుటచే శమదమాదులు కలిగి యుండుటయు దెలియుచున్నది. శమదమ ఉపరతి తితాక్షా శ్రద్ధ సమాధానములు శమాది

షట్కమనబడును. "మముక్షూణామ్" మోక్షము గోరువారలనుటచే మోక్షేచ్ఛయు తెలియుచున్నది. ఇట్టి సాధనచతుష్టయ సంపద కలవారే వేదాంత శాస్త్రమును జదువనధికారులు.

అవ: ప్రపంచ మధ్యస్తమేనని వేదాంత విచారము వలన కలిగిన జ్ఞానము ప్రపంచమును సమూలముగ దొలగించును. కావుననే జ్ఞానమే ముక్తి సాధన మనుట పొసగును. కనుక ప్రపంచ మధ్యస్తమని ప్రమాణీకరించుచున్నారు.

చిత్తస్థైర్యమును శౌచసంపదయుగల జ్ఞానులా పరమపదమును బొందు దురు. ఆపరమపదము చేరినవారలీ సంసారమున మరల బుట్టజాలరు అనియు, ఆకాశమును, చర్మమును చాపను చుట్టునట్లు మానవులెన్నడు చుట్టగలరో ఆనాడు బ్రహ్మమును దెలియక దుఃఖాంతము సంభవించవచ్చును. అనగా ఆకాశమును చాపవలె చుట్టుటయు, బ్రహ్మమును తెలియక ముక్తుడగుటయు సంభవింప నేరదనియు "బ్రహ్మమును ఎవడు తెలియునో అతడు బ్రహ్మమే యగుచున్నాడు." నన్ను తెలిసి శాంతిని పొందుదువు. నన్ను తెలిసిన పిమ్మట పరమాత్మరూపము పొందగలవనియు చెప్పు వేలకొలది స్మృతులును జ్ఞానమే ముక్తి సాధనమని జ్ఞానమువలనే బంధము తొలగునని చెప్పుచున్నవి. ఈ ప్రపంచమనునది బంధము. బంధము కల్పితమయినందున జ్ఞానమువలన తొలగుచున్నది. కల్పిత వస్తువులే జ్ఞానమువలన తొలగును గాని సత్యవస్తువు జ్ఞానమువలన దొలగ జాలదు. ఎట్లనగా సంజవేళ త్రాడును చూచి పామని భ్రమ చెందినపుడు దీప కాంతిచే త్రాడు తెలియగ సర్పము వైదొలగును. ఇట్లే ముత్యపుచిప్పను వెండి యని భ్రమపడినపుడు ముత్యపుచిప్ప తత్త్వమరయ వెండి విలయమగుట లోకాను భవ సిద్ధము. పై రెండింటియందు సర్పరజతములు సత్యములు కావు. ఆరోపి తములు. అధ్యస్తములు కనుకనే వాని యధ్యాసమునకు అధిష్టానమగు త్రాడు, ముత్యపుచిప్ప తెలిసినచో సర్పరజతములు అంతరించుచున్నవి. అట్లే పరమాత్మ తత్త్వము దెలియనంతవరకు సకల బంధము తొలగదనుటచే సకల బంధములు కల్పితమనుట అర్థసిద్ధమయి యుండ దొలగనేరదు. కాని జ్ఞానముచే బంధము

తొలగుననియు, ముక్తి దొరకుననియు చెప్పుటచే సకల బంధములు పరబ్రహ్మ మందు కల్పితమని తెలియుచున్నది. ఇట్లు చెప్పకయే సిద్ధించు అర్థమును అర్థ సిద్ధమందురు. అర్థాపత్తి ప్రమాణములచే సిద్ధింపగలదని దాని భావము.

అర్థాపత్తియనునది ప్రత్యక్షాది ప్రమాణములవలె ప్రమేయ సిద్ధికి తోడ్పడగల ప్రమాణము. అర్థాపత్తి ప్రమాణము దృష్టార్థాపత్తి అనియు శ్రుతార్థాపత్తియనియు రెండు విధములు. ఎట్లనగా పగటిపూట భుజింపని దేవదత్తుడు బలిసియుండుట కనుగొందుము. బలిసిన దేవదత్తుడు పగటిపూట భుజింపకుండుట మనకు తెలియును. పగటిపూట తినని దేవదత్తుడు బలిసియుండుట జూచి రాత్రి భుజిం చుచున్నాడని నిర్ణయింతుము. బలిసియున్న దేవదత్తుడు రాత్రి భుజించుట సత్యము. ఈ సత్యమును మనము కనులార చూడకున్నను బలియుట జూచి నిర్ణయించితిమి. రాత్రిభోజనము లేక బలియుట పొసగదు కాన రాత్రిభోజనము కల్పించుట దృష్టార్థాపత్తి అనబడును. జ్యోతిష్టోమము చేయునతనికి స్వర్గము లభించునని వేదము వక్కాణించుచున్నది. జ్యోతిష్టోమము క్రియారూపమగుటచే క్షణికము. స్వర్గమను ఫలము కొంత కాలమునకు పిమ్మట లోకాంతరమున గలుగును. జ్యోతిష్టోమము క్షణికమైనను, జ్యోతిష్టోమముచేసిన ఒక అపురూపము పుట్టుననియు కాలాంతరమున లోకాంతరమందు స్వర్గము కలిగించుననియు మీమాంసకులు కల్పింతురు. వేదములందు జ్యోతిష్టోమము స్వర్గ సాధనమని అపురూపమును కల్పించుటనే నీయర్థాపత్తి శ్రుతార్థాపత్తి యనబడును. ఇట్లే లోకమందును లౌకికశ్రుతార్థాపత్తియు నుండును. శతవర్షజీవి యగు దేవదత్తుడు ఇంటలేడనిన మృతుడని నిర్ణయింపక ఎక్కడికైనా వెళ్ళియుండునని నిర్ణయింతుము. దీనికి లౌకిక శ్రుతార్థాపత్తి అందురు.

పైన జూపిన రీతి వేదాంతములందు జ్ఞానము ముక్తి సాధనమని తెలియు చున్నది. మోక్షమనగా జీవుడద్వితీయమగు సచ్చిదానంద బ్రహ్మరూపమును బొందియుండుట. ఈకనబడు బ్రహ్మాండము శాశ్వతముగ నిట్లేయుండ బ్రహ్మ మద్వితీయముకానేరదు. కావున జ్ఞానము ముక్తిహేతువని కల్పింపగలవు. ఆరోపి తమగు రజ్జుసర్పాదులు, శుక్తిరజితములు జ్ఞానముచే దొలగుటయు ఆరోపిత

ములు కాని శుక్తియు, త్రాడును తొలగకుండుటయు లోకానుభవము. ఇట్లుండ జ్ఞానముచే ప్రపంచము ఆరోపితమనియు జీవుడద్వితీయ సచ్చిదానంద రూపు డనియు తెలియును.

అవ: వేదవిహిత కర్మాచరణమే బంధమును తొలగింపజాలును. వైదిక క్రియాకలాపములు మోక్షహేతువులని వెల్లడించు శ్రుతులును గలవు. ఇట్లుండ ముక్తికి జ్ఞానముగాక వేఱొండు మార్గము లేదని చెప్పిన మాటలెట్లు పొసగుననే సంశయమును తొలగించుచున్నారు.

లోక వ్యవహారసిద్ధములగు వస్తువులు భావపదార్థములని, అభావ పదార్థ ములని రెండు రకములు. ఘటపటాదులు భావపదార్థములు. దండపాతము, భేదనము మొదలగు క్రియలచే భావపదార్థములగు ఘటపటాదులు నశించును. కాని ఇది ఘటమని, ఇది పటమని తెలుపు యథార్థ జ్ఞానము ఈ ఘటపటాది పదార్థములను నశింపచేయజాలదు. రజ్జువు నందు కనబడు సర్పము ముత్యపు చిప్పయందు వెండియు మిథ్యావస్తువులు. ఇది త్రాడని, ఇది ముత్యపు చిప్పయని తెలుపు యథార్థజ్ఞానమిట్టి మిథ్యావస్తువులను తొలగింపచేయును. కాని దండ పాతము, భేదనము మొదలగు క్రియాకలాపములు గాని, యజ్ఞదాన మంత్ర జపాది వైదిక క్రియాకలాపములుగాని పై మిథ్యావస్తువులను తొలగింపనేరవు. ఇట్లుండ ఈ ప్రపంచమనుబంధము యథార్థ జ్ఞానముచే వైదొలగునని వేదాం తము లుపదేశించుటచే ప్రపంచమను బంధము మిథ్యాభూతమనుట తథ్యము. మిథ్యాభూతమగు బంధము యథార్థజ్ఞానముచే దొలగుట తథ్యము.

లోకమున పదార్థములు నాలుగు రకములు. **1.**పరమార్థ వస్తువు **2.**వ్యవ హారిక వస్తువు **3.**ప్రాతిభాసిక వస్తువు **4.** తుచ్ఛవస్తువు. బ్రహ్మవస్తువు పరమార్థ వస్తువు. ఎల్లవేళల నీ బ్రహ్మము బాధితము కాదు. కావున వేదాంతులు దీనిని పరమార్థవస్తువని చెప్పుదురు. లోకమున వ్యవహరింపదగిన ఘటపటాదివస్తువు లన్నియు ఈ బ్రహ్మమువలె శాశ్వతమని చెప్పుటకు ఏ ఒక్కడు సాహసింపడు. ఇట్లే శుక్తిరజిత, రజ్జు సర్పాదులును శాశ్వతములనదగి యుండవు. కలయందు గాంచిన వస్తువులు జాగ్రదావస్థయందు అంతరించుట

లోకానుభవ సిద్ధము. కాని శుక్తి రజత రజ్జు సర్పాదుల కన్నను, కలయందు గాంచిన వస్తువులకన్నను, లోకమున వ్యవహరింపబడు ఘటపటాదులు శాశ్వతముగ దోచుట సత్యము. కావున ఈ రెండు తెగల వస్తువులకు గల భేదము ననుసరించి లోకమున వ్యవహరింపదగు ఘటపటాదులను వ్యవహారవస్తువులందురు. శుక్తి రజతాదులు, స్వప్న పదార్థములు అవి కనబడు పర్యంతమే ఉండునవి కావున వాటిని ప్రాతి భాసిక వస్తువులందురు. గొడ్రాలి పుత్రుడు, కుందేటికొమ్ము, గగనకుసుమము మొదలగునవి యే వేళ యందును లేని వస్తువులు కావున వీనిని తుచ్ఛ వస్తువు లందురు.

ఈ నాల్గింటియందు బ్రహ్మపదార్థము సద్రూపము కావున త్రికాలములందు బాధింపదు. కుందేటికొమ్ము, గొడ్రాలిపుత్రుడు మొదలగునవి త్రికాలములందు లేనివి కావున ఇవియు బాధనొందదగవు. వ్యవహారిక ప్రాతిభాసిక వస్తువులు ఒకప్పుడు కనబడి మరొకప్పుడు కనబడకున్నవి. ప్రాతిభాసిక వస్తువులకన్న వ్యవహారిక వస్తువులు కొంత శాశ్వతములనదగియున్నవి. ఈ రెండు తెగల వస్తువులు మిథ్యా వస్తువులనబడును. యథార్థజ్ఞానముచే తొలగింపబడుట లేక తొలగింపబడదగి యుండుట మిథ్యావస్తువుల లక్షణము. దండపాతము, భేదనము మున్నగు క్రియలచే లోకమునగల భావపదార్థములకు నాశనము వాటిల్లుట కనబడుచున్నది. కాని దండపాతాది క్రియలచే ఘటపటాదుల స్థూల రూపము నశించినను సూక్ష్మరూపము నశింపజాలదు. నశించిన పిదప దోచు స్థూలరూపము సూక్ష్మరూపమున లీనమైయుండును. ఈ విధముగ స్థూలసూక్ష్మ రూపమగు ప్రపంచము జ్ఞానముచే విలయమగును గాని క్రియాకలాపముచే దొలగజాలదు.

ఇట్లుండ కొందఱు ముక్తియనిన పరమసుఖ రూపమనియు సుఖ శబ్దము స్వర్గపరమనియు నిర్వచనముచేసి కర్మసాధ్యమగు స్వర్గమే మోక్షమనియు, అది నశింపజాలునను సంశయము లేదనియు చెప్పుదురు. చాతుర్మాస్య యాగము చేయువానికి అక్షయమగు ఫలము గలుగుననియు, సోమపానము చేసితిమి కావున మరణ ధర్మము లేని వారలమయితిమనియు, కర్మానుష్ఠానము వలన

నిత్యమగు ఫలము సంభవించుననుటచే స్వర్గఫలము కర్మసాధ్యమేననియు, “కర్మణైవహి సంసిద్ధి మాస్థితాజనకాదయః” అను శ్రుతియు నిత్యమగు ముక్తి కర్మఫలము కాగలదనుటకు ప్రమాణమని వీరు తలంతురు. వీరి ఆశయమే మనగా సంచితములగు కర్మములు మున్నెన్నడో స్వర్గనరకాదు లనుభవించుటచే క్షీణించెననియు, ప్రారబ్ధ కర్మమిపుడు భోగముచే క్షీణించుననియు మరియు ఇపుడు కామ్య నిషిద్ధ కర్మములను చేయకుండినచో ముందు ముందు ఇష్టానిష్ట జననములు సంభవింపవనియు, నిత్య కర్మములను చేయచుండుటచే పాపము సంభవింపక ముందు జన్మలు రాజాలకపోవుటచే స్వర్గమను ముక్తికర్మ సాధ్య మనియు వీరి ఆశయము. కాని వీరి ఆశయము పొసగనేరదు. సంచిత కర్మల న్నియు పూర్వమను భవించి యుండుట శక్యము గాదు. బ్రహ్మజ్ఞానము లేని అవివేకి కామ్యనిషిద్ధ కర్మముల నాచరింపకుండుటయు పొసగదు. రాగద్వేషము లచే కామ్య నిషిద్ధకర్మములను చేయుచునే యుండును. కావున ముందు జన్మము రాకుండుటకు తగిన హేతువు లేదు. ముక్తియనిన స్వర్గమనుటయు తగదు. ముక్తియనునది నిత్యము. స్వర్గమనునది కర్మసాధ్యము కనుక నిత్యము కానేరదు.

చాతుర్మాస్యయాగము చేయునతనికి నిత్యఫలము గల్గుననియు, కర్మసాధ్య మగుట మానవలోకము రీతి దేవలోకమును శాశ్వతముగాదనియు నీ మాటలు రెండును ప్రమాణములు కానేరవు. ఈ రెండింటియందు నేదోనొకటి ప్రమాణ మగును. మఱియొకటి అట్లు ప్రమాణమగుటకు తగిన అర్థమును మాత్రము చెప్పజాలును. చాతుర్మాస్య యాగము చేయునతనికి శాశ్వత ఫలము గలుగునను మాట దుర్భలమగుట సహజము. కాగా చాతుర్మాస్య యాగము చేయునతనికి జిరస్థాయియగు ఫలము గలుగునని అర్థము. ఇట్లు రెండువాక్యములు ప్రమాణ ములు కాగలవు. కాదేని కర్మసాధ్యమగుట పరలోకము నశ్వరమను వేదవాక్యము ప్రమాణము కాజాలదు. ప్రమాణము కాదనుటయు తగదు. ముక్తి-కర్మ సాధ్యమై నంత మాత్రమున శాశ్వతము గానేరదేని జ్ఞాన సాధ్యమయ్యును శాశ్వతము గానేరదను సందియము వలదు.

పరబ్రహ్మము బ్రహ్మాండమును బుట్టించి అందు ప్రవేశించి జీవుడనబడెను.

కనుక జీవుడెన్నడును ముక్తుడు. కావున ముక్తి జ్ఞానసాధ్యము గాదు. కంఠము నందుగల సువర్ణాభరణమును మఱచి పోయినదని విచారించునతనికి ప్రక్కన గల పురుషుడు నీ కంఠమందే కలదని బోధింపనంతకు పూర్వము పోకున్నను పోయినదని విచారించు రీతి విచారించు నతడు మిత్రుని బోధకు పిమ్మట దొఱక కున్నను దొఱికినట్లు సంతసించునట్లుగా జ్ఞానము కలుగగా ముక్తి కలుగునని బోధార్థమేగాని జీవుడు పూర్వమును ముక్తుడే. కాగా బంధము మిథ్యాభూత మనియు, జ్ఞానముచే తొలగుననియు భావము.

అవ: జ్ఞానాజ్ఞానములకు పరస్పరము విరోధముండుట సహజము. జ్ఞానో దయముచే అజ్ఞానము తొలగును గాని బంధమేల తొలగునను సంశయమును నివర్తించుచు జిజ్ఞాసువులను జ్ఞానోపాయమున ప్రవర్తింప చేయుచున్నారు.

సంజవేళలందు పూలమాలను చూచి సర్పమని భ్రమింతుము. దీపము తీసుకొని వచ్చి పూలమాలను కనుగొనగా సర్పము తొలగును. కాని నమస్కార ములు చేసినను, గరుడ మంత్ర పారాయణ సలిపినను ఆ సర్పము తొలగదు. ఇట్లే ప్రపంచమనుబంధము బ్రహ్మమును తెలియనంతవరకు అవిద్యచే కలిగిన భ్రమచే కలుగుచున్నందున క్రియాకలాపముచే దొలగనేరదు. ఈ తత్త్వమును తెలిసిన జిజ్ఞాసువులు పాము కుబుసమును విడుచురీతి ఈ కర్మ బంధములను శాస్త్రోక్త రీతిని పరిత్యజింపవలయును. పిమ్మట సద్గురువు చెంతకు చేరి జ్ఞాన సంపద కొరకు శ్రవణాదులను ఆచరింపవలయును. సంసారబంధ మవిద్యా మూలమని వేదాంతులందురు. అట్లే విద్యోదయము కాగానే అవిద్య తొలగుటయు లోకానుభవ సిద్ధము. వేదాంతులు చెప్పు అవిద్య సద్రూపమని గాని అసద్రూప మనిగాని నిర్వచింప అశక్యము. ఇదియుగాక వ్యతిరేకార్థమును బోధించుట నఞ్ పదమునకు సహజము. కావున అవిద్య యనిన విద్యాలేమి అనే అర్థము సహజముగ స్ఫురించును. ఇట్లుండ వేదాంతులు అవిద్యను అభావ పదార్థమని చెప్పకుండా ఘటపటాదులవలె భావపదార్థమనియు దానికి చిద్రూపమగు బ్రహ్మ మాత్రయమనియు చెప్పుదురు. ఇట్లు అనిర్వాచ్యమగు భావరూపా విద్యామూల మీబంధమనదగదు. అట్టి భావరూపమగు అవిద్యా

సద్భావమున ప్రమాణము కన్పించదు. కాగా మిథ్యాజ్ఞానము వలన బంధము సంభవించెననిన కణాదగౌత ములు ప్రకృతి పురుషులకుగల భేదము తెలియక నీబంధము సంభవించెననియు, సాంఖ్యులు పాతంజలాదులును కర్మమూలము కాక వేఱొండు గానేదని భాట్ట ప్రభాకరులు చెప్పుదురు. మరియు అనేకులు వారికి తోచిన రీతి చెప్పుదురు. ఇట్లుండ బంధము అవిద్యా మూలము కానిచో విద్యోదయమున దొలగనేరదు. కావున బంధమవిద్యామూలము కాని వేఱొండు మూలము గానేరదని నిరూపిం చదలచి “అవిద్యోహ్యేష బంధః” అని ప్రతిజ్ఞచేసిరి. నేను నన్నుగాని యితరులను గాని తెలియజాలకున్నాను అను ప్రత్యక్షము ఇట్టి అజ్ఞానము కలదనుటకు ప్రమాణము కాగలదు. మరియు నీబంధము ముత్యపుచిప్ప యందు కనబడు వెండివలె ఇది ఇట్టిదియని నిరూపణ చేయరానిదై యుండుటచే అజ్ఞానమే మూలమయి యుండును అను అనుమాన ప్రమాణము కాగలదు. బంధమిట్టిది యని నిరూపింపరానిదై యుండనంత మాత్రమున అజ్ఞానమే దీనికి మూలమేల గావలయుననరాదు. కార్యకారణములు రెండింటికి సాజాత్యము లోకసిద్ధము. కావున ప్రపంచమిది యిట్టిది అని చెప్పరాని నిరూపణ చేయరాని అవిద్యవలన బుట్టి యుండుట యుక్తము. ప్రపంచమను బంధము దుర్నిరూపమగుటచే దుర్నిరూపమగు అజ్ఞానమే మూలమను తర్కము వేదాంతులు చెప్పు భావరూప మగు అజ్ఞానము కలదనుటకు ప్రమాణము కాగలదు. మరియు నిర్గుణబ్రహ్మము జగత్కారణమని వేదము చెప్పెడి అర్థము ఇట్టి అజ్ఞానము లేని ఎడల పొసగనేరదు. కాగా ఇట్టి అజ్ఞానము అర్థాపత్తి ప్రమాణము వలనను సిద్ధించును. అవిద్యామూల మగు బంధము విద్యోదయము కలిగినంత తొలగును.

కర్మసన్యాసము చేయదగదని కొందరి ఆశయము. “యావజ్జీవ మగ్ని హోత్రం జుహోతి” బ్రతికియున్నంతకాలమగ్ని హోత్రము చేయవల యుననియు, ఆచార్యుల ఋణము తీర్చి సంతాన విచ్ఛేదము చేయరాదు, అనగా గృహస్థాశ్రమ స్వీకారము చేసి కర్మానుష్ఠానము చేయవలయు ననియు, కర్మములు చేయుచునే శతవర్షము జీవింపగోరవలయుననియు, మూడు ఋణములతో పుట్టుచున్నాడు.

కావున అధ్యయనము చేయగ ఋషి ఋణమును, యజ్ఞానుష్ఠానముచే దేవ ఋణమును, సంతానముచే పితృఋణము తీరును అనియు శ్రుతులు వక్కాణిం చుచున్నవి. మఱియు నిత్యకర్మము పరిత్యజింపదగదు. తెలియక పరిత్యాగము జేసిన తామస పరిత్యాగమనబడుననియు, యజ్ఞదానములు తపస్సు అను కర్మమును విడువరాదు, చేయవలయుననియు, క్రియాకలాపము నాచరింపక పురుషుడు నైష్కర్మము పొందలేరనియు స్మృతులు కర్మసన్యాసము చేయదగదను చున్నవి. కావుననే శ్రీకృష్ణపరమాత్మయు...

“కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయోవిదుః ।
సర్వకర్మ ఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥”

కామ్యకర్మలు చేయకుండుట సన్న్యాసమనియు, తాను చేయు సకల కర్మల ఫలత్యాగము చేయుట త్యాగమనియు వివరించెను. మఱియు గృహస్థులకు కర్మాచరణమునకు భిన్నకాలమందు శ్రవణాభ్యాసము సంభవింపవచ్చును. ప్రతర్దనుడు మున్నగువారు గార్హస్థ్యమందే శ్రవణము చేసిరనియు కనబడుచున్నది. అందువలన కర్మాచరణము తోడనే జనకాదులు ముక్తి బొందిరను మాటయు సమంజసము కాగలదు.

ఇవ్విధమున కర్మ సన్న్యాసము చేయదగదనువారల మతము శ్రుతిసమ్మతం గాదు. ఛాందోగ్యమున వేదవిహిత ధర్మాచరణమునకు పర్వములు మూడనుచు మూడు ఆశ్రమములను వేఱుగజూపి “బ్రహ్మసంస్థో మృతత్త్వమేతి” బ్రహ్మసంస్థుడు మాత్రము అమృతత్త్వమునుబొందునని నుడివెను. బ్రహ్మచర్య, గృహస్థ,వానప్రస్థ ఆశ్రమములందు వేదవిహిత ధర్మములు చేసిన పుణ్యలోకములు ప్రాప్తించు ననియు, సర్వకర్మ సన్యాసము చేయునతడు బ్రహ్మ సంస్థుడనియు ముక్తిబొందు ననియు స్పష్టమగుచున్నది. ఇతర వ్యాపారములు లేక నిరంతరము చిత్తమందు బ్రహ్మమునే చింతించువాడు బ్రహ్మ సంస్థుడనబడును. గృహస్థులకు చేయదగిన కార్యాంతరములున్నందున నిరంతరము బ్రహ్మచింతన చేయుట శక్యముగాదు. బ్రహ్మసంస్థుడు విధిపూర్వకముగ సర్వకర్మ సన్యాసము చేయుటచే బ్రహ్మచింతన గాక వేఱొండు కార్యమతనికి లేదు.

నిత్యము నిద్రాపర్యంతమును బ్రహ్మవిచారము చేయవలయుననియు, ఇతర కోరికలకు అవకాశమియ్యరాదనియు, మరణపర్యంతము వరకు బ్రహ్మచింతన చేయవలయుననియు సన్న్యాసులకు విహిత ధర్మమయియున్నందున సన్న్యాసులు బ్రహ్మసంస్థులనబడుదురు. ప్రతర్ధనాదులకు కనబడు శ్రవణాభ్యాసము సాపేక్షము కావున శ్రవణ విధాయక శాస్త్ర విరుద్ధమగు శ్రవణాధికారము కల్పింపజాలదు. అట్లేని "గావోవైసత్ర మాసత" గోవులు సత్రయాగము చేసినవియను మాటలచే గోవులకును కర్మాధికారము కలుగవలసియుండును. కావుననే సురేశ్వరాచార్యులు సమస్త క్రియాకలాపమును పరిత్యజించి సంసారమును విడనాడి జీవబ్రహ్మైక్యమును తెలియ తహతహపడు నతనికి వేదాంత శ్రవణాధికారము కలదని చెప్పిరి. జనకాదులును పూర్వజన్మమున సన్న్యాసమును స్వీకరించి శ్రవణాదు లభ్యసించి యుందురు. కాని బలవత్ప్రతిబంధకమేదేని యుండుట వలన జ్ఞానోదయము కలుగకపోయి యుండవచ్చును. ఆ సంస్కారవశమున మఱి జన్మమందొక్క మాఱు శ్రవణము చేయగ పూర్వ సంస్కారబలమున జ్ఞానోదయమయి యుండవచ్చును. కనుకనే పూర్వజన్మాభ్యస్త సంస్కారవశమున తన తలంపు లేకయే కొనిపోబడు ననియు, బహుజన్మ సిద్ధుడై పరమపదవి బొందుచున్నాడనియు స్మృతులు నొక్కి వక్కాణించుచున్నవి. కావున కర్మానుష్టానమును పరిత్యజింప రాదనరాదు. ఇట్టి సన్న్యాసము విద్వత్సన్న్యాసమనియు వివిదిషాసన్యామనియు రెండు విధములు.

"నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః" క్రియాకలాపముచేగాని, సంతానముచేగాని, ధనముచేతగాని ముక్తిబొందనేరరు. కర్మసన్న్యాసముచే కొందరు అమృతత్వము బొందిరనియు, "ఏతమేవ ప్రవ్రాజినో లోకమిచ్ఛంతః ప్రవ్రజంతి" ఈ ఆత్మరూపమను లోకమును గోరి సన్న్యసించుచున్నారనియు వివిదిషాసన్న్యాసము చెప్పుచున్నది. అనగా బ్రహ్మమును తెలియగోరి సన్న్యసించుట యని భావము. ఇట్టి ఆత్మను తెలుసుకొని యీషణాత్రయములను పరిత్యజించి భిక్షాటనము చేయుచున్నారు. పుత్రలోక ఈషణాదులకు తగిన కర్మపరిత్యాగము చేయుచున్నారనియు

"ఏతావద రేఖల్వమృతత్వమి ఆహోక్త్వా యాజ్ఞవల్క్యః ప్రవవ్రాజ" అమృతత్వమింతియేయని చెప్పి యాజ్ఞవల్క్యుడు సన్న్యసించెననియు విద్వత్సన్న్యాసము చెప్పుచున్నవి. జన్మాంతరమున శ్రవణాదుల భ్యసించియు నేదేని అవరోధముండ నంత జ్ఞానోదయ ప్రాప్తిలేక ఈ జన్మమున నా సంస్కార వశమున జ్ఞానోదయము కలుగగా పిమ్మట సన్న్యసింతురు. అట్టిది విద్వత్సన్న్యాసమనబడును. ఇట్టి సన్న్యాసము బ్రహ్మచర్యమును సమాప్తిజేసి గృహస్థుడు కావలయుననియు, పిమ్మట వానప్రస్థాశ్రమ స్వీకారముచేసి సన్న్యసింపవలయుననియు చెప్పుటచే క్రమికమని కొందరి ఆశయము. లేక బ్రహ్మచర్యమునుండియే సన్న్యసింపవచ్చును. గార్హస్థ్యము నుండియు వానప్రస్థము నుండియు సన్న్యసింపవచ్చును. ఏనాడు విరక్తి పుట్టునో ఆనాడే సన్న్యసింపవలయును అనుటచే క్రమము వివక్షితము కాదని మఱికొందఱి ఆశయము. శ్రీకృష్ణపరమాత్మయు "నైషర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధి గచ్ఛతి" సన్న్యాసముచే అత్యుత్తమమగు నైష్కర్మ్య సిద్ధి బొందు చున్నాడని వివిదిషాసన్న్యాసమును, "యోగారూఢస్య తస్యైవశమః కారణముచ్యతే" యోగారూఢునకు శమము కారణమగుననియు "సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖంవశీ" సమస్త కర్మములను పరిత్యజించి జితేంద్రియుడై సుఖముగ నుండుననియు, "నైవతస్యకృతే నార్థోనాకృతే నేహకశ్చన" జ్ఞానికి కృతాకృతములతో ప్రయోజనము లేదనియు చెప్పుచు విద్వత్సన్న్యాసమును వెల్లడించెను. కాగా బహుశ్రుతి స్మృతి విరోధము కాన్పించుటచే "కర్వన్నేవేహ కర్మాణి" కర్మానుష్టానం తోడనే శతవత్సరములు జీవింపవలయునను శ్రుతివైరాగ్యములేని వారి విషయమని గ్రహింపనగును. కావుననే విరక్తి లేనివారికి చిత్తశుద్ధి కొఱకు కర్మాచరణము కావలయునని ఫలత్యాగము చేయుటచే సన్న్యాసముతో పోల్చి శ్రీకృష్ణపరమాత్మ "కామ్యానాం కర్మణాంన్యాసమ్" అని కామ్యములను పరిత్యజించుటనుపొగడెను. కావున సర్వకర్మసన్న్యాస పూర్వకముగ బ్రహ్మ జ్ఞానము సంపాదింప అజ్ఞానమును తన్మూలమగు బంధము తొలగగలదనుట తథ్యమని భావము.

అవ: పలువురు పలు విధములుగ జూపు మోక్షమార్గములను ఇపుడు

విమర్శించుచున్నారు.

భాట్టులలో కొందఱును ప్రభాకరులును కేవల కర్మానుష్టానము ముక్తిసాధన మందురు. భర్తృ ప్రపంచకారులు భాస్కరాచార్యులు ఉపాసనా సహితమగు కర్మానుష్టానమే ముక్తి సాధనమందురు. వీరిలో మరికొందఱు జ్ఞానమును అంగీకరింతురు కాని కర్మాచరణ సహిత జ్ఞానము ముక్తి సాధనమందురు. భాట్ట ప్రభాకరాది మీమాంసకులు కర్మశ్రద్ధగలవారలై జైమిని సూత్రముల నాదరించి వేదము క్రియాపరమనియు, వేదాంతము నందు కనబడు కర్తృత్వాది విశిష్టమగు ఆత్మ స్వరూపము పూర్వభాగమున చెప్పిన క్రియలకు చెందిన కర్తృరూపమును బోధించుటచే ప్రమాణమగుననియు చెప్పుదురు. కేవలాత్మ స్వరూపమును తెలుపు వేదాంతములు ప్రమాణములు కానేరవనియు నిరాకరిం తురు. భర్తృ ప్రపంచ భాస్కరాదులు పూర్వభాగము యాగాది శారీరక క్రియాపరమనియు ఉత్తరభాగ మగు వేదాంతము ఉపాసనారూపమగు మానస క్రియాపరమనియు చెప్పుదురు. కావుననే "ప్రాణోఽబ్రహ్మేత్యుపాసీత, ఆత్మానమేవ లోకము పాసీత, సమ ఆత్మాతి విద్యాత్" అని అనేక స్థలములందు ఉపాసనను విధించు శబ్దము స్పష్టముగ తెలియుచున్నవనియు, తత్త్వమసి వాక్యములందు ఉపాసనను విధించు శబ్దము కనబడకున్నను కల్పింపవలయునని వీరి ఆశయము. కర్మ సముచ్చితమగు జ్ఞానమే ముక్తిసాధనమని వీరలంగీకరింతురు.

గోవును తోలుకురమ్మనియు, నల్లకలువతెమ్మనియు ఒక వృద్ధుడు పలుకగా, ఆ మాటలు విన్న ఒక బాలుడు నల్లకలువ తెచ్చునతనిని, గోవును తోలుకువచ్చు నాతనిని చూచి నల్లకలువను, గోవును తెలియును. ఇట్లే మీమాంసకులు క్రియా పరములగు శబ్దములకు మాత్రమే అర్థములను బోధింపగల శక్తి కలదనియు, క్రియాపరములు కనుకనే వేదములు ప్రమాణములని విశ్వసించి, ఉపాసనారూప మగు క్రియను అంగీకరింపక వేదమునకు ప్రమాణ్యము సంభవింపదనిరి. కాని నీకు పుత్రుడు జన్మించెననియు, మరణించెననియు పలుకు వృద్ధుల మాటల వలన ముఖ వికారాదులచే బాలుడర్థము గ్రహించుననియు కావున క్రియా బోధకములకే కాక సిద్ధార్థములను

బోధించు వేదాంతములకు ప్రామాణ్యము సంభవించుననియు వేదాంతులందురు. ఇది త్రాడుకాదని సిద్ధార్థము బోధించు మాటలకు భయకంపాదుల నివృత్తియను ప్రయోజనము లోకానుభవము. కాగా తత్త్వమసివాక్యము సిద్ధార్థబోధకమై సకల సంసారానర్థ మూలాజ్ఞానముబాపుటచే సఫలమేగాని నిష్ఫలము గాదు. భార్యాపుత్రాదులందు రాగము మెండగుటచే భాస్కరాదులు జ్ఞానము నంగీకరించినను సన్న్యాసమును అంగీకరింపక జ్ఞాన కర్మ సముచ్ఛయమే ముక్తి సాధనమనిరి. ఆనందానుభవులు తమ న్యాయరత్న దీపావళియందీ భాస్కరాచార్య శాస్త్రద్వేషముగలవాడనియు అసత్యములు పలుకు వాడనియు, కావున అనాదరణీయుడనియు నిందించిరి. మఱియు "వేదం యదిద ముపాసతే" ఉపాసనా విషయమగునది బ్రహ్మము కాదనియు వేదము నిరాకరిం చుచున్నది. కావున బ్రహ్మము ఉపాసనాచరముకాదు. జీవబ్రహ్మైక్య జ్ఞానము నొంది తాను కర్తగాడనియు, భోక్తగాడనియు తలంచు జ్ఞానికి జ్ఞానకర్మసముచ్ఛ యము ముక్తిసాధనము కానేరదు. కేవల జ్ఞానమే ముక్తిసాధనము.

వేదములు నిత్యనైమిత్తికాది క్రియాకలాపములకు పితృలోకాది ఫలములను చూపుచున్నందున క్రియాకలాపము ముక్తిసాధనము కానేరదు. "కర్మణా పితృ లోకః" అను శ్రుతి నిత్యనై మిత్తకములకు పితృలోక ప్రాప్తిని ఫలమనుచున్నది. "విద్యయా దేవలోకః" అను శ్రుతి ఉపాసనకు దేవలోక ప్రాప్తిని చూచుచున్నది. ఈకర్మోపాసనలు రెండింటికిని చిత్తమాలిన్యము తొలగుటయే ఫలము కావచ్చు లేదా జిజ్ఞాసయో జ్ఞానమో ఫలము కావచ్చును. ముక్తికి జ్ఞానము కాక మఱి వేరొకటి కానేరదు. ఆడకుందేలుకు సింహపు పిల్ల పుట్టనేరదు. కర్మోపాసనలు చిత్తమును శుద్ధిచేయును. చిత్తము శుద్ధి పొందిన పిమ్మట జ్ఞానోదయమగును. జ్ఞానము సంపాదింపదగిన పురుషుడొకడు, క్రియాకలాపమాచరింపదగిన పురుషుడు మఱియొకడునై యుందురు. కర్మలాచరించుటకు తగిన ధనాది సంపదయు, వాటి ఫలములు కావలయునను కోరిక గల పురుషుడు కర్మాచరణ మునకు అర్హుడు. కర్మలు ఆచరింపదగిన కులములందు పుట్టినవాడననియు,

వేదము చదవడానికి అధికారము గలవాడననియు అభిమానము గల పురుషుడు ఆయా కర్మలాచరింప అర్హుడైయుండును. రాగద్వేషములుడిగి, సకలేంద్రియము లను కట్టిపెట్టి సర్వమును త్యజించి శ్రవణాది విచారము సలుపుటకై దేహపోషణ కొరకు భిక్షాటన చేయునతడు బ్రహ్మవిద్యకు అర్హుడు. వీరివురకు స్పష్టముగా బేధముండగా జ్ఞానక్రియాకలాపములు రెండును ముక్తికి హేతువులనుట హాస్యాస్పదమగును. దప్పిగొన్నవాడు చల్లటి నీరు త్రాగ జూచునుగాని భగభగ కాలే వేడి నీటిని చన్నీటిలో కలిపి త్రాగి దాహము తీర్చుకొనవలెనని కోరుకోడు. మిళితమును చేయజాలడు. అగ్నితాపము దాహమును పుట్టించు రీతి కర్మానుష్ఠా నము బంధమును కల్గించును. అగ్నిని, నీటిని మిశ్రమముచేయ శక్యము కానట్లే జ్ఞానకర్మ సముచ్ఛయము చేయ శక్యముగాదు.

జ్ఞానమే ముక్తికి హేతువు. జ్ఞానమనగా తానద్వితీయ బ్రహ్మ స్వరూపుడననే జ్ఞానము. బ్రహ్మము మన స్వస్వరూపమై, ఆనంద రూపమయినదైయున్నది. బ్రహ్మమునకు దేశకాల వస్తు కృతములగు పరిచ్ఛేదములు లేవు. సద్రూపమై, చిద్రూపమైయున్న బ్రహ్మము తానై యున్నానను జ్ఞానమే ముక్తి సాధనము. జన్మాంతరమున చిత్తశుద్ధి కలిగిన వారికీ జ్ఞానము ఒక్క తత్త్వమసి వాక్యమును గురుముఖమున శ్రవణము చేయ ఉదయింపగలదు. మందమాధికారులకు దేహమే నేననే భ్రమ అధికముగా యుండుటచే తత్త్వమసి వాక్యశ్రవణముచేసినను ఈజ్ఞానము పుట్టజాలదు. కావున బాదరాయణ సూత్రములతో, గురు వేదాంత వాక్యములతో పలుసార్లు బ్రహ్మవిచారము చేయవలెను. వాక్యము అపరోక్ష జ్ఞానమును పుట్టింపనేరదని కొందఱు వాదులందురు. కాని ఉత్తమాధికారి జన్మాంతరమునందే నిష్కామ కర్మానుష్ఠానముచే చిత్తశుద్ధి పొందియున్నందున తత్త్వమసి వాక్యము వినినంతనే తత్త్వమును తెలుసుకొనగలడు. అందుకే శంక రులు "న అవగత బ్రహ్మాత్మ భావస్య యథాపూర్వం సంసారిత్వం శక్యం దర్శయి తుమ్" బ్రహ్మాత్మ భావమును అపరోక్షముగ తెలిసిన పురుషునకు మునుపటివలె సంసారి భావము జూప శక్యము గాదనిరి. వేదాంతములు బ్రహ్మ మద్వితీయ

మనియు, అపరిచ్ఛిన్నమనియు, స్వప్రకాశరూపమనియు బోధించి నీవట్టి బ్రహ్మరూపుడవై యున్నాడవని జీవుని మేల్కొలుపుచున్నవి. నీవెన్నడును ముక్తు డవై యున్నాడనుచున్నవి. కాని మంధమాధికారులు తామాకలి దప్పులు గల వారమనియు, ఆయా కులములందు బుట్టుటచే బ్రహ్మణ క్షత్రియాది భేదము గలవారలమనియు, పరిచ్ఛిన్నులమనియు, సుఖదుఃఖ రాగద్వేషాదులతో యున్నా మనియు, కర్మపరవశలమయి బద్ధులమై యున్నారమనియు ఎల్లప్పుడు విపరీత భావన కలిగియుందురు. ఇట్టి భావన సర్వజన సాధారణమగుటచే భ్రమ అనియు చెప్ప వీలుపడదు. కర్మోపాసనాపరమగు వేదమును ఒక్కొక్క అధికారిని దేశ మును, కాలమును, సాధనలను, ఫలములను చూపుచు ఒక్కొక్క కర్మమును విధించుచు ఈద్వైతప్రపంచము సత్యమనుచున్నది. అనేక ప్రమాణములు ద్వైత ప్రపంచము సత్యమని చాటుచుండగా ఒక్క వేదాంతము వెల్లడించునంత జగ ముల సత్యములెట్లు కాగలవు? గురువు, శాస్త్రము మున్నగు ద్వైతమే లేకున్న శ్రవణాదులు పొసగవు. ఇంతేగాక ప్రత్యక్షాది ప్రమాణ విరుద్ధార్థమును సైతము వేదము వెల్లడింప జాలునేని "ఆదిత్యోయూపః " యూపము ఆదిత్యుడు అను మాటలును ప్రమాణములు కావచ్చును. ప్రత్యక్ష విరోధము తగదు కావుననే పై మాటలకు గౌణీవృత్తినాశ్రయించిరి యూపమాదిత్య సదృశ్యమని అర్థము వర్ణించిరి. అట్లే "తత్త్వమసి" నీవా బ్రహ్మము అను మాటలకు గౌణీవృత్తిచే నీవా బ్రహ్మమయియున్నావను అర్థము కల్పింపనగును. లేక వేదాంతముల ప్రమాణ ములే కానిమ్ము. ప్రపంచాపలాపము చేయదగదు. ఈవిధముగా ఆత్మతత్త్వము తెలియజాలని మందాధికారులు దర్శనాంతరములను ఆశ్రయించిరి. మఱి కొందరు తాము స్వయముగ మూఢులయి పరులను మోహపరవశులను చేయు చున్నారు. వేదాంతములకు విపరీతార్థములను కల్పించుచున్నారు. ఇట్టి అస్పర్శ యోగమును కనుగొనజాలక యోగులు భీతులగుచున్నారు. ఆ యోగులు నిర్భయ మందు భయమును జూచువారలనియు వృద్ధులు నుడివిరి. ఇట్టివారు ఆత్మ తత్త్వమును దెలియుదమనే ఆశచే సకల కర్మలను పరిత్యజించి, జ్ఞానమును పొందనేరక పతితులగుదురను కృపచే బాదరాయణుడు వేదాంత సూత్రములను,

శ్రీమచ్ఛంకరులు భాష్యమును రచించిరి. వాటి విచారణ చేయగా జ్ఞానోదయము కలుగును. గర్భమునందున్న వామదేవుడు తాను సూర్యుడననియు, మనువు ననియు చెప్పెను. సర్వాత్మ భావమును తొలిజామున చిత్తశుద్ధి కలుగుటచే ఆయనకు తెలిసింది. కావుననే "తత్త్వమసి" వాక్య శ్రవణముచే అపరోక్షసాక్షాత్కార ముదయించును

అవ: జీవస్వరూప విచారణయందు పలువురు పలురీతుల మత భేదములు చెప్పుచున్నారు.

పామరులు కొందఱుచార్వాకులును దేహము ఆత్మయనుచున్నారు. చార్వాకులందు మఱికొందఱు ఇంద్రియములను ప్రాణములను, మనస్సును ఆత్మ స్వరూపమనుచున్నారు. వైనాశికులు క్షణిక విజ్ఞానమును, భాస్కరుడు మున్నగు వారలు స్థిరవిజ్ఞానమును ఆత్మస్వరూపమనుచున్నారు. సాంఖ్యులు పాతంజలులు సుఖదుఃఖ విహీనమగు చైతన్యము ఆత్మయనుచున్నారు. భాట్టమతానుయాయులు ఆత్మను జడరూపమనియు, చిద్రూపమనియు చెప్పుచున్నారు. ప్రాభాకర నైయాయికాదులు ఆత్మను జడమాత్ర స్వరూపమనియు అద్దానికి జ్ఞాన గుణము మనస్సంయోగము వలన పుట్టుననియు చెప్పుదురు. వేదాంతులు సచ్చిదానంద రూపమనియు, అద్వితీయమనియు ఆత్మను వెల్లడింతురు.

నేను గౌరవర్ణము గలవాడననియు, దీర్ఘకాయుడనియు పామరులును చార్వాకులును దేహమే ఆత్మయని విశ్వసింతురు. నేను చూచితిననియు, విను చుంటిననియు, గ్రుడ్డివాడననియు, చెవిటివాడననియు తెలియుచున్నందున ఇంద్రియములే ఆత్మయనియు మరికొందరు చార్వాకులు విశ్వసింతురు. నిద్రిం చునపుడు ఇంద్రియము లేకున్నను ప్రాణవ్యాపారములు సక్రమముగ సాగుచునే యుండుటచే ప్రాణమే ఆత్మ అనియు మరికొందఱు చార్వాకులు విశ్వసింతురు. మూర్ఛాద్యవస్థల యందు ప్రాణవ్యాపారము సందిగ్ధము కానంత జీవనము సంశయగ్రస్తమగుటచే ప్రాణము నాత్మయనువారల మతము దేహేంద్రియము లను ఆత్మయనువారల మతముకన్న శ్రేష్ఠమనదగును. ఎట్లనగా చార్వాకుల దేహమును, ఇంద్రియములను, ప్రాణములను

ఆత్మస్వరూపమనుటచే దాని పోషణమే పరమార్థమనియు శరీరము భస్మము కానిదే లోకాంతరములు లేవని చెప్పుదురు. భస్మీభూతమగు దేహము మరల రానేరదు. కావున ఋణమయినా చేసి దేహ పోషణము చేయవలయునందురు. ఇట్టి యుపదేశము పామరులకు సులభగ్రాహ్యమై యుండుట తథ్యము. పామరుల చెవులకింపుగా ఇట్టి మాటలు మాట్లాడే వారు కనుకనే వీరికి చార్వాకులు అనిపేరు. వీరిలో మఱికొందఱు ప్రాణ వ్యాపారము సక్రమముగా జరుగుచున్నను మనస్సు సహకారముకానిదే సుఖము కాని మఱి ఇతరము కాని తెలియుటలేదు. కావున మనస్సే ఆత్మయని చెప్పుదురు. నా మనస్సు ఎక్కడో ఉంది, చూడలేదు, వినలేదు అని చెప్పుటచే మనస్సు నుండియే జ్ఞానము పుట్టుననుచు మనస్సును ఆత్మ అని యనుచున్నారు. ఇట్టి చార్వాకుల మతము విశ్వసింపదగినది కాదు. సుషుప్తావస్థ యందు మనస్సుతో సహా సర్వేంద్రియములు లయమగును.జాగ్రదాద్యవస్థలందు మనస్సు చేతనము కాక జడమగుటచేత మనస్సు ఆత్మ కానేరదు. మనస్సు యొక్క చేతనా కారమున పరిణమించు క్షణిక విజ్ఞానమే ఆత్మ స్వరూపమని వైనాశికులు వెల్లడింతురు. ఈ విజ్ఞానము క్షణికమగుటచే ఇట్టి విజ్ఞానము జీవుడేని నిన్న మొన్నటి విషయముల ప్రత్యభిజ్ఞ ఈనాడెట్లు పొందును. మఱియు జీవుడు క్షణికుడేని బంధమోక్షముల వ్యవస్థయు పొసగదు. జీవుడు క్షణికుడగుటచే బద్ధుడొకడే అయివుండును. మోక్షప్రయత్నము చేయుకాలమున జీవుడు క్షణ క్షణం మాఱుచుండుటచే ముక్తి కొఱకు ప్రయత్నించు జీవుని రూపమెక్కడను కానరాదు. ఇట్లయినచో ముక్తికి ప్రయత్నించు వాడొకడు ముక్తి బొందువాడొక్కడు అయి వుండును. ఒకని ముక్తికి మఱియొకడు ప్రయత్నింపనేరడు. కావున బంధమోక్షశాస్త్రము వ్యర్థము కాగలదు. కావున భాస్కరాచార్యులు మున్నగువారు స్థిర విజ్ఞానము ఆత్మస్వరూపమందురు. ఇట్టి విజ్ఞానమే క్రియాకలాపములు చేయుచున్నదనియు, అందుచే ఆత్మకు కర్తృత్వాదులు గలవని వీరి ఆశయము. కాని కర్తృత్వాదులు, సుఖదుఃఖాదులు ఆత్మ ధర్మములనిన, ఆత్మకు అనిత్యత్వము, వికారము సంభవించును. నిత్యుడు కానిచో జీవునకు ముక్తిపొసగదు. మఱియు ఈవిజ్ఞానము కూడా అన్నమయాది కోశములవలె ఆత్మకు కోశమని ఉపనిషత్తులు చెప్పుటచే కర్తృత్వాదులు గుణపరిణామములనియు, ఆత్మ

చిన్మాత్ర స్వరూపుడ నియు సాంఖ్య పాతంజలాదులు చెప్పుదురు. చిన్మాత్రుడగు ఆత్మకు ప్రకృతి గుణముతో వివేకములేనందున బంధమనియు వివేకము కలుగగా ముక్తి పొందు నని వీరి ఆశయము. కర్తృత్వము ప్రకృతి గుణములతోనయితే భోక్తృత్వ మాత్మ కేల సంభవించును? ఒకరు పనులు చేయ మఱియొకడు ఫలితము బొందుట అసమంజసము. కావున జీవునకు సుఖదుఃఖాదులును, కర్తృత్వమును సమకూర్చే జడాంశమును, నిత్యత్వము సమకూర్చే బోధాంశము గలదని భాట్టులందురు. కాని ఆత్మకు రెండంశములుంటే ఘటాదులవలె నాశనము సంభవింపగలదు. కావున ప్రాభాకరనైయా కాదులు ఆత్మను జడరూపుడనియు, మనస్సంయోగము వలన ఆత్మకు జ్ఞాన గుణముదయించుననియు చెప్పుదురు. భాట్టుల మతమున జీవుడనిత్యుడగుటచే మోక్షోపదేశశాస్త్రము నిష్ఫలమనుట తేటతెల్లము. ప్రాభాకరాదుల మతమందు మనస్సంయోగము లేనిచో జ్ఞానగుణము సంభవింపదనుటచే జీవుడు పాషాణతుల్యుడయి యుండును. అట్టి మోక్షమును ఏ ఒక్కరు కోరరు. కావున సచ్చిదానంద స్వరూపమే ఆత్మయను వేదాంతులు మతమే సమంజసము.

అవ: జీవునకు గల పరిణామ స్వరూపమును తెలుపు పలు మతముల ప్రమాణవిషయములను చూపుచున్నారు.

ఆత్మ స్వరూపము సర్వవ్యాపకమై సకల దేహములందు ఎల్లవేళల నిండి యుండును. కావున శరీరమునకు గల అవయవ వినాశనముచే జీవస్వరూపము నాశనమును పొందును. కావున మోక్షోపదేశశాస్త్రము నిష్ప్రయోజనముకాగలదు. కావున జీవుడణు పరిమాణుడనవలయును అని పాశుపత పాంచరాత్రాద్యాగమ వాదుల ఆశయము. జీవుడణు పరిణామణుడనినచో దేహమందు అతడెందేని నుండ సకల శరీరమునకు గల వేదనలను తెలియనేరడు. కావున అర్హతమతానుయాయులు జీవునిదేహసమాన పరిమాణుడందురు. దీపపు కాంతివలె దేహము వృద్ధిపొందితే వృద్ధి పొంది, క్షీణిస్తే క్షీణించునందురు. ఇట్లయినచో జీవుడు నిత్యుడుకానేరడు. కావున శాస్త్రము వ్యర్థమగునని దలచినైయాయికులు జీవుని విభు స్వరూపుడందురు. జీవుని గోచరింపజేయు ప్రమాణవిషయమున వివాద పడుచుందురు. పైవాదులందరు ఆత్మను మానస ప్రత్యక్షగోచరుడని చెప్పుదురు.

సాంఖ్యులు ఆత్మస్వరూపమెన్నడు ప్రత్యక్షము కాదనియు, ఘటపటాదులు మనకు కనబడుటచే మన మాయాత్మ స్వరూపమెుందుకలదని యూహింపవలయుననియు జెప్పుదురు. వైనాశికులు క్షణిక విజ్ఞానమున జీవుడు గోచరించునందురు. ప్రభాకరులు త్రిపుటి యందు జ్ఞానము స్వప్రకాశమనియు, జ్ఞాతజ్ఞానాశ్రయముగను జ్ఞేయము జ్ఞానవిషయముగను భాసించునందురు. జ్ఞానమ పరోక్షమనియు, జ్ఞేయవిషయమున మాత్రము అనుమేయ మనియు ఆత్మజ్ఞాన విషయమందు చెప్పుదురు. వేదాంతులు పంచకోశములకు అతీతమైన స్వప్రకాశ రూపమనియు, సచ్చిదానంద స్వరూపమనియు ఆత్మను వెల్లడింతురు. ఇట్టి ఆత్మతత్త్వమును అపరోక్షముగ తెలియునంత వరకు జిజ్ఞాసువులు వేదాంతము లను విచారణ చేయవలెను. కనుకనే చాందోగ్యమున తొమ్మిదిసార్లు తత్త్వమసి వాక్యమును ఉపదేశించెను.

అవ: ఈశ్వరస్వరూప విషయమున అనేక మతభేదములను జూపుచున్నారు.

సత్త్వరజస్తమోగుణముల సమభాగములయియున్న ప్రకృతి లేక ప్రధానము జగత్తుకు ఉపాదాన కారణమనిరి. పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, అంతఃకరణము, మహత్తత్త్వము, అహంకారమను ఇరువది మూడు తత్త్వములు గల ప్రకృతి మహదాదిరూపమున పరిణమించుననియు కపిల మతానుయాయులగు సాంఖ్యుల ఆశయము. పృథివ్యప్తేజోవాయువులను భూతములు నాలుగనియు, ఈ నాలుగు పరమాణువులు అవిద్యాచక్రము సతతము తిరుగుటచే దేహాకారమును, ఘటపటాది బాహ్య పదార్థరూపమును సంఘీభావము బొంది సకల జగములకు కారణమని వైనాశికులలో కొందరు అర్హతులు జెప్పుదురు. దుఃఖ జన్మ ప్రవృత్తి దోష మిథ్యాజ్ఞానము అవిద్యాచక్రమనబడును. ఈశ్వర ప్రేరణలేక అచేతనములగు పరమాణువులు గాని, ప్రకృతిగాని సంఘీభావము పొందనేరదు కావున ఈశ్వర ప్రేరితములగు పరమాణువులు, ప్రకృతి జగదుపాదాన కారణమని కణాద గౌతమ పతంజలి మతానుయాయులు చెప్పుదురు. పతంజలి మతానుయాయులు ఈశ్వరుని అంగీకరించుటచే సేశ్వర సాంఖ్యులని ప్రసిద్ధినొందిరి. ప్రకృతిని మాత్రము ఉపాదాన కారణమను వారు నిరీశ్వర సాంఖ్యులు. కణాద గౌతములిరువురు ఈశ్వర ప్రేరితమగు పరమాణువులను కారణమందురు. వైనాశికులు బాహ్యవస్తువులు

లేవనియు క్షణిక విజ్ఞానమే సత్యమనియు, ఈ క్షణిక విజ్ఞానము అసద్రూపమగు బాహ్యవస్తువుల ఆకారమును పొందునందురు. క్షణకాలముండనిది ఎల్లప్పుడు ఉండని క్షణికవిజ్ఞానము సత్యమెట్లగుననుచు శూన్యమే తత్త్వమనియు, శూన్య మందీ సకలజగము లారోపింపబడినవనియు శూన్యాత్మవాదులందురు. హిరణ్య గర్భోపాసకులు హిరణ్యగర్భుడు జగత్కారణమనియు, లోకాయుతులు స్వభావమే జగత్తు హేతువనియు, దైవజ్ఞులు కాలమే జగత్తునకు కారణమనియు, ఎవరికి తోచినరీతి వారు చెప్పుదురు. వేదాంతులు అద్వితీయ సచ్చిదానంద బ్రహ్మము నకు మాయావశమున విచిత్రశక్తులు ప్రాప్తించుననియు, అదియే జగదుపాదాన కారణమనియు, నిమిత్త కారణమనియు వెల్లడింతురు. ఇన్ని వివాదములు జగత్కారణ విషయమై కనబడుచుండుటచే ఇన్ని వాదనలలో సత్యమేదియో జిజ్ఞాసువు విచారణచే తెలుసుకొనవలెను.

అవ: అద్వితీయ బ్రహ్మమును లక్షణ ప్రమాణములచే వెల్లడించుచున్నారు.

పరబ్రహ్మము నుండియే సమస్త బ్రహ్మాండము పుట్టుననియు, లయమొందు ననియు "యతోవా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి యత్ప్ర యంత్య భిసంవిశంతి" అను శ్రుతి చెప్పుచున్నది. ఆ బ్రహ్మమే వేదములను రచించెను. ఇంతియే గాక వేదమే పరమాత్మను యథార్థముగ తెలుపునుగాని వేఱొండు ప్రమాణము తెలుపజాలదు. అట్టి బ్రహ్మము మాయా సహాయమున సకలమును పుట్టించి సర్వజ్ఞమాయెను. మాయోపాధిరహితమగు ఆ బ్రహ్మము సుఖరూపము, జ్ఞానరూపము, సద్రూపములైవుండును. ఇట్టి వస్తువు మఱియొకటి లేనందున అది అద్వితీయము. అట్టి బ్రహ్మము సకల వేదాంతములకు తాత్ప ర్యమై, స్వప్రకాశమైయున్నది. సత్పురుషులు అద్దానిని తమ నిజరూపమని తెలుసు కొని జననమరణ సముద్రమును దాటుచున్నారు. అట్టి జ్ఞానమును సంపాదింప వలెనన్న ఆత్మవిచారము చేయవలెననుచు "ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిది ధ్యాసి తవ్యః" అను శ్రుతి వెల్లడించెను. బాదరాయణాచార్యులీ యంశమును "అథాతోబ్రహ్మజిజ్ఞాసా" అని సూత్రీకరించిరి. ముక్తియను ప్రయోజనము కొరకు, బ్రహ్మజ్ఞానము సంపాదించుటకు ఆత్మవిచారణ చేయ వలెనని పై శ్రుతి సూత్రముల భావము. గ్రంథకారులద్దానిని వెల్లడించి "జన్మ ద్యస్యయతః శాస్త్రయోనిత్వాత్, తత్తు సమన్వయాత్" అను సూత్రములను చెప్పుచు

నీసకల బ్రహ్మాండము సృష్టిస్థితిలయములకు కారణము బ్రహ్మమనిరి. శాస్త్రమనగా

"ప్రవృత్తిర్వానివృత్తిర్వా నిత్యేన కృతకేనవా ।
పుంసాంయే నోపదిశ్యేత తచ్ఛాస్త్రమభి ధీయతే ॥"

అపౌరుషేయమగు వేదముకాని, పౌరుషేయమగు శాస్త్రము కాని మానవు లకు విధినిషేధ రూపములగు ప్రవృత్తి నివృత్తులను బోధించునది శాస్త్రమన బడును. ప్రతిదినము సంధ్యోపాసన జేయమనునది ప్రవృత్తి. సూరాపానము చేయరాదనునది నివృత్తి. ఇట్టి విధి నిషేధములను బోధించు ఋగ్వేదాది శాస్త్ర ములు "అస్య మహతో భూతస్య నిశ్వసితమే తద్య దృగ్వేదః" నీ బ్రహ్మమునకు నిట్టూర్పు అను వేదమే యిందులకు ప్రమాణము. వేదము సకలార్థములను తెలుపును. ప్రమాణాంతరములకు తెలియరాని స్వర్గాదులను తెలుపును. ఇట్టి వేదము సర్వజ్ఞమనదగి యుండును. అట్టి వేదమును రచియించు నాతడంతకు మించిన జ్ఞానము గలవాడనుటలో సంశయముండరాదు. లోకమునందెవ్వరును తమకు తెలిసిన అంశములన్నిటిని తెలుపజాలరు. ఇంతయేల? వాగ్దేవతయగు సరస్వతీదేవి కూడ తీపి క్షీరగుడాదుల మాధుర్యములకు గల భేదములను తాను స్వయముగ తెలియుచు అన్నిటికీ సరిపడే రీతిలో తీపియన జాలునే కాని, వేర్వేరుగ చెప్పసాధ్యముకాదు. ఎవరైన తమకు తెలిసిన అంశమును చెప్పునప్పుడు వారు చెప్పిన అంశము కన్నా వారు మిక్కిలి తెలిసినవారై ఉందురనుట స్పష్టము. వేదములే సర్వజ్ఞమనదగియుండ ఆవేదములను రచించిన బ్రహ్మము సర్వజ్ఞుడ నుట స్పష్టము. సకల జగములకు, వేదములకు బ్రహ్మమే కారణమనుట వెల్లడగు చున్నది. కాగా "యచ్ఛ శాస్త్రికయోనిః" అను మాటలేలనను సంశయము కొందఱకు కలుగవచ్చు. వేదము కాక వేఱొండు ప్రమాణమా బ్రహ్మమును తెలుపజాలదు. మాయా సహాయముతో కారణమనుటచే బ్రహ్మము జగదా కారమున పరిణమింపదనియు, త్రాడు సర్పమునకు కారణమయినట్లు బ్రహ్మము జగదుపాదానమని చెప్పవచ్చును. ఇట్టి బ్రహ్మమే సకల వేదాంతములకు తాత్పర్యము.

అవ: జగత్కారణమును నిర్ణయించుటలో ఇతరులు పేర్కొను అణు ప్రధానాదులు పొసగనేరవనియు, వేదాంతులు నిర్ణయించు పరబ్రహ్మమే

పొసగునని చెప్పుచున్నారు.

కపిల పతంజలి మతానుయాయులు ప్రధానమే జగత్కారణ మందురు. "ప్రధీయతే–అస్మిన్ – ఇతి – ప్రధానమ్" అను సమాసముచే లయ కాలమున బ్రహ్మాండ మంతయు దీని యందు లీనమై యుండుటచే ఇది ప్రధానమనబడును. మట్టితో తయారైన కుండ, మూకుడు మొదలగునవి మృణ్మయములనుటయు, స్వర్ణాభరణములు స్వర్ణమయములనుటయు తెలియుటచే బ్రహ్మాండమంతయు సుఖదుఃఖమోహాత్మకములగు సత్త్వరజస్తమోగుణముల సమభాగముల ప్రధానమే ప్రపంచ కారణమయి యుండునని సాంఖ్యాదుల ఆశయము. అట్టి ప్రధానము పురుషుని భోగాప వర్గములకై మహతత్త్వాది రూపమున పరిణమించునని వీరు చెప్పుదురు. ప్రధానము అచేతనము కావున ప్రధానము జగత్కారణ కాదు. జడమగు ప్రధానము బ్రహ్మాండమును నిర్మింపజాలదు కాని చేతనుడగు ఈశ్వరుడు కారణము కాగలడని పాతంజలి కణాదమ తానుయాయులూహిం తురు. కణాదులీశ్వరుని నిమిత్త కారణమందురు. ఒకరి మతమును మరొకరి మతముచే ఒప్పుకొననిచో ఒకరి మతము నిరాకృతమగును. కనుకనే బాదరా యణుడు "తర్కా ప్రతిష్ఠాపదప్యన్యథాను మేయ మితిచే దేవమప్య విమోక్ష ప్రసంగః " అని తర్కమునకు నిలుకడ లేకపోవుటచే కాదని నవిలక్షణత్యాధికరణమున నిరూపించిరి. ఇప్పట్టున వాచస్పతియు

"యత్నేనానుమితోప్యర్థః కుశలైరను మాతృభిః ।
అభియుక్తతరైరన్యై రన్యదైనోప పాద్యతే ॥"

అతి ప్రయత్నముచే నేర్పరు లూహించి నిర్ణయించిన యంశము నంతకు మించిన నేర్పరులు అన్య విధమున నూహించి నిర్ణయించి నిరాకరింతురనెను. కపిలుడు మహాప్రజ్ఞాశాలియనియు, సిద్ధుడనియు, నాతడూహించి నిర్ణయించిన యంశములు యథార్థములు కావచ్చు ననియు కొందఱనవచ్చును. కాని కపిలుడు సిద్ధుడని అంటే కణాదులు మొదలైనవారు సిద్ధులుకారు అనడానికి ప్రమాణమేమి? కావున శ్రుతి సమ్మతమగు కారణమునే అంగీకరింపవలెను గాని కేవల తర్కముచే జగత్కారణమును నిర్ణయింపరాదు. బౌద్ధులలో కొందరు పరమాణులీ బ్రహ్మాండాకారమున సంఘీభావమును బొందునందురు. శూన్యమే

తత్త్వమనియు, శూన్యము నుండే బ్రహ్మాండము పుట్టుననియు మఱి కొందఱు బౌద్ధులందురు. సర్గాదియందు శూన్యము కలదని శూన్యవాదులు చెప్పిరి. ఇట్టి శూన్యమే కలదని చెప్పుటకు సాక్షి ఒకడుండనిచో సర్వము శూన్యమనుట పొసగదు. కావున నిస్సాక్షియగు శూన్యము జగత్కారణము కానేరదు. పై వాదు లందఱు కేవల తర్కావలంబనచే శ్రుతి విరుద్ధార్థము నూహించుచున్నారు. ఒకరూహించు విధమున మరియొకరు ఊహించనిచో తర్కముచే తత్త్వమును నిర్ణయింపజాలము. గనుక వేదాంతులు నిర్ణయించు పరబ్రహ్మమే జగదుపాదాన కారణము నిమిత్త కారణము.

అవ: కపిల మతము సవిమర్శముగ వివరించి నిరాకరించుచున్నారు.

ప్రధానము చేతనముకాదు. అచేతనమై కదలని ప్రధానమెట్లు ఈ బ్రహ్మాం డమును పుట్టించును. ఈ దోషమును నివారించుటకై సాంఖ్యులు ప్రధానమును సహజమగు ప్రవృత్తికలదని చెప్పుదురు. అట్లయినచో నిత్యము సృష్టి జరుగుచునే యుండవలయును. కాని ప్రళయము సంభవింపరాదు. కపిల మతమున పురుష డసంగుడగుటచే ప్రకృతి సంబంధము లేక బంధము కలుగునేని బంధము నిర్హేతుక మగును. నిర్హేతుకమన అగ్నికి వేడిమివలె సహజమగుట. పురుషుడుండు నంత వరకు బంధమే విధమునైనను తొలగనేరదు. కావున పురుషున కెన్నడు ముక్తి సంభవింపనేరదు. అట్లయినచో బంధమోక్షములకొక వ్యవస్థ కలుగజాలదు. ఇంతేకాక సాంఖ్యులు ఆత్మను కేవల చిద్రూపుడందురు. సుఖస్వరూపుడనరు. సుఖము లేని ముక్తిని బుద్ధిమంతులెవ్వరు కోరజాలరు. కావున సాంఖ్యుల మతము మోక్షకాములాదరింపదగినదికాదు. లేగదూడలు వృద్ధి కొరకు గోవుల పొదుగునుండి అచేతనమగు పాలు ప్రవర్తించునట్లుగా అచేతనమగు ప్రధానము ప్రవర్తించునని సాంఖ్యులందరు. కాని గోవులకు దూడలయందు గల ప్రేమ చేతను, దూడలు ముట్టెతో తల్లుల పొదుగులను పట్టి పీల్చుట చేతను, అచేతన ములగు పాలు కారుటకు చేతనముల ఆపేక్ష కలదని స్పష్టమగుచున్నది. ఇట్లే అచేతనమగు ప్రధానమును చేతనుడొకడు ప్రవర్తింపచేయనిచో జగదాకారమున పరిణమించదు. ప్రధాన ప్రవృత్తికి

తొలుత అదృష్టము సిద్ధింపనేరదు. ప్రధానము తొలుత శరీరమును, పిమ్మట శరీరముతోడ కర్మలను చేయుటచే అదృష్టము కలుగును. ఈ సృష్ట్యాదియందలి ప్రవృత్తికి పూర్వసృష్టి యందలి అదృష్టము కారణము కాగలదనియనినచో, దానికి అంతకుపూర్వపు సృష్టియందలి అదృష్టము కారణమనవలసి యుండును. అందువలన నిలకడలేకపోవుట యను దోషము తటస్థమగును. మరియు సాంఖ్యమతమున ఆత్మకేవల చిద్రూపుడే కాని సుఖ స్వరూపుడుకాడు. సుఖము లేని మోక్షమును ఎవరు కోరరు. కావున సాంఖ్యులు దుఃఖము లేకపోవుటచే ముక్తి కోరుదురని చెప్పుదురు. కాని ఆత్మ నిజానికి సుఖస్వరూపమే అయినను సాంసారిక సకల దుఃఖములు నివృత్తికానంత వరకు స్వప్రకాశానందము గోచరించుట లేదు. కావున దుఃఖ నివృత్తి కోరుదురే కాని, సుఖరూపము కాని ఆత్మను బొందుటకు దుఃఖ నివృత్తిని కోరజాలరు.

సాంఖ్యులు ప్రకృతిని కర్తయనియు, పురుషుని భోక్తయనియు చెప్పుదురు. కర్తృత్వముగల ప్రకృతికి భోక్తృత్వము, భోక్తృత్వముగల పురుషునకు కర్తృత్వము లేకపోవుటచే కృతహానాకృతా భ్యాగమను దోషము సంభవించును. కృతహాన మనగా చేసినదానికి ఫలము లేకపోవుట. ప్రధానము పనులుచేసియు ఫలమను భవింపకుండుటచే కృతహాన దోషము సంభవించును. పనులు చేయకయే ఫలము కలుగుట యకృతాభ్యాగమనబడును. పురుషుడు పనులు చేయకున్నను ఫలములనుభవించుటచే యకృతాభ్యాగమనుదోషము సంభవించును. కృతహానా కృతాభ్యాగమును అంగీకరించినచో విష్ణుశర్మ భుజింప, యజ్ఞశర్మకు తృప్తియు, విష్ణుశర్మాపరాధమున యజ్ఞశర్మకు శిక్షయు కలుగవలయను. ఇట్టి వాదమును బుద్ధిమంతులంగీకరింపరు.

సాంఖ్యులు పురుషుడసంగుడందురు. సత్త్వరజస్తమోగుణము లందలి సత్త్వము రజోగుణముచే తపింపబడుచు, సత్వాను గుణసారియగు పురుషుడు తపించినట్లు కనబడుననియు, కనుక పురుషునకు భోగమన ఔపచారికమని అందురు. ఔపచారికమే అయితే భోగము సంభవింపజాలదు. ఈ బాలుడు సింహముయని మనము ఔపచారికముగా అందుము. అంతమాత్రమునబాలుడు

సింహము కానేరదు. అసంగుడగు పురుషునకు యే అతిశయము లేక భోగమన నెట్లు సిద్ధించును? భోగ్యమగు ప్రధానమునకు ఇటువంటి పురుష భోగముచే ఎట్టి ప్రయోజనము కలుగును? భోగమాపచారికమంటే భోగములేదని స్పష్టమగు చున్నది. ప్రకృతి పురుషుల వివేకమే బంధనముకు కారణమని సాంఖ్యులందరు. ఇదియే పొసగదు. అవివేకమనగానేమి? అదెట్లు భోగమునకు కారణమగును? వివేకమెవ్వరికి కలుగును? అట్టి వివేకము వలన ప్రయోజనమేమి? అను విషయ ములకు సమాధానములేనందున సాంఖ్యమతము పొసగదు. మఱియు ప్రధానము, పురుషుల అవివేకము వలన బంధమనియు సాంఖ్యులు చెప్పుదురు. అవివేకమనగా వివేకము లేకపోవుట. అది అభావమేగాని భావముకాదు. అట్టి అభావము నొక తత్త్వముగ ఇరువది మూడింటినందు సాంఖ్యులంగీకరింపలేదు. కావున ఇది పొసగదు. అవివేకమన వివేకా భావమనక ప్రధానము పురుషులకైక్య జ్ఞానమని వెల్లడింప నవకాశములేదు. భిన్నులగు లిరువురకు ఒక్కరమను జ్ఞానమును నిరూపింప శక్యముగాదు. అయినను సాంఖ్య మతమున పురుషుడు ఉదాసీనుడు, అసంగుడు కావున భోగానర్హుడు. భోగానర్హుని సయితము భోక్త జేయుచు ముక్తుని సైతము బద్ధుని చేయగలదు. అందువలన వీనికి బంధమని, వీనికి మోక్షమని తెలుప శక్యము కాదు. మఱియు ప్రధాన పురుష వివేకము వలన మోక్షమని సాంఖ్యులందురు. ప్రధాన మచేతనమగుటచే వివేకము ప్రధానమునకు కలుగజాలదు. పురుషుడు అసంగుడగుటచే వివేకము అతని నంటరాదు. ఇట్లుండ వివేకమెవరికి కల్గును? అట్టి వివేకముచే ముక్తి ఫలమెట్లు పొసగును? ఇట్లు విచారించి చూడగ సాంఖ్యమతము పొసగదని తెలియుచున్నది. లేకపోయినను ఉన్నట్లు తోచుననుటకు అద్వైతులు చెప్పు అజ్ఞానమే కారణమై యుండును. కావున వేదాంతుల మతమునే సాంఖ్యులు నామానాంతరమున పిలుతురన వచ్చును.

అవ: అచేతనములగు ప్రధాన పరమాణువులను ప్రేరేపింప ఈశ్వరుడు నిమిత్తము కాగలడను యోగమతమును, మహేశ్వర కాణాదుల మతమును, గౌతమ మతమును నిరసించుచున్నారు.

ఈశ్వరుడు ప్రధానము నధిష్ఠించి బ్రహ్మాండమును పుట్టించి ప్రవర్తింప జేయునని యోగులు మున్నగు వారలందురు. కాని ఈశ్వరునకు దేహేంద్రియా దులు లేవు. సృష్టికి పూర్వము దేహేంద్రియాదువలె బాహ్య సాధనములు లేవు. ప్రవర్తింప చేయవలయునను కోరికయు, ప్రయత్నము లేవు కనుక ప్రధానమును ప్రేరేపింపజాలదు. ఈశ్వరునకు దేహేంద్రియాదులున్నచో జీవులవలె సుకృత దుష్కృతముల వలన పుట్టు భోగము సంభవింపవలసి యుండును. దుఃఖ భూయిష్ఠమగు లోకమును నిర్మించునట్టి ఈశ్వరునకు విషయాచార దోషమును, నిర్దయత్వ దోషమును ప్రసరించును. సృజింపదగిన ప్రాణుల కర్మల నపేక్షించి పుట్టించునేని చక్రిక, అనవస్థా, వైఫల్య, అన్యసిద్ధులను దోషములు సంభవింప గలవు. దేహేంద్రియాదులును, బాహ్య సాధనములు గల కులాలాదులు మృత్పిండములను ఘటరూపమున పొందు విధానమాలో చించి ఘటాదులను నిర్మింతురు. పై మతము వారికి అభిమతుడగు ఈశ్వరునికి దేహేంద్రియాలు లేవు. ప్రధాన పరమాణువులకు రూపాదులు లేవు కనుక వీరి మతము పొసగ నేరదు. మఱియు ఈశ్వరుడు దయామయుడు, వీతరాగుడు, స్వతంత్రుడై యుండగా ప్రాణుల సుఖదుఃఖములతో కూడిన సృష్టియందేల ప్రవర్తించును? పరాధీనుడై ప్రవర్తించెననినచో నెందు నుండి పరాధీనుడయి ప్రవర్తించు నందునను పూర్వ పరాధీనత నంగీకరింప అనవస్థయను దోషము సంభవిం చును. స్వార్థము గోరి స్వతంత్రుడై ప్రవర్తించునననినచో దేవతలను సుఖవంతులు గను, నరకవాసులను దుఃఖవంతులుగను, మానవులను సుఖదుఃఖవంతులుగ పుట్టించు విషమాచారుడు, దయా విహీనుడు కావలసియుండును. ప్రాణుల కర్మలనపేక్షించి వారివారి కర్మానుసారము పుట్టించుననిన, కర్మలచే ఈశ్వర ప్రవృత్తియు, ఈశ్వరునిచే ప్రధాన వృత్తియు మహదాది క్రమమున ప్రధానము ప్రవర్తింప దేహముకలుగగా, ప్రాణికర్మయు కలుగనవలయును. ఇట్లు చక్రము తిరుగుచుండుటచే చక్రకమను దోషము సంభవించును. లేక స్వర్గాది యందలి ఈశ్వర ప్రవృత్తికి, పూర్వ సర్గమందలి కర్మలే కారణమనిన, దానికి అంతకు పూర్వకర్మమనిన, నిలుకడలేక అనవస్థా దోషము కలుగును. బీజాంకురమందు అనవస్థా ప్రత్యక్షము కనుక అంగీకరించవచ్చును గాని

తర్కముచే ఊహించు విషయములందు అనవస్థా దోషమును అంగీకరింపరాదు.

లోకమున మనుష్యుల ప్రవృత్తికి స్వార్థము కారణము. ఈశ్వరునికి స్వార్థము లేనందున అతని ప్రవృత్తి నిష్ఫలము కాగలదు. దయాళువులు పరులకు కలిగిన దుఃఖమును నివారింప యత్నింతురనిన, పరులకు దుఃఖము కలుగుటచే తాము దుఃఖితులయి, పరులుసుఖపడితే తాము సుఖియనుకొనుట స్వార్థము కాని స్వార్థ శూన్యము కాదు. వేదాంతములు మాయా వశమున ప్రాప్తించిన సకల శక్తులు గల పరబ్రహ్మమే జగత్కా రణమని తెలుపుచుండగా నీ తర్కముచే ఊహింపనవసరము కన్పించదు. జగత్కారణము సిద్ధించునను ప్రయోజనము వేదాంతము వలననే సిద్ధించును.

అవ: అమూర్తమగు ప్రధానము అసంగుడగు పురుషుడు ప్రేరేపింపలేక పోయినను, నిత్యము జ్ఞానేచ్ఛా ప్రయత్నములు గల ఈశ్వరుడు మూర్తములగు పరమాణువులను ప్రేరేపింపగలడనియు పృథివ్యాధి జగన్నిర్మాణము చేయగలడని చెప్పు కణాద గౌతమ మతములను నిరాకరించుచున్నారు.

కణాద గౌతములు ఈశ్వరుని సర్వజ్ఞుడనియు, సకలము గోరు వాడనియు, సకల జ్ఞానేచ్ఛా ప్రయత్నము చేయువాడనియు చెప్పుదురు. జ్ఞానేచ్ఛాకృతులు కార్యసిద్ధికి కారణములని లోకప్రసిద్ధి. కావున సకల జ్ఞానేచ్ఛా ప్రయత్నములు గల ఈశ్వరుడు సకలమును పుట్టించునందురు. జ్ఞానేచ్ఛాదులు ఈశ్వరునకు ఎల్లవేళల యున్నచో సకల కార్యములు ఎల్లవేళల కలుగవలయును. పుట్టింప నిచ్ఛయు, రక్షింపనిచ్ఛయు, లయముచేయు ఇచ్ఛయు ఎల్లవేళలందు యుండునేని జన్మస్థితి భంగములు ఎల్లవేళల కలుగవలయును. మఱియు ఈ బ్రహ్మాండము నకు ఈశ్వరుడు నిమిత్త కారణమనియు, పరమాణువులు ఉపాదాన కారణమని వీరి ఆశయము. కార్యము ఏ తీరున మార్పు చెందుచున్నను ఆయా కార్యము లందు ఎడబాయకుండా కనబడునది ఉపాదాన కారణము. కడవ, మూకుడు మున్నగునవి ఎన్ని మారినను మట్టి యెడబాటు లేక కనబడుచుండును. కావున మట్టి, కుండ, మూకుడు మున్నగువానికి ఉపాదాన కారణము. అట్టి మట్టిని కుండ, మూకుడులుగా తయారుచేసిన కుమ్మరి నిమిత్త కారణమన

బదును. ఈ దృష్టాంతమవలంబించి కణాదులీ బ్రహ్మాండమునకు పరమాణువులు ఉపాదానకారణమని, ఈశ్వరుడు నిమిత్తకారణమని ఊహింతురు. పై దృష్టాంత మందు కులాలునకు శరీరాదులుగలవు. శరీరాదులు లేకున్న ఘటాది రూపము లను చేయజాలడు. ఇట్లే ఈ దృష్టాంతావలంబమున ఊహించు ఈశ్వరునకు సయితము శరీరాదులుండవలయును. శరీరాదులుంటే ఈశ్వరునకు కర్మ సంబంధము, దాని భోగప్రసక్తి అనివార్యము కాగలదు. అట్టి ఈశ్వరుడు నిత్యుడు కానేరడు. కుండ, మూకుడు తయారగుటకు వానిని పుట్టించిన కర్త ఒకడుండినట్లే కణాదులు ఈశ్వరుని ఊహింతురు. కాని చేతనము సహాయములేనిదే కార్యము నెరవేరదు. కావున ఈశ్వరుడు జగత్కారణము కాజాలడు.

అవ: తార్కికులు చెప్పు పరమాణు కారణతా వాదమును ఖండించు చున్నారు.

కాణాదులు సృష్ట్యారంభ కాలమున పరమాణువులు చలించి, ఒకదానిలో ఒకటి కలియుటచే బ్రహ్మాండ ముదయించునందురు. కాని సృష్ట్యారంభకాలమున పరమాణువు లందు చలనము పుట్టుటకు తగిన కారణము లేదు. రెండు పరమాణువులు కలియుటచే ద్వ్యణుకము కాగలదనియు, రెండు ద్వ్యణుకములు కలియుటచే త్ర్యణుకమగు ననియు, ఈ విధముగా చతురణుకాది క్రమమున సకల బ్రహ్మాండము పుట్టుననియు నైయాయికుల ఆశయము. నిరవయములగు పరమాణువు లెట్లు కలియ గలవు? రెండు పరమాణువుల కలయిక వలన పుట్టినది ఆ రెండింటి కన్న మూడవ వస్తువెట్లు కాగలదు? ద్వ్యణుకముల వలన పుట్టు త్ర్యణుకము నందు అధిక పరిణామమెట్లు సంభవించును? ఇట్టి త్ర్యణుకమే ఏల నిత్యమనరాదు? పరమాణువులు నిరవయ మెట్లగును? ఎట్లు నిత్యమగును? అసత్కార్యవాదులగు నైయాయికుల మతమునందు ఇట్లు లెక్కలేని సంశయమములు కనబడుచున్నందున పరమాణువులు జగదుపాదాన కారణము కాజాలవు.

పరమాణువులందు చలనము పుట్టుటకు ప్రయత్నము గల ఈశ్వరుడు కారణము కాజాలడు. ఈశ్వరునకు దేహము లేనందున అతని ప్రయత్నము

సఫలము కాదు. అదృష్టము గల జీవుల సంయోగము సయితము పరమాణువుల ందు చలనమును పుట్టింపజాలదు. సృష్ట్యారంభముననే కాక ప్రళయమందు సయితము అట్టి జీవులుగలవు. మూర్త ద్రవ్యముల సంయోగమువలనను పరమాణువులు చలింప నేరవు. ప్రళయ కాలమున పరమాణువులు కాక వేఱొండు మూర్తద్రవ్యములేదు. ఒక పరమాణువు సంయోగమువలన మఱియొక పరమాణువు నందు చలనము పుట్టుననిన, పరమాణువులు రెండు క్రియామూలమున కలియవలయును. అప్పుడు పరస్పరాశ్రయమను దోషము సంభవించును. మొదటి పరమాణువు రెండవ పరమాణునందలి క్రియను, రెండవ పరమాణువు మూడవ పరమాణువు నందలి క్రియను, మూడవ పరమాణువు మొదటి పరమాణువు నందలి క్రియను అపేక్షించును. మూడవ పరమాణువు నాల్గవ పరమాణువు నందలి క్రియను, నాల్గవ పరమాణువు ఐదవ పరమాణువును వరుసగా నపేక్షింప అనవస్థయను దోషము తటస్థించును. పరమాణువులందు చలనము పుట్టనేరదు. కావున పరమాణువులు కలియజాలవు. చలనము సంభవించినను పరమాణువులు నిరవయములగుటచే కలియజాలవు. కలయిక పొసగింప పరమాణువులు సావయవములనిన నిత్యములు గానేరవు. పరమాణువులు కలియునపుడొక భాగమున కలియునేని సావయవము లనుటయు, తరువాత వినశ్వరములనుటయు తథ్యము. పరమాణువులు ఒకదానిలో ఒకటి పరిపూర్ణముగ కలియునేని ఆ కలయిక మూలముగ వృద్ధి సంభవింపనేరదు. కావున ద్వ్యణుకము పరమాణువునకు మించిన పరిమాణము కలదికాకపోవును. రెండింటి కలయిక వలన పుట్టు వస్తువునందు పరిమాణము వృద్ధి యగుట లోకానుభవ సిద్ధము. పరమాణువులు రెండు కలియుటచే ద్వ్యణుకము పుట్టునని తార్కికు లందరు. ద్వ్యణుకమునకు గల పరిమాణము పరమాణువు యొక్క పరిమాణమును మించదని చెప్పుదురు. కావున ఇది పొసగదు. కల్పితములగు పరిమాణము గల పరమాణువులు కలియునని చెప్పుట, కల్పిత వస్తువు లంగీ కరించుటచే మాయా వాదము తటస్థము కాగలదు. అనుభవానికి విరుద్ధముగ కల్పించి త్ర్యణుకము మాత్రమేల వృద్ధి పొందెనన వలయును? త్ర్యణుకమునే నిత్యమనవచ్చును. వేఱొండ పరమాణువును కల్పించనేల?

త్ర్యణుకము సావయవమగుటచే నిత్యము గానేరదు. కావున నిరవయమగు పరమాణువును కల్పింతుమనుటయు తగదు. ఎనిమిది లేక పది దిక్కులు గలవు. అట్టి దిక్కు లందు సంబంధము కలదనుటచే పరమాణువులు ఎనిమిది లేక పది ప్రదేశ ములు గలవనవలయును. కాన పరమాణువు సావయవమగుట నిత్యము కానేరదు.

బౌద్ధనైయాయి కాదుల సత్కార్యవాదులు అనగా పుట్టువునకు పూర్వము కార్యము లేదనియు, అసద్రూపమగు కార్యము పుట్టుననియు వీరి ఆశయము సాంఖ్యులీవాదమును అంగీకరింపరు. అసద్రూపమునుండి కార్యము పుట్టునెడల ఇసుకనుండి తైలము పుట్టవలయును. కాని తిలలనుండే తైలము పుట్టుచున్నం దున తైలమా విర్భవించుటకు తగిన కారణముచే తైలమావిర్భవించుననియు వీరు చెప్పుదురు. కార్యము సద్రూపమైనను కార్యము ఆవిర్భవింప చేయుటకు సాధనలు అవసరములు. కనుక సత్కార్యవాదమును, సాధన సామగ్రి వ్యర్థము కానేరదని వీరల ఆశయము. కాని కార్యముల ఆవిర్భావము సత్కార్యవాదమున సద్రూపమేని కారణ కలాపము వ్యర్థము కాగలదు. ఆవిర్భావము అసద్రూపమేని అసత్కార్యవాదమగుట తథ్యము. కావున ఆవిర్భావ తిరోభావములు సయితము మాయామయములనియు, అనిర్వాచ్యములనియు వేదాంతులందురు. కావున నైయాయికుల పరమాణువాదము పొసగింపరాదనియు, బౌద్ధాదుల దర్శనమును శిష్యులు పరిగ్రహింపరాని అసత్కార్య వాదమును మోక్షకాములు ఆదరింపరాదని భావము.

అవ: బాహ్యములగు ఘటపటాది పదార్థములు గలవనియు, అవి క్షణి క్షములనియు చెప్పు బౌద్ధుల మతమును నిరాకరించుచున్నారు.

బౌద్ధులు సౌతాంత్రికులనియు, వైభాషికులనియు, యోగాచారులనియు, మాధ్యమికులనియు నాలుగు తెగలవారు. ఇందులో సౌత్రాం తిక వైభాషికులిరు వురు ప్రపంచమున బాహ్యాభ్యంతర వస్తువులు గలవందురు. వీరికి బాహ్యార్థము లందలి అభినివేశము జూచి బుద్ధుడు వారికి బాహ్యాభ్యంతర ప్రపంచమంతయు కలదని ఉపదేశించెను. సౌత్రాంతికుడా బాహ్యార్థము జ్ఞానమునకు గల వైచిత్ర్య

ముచే ఊహింపబడుననియు, వైభాషికుడా బాహ్యార్థము ప్రత్యక్షగోచరమనియు అంగీకరించును. మూడవ యోగాచారుడు పరిపక్వ చిత్తము గలవాడగుటచే అతనికి విజ్ఞానము మాత్రముగలదనియు, ముఖ్యాధికారియగు నాల్గవ మాధ్యమి కునకు సర్వము శూన్యమనియు ఉపదేశించెను.

సౌత్రాంతిక, వైభాషికులు ఖర,స్నేహ,ఉష్ణ,ఈరణ స్వభావములగు పరమా ణువులు నాలుగు తెగలనియు, భూతభౌతిక వస్తుసముదాయమంతయు భోగ్య వస్తువులనియు, ధాన్యరాశివలె పరమాణు సముదాయమనియు, తన్మూలమున సకల బ్రహ్మాండము పుట్టుననియు చెప్పుదురు. బాహ్యమగు భోగ్యమువలె ఆంతర మగు భోక్తృవర్గము కలదనియు, నదియు క్షణికమని చెప్పుదురు. వీరు వేద ప్రామాణ్యము నంగీకరింపరు. కావున వీరిని వేదబాహ్యులనబడుదురు. ఇట్టి వేదబాహ్యులీ తత్త్వమును ఏ ప్రమాణ మూలమున కనుగొనిరి? ప్రమాణముల అవసరము లేకనే స్వయముగా నిర్ణయింతురా? అజ్ఞానము వలన ప్రలాపమా? లేక జగద్వంచన జేయు కోరికయా? ఎట్లయినను బౌద్ధులు స్వార్థ పరార్థముల తెలియరనియు, గుబుద్ధులనియు భావము.

ఆంతరమగు రూపస్కంధమును, విజ్ఞాన స్కంధమును, వేదనా స్కంధమును, సంజ్ఞా స్కంధమును, సంస్కార స్కంధమును నిరూపించి, ఈ పంచస్కంధమును భోక్తృవర్గమని వీరు అంగీకరింతురు. సద్రూపమగు సకలవస్తువులు క్షణికములని వీరి ఆశయము. విషయ సహితములగు ఇంద్రియములు రూపస్కంధమన బడును (అహం). "నేను" అనునది ఆలయ విజ్ఞానమనబడును. ఇంద్రియము లకు విషయములు కనబడునంత యిట్టిది యని చెప్పరాని నిర్వికల్పజ్ఞానము పుట్టుననియు, పిమ్మట ఆ విషయములను వివరముగ తెలుపు సవికల్పజ్ఞానము పుట్టుననియు లోకానుభవసిద్ధము. పై ఆలయ విజ్ఞానమును,నిర్వికల్పకజ్ఞానమును విజ్ఞాన స్కంధమనబడును. సుఖదుః ఖానుభవములు వేదనాస్కంధమనబడును. విష్ణుశర్మయనియు, దేవదత్తుడనియు, బ్రాహ్మణుడనియు, క్షత్రియుడనియు పుట్టు సవికల్పక జ్ఞానము సంజ్ఞారూపమగుట సంజ్ఞాస్కంధమనబడును. రాగద్వేషమోహ మదమానాదులు

సంస్కార స్కంధమనబడును,. "తాను" అను అంశమును తెలుపు నిర్వికల్పకమగు ధారారూపమయిన ఆలయ విజ్ఞానము చిత్తమనియు, ఆశయ మనియు, ఆత్మయనియు చెప్పబడును.

పై మతమును పరిశీలించినచో సకల వస్తువులు క్షణికమనినచో బాహ్య వస్తువులను చూచుట, తలచుట మున్నగు లోకానుభవవిరోధము స్పష్టమగుచున్నది. క్షణికుడగు జీవుడు క్షణిక వస్తువులను చూచి స్మరించినచో క్షణికుడు కాజాలడు. నేను ఇంతకు ముందు చూచిన ఘటమిది అను స్మరణము పొసగనేరదు. పరమా ణువులు కంటికి కనబడవు. అట్టి పరమాణువుల సముదాయమే ఘటపటాదుల నినచో అవి కంటితో జూడరానివయి యుండును. ఇట్లు లోకానుభవ విరోధము ఈ మతమున కనబడుచుండగా ఇట్టి మతమును బౌద్ధులు ఏ ప్రమాణమువలన కనుగొనిరి? వేద బాహ్యులనుటచే వారితో శిష్టులు మాట్లాడరాదనుట తేటతెల్ల మగుచున్నది. ఇట్టి లోకానుభవ విరుద్ధ మతము ప్రత్యక్షమూలము కానేరదు. ప్రత్యక్షము చూడరాని విషయమును అనుమాన ప్రమాణము ప్రసరింపజాలదు. సర్వము క్షణికమయి యుంటే ఎవరైన వస్తువుల సాదృశ్యము జూచి యుపమింప జాలుదురు? కావున అనుమాన ప్రమాణము సయితము ఈ విషయమును నిరూపింపనేరదు. బాహ్యార్థము కలదనియు, క్షణికమనియు చెప్పు బౌద్ధమతము దోషమూలము కనుక మోక్షకాము లాదరింపదగినది కాదు.

చలనములేనట్టియు, క్షణికములయినట్టియు అయిన పరమాణువులకు సంఘీభావమెట్లు పొసగును? పొసగనేరదు. పరమాణువులు కంటికి కనబడక పోతే పరమాణు సముదాయమగు ఘటపటాదులు కంటికి కనబడకుండుట తథ్యము. భిన్నము కాని సంఘము ఇంద్రియములకు ఎట్లు గోచరించును? ఎవరు చేయగలరు? స్థిరుడొక్కడు లేకపోయినచో సంఘము సంభవింపజాలదు. స్కంధపంచకమే పరమాణు సంఘము చేయుననుట పొసగదు. స్కంధపంచకము సంఘరూపమగుటయు, స్కంధపంచకము నందెన్ని స్కంధములకు భోక్తృతమను టయు నిర్ణయింపవలను వీలుపడదు. ధారావిజ్ఞానము సయితమిట్టిది యని

నిరూపింప శక్యము కాదు. ఇట్లుండ భోగమోక్షము లెవరికి కలుగును?

స్కంధపంచక సముదాయమునకు భోక్తృత్వమని బౌద్ధులు చెప్పుచున్నందున అట్టి సముదాయము స్కంధపంచకము కన్న భిన్నమగు అవయవములను అంగీ కరించుటచే అపసిద్ధాంత దోషము సంభవించును. ఈ సముదాయమంతటికీ కర్తృత్వము చెప్పుటచే ఈదేహమునగల పలువురు యజమానులకు ఏకాభిప్రా యము పొసగదు. శరీరము ఏ కార్యము చేయజాలదు. స్కంధపంచకము నందు కర్తృత్వము ఎవరికో నిర్ధారణ చేయజాలము. "నేను" అను ఆలయ విజ్ఞాన ధారయు నిరూపింప శక్యము కాదు. ఆలయ విజ్ఞానధార యనిన క్షణిక విజ్ఞాన రూపమనిగాని, క్షణిక విజ్ఞానములకన్న భిన్నమని కాని చెప్పనగును. అప్పుడు ఆలయ విజ్ఞానము (నేను) క్షణికమగును. "తాను" క్షణికమయినచో పూర్వోత్తర క్షణములను ఎరుగనివాడు పరమాణు సంఘీభావమునకు ఏల ప్రయత్నించును. ఇట్లు బౌద్ధమతమున భోగమోక్షములనుభవింపదగు స్థిరుడైన జీవుడు లేకుండు టచే బౌద్ధశాస్త్రము నిరుపయోగము కాగలదు.

క్షణభంగురములగు పృథివ్యాధి ధాతువులను స్థిరమనియు, దేహము తాననియు, దేహసంబంధీకులు తనవారనియు తలచుట అవిద్య యనబడును. ఇట్టి అవిద్యవలన రాగద్వేష మోహ సంస్కారములు పుట్టును. ఇట్టి సంస్కారము మూలమున గర్భస్థునకు అదృష్టము వలన తొలిజ్ఞాన మంకురించును. పిమ్మట దేహమునకు గల బుద్బుదా వస్థలను నామరూపములంకురించును. పిమ్మట ఇంద్రియములు కలుగును. పిమ్మట ఇంద్రియములకు విషయ సంబంధము వలన స్పర్శయు, సుఖ దుఃఖాది వేదనలు పుట్టును. పిమ్మట విషయములందు కోరికలు జనించును. కోరికల వలన ప్రవృత్తియు, ప్రవృత్తి వలన ధర్మాధర్మములు వీటివల్ల తదనుకూలమగు జన్మ కలుగును. జన్మ వచ్చాక వార్ధక్యము, తరువాత మరణము సంభవించును. ఇట్లు అవిద్యాదులు ఒకదాని వెంటనొకటి నిమిత్త భావముతో తిరుగుచుండగా బాహ్యాభ్యంతర సంఘములగు భోగ్యభోక్తృ వర్గ ములు కల్గునని బౌద్ధుల ఆశయము. కాని ఇవన్నీ క్షణికములగుటచే ఒకదాని కొకటి కారణము కానేరదు.

భావపదార్థమునుబౌద్ధులు మూడు తెగలందురు. అవి ప్రతిసంఖ్యా నిరోధము, అప్రతిసంఖ్యానిరోధము, ఆవరణాభావము అని మూడురకములు. బుద్ధి పూర్వకముగ వస్తునాశనము చేయుటను ప్రతిసంఖ్యా నిరోధమనబడును. కాల క్రమమున వస్తువులకు కలుగు నాశనము అప్రతిసంఖ్యానిరోధమనబడును. ఆకాశము అభావ పదార్థమనియు, అది ఆవరణా భావ రూపమనియు వీరి ఆశయము. కాని అసద్రూపమగు అభావ పదార్థము ఏకరూపమయి యుండును. కాని ఇట్టి అభావమందు ఇన్ని తెగలుండదగవు. మఱియు ఆవరణాభావ ఆకాశ మందు ఒక పక్షి సంచరించుచుండగా ఆవరణ సంభవించును. కావున మఱి యొక పక్షి ఆకాశమున సంచరింపజాలదు. తొలిపక్షి ఆకాశమందున్నపుడు ఆకాశమును ఆవరణాభావమనుట పొసగదు. తొలిపక్షి ఆకాశమందు లేని యెడల రెండవ పక్షి సంచరించుచున్నదనుట పొసగదు. ఆవరణాభావమాకాశము అనువారి మతము నందు ఆకాశము అభావము కనుక ఏక రూపమయి యుండును కాని మఱియే ఇతర విశేషములు కల్పింప అవకాశములేదు. కాని ఇతరుల మతమునందు ఆకాశము అనగా అవకాశమునిచ్చునట్టి భావపదార్థమని అర్థము.

అవ: బాహ్యార్థము లేదనియు, విజ్ఞానము మాత్రమే స్వప్న, జాగ్రద్వ్యవహారమును సాగింపగలదని చెప్పు విజ్ఞానవాది(యోగాచారుని)మతమును నిరసించుచున్నారు.

ప్రమాణసిద్ధమగు ఘటపటాది బాహ్య పదార్థము లేదని నిరాకరింప శక్యము గానిది. ప్రత్యక్షాది ప్రమాణసిద్ధమగు దానిని యోగాచారులెట్లు లేదనజాలుదురు? కావున బాహ్యార్థము లేదనుట లోకవిరుద్ధము. బాహ్యపదార్థము లేవనిన ఇది ఘటమనియు, ఇది పటమనియు భేదము పొసగదు. మఱియు బాహ్యార్థములు లేకున్నను జ్ఞానము మాత్రము వ్యవహారమును సాగించుననుచు, జాగ్రద్వ్యవహారములు బాహ్యార్థములు లేకనే సంభవించుననియు కావున బాహ్యార్థములను అంగీకరించుట వ్యర్థమని వీరి ఊహ. అదియు సమంజసము గాదు. జాగ్రత కాలములో బాహ్యవస్తువుల అనుభవముతో కలుగువాసనలచే స్వప్నమందలి వ్యవహారము సంభవించును. జాగ్రత్తలో వస్తువులను అంగీకరింపక వాసనయు,

తన్మూలమున వ్యవహారము కుదరదు. బాహ్యపదార్థములు నిరాధారమయి యుండుట మనకు తెలియును. బాహ్య పదార్థములు శూన్యములనియు, ఆంతరమగు జ్ఞానరూపములనియు వీరు చెప్పుదురు. బాహ్యములగు వస్తువులు లేకున్నచో బాహ్యములో అట్లు కనబడుటయు పొసగదు. మఱియు జ్ఞానములందలి భేదమే కాక వాసనల యందలి భేదమును పొసగనేరదు. పూర్వాపూర్వపు వాసనలయందలి వైచిత్ర్యముచే ఉత్తరోత్తర వాసనలందు వైచిత్ర్యము సంభవించుననుటయు నిలుకడలేని అనవస్థను సమకూర్చును. కావున ఘటపటాది జ్ఞానమందలి భేద వ్యవహారమును పొసగింపనేరదు. క్షణిక విజ్ఞానము ఆత్మయనిన బంధ మోక్షములు కుదరజాలవు. సకలము క్షణికమను సౌత్రాంతిక వైభాషికుల మతమున చెప్పిన దోషములన్నియు క్షణిక విజ్ఞాన వాదమందును సంభవింపగలవు. సకలప్రపంచ వస్తువులులేకున్న వాది ప్రతివాదులు శాస్త్రము మున్నగునవి లేకపోవుటచే బాహ్యార్థములు లేవనియు, క్షణిక విజ్ఞానము మాత్రమే సత్యమని చెప్పు యోగాచారుల మతము సకలానుభవ విరుద్ధమగుటచే మోక్షకాములాదరింపదగదని భావము.

అవ: శూన్యమే తత్త్వమనియు, అందుండే బ్రహ్మాండము పుట్టుననియు చెప్పు మాధ్యమికుని మతమును నిరాకరించుచున్నారు.

శూన్యమే తత్త్వమని శూన్యమునుండి సకల బ్రహ్మాండము పుట్టునని బుద్ధుని పరమాశయము. కాని అభావము నుండి భావ పదార్థములు పుట్టుట కనివిని యుండని అభావమందు ఎట్టి విశేషములుండవు. అట్టి నిర్విశేషమగు అభా వము వలన విచిత్రమగు ప్రపంచ మేల పుట్టును? కార్యమందలి విశేషములకు కారణమందలి విశేషములే కారణము కావున పుట్టజాలవు. బంగారమునుండి పుట్టు ఆభరణములన్నిటి యందు బంగారమే కనబడునట్లుగా ఈ బ్రహ్మాండము అసద్రూపమగు అభావము నుండి పుట్టినచో అసద్రూపముగనే కనబడవల యును. కాని ఎవ్వరు కూడా బ్రహ్మాండమందలి వస్తువులను అసద్రూపమున గ్రహించుటలేదు. అభావమునుండి సకలము పుట్టినచో సకలజనులకు ప్రయ త్నము లేకనే సకలము పుట్టవలయును. కాని అట్లు పుట్టుటలేదు. మఱియు అభావమును కనుగొనుప్రమాణమునులేదు మఱియు వీరి మతమున ప్రత్యక్షాను మానములు రెండే ప్రమాణములు. ఇంద్రియముల

తోడ సంబంధము గల వస్తువులను తెలుపుప్రమాణము ప్రత్యక్ష ప్రమాణము. సకలము శూన్యమేయనిన ఇంద్రియములతోడ సంబంధము కుదరదు. కావున ప్రత్యక్ష ప్రమాణము శూన్యతత్త్వమును తెలుపజాలదు. ప్రత్యక్షమును అనుసరించియే అనుమానము బయలు వెడలును. ఇందు ప్రత్యక్షము లేనందున అనుమానము సయితము శూన్యతత్త్వమును తెలుపనేరదు. అనుపలబ్ధి మున్నగు ప్రమాణాంతరములను వీరలంగీకరింప మీ శూన్యమను తత్త్వము ఏ ప్రమాణములకు తెలియరానిదై యుండును. మఱియు సర్వశూన్యతయే జ్ఞానమునకు ఫలమనియు, తన్మూల మున నైరాత్మ్యసిద్ధియే ముక్తియనియు వీరి ఆశయము. నైరాత్మ్యము అనర్థహేతువే గాని పురుషార్థము గానేరదు. ఎందుకంటే తన నాశనాన్ని ఏ యొక్కడు కోరు కొనడు సరికదా ద్వేషించుననుట లోకానుభవ సిద్ధము. ఇట్టి ఆత్మ ఘాతమను ముక్తిని బోధించి లోకులను వంచింప నరకపాతము సంభవించునని భావము.

అవ: దిగంబర మతమును నిరాకరించుచున్నారు.

దిగంబరులనియు, అర్హతులనియు జైనులకు నామాంతరము. దిగంబరులు పదార్థము ఏకరూపముగా నుండక ఒక్కొక్కటి నాఱున్నొక విధమగునందురు. వస్తువు ఏకరూపమున ఉండనిచో ఆయావస్తువులను కనుగొనుటగాని, త్యజించుట కాని జరుగదు. వీరి మతమున వస్తువులు పలు రూపములయినట్లుగా జీవుడు కూడా పలు రూపములు ఎట్లు బొందును? వీరి శాస్త్రమున గల జీవుడు, వస్తువులు ఆఱున్నొకటి కానిచో సకల వ్యవస్థా శూన్యము కాగలదు. వీరి శాస్త్రమందు నిర్ణయించిన అంశములన్నియు యిది యిట్లనియు, ఇది యిట్లు కాదనియు పలు విధముల తీర్మానించుటచే వీరి శాస్త్రము వలన కలుగు జ్ఞానమంతయు సందేహరూపము కాగలదు. బంధమోక్షములు వ్యవస్థాహీనములగును. ఇట్టి వాదమును సర్వానైకాంత్య వాదమనబడును. దీనిని పొసగించుటకు సప్తభంగీనయము అనుదానిని వక్కాణింతురు. లోకమున గల ఘటపటాది వస్తువులు ఒక్కొక్కటికి ఏదో ఒక రూపముగలదు. ఏదో ఒక రూపము లేదు. ఏదో ఒక రూపము గలదు చెప్పరానిది. ఏదో ఒక రూపము లేదు చెప్పరానిది. ఏదో ఒక రూపము గలదు లేదు చెప్పరానిది. ఈ తీరంతయు నాఱున్నొక

విధమగుటచే ఇదియే సప్తభంగీనయమనబడును. సప్తభంగీనయముచే సమస్త వస్తువులు ఒక తీరున లేక పలు తీరులగుటచే ఆయా వస్తువులను సంపాదింపబూనుటయు, త్యజింపబూనుటయు పొసగునని వీరి ఆశయము. కాని వీరు నిరూపించు సప్తభంగీనయము సయితము ఇట్టిది యని నిర్ణయము చేయనలవి కాక యుండును.

లోకమునగల సకలము సప్తవిధమని నిరూపించుటయు తగదు. జ్ఞానము ఏకరూపమున యుండక కలదనియు, లేదనియు చెప్పినందున సంశయ రూపమగునేగాని ప్రమాణము కాదు. మఱియు కలదు, లేదు అనునవి విరుద్ధ ధర్మములు. ఒక కాలమందు కలదనియు, మఱియొక కాలమందు లేదనియు చెప్పదగదు. అప్పుడు ఏ వస్తువును యిట్టిది అని నిర్ణయింప శక్యముగానందుచే శిష్యులకు శాస్త్రమందు ప్రవృత్తిసంభవింపదు. ఇట్లే లోకవ్యవహారము సయితము పొసగనేరదు. అన్నము భుజించిన తృప్తికలుగునని, విషముసేవించిన మరణింతురని నిర్ణయము చేయనలవి కాదు. వస్తువులెల్లప్పుడు ఏకరూపములయినచో సంపాదింపబూనుట మున్నగు లోకవ్యవహారము పొసగదని, లోకవ్యవహారము పొసగించుటకు సప్తభంగీనయమును అంగీకరించుచు న్నామని చెప్పుచు జైనులు లోకవ్యవహారమును నల్లకల్లోలము చేయుదురని స్పష్టమగుచున్నది. మఱియు జైనులు జీవుని శరీర పరిమాణుడని అంగీకరింతురు. జీవునకు కర్మమూలముగ మానవ గజాది దేహములు ప్రాప్తించునపుడు ఆయా దేహములకు తగిన విధముగా జీవుని రూపము పెరుగుట, తరుగుట జరిగినచో జీవుడు అనిత్యుడు కాగలడు. అప్పుడు బంధమోక్షముల వ్యవస్థ లేకపోవును. ఇట్టి అంశములను పరిశీలించినచో దిగంబరుల మతము మోక్షకాము లాదరింపదగదనుట స్పష్టము.

అవ: వేదైక దేశికమగు హైరణ్యగర్భమతమును నిరాకరించుచున్నారు.

హిరణ్యగర్భోపాసకులు హిరణ్యగర్భుని జగత్కారణమందురు. దైవజ్ఞులు కాలమును జగత్కారణమందురు. శ్రుతి, యుక్తి బాధితములగుటచే కపిల గౌతమాది మతముల మాదిరి దైవజ్ఞ హైరణ్య గర్భాదుల మతము లాదరింపదగినవి కావు. పురాణాలలో హిరణ్యగర్భునకు పుట్టువు మరియు పరిమితమగు ఆయువు నిర్ణయింపబడి యున్నది. హిరణ్యగర్భునకు బ్రహ్మము నుండి

జ్ఞానోదయము గలిగెనని వేదములు పలుకుచున్నవి.

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వైవేదాంశ్చ ప్రహిణోతితస్మై।
తగ్ంహ దేవ మాత్మబుద్ధి ప్రకాశం ముముక్షుర్వై శరణమహం ప్రతద్యే॥"

తొలుత హిరణ్యగర్భుని పుట్టించి, అతనికి వేదములు చెప్పి, ఆత్మబుద్ధులను ప్రకాశింపచేయునట్టి దేవుని మోక్షము గోరి శరణుపొందుదునను మంత్రము పరబ్రహ్మమునుండి హిరణ్యగర్భునకు పుట్టువును, జ్ఞానైశ్వర్యమును సంభవించెననుచున్నది. కావున సచ్చిదానందరూపమగు నిర్గుణ పరబ్రహ్మమే సకల బ్రహ్మాండమునకు కారణము. అట్టి బ్రహ్మమునకు మాయావశమున సకల శక్తులుద్భవింప నీ బ్రహ్మాండమును పుట్టింపగలదు. పాలింపగలదు. లయము చేయగలదు.

క్రమముక్తియనియు, సద్యోముక్తియనియు ముక్తి రెండువిధములు. జ్ఞానోదయమునకు ప్రయత్నించువారికి ఈజన్మములో జ్ఞానమంకురించుటకు ప్రబలమైన ప్రతిబంధకములు అడ్డుతగిలినచో జ్ఞానోదయము కలుగజాలదు. అట్టివారు అర్చితాది మార్గమున హిరణ్యగర్భ లోకమున చేరి హిరణ్యగర్భుని వద్ద వేదాంతశ్రవణముచేయుదురు. పిమ్మట ఆలోకమందు జ్ఞానోదయము కలుగగా, హిరణ్యగర్భునితోడ పరబ్రహ్మమును పొందుదురు. జ్ఞానోదయమెప్పటికీ కలుగనివారు ఈలోకమందు జన్మింతురు. కావుననే హిరణ్యగర్భుని లోకము చేరబోవు వారల ఇంద్రియములు బయలు వెడలుననియు వేదాంతములందు గానవచ్చుచున్నది. పరబ్రహ్మవేత్తలకు లోకాంతర గమనము లేనందున వారల ఇంద్రియముల కిందే లయము చెప్పబడినది. బ్రహ్మవేత్తలకు కలుగు ముక్తి సద్యోముక్తి అనబడును. పరబ్రహ్మము తానని తెలిసిన జీవుడు సద్యోముక్తుడగును. హిరణ్య గర్భుడు చేతనుడయినప్పటికీ సకల జగములకు కారణము కాజాలడుయనినచో అచేతనమగు కాల స్వభావాదుల మాటలు ముచ్చటింపనేల? కావున వారి మతమును మోక్షకాములాదరింపదగినవి కావు.

అవ: దేహాత్మవాదుల మతమును నిరాకరించుచున్నారు.

నేను తెల్లనివాడను, నేను పోవుచున్నాను, నేను భుజించుచున్నా ననియు పండిత పామరులెల్లరు ఒక్కొక్క విధమున దేహధర్మములను నాత్మగా తలంచుచుండుటచే దేహమే ఆత్మయని చార్వాకులు చెప్పుదురు. ఒకడు పుట్టినది మొదలు దుఃఖము గలవాడుగను, మరియొకడు పుట్టినది మొదలు సుఖసంపన్నుడగుచున్నాడు. దేహమే ఆత్మకాకున్నచో పుట్టినది మొదలు కలుగు సుఖదుఃఖములు నిష్కారణములగును. మఱియు పూర్వజన్మములందలి అనుభవములేని స్తన్యపా నాలందు ప్రవృత్తి పుట్టిన శిశువులకు నిర్హేతుకమగును. అచేతనములగు పృథి వ్యాధి భూతచతుష్టయము, రథశకటాదుల మాదిరి దేహరూపమున పరిణమించునని చార్వాకులందురు.

పుట్టిన శిశువు స్తన్యపానాదులను గ్రహించుటను బట్టి దేహముగాక వేఱొకండు ఆత్మ గలదనుటకు నిదర్శనము కాగలదు. రథశకటాదులవలెనే దేహాకార పరిణామము సయితము దేహముకన్నా వేఱుగ చేతనుని కొఱకని స్పష్టమగుచున్నది. మరణము తరువాత కూడా దేహ పరిణామముండుట వలన మృతి చెందిన జీవునకు జీవించు రీతి సకలము తెలియవలెను. అట్లు తెలియక పోవుటచేత దేహము కన్న ఆత్మ వేఱొకండుకలదనుట సిద్ధింపగలదు. కుమ్మరిచే చేయబడిన కుండలు ఒకటి పాలు పోయుటకు, మరొకటి మదిరమునకు కారణ మైనట్లుగా ఒకడు సుఖవంతుడగుటకు, మరియొక జీవుడు దుఃఖవంతుడగుటకు స్వభావమే కాని అదృష్టము కారణముకాదని చార్వాకులందురు. అయితే అన్నిటికీ ఒక్క స్వభావమే కారణమైతే సకలము ఏకరీతిగా యుండవలయును. తైలము కారణమగు దీపములందు వత్తియు, బీజములనుండి పుట్టిన అంకురములందును తేడాలు కనబడునట్లుగా స్వభావమే కారణమైతే జీవులెల్లరు ఏకరీతిగా సుఖ వంతులు కావలయును లేదా దుఃఖవంతులు కావలయును. కాని భేదము సిద్ధింపజాలదు. కనుక ప్రాణికోటియందు గల తారతమ్యము పూర్వజన్మమందలి వాని కర్మమూలముగ సిద్ధించును. కావున దేహము కన్న వేఱొక ఆత్మకలదనుట నిర్వివాదమగును.

చార్వాకులు ప్రత్యక్షముగాక వేఱొండు ప్రమాణము లేదందురు. ఇది పొసగని మాట. శబ్దరూపములగు చార్వాకుల మాటలు ప్రమాణములు కానేరవు. మానవుల మాటలలో అనేక దోషములుండుట సహజము. అట్టి మాటలే యథార్థములైతే ఏ మాత్రము దోషములు లేనట్టి వేదము ప్రబల

ప్రమాణము కాగలదు. శబ్ద ప్రమాణ్యమును అంగీకరించినచో మానవుల మాటలు వేదముల కన్న నిర్దోషములగుట, ప్రబల ప్రమాణములనుట స్పష్టము. కేవల ప్రత్యక్షముచే చార్వాకులు సకల లోక వ్యవహారమును నిర్వహింపజాలరు. ఇంద్రియములు లేకుండా ప్రత్యక్షము సంభవింపనేరదు. వేదాంతులు నిరూపించిన అనుమానము ప్రమాణమనియు, దేహముకన్న వేఱొక యాత్మగలదనియు చార్వాకులు అంగీ కరింపరు. నేను మనుష్యుడననియు, నేను దీర్ఘకాయుడననియు, దేహవే ఆత్మ రూపమున సర్వులకు గోచరించుచుండగా, తద్విరుద్ధముగ అనుమాన ప్రమాణ బలమున దేహాతిరిక్తమగు ఆత్మను ఊహించుట తగదని చార్వాకుల తాత్పర్యము. కాని అనుమానాదులు ప్రమాణములు గానిచో అనుమానాది మూలములగు ఇంద్రియములవలన పుట్టు ప్రత్యక్షమే సిద్ధింపజాలదు. ఇట్టి ప్రత్యక్షము ప్రామాణ్యా మనుటయు తగదు. మఱియు ప్రత్యక్షము మాత్రము ప్రమాణమయితే పరులకు గల జ్ఞానము ఆ ప్రత్యక్ష మూలమున తెలియజాలవు.

ఇంతియేగాక ఇంద్రియములు ప్రత్యక్షములుగావు. వాటి ఉనికి ఊహించ వలసియుండును. ఇట్లు అనుమాన ప్రమాణాధీనమగు ఉనికి ప్రత్యక్షము అను మాన ప్రమాణముగాకున్న సిద్ధింపనేరదు. మఱియు చార్వాకులు ప్రత్యక్షమం తయు ప్రమాణమనరు. భ్రమ ప్రత్యక్షమనియు, ప్రమాప్రత్యక్షమనియు రెండు తెగలగును. ఆ రెండింటియందు భ్రమాప్రత్యక్షమునే ప్రమాణమనగలరు. కాని భ్రమ ప్రత్యక్షమును ఏ ఒక్కరు ప్రమాణమనజాలరు. ఇది భ్రమ ప్రత్యక్షమనియు, ఇది ప్రమాప్రత్యక్షమనియు తెలియుటకు అనుమాన ప్రమాణమునే అంగీకరింప వలయును. కావున ప్రత్యక్షము ప్రమాణమనదగదు. తెలియని మనుజులను తెలుపుటకు శాస్త్రములను వ్రాయుదురు. తెలియనివారలను తెలియుట అనుమాన గమ్యమే గాని ప్రత్యక్షముకాదు. కావున అనుమాన ప్రమాణమును కాదని తెలియని వారిని తెలుపుటకై చార్వాకుల తత్త్వముపదేశించుటయు కుదరదు. కావున చార్వాకుల ప్రత్యక్షము ప్రమాణమనుట పొసగదు.

చార్వాకులు దేహాత్మ వాదమును బోధించుటకై తమ శాస్త్రమును రచించిరి. నేను స్థూలకాయుడననియు, శరీర పాటవము గలవాడననియు సకల ప్రాణులు దేహమునే ఆత్మగా తలచుట లోకానుభవ సిద్ధము. తెలిసిన

అంశములను తెలుపు నదియు, పరమార్థముగాని దానిని తెలుపునదియు ప్రమాణము కానేరదు. దేహము ఆత్మయని లోకానుభవ సిద్ధముగా తెలియుచున్నపుడు ఈ తెలిసిన అంశమును తెలుపుటకు చార్వాకదర్శనము ప్రమాణము గానేరదు. దేహాతిరిక్త మగు ఆత్మను వేదములు తెలుపుచున్నందున వేదములందలి ద్వేషముచే చార్వాకులు దేహాత్మవాదమును చెప్పుచున్నందున చార్వాక దర్శనము ద్వేషమూల మగును. దేహాత్మవాదము యథార్థమనియు, ధనికులను వంచించుటకై దేహాతి రిక్తాత్మవాదమును చెప్పిరనియు, కావున తాము దేహాత్మవాదమును దృఢపరచు టకై ఈవాదమును నిరూపించితిమని చార్వాకులు చెప్పుదురు. జన్మాంతరమున చేసిన దుష్కృతములచేత చార్వాకులకు వేదద్వేషము పుట్టెను. పరమార్థ చింతన లేక పరిమితిలేని జనన మరణ సముద్రమున మునిగి నాశనమును పొందును. పరలోకములు లేవనియు, ఈ దేహము ఆత్మ గనుక యదేచ్ఛగా సంచరింపుమని చెప్పుచు, జనన మరణ సముద్రమున పడవేయుచూ లోకులను వంచింపబూనిన చార్వాక దర్శనము నమ్మదగినది కాదు. దేహమాత్మయని తలచి యదేచ్ఛగా సంచరింప నరకపాతము కలుగును. మృత్యుదేవత నచికేతునకు:

"అయం లోకోనాస్తి పర ఇతిమానీ పునః పునర్వశమా పద్యతేమే ॥"

ఈ లోకముగాక వేఱొండు లోకములేదని తలచు మూఢుడు మాటిమాటికి నా వశమున బడుననియు ఉపదేశించెను. మఱియు

"దేహాభిమానాద్యత్పాపం నతద్గో వధకోటిభిః ।
ప్రాయశ్చిత్తాద్భవేచ్ఛుద్ధిర్నృణాం గోవధకారిణామ్ ॥"

కోట్లానుకోట్ల గోవులను చంపినను దేహమాత్మయని తలచుట వలన కలుగునంతటి పాపము కలుగదు. గోవధ చేయువారి పాపము ప్రాయశ్చిత్తమున తొలగును అనునట్లుగా దేహాత్మాభిమానముచే విచ్చలవిడిగా సంచరించిన నరక పాతము తప్పదని తెలియుచున్నది. ఈదేహము తండ్రియొక్క వీర్యమును, తల్లి రక్తముతోడను పుట్టియు, అన్నపానాదులచే వృద్ధి పొందును. ఇది జడమే గాని చేతనము కాదు. పుట్టుట, ఉండుట, వృద్ధిచెందుట, పరిణమించుట, కృశించుట,

నశించుట అను షడ్వికారముతో కూడియున్నది. చర్మము, ఎముకలు, నాడులు, మాంసము, మలమూత్రాది కోశముల తోడను, సప్తధాతువులతో కూడియున్నం దున ఆది వ్యాధులకు మూలము. మనఃక్లేశముల తోడను, దేహక్లేశములతోడను నిండియుండి ప్రాణము పోయినంతనే మట్టిపెళ్లవలె కొయ్యబాఱి నిరుపయోగ మగును. "ప్రాణము పోయిన పిమ్మట నక్కలు తినకున్న దహన సంస్కారము చేయు దేహమును ఎందువలన నీవు ఆత్మగా తలచుచున్నావు? ఓరి మూర్ఖ! నీవెవరిచే ఈ విధముగ మోసగించబడితివి?" అనుచు చార్వాక దర్శనమును చూచి జాలినొందుచున్నారు. చార్వాకుల దర్శనము వంచనామూల మనియు, మోక్షకాములు నమ్మదగినది కాదని భావము.

అవ: ఇంద్రియాత్మ వాదమును నిరాకరించుచున్నారు.

మఱికొందరు చార్వాకులు ఇంద్రియములే ఆత్మయందురు. చూచుచున్నాను, వినుచున్నాను అను ఇంద్రియ ధర్మములు ఆత్మయని చార్వాకుల ఆశయము. ఇంద్రియము లొక్కొక్కటియు ఆత్మయనిన ఆదేహమున పలువురు జీవులుండునట్లు అంగీకరింపవలసి యుండును. పలువురు జీవులు తమ తమ ప్రయోజనము కొరకై ఈదేహమును ఏకకాలమునందు నలుదిశల నడిపింపబూనిన ఈదేహము సంధిబంధములు సడలి నశింపవలసియుండును. ఇంద్రియ సముదాయమం తయు ఆత్మయనిన గ్రుడ్డివారికి, మూగవారికి ఆయా ఇంద్రియములు లేనందున వారికి ఆత్మస్వరూపము లేకపోవుటచే మరణింతురు. కంటితో చూసిన అంశము లను, చెవితో విన్న మాటలను చెప్పుట కుదరకపోవును. ఇట్లు ఒక ఇంద్రియము యొక్క అనుభవము మఱియొక ఇంద్రియమునకు తెలియ శక్యము గానందున ఇంద్రియ సముదాయము ఆత్మ యనుట పొసగదు. ఇంద్రియములు ఆత్మయనిన స్వప్న, సుషుప్తులను చూచువాడు లేకపోవును. ఇంద్రియములు లేకపోవుటయే మరణమనిన స్వప్నములో ఇంద్రియములు లేనందున నిద్రించుటకు భయపడ వలసి యుండును.

భౌతికమగు దేహమువలెనే భౌతికములగు ఇంద్రియములు అచేతనములు గనుక ఆత్మకాదని చెప్పరాదు. వేదాంతులు ఇంద్రియము లన్యోన్య సంవాదము చేసిన కథలు కనబడుచున్నవి. అనేక వ్యాపారము చేయువారందరూ ఐకమత్య ముగా యుండునట్లుగా ఇంద్రియములనేకమయినను ఏకాభిప్రాయము కలిగి యుండునని చార్వాకుల ఆశయము. కాని ఇంద్రియముల అన్యోన్య సంవాదము చేసినట్లు కనబడు కథలు స్తుతిపరములు. కావున ఇంద్రియములకు చైతన్యమును నిరూపింపజాలవు. వ్యాపారము చేయు వ్యాపారస్తులకు లాభ ప్రయోజనము కలదు. కావున వారికి ఐకమత్యము సంభవించును. కాని ఇంద్రియములన్నిటికీ ఏక ప్రయోజనము లేదు. వ్యాపారస్తులు సయితము ఎల్లవేళల ఐకమత్యము కలిగియుందురనుటయు తగదు. ఇంద్రియములు అచేతనమగుటయే నిద్రామ రణములు. కావున ప్రాణులకు మరణభీతివలె నిద్రాభీతి కలుగవలయును. మరణావస్థ యందు శరీరము నశించుటచే భీతికలదు కాని నిద్రావస్థ యందు శరీర నాశనము లేకపోవుటచే నిద్రవలన ప్రాణులకు భీతిలేదనియు నిద్రామరణ ములకు భేదముకలదని చార్వాకులందరు. కాని ఇంద్రియములాత్మ అనువాద మున తాను కాని దేహనాశనము తనకు దుఃఖకరము కానేరదు. కావున మరణము వలనను భీతి చెందరాదు. కావున ఇంద్రియాత్మ వాదము పొసగదని భావము.

అవ: ప్రాణాత్మవాదమును నిరాకరించుచున్నారు.

ప్రాణమే ఆత్మయని ప్రాణాత్మవాదులందురు కాని ప్రాణము జడము కావున ఆత్మకానేరదు. ప్రాణము అన్నమను త్రాడుచే కట్టబడి యుండును. మఱియు సుషుప్తావస్థ యందు ప్రాణమునకు ఉచ్ఛ్వాస, నిశ్వాసలనే వృత్తులుండుట లోకానుభవ సిద్ధము. "సతాసోమ్య తదా సంపన్నో భవతి" జీవుడు సుషుప్తావస్థ యందు పరబ్రహ్మముతో ఏకమగుచున్నాడు అని శ్రుతి చెప్పుచున్నది. ప్రాణము సంచరించుచున్నను జీవుడు సుషుప్తిలో తాను సంచారము లేనివాడనని తలంచుచుండును. ప్రాణము సయితము జలవికారమగుటచే ఆత్మకానేరదు. "జీవప్రాణ ధారణే" జీవుడనిన ఉపాధి వశమున ప్రాణములను

ధరించువాడని అర్థము. అట్టి శబ్దమును పరిశీలించిన ప్రాణము వేఱనియు, వానిని ధరించు జీవుడు వేఱనియు స్పష్టమగుచున్నది. ఇట్టి జీవుడు ప్రాణములను ధరించి స్వప్న, సుషుప్తులందు యదేచ్ఛగ సంచరించుచు ఈ ప్రాణమును దేహరక్షణకై నియమించును. కావుననే స్వప్న, సుషుప్తులందు సకలేంద్రియములు లయమయి ఉండగా, ఈ ప్రాణమొక్కటే ఉచ్ఛ్వాస నిశ్వాసములతో ఈ దేహమున సంచరించు చుండును. మరణ పర్యంతము ఈదేహము నుండి పోవునపుడు ఈ ప్రాణోపాధి నాశ్రయించి బయలు వెడలును. అట్టి ఆత్మ ప్రాణముకన్న వేఱుగానే యుండెను. అట్టి జీవుడు స్వయంజ్యోతి స్వరూపుడు కావున ప్రాణమాత్మ కానేరదు.

ఇట్టి జీవుడొక హంస. ఏకహంస శబ్దమునకు ఒక్కడనియ, "హంతి = సంచరతి" అను వ్యుత్పత్తిచే జాగ్రదాది మూడవస్థలందు సంచరించు వాడనియు అర్థము లేక "హంతి = నాశయతి" అను వ్యుత్పత్తిచే తన స్వరూపమును తెలిసిన తడవుగ సంసారబంధమును సమూలముగ తొలగించును. కావున ఏకహంస రూపుడని అర్థము. ఒక్కడేయగు ఈ ఆత్మకు మోదప్రమోదాదులను రెక్కలను నిరూపించి తైత్తిరీయము జీవుని పక్షిరూపమున చెప్పుటచే ఏకహంస స్వరూపు డనబడెను.

అవ: మనస్సును ఆత్మ కాదనుచున్నారు.

మనస్సును ఆత్మ అని మనాత్మవాదులందురు. కాని మనస్సునకు పుట్టువు కలదు. కావున నిత్యము కానేరదు. నిత్యము కాని వస్తువు ఆత్మ గానేరదు. జ్ఞానమును సంపాదించుటకు ఇతరేంద్రియములవలె మనస్సును ఒక సాధనము కావున ఆత్మ కానేరదు. అన్న వికారమగుట చేతను, శుద్ధియు, అశుద్ధియు కనబడుట చేత ఆత్మ కానేరదు. జీవుని బంధమోక్షములకు మనస్సే కారణము. మనస్సును అనుసరించి శరీరధారణమును, తన్మూలమున జీవుడు మనోమయు డగుటచేతను ఆత్మకానేరదు. జాగ్రతస్వప్న భోగములను కలిగించు కర్మలుపశ మింప సకలేంద్రియములు లయము కాగా, మనస్సు సయితము పరమ కారణ మున లీనమగును కావున ఆత్మకానేరదు. మనస్సును ఆత్మ యనుచు సుషుప్తి

యందు ఆ ఆత్మకు లయమంగీకరింప నిద్రనుండి మేల్కొంచిన పిదప నిద్రను, నిద్రాసుఖమును స్మరింప వీలుపడదు. కావున మనస్సుకన్న వేఱొక ఆత్మ నిత్య జ్యోతిస్వరూపమై సుషుప్తియందు భాసించుచుండునని స్పష్టమగుచున్నది.

కృత హానాకృతా భ్యాగమములను దోషములను పరిహరించుటకై ఆత్మను నిత్యుడనవలయును. నిత్యుడుగానిచో ఈ జన్మమందు చేసిన కర్మలఫలము మరుజన్మమందు లేకపోవుటచే కృతహానియు, నిత్యుడుగాని జీవుడు పూర్వజన్మ కర్మ సంబంధము లేక పుట్టుననిన అకృతా భాగ్యమమును సంభవించును. "తన్మనోకురత" ఆ బ్రహ్మము మనస్సును పుట్టించెననుటచే పుట్టువు కలదు కావున ఆత్మగానేరదు. మఱియు జీవుని గూర్చి:

"అనన్వాగతం పుణ్యేన అనన్వాగతం పాపేన ।
అనన్వాగతస్తేన భవత్య సంగోహ్యాయం పురుషః ॥"

పుణ్యాపాప సంబంధము లేనివాడనియు, అసంగుడనియు వేదాంతములు తెలుపుచున్నవి.

"మనోహిద్వివిధం ప్రోక్తం శుద్ధంచా శుద్ధమేవచ"

శుద్ధము, అశుద్ధము అని మనస్సు రెండు విధములనబడునని శ్రుతులు మనస్సు గూర్చి చెప్పుచున్నవి కావున మనస్సు ఆత్మగానేరదనుట స్పష్టము.

"మన ఏవమనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।
బంధాయ విషయాసక్తం ముక్త్యైనిర్విషయం స్మృతమ్ ॥"

జీవుని బంధమోక్షములకు మనస్సే కారణము. విషయాసక్తమగు మనస్సు బంధకారణమగును. విషయము లందు ఆసక్తిలేని మనస్సు ముక్తి హేతువగును. దీనినిబట్టి జీవుడు వేఱనియు, అతని బంధమోక్షములకు కారణమగు మనస్సు వేఱనియు స్పష్టముగ తెలియుచున్నది. మనోవృత్తిని అనుసరించి జడభరతాదు లకు జన్మలు కలుగుటయు, జీవులు మనోమయములగుటయు లోకమున తెలియుచున్నది. జీవునకు గల మనస్సంబంధము దురవగాహము. కావుననే కొందఱు మనస్సును ఆత్మగా తలచిరి. సుషుప్తియందు మనస్సుతో సహా

సకలేంద్రియములు ఉపశమించును కావున మనస్సు నిత్యము కానేరదు. ఇట్లు అనిత్యమగు మనస్సును ఆత్మయనినచో నిద్ర నుండి మేల్కొన్న జీవులు నిద్రానుభవమును తెలియజాలరు. కావున అనిత్యమగు మనస్సుకన్నా నిత్యుడగు జీవుడు వేఱుగగలడని తెలియుచున్నది.

అవ: విజ్ఞానమే ఆత్మయనువారల మతమును నిరాకరించుచున్నారు.

"విజ్ఞానం యజ్ఞంతను తే కర్మాణి తను తేపిచ" విజ్ఞానమే యజ్ఞములను చేయుచున్నదనియు, కర్మలను చేయుచున్నదనియు వేదమున కనబడుటచే కొందఱు విజ్ఞానము ఆత్మయని భ్రమించిరి. కాని విజ్ఞానమునకు కూడా మనస్సు వలె పుట్టువు కలిగియుండును. చిత్‌ప్రతిబింబము గ్రహించు అంతఃకరణమునకు బుద్ధియనబడు విజ్ఞానము సహితమొక అంశము. ఇట్టి విజ్ఞానము నానారూపమగుటచే నానాత్మ వాదము సంభవించును. అనేక ఇంద్రియములు ఆత్మస్వరూపము కానట్లే నానారూపమగు బుద్ధియు ఆత్మకానేరదు. ఇట్టి బుద్ధియే తానని తలంచుటచే జీవునకు బంధము సంభవించునని శ్రుతులు చెప్పుచున్నవి. కావున విజ్ఞానము ఆత్మకన్న వేఱయియుండును. జీవునకు భోగముక్తులకై కల్పించిన రధిరథాది కల్పనయందు విజ్ఞానమునకు సారధ్యము కల్పింపబడియున్నది. ఆ స్థిర విజ్ఞానమునకు సాక్షియై, ఆ స్థిర విజ్ఞానముచే కప్పబడిన తనువు గలవాడైనట్టియు, చిద్రూపుడైనట్టియు, విజ్ఞానము కన్న భిన్నుడయినట్టి సాక్షి స్వరూపము వేఱొండు గలడని తెలియుచున్నది. జీవుని బంధమోక్షములను కఠోపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది.

"ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు ।
బుద్ధింతు సారథిం విద్ధిమనః ప్రగహమేవచ ।"

ఈశరీరమే రథము. అందు రథికుడే ఆత్మ. బుద్ధి సారథి, మనస్సు పగ్గములనియు తెలియుము. ఇంద్రియములు గుఱ్ఱములనియు, ఆ గుఱ్ఱములు పోవు మార్గములను ఇంద్రియ విషయములని చెప్పుదురు. శరీరేంద్రియ మనో యుక్తుడగు జీవుడు భోక్తయని పేర్కొందురు. ఇట్లుండ నసమాహిత చిత్తుడయి నేర్పరిగాని సారథి గల జీవునకు, లోకమందు పగ్గములు పట్టుట

తెలియని సారథిచేతిలో గుఱ్ఱములవలె ఇంద్రియములు పట్టుతప్పి నడువసాగును. పగ్గ ములు పట్టి సమాహిత చిత్తుడయి నేర్పుగల సారథికి వశమయిన గుఱ్ఱములవలె సమాహిత చిత్తుడయి విజ్ఞానవంతుడగు సారథి గల జీవునికి ఇంద్రియములు తప్పు త్రోవలను త్రొక్కజాలవు. పై ఇరువురిలో నేర్పులేని సారథి గల జీవుడు పరమపదమును పొందజాలడు. గనుక సంసారమునపడును. నేర్పు గల సారథి గల జీవుడు పునర్జన్మలేని పరమపదమును పొందును. వివేకముగల సారథియు, మనోరూపములగు పగ్గములుగల జీవుడు తుదకుచేరు పదము పరమపదమన బడును. పై మంత్రమందు సారథి బుద్ధియనియు, జీవుడు రథికుడని చెప్పుటచే జీవుడు విజ్ఞానముకన్న వేఱనియు స్పష్టమగుచున్నది. మఱియు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములకన్నా జీవుడు అన్యమని తైత్తిరీయము తెలుపుచున్నది. కావున విజ్ఞానము ఆత్మకాదు.

అవ: సకల శరీరములందు వ్యాపించగల చైతన్య శక్తి సంపన్నుడును, అణుమాత్ర స్వరూపుడు ఆత్మయని పాంచరాత్రాద్యాగమవాదులు చెప్పెదరు. వారి మతము పొసగనేరదనుచున్నారు.

"వాలా గ్రశత భాగస్య శతధా కల్పితస్య చ బాగోజీవః సవిజ్ఞేయః", వాలాగ్ర మాత్రం హృదయస్య మధ్యే అను శ్రుతులను జూచి జీవుడణు రూపుడందురు. "నిత్య స్సర్వగత స్థాణుః" అను గీతావచనమును ప్రమాణీకరించి ఆత్మ నిత్యమనియు, సర్వగతమనియు, అణు స్వరూపమనియు చెప్పుదురు. జీవుడు అణు స్వరూపుడయి దేహమునందు ఎందేని స్థిరుడయియుండ, అతని గుణమగు జ్ఞానము సకల శరీరమును వ్యాపించునని వీరి ఆశయము. అట్లయినచో గంగా ప్రవాహమున మునిగిన వానికి సకల శరీరమునందు నీటి యొక్క స్ఫురణ తెలియ నవకాశము లేకపోవును. ఇంతియే కాక జ్ఞానమనునది జీవునిగుణమని వీరందురు ఇట్లు జీవుడు అణుస్వరూపుడనియు, అతని గుణమని వారు వెల్లడించే జ్ఞానము సకల శరీరము నందు గల చైతన్యమును గ్రహింపజాలదు. గుణములెన్నడు గుణిని విడిచి యుండ జాలవు. తామరపువ్వు నుండి వచ్చు పరిమళమును వీరు దృష్టాంతీకరింతురు. కాని పరిమళ మునకు ఆధారమైన

పుష్పరేణువులు సయితము వాయువు మూలముగా వెడలి వచ్చును. అట్లుకానిచో పరిమళము దూరమునకు వ్యాపించ జాలదు. కర్పూర పరిమళముతో కర్పూర పరమాణువులు కలిపి వాయువుతో పాటు వ్యాపించుటవలన కొంత కాలమునకు కర్పూరము అంతరించిపోవుట లోకానుభవమున తెలియుచున్నది.

మఱియు గుణగుణులకు వైధర్మ్యముండవలెను. వైధర్మ్యము లేనియెడల గుణగుణి భావము కుదరజాలదు. రూపము రూపమునకు గుణము కానేరదు. రసము రసమునకును గుణముకానేరదు. జీవునకు అతని గుణమగు జ్ఞానము నకు వైధర్మ్యము కలదనిన గుణమగు జ్ఞానము చేతనము కావున ఆత్మజడము కావలసియుండును. ఆత్మ చేతనమే గాని జడము కాదు. కావున ఈ రెండింటికి గుణగుణి భావము సంభవింపజాలదు. గుణగుణి భావము పొసగింపదలచి జీవునకు అతని గుణమను జ్ఞానమునకు వైధర్మ్యము కలదందురేని జ్ఞానము చేతనమయి జీవుడు అచేతనుడనవలసి యుండును. అచేతను దాత్మగా నేరదనుట స్పష్టము. మఱియు అణురూపుడగు జీవునిగుణమగు జ్ఞానము సకల శరీరమున వ్యాపింపజాలదను దోషము సయితము అనివార్యమగును. మఱియు జీవునకు అణురూపము కలదని చెప్పుటకు ప్రమాణము కానరాదు. ప్రత్యక్షాదులీ అంశ మున ప్రమాణములు కాజాలవు. ప్రమాణము లేకున్నను నిరాలంబన ఆకాశ మందు పక్షులెగురుటయు, శ్వాసోచ్ఛ్వాసములు లేక చేపలు జీవించుటయు లోకానుభవసిద్ధమగుటను అంగీకరింతుము. కాని జీవుడు అణురూపుడనుటకు శ్రుతియు ప్రమాణము కానేరదు. "వాలాగ్రశతభాగస" అని ముందు చూపిన శ్రుతియు, వాక్యము చివరలో "సచానంత్యాయ కల్పతే" అని జీవుడనంత పరిమాణము గలవాడనుచున్నది. కావున వాలాగ్రశతభాగ స్వరూపము జీవున కౌపాధికమని భావము. కావుననే ముందు చెప్పిన రెండవ శ్రుతియందు వాలాగ్ర మాత్ర స్వరూపుడనుటయు కుదురును. అట్లు వాలాగ్రాదిస్వరూపము ఔపాధికము కాదేని ఒక శ్రుతియందు వాలాగ్రమాత్ర రూపుడనియు, మఱియొక శ్రుతియందు వాలాగ్రభాగ శతాంశ రూపుడనుటయు తగదు. "ఏషోఽణురాత్మ చేత సావేది తవ్యః" అను శ్రుతి ఆత్మరూపము

దుర్జ్ఞేయము కావున అణురూపమనుచున్నది. అట్లే జీవరూపమును చెప్పవలయును. పైన చెప్పిన గీతావాక్యము సైతము ఆత్మకు అణుత్వముగ చెప్పజాలదు. జీవుడణువేని అతనికి చలనమును అంగీకరింప వలయును. అట్లు అంగీకరింప గీతావాక్యమందు "అచలోఽయం సనాతనః" అచలుడనుటయు పొసగ నేరదు. కావున జీవుడణు స్వరూపుడను పాంచరాత్రా ద్యాగమవాదుల మతము పొసగనేరదని భావము.

అవ: ఆత్మ చిద్రూపుడు జడరూపుడను భాట్టమతమును నిరాకరించు చున్నారు.

భాట్టులు ఆత్మను చిద్రూపుడనియు, జడరూపుడనియు అందురు. కాని ఒకే ఆత్మ చిజ్జడరూపము గానేరదు. అట్లైనచో తనకు తానెట్లు విషయమగును? చీకటి వెలుతురులవలె విరుద్ధాంశములగు చిజ్జడాంశములు గల ఆత్మ ఒక్కటి కానేరదు. అట్లు కానిచో దేహమున నానాత్మ వాదము తటస్థమగును. "నేను" అను జ్ఞానమున గోచరించు నతడు ఆత్మయని సర్వసమ్మతమనియు, ఆత్మ కేవలచిద్రూపుడనిన చిద్రూపమగు జ్ఞానము నందు అతడు గోచరింప తనకు తాను గోచరుడగుట సంభవింపగా, ఆత్మకు జాడ్యాంశమును సయితము అంగీ కరింతుమనియు భాట్టులందురు. అట్లైనచో కర్మత్వము, కర్తృత్వము ఒక్కనికి లేదు కావున కర్మకర్తృదోషము సంభవింపదని వీరి ఆశయము. కాని జ్ఞానమున గోచరింపదగు జాడ్యాంశమును అంగీకరింపనంత మాత్రమున జ్ఞానము గోచరము కాగలదు కాని చైతన్యాంశము జ్ఞానగోచరము కాజాలదు. కాజాలిన కర్మకర్తృదోషమనివార్యమగును. జాడ్యాంశకల్పనము వ్యర్థమగును.

ఆ చిజ్జడ రూపములు రెండు ఎట్టివి? అవయవములు, జాతి వ్యక్తులు మున్నగునవి ఏవియు వానికి చెప్ప సాధ్యముకాదు. చిజ్జడాంశములు అవయవ ములనదగదు. అమూర్తములగునవి అవయవములు గానేరవు. జాడ్యాంశము మూర్తము కాగలదనిన మూర్తములగు దేహేం ద్రియములవలె ఆత్మాంశము గానేరదు. మూర్తమగు జాడ్యాంశము ఆత్మ కాగలిగితే "నేను దీర్ఘకాయుడను" మున్నగు అనుభవముల బలమున దేహమే ఆత్మ కాగలదు. అంతట చార్వాక

మతము సిద్ధమగును. జాతి యనునది సమాన జాతీయులగు నానాపదార్థములం దుండును. భాట్టులు చెప్పు చిజ్జడాంశములు రెండును నానాపదార్థములందుండు నవి కావు. కావున జాతి వ్యక్తులనదగదు. చిజ్జడాంశములు గుణగుణులనియు చెప్పరాదు. చిజ్జడాంశములు రెండింటి యందును చైతన్యమే జ్ఞానము. కావున గుణము కానేరదు. జాడ్యాంశము ఆ చైతన్య గుణము కానిచో విజ్ఞానవాదము తటస్థమగును. అమూర్తమగు చిదంశమున క్రియ సంభవింప ఈ చిజ్జడాంశ ములు క్రియతకు ఆధారములనుటయు పొసగదు.

చిజ్జడాంశములకు సంయోగ సంబంధము కలదని చెప్పినచో కొంత కాలమునకు విభాగమనివార్యమగుటచే ఆత్మకు నిత్యత్వము సంభవింప జాలదు. చిజ్జడాంశములకు తాదాత్మ్యము కలదనినచో ఆత్మకు తాదాత్మ్య మనుటయు గలదు. చిజ్జడములకు విషయ విషయిభావ సంబంధము కలద నినచో విషయమగు జాడ్యాంశము ఆత్మ కానేరదు. జడాంశమే ఆత్మయనినచో దేహాత్మవాదము తటస్థమగును. మఱియు జీవునకు జడ్యాంశము నిత్యసిద్ధము కాదు శ్రుతులు, స్మృతులు ఆత్మను కేవల చిద్రూపుడనుచున్నవి. చిద్రూపునకు జాడ్యాంశము కారణాంతరమున పుట్టెననుటయు తగదు. అసంగుడగు ఆత్మకు కారణ సంబంధము సంభవింపదు.

రాగద్వేషాదులు లేకుండా వైదిక లౌకిక క్రియాకలాపములందు జీవులకు ప్రవృత్తి సంభవింపదు. కావున కేవల చిద్రూపునకు రాగద్వేషాదులు సంభవింపగా ఆ రాగద్వేషాది మూలమైన కర్తృత్వము ఆత్మకు పొసగించుటకై జాడ్యాంశమును అంగీకరింపవలెనని భాట్టులందురు. ఇదియు పొసగదు. చేతనమగు ఆత్మకు జడత్వమేల ఏ ప్రమాణముచే చెప్పదగును? కర్తృత్వము సయితము ఆత్మకెట్టిది? ఇంద్రియ సంబంధ మును అతడెట్లు పరిగ్రహించును? ఇంద్రియ సంబంధముచే ఆత్మకు కర్తృత్వము కలదనినను "నిర్గుణం నిష్క్రియం శాంతమ్" అను శ్రుతి ఆత్మ కర్తృత్వాది హీనమనుచున్నది. అట్టి ఆత్మకు ఇంద్రియ సంబంధమును, తన్మూలమున కర్తృత్వమును అధ్యాస సిద్ధమేగాని స్వతఃసిద్ధము కాదు. ఇట్టి ఆత్మను కర్మ మీమాంసకులు నిరూపింపజాలరు.

మీమాంసకులు దేవప్రియులు. వారు దేవతలను యజ్ఞయాగాదులచే పూజిం

తురు. అట్టి మీమాంసకులు ఆత్మతత్త్వమును తెలియుటకు దేవతలు ఇష్టపడరు. ఆత్మకు కర్తృత్వము లేదను తత్త్వమును తెలుసుకొని యజ్ఞయాగాదులను త్యజించి నచో దేవతలకు ఆహుతులు సన్నగిల్లును. కావుననే "యథాహవై బహవః పశవో మనుష్యం భుంజ్యుః ఏవమేకైకః పురుషో దేవాన్భునక్తి, ఏకస్మిన్ పశావాదీయమానే ప్రియం భవతి, కిము బహుషు తస్మా దేషాం తన్న ప్రియం యదేతన్మనుష్యావిద్యుః"

అనేక పశువులు మనుష్యులకు భోగ సాధనములగునట్లుగా ఒక్కొక్క కర్మఠుడు దేవతలకు భోగసాధనమగును. అనేక పశువులు గల మనుజుడు ఒక్క పశువైనను తన వద్ద నుండి పోవుటకు అంగీకరింపడు. ఇక అన్ని పశువులు పోవుటకు అంగీకరింపడని చెప్పనేల? ఇట్లే మనుష్యులు ఆత్మతత్త్వమును తెలుసు కొని తమ పశుభావము పోగొట్టుకొనుటకు దేవతలు అంగీకరింపరు. ఇట్టి మీమాంసకులకు జీవతత్త్వము దుర్నిరూపము. కేవలము వేదాంత వేద్యమయి నట్టి జీవుని యొక్క యథార్థ స్వరూపమును దేవతలకు ప్రియములైనట్టియు, పశుతుల్యము లయినట్టియు కర్మఠులచే నిరూపింపనలవి కానిది.

అవ: ఆత్మ జడస్వరూపమనియు, ఆకాశమువలె విభుస్వరూప మనియు చెప్పు కణాద గౌతముల మతమును నిరాకరించుచున్నారు.

న్యాయవైశేషికులు ఆత్మను జడరూపమందురు మఱియు ఆకాశమువలె సర్వ వ్యాపకమందురు. కాని సకలజీవులు సర్వవ్యాపకులనినచో సకల ఇంద్రి యములతో సకలజీవులకు సంబంధముండుటచే ఈ జీవునకు సుఖదుఃఖాది భోగమను వ్యవస్థ లేకపోవును. అప్పుడు జీవునకు మనస్సుతో సంబంధము కలిగి శరీరము కలిగి దానికి భోగవ్యవస్థ సంభవించుననియు చెప్పుటకు వీలు పడదు. ఎట్లన మనస్సు గల ప్రదేశములందు విభురూపులగు సకల జీవులుం డుటచే మనస్సు సంబంధము చెప్ప వీలుపడదు. శరీరోపాధి మూలముగ వ్యవస్థ కల్పించినచో జీవనానాత్మవాదమును అంగీకరింపపనిలేదు. మఱియు నైయాయి కులు విశేష పదార్థము నొకదానిని అంగీకరించి, ఆ విశేషములు గల ఆత్మ స్వరూపములు భిన్నభిన్నములని చెప్పుదురు. ఆత్మ భేదము సిద్ధము కానిచో ఆయా విశేష పదార్థము ఆత్మకు భేదమును కల్పింపజాలవు. కావున జీవుడొక్కడే అయి శరీరోపాధి మూలముగ భోగవ్యవస్థ సంభవించును. సర్వ వ్యాపకుడగు జీవునకు శరీర సంబంధము అధ్యాస మూలముచే కలుగునే గాని వేఱు విధమున కానేరదు. మఱియు వీరి మతమున జీవుడు జడస్వరూపుడనియు, అతని

మనస్సం యోగము వలన జ్ఞానేచ్ఛాదులు కలుగుననియు చెప్పుదురు. ముక్తావస్థయందు జీవుడు మనస్సుతో సంయోగము లేకుండా, జ్ఞానేచ్ఛాదులు లేక నిజరూపమున నుండునందురు. నిజరూపమనగా జడస్వరూపమని చెప్పుదురు. కేవల జడ రూపమగు ముక్తిని ఏ ఒక్కడూ కోరడనుట స్పష్టము. మఱియు ఆత్మ జడరూపు దనిన దేహాదులే ఆత్మ కావచ్చును. కావున ఆత్మ జడమనియు, విభుస్వరూప మనియు, అట్టి ఆత్మలు పలువురనియు చెప్పు నైయాయిక వాదము. సమంజసము కాదు.

అవ: అణుస్వరూపమున మనస్సుతోడ సంబంధముచే జ్ఞానేచ్ఛాది గుణములు పుట్టునని కణాద గౌతములు చెప్పుదురు. ఇది ఎంత మాత్రము పొసగదనుచున్నారు.

ఆత్మకు అణుస్వరూపమగు మనస్సుతోడ సంబంధముచే బుద్ధ్యాదుల గుణములు పుట్టుననియు, ఆ గుణములకు ఆశ్రయమగుటచేత ఆత్మ ద్రవ్యమనియు కణాద గౌతములు చెప్పుదురు. కాని ఆత్మ నిత్యమగుటచే సావయవము కానేరదు. మనస్సును నిరవయమనియు, పరమాణు రూపమనియు చెప్పనిచో నిరవయములు రెండింటికి సంబంధమెట్లు కల్గును? సంబంధము సంభవింపదు కావున జ్ఞానేచ్ఛాదులు కలుగవు. మఱియు గుణములకు ఆశ్రయమగుటచే ఆత్మ ద్రవ్యమనియు వీరి ఆశయము. కాని ద్రవ్యమెన్నడును నిరవయము కానేరదు. కావున శాశ్వతము కాదు. ఇంతియేగాక జడస్వరూపమగు ఆత్మకు మనస్సు యొక్క సంబంధముచే పుట్టిన జ్ఞానము ఆత్మ ధర్మమని వీరందురు. కాని జ్ఞానము జడాత్మ ధర్మమయినచో ఆత్మయు జడము కావలసియుండును. కావున ఆత్మ జడరూపము కానేరదనియు, జ్ఞానగుణాశ్రయము కాదనియు, ద్రవ్యము కాదనియు స్పష్టమగుచున్నది. మఱియు నిరవయమయినది ద్రవ్యము కానేరదనియు, శాశ్వతము కానేరదనియు వేదాంత సిద్ధాంతము. ఆకాశము నిరవయ నిత్యద్రవ్యము గలదని నైయాయికుల ఆశయము. కాని ఆకాశము నిరవయము కానేరదు. నిరవయమయినచో ఒక పక్షి ఆకాశమందు ఎగురునప్పుడు ఆకాశము ఆవృతము కనుక మఱియొక పక్షి ఎగురుటకు సావకాశము లేకపోవును. మొదటిపక్షి లేని దేశమందు రెండవపక్షి ఎగురుననిన ఆకాశము సావయవమగును కావున ఆకాశము నిత్యముకానేరదు. "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః" అట్టి ఈఆత్మ ఆకాశమునుండి పుట్టెననుటచే

అద్వైత-1
30

పుట్టినవాడు మరణించుట సహజము. కావున ఆకాశ దృష్టాంతముతో నైయాయికులాత్మను నిరవయమనియు, శాశ్వతమనియుచెప్పజాలరు. వేఱొండు నిత్యనిరవయవస్తువు వారి మతమందులేదు. ఇంతియేగాక "అస్థూలమణ స్వదీర్ఘమ్" మొదలగు శ్రుతియు ఆత్మకు ద్రవ్యధర్మములను నిషేధించుచున్నది. కావున ఆత్మ ద్రవ్య మనియు, అద్దానికి మనస్సంయోగవముచే జ్ఞానముదయించుననియు చెప్పదగదు.

అవ: ఆత్మను జడస్వరూపమనదగదనుచున్నారు.

నైయాయికుల మతమునే నిరాకరించుచున్నారు. నైయాయికులు ఆత్మను జడమందురు. ఆత్మకు సుషుప్తి కాలములో మనస్సుతో సంయోగము కలుగదు. కావున సుషుప్తి కాలమునందు అనుభవింపని అజ్ఞానమును, సుషుప్తి సుఖమును, తనను మెలకువ వచ్చిన తరువాత గాని స్మరింపజాలడు. మఱియు విచ్ఛేదము లేని ఘటపటాది జ్ఞానమును, ధారావాహికమనబడు జ్ఞానమును జాగ్రత యందు స్వయముగ జడ రూపుడగు ఆత్మ తెలియజాలడు. సుఖముగ నిద్రించి మేల్కాంచిన జీవుడు తాను "సుఖముగ నిద్రించితిని నిద్రలో నాకేమి తెలియలేదు" అనుచున్నాడు. ఇట్టి జ్ఞానము స్వప్నము నందు లేకుండుటచే అనుభవము కాజాలదు. స్మరణమగును. అనుభవింపని విషయములను స్మరింపజాలడు. జీవుడు స్వయముగ జడరూపుడయినచో అతనికి సుషుప్తికాలమందు మనస్సం యోగము లేని అనుభవము సంభవింపదు. అనుభవము లేనిచో స్మరణము పొసగదు. ఆత్మ జడరూపమయినచో మేల్కాంచిన మనుజుడు తాను సుఖముగ నిద్రించిన అంశము తెలియనేరడు.

అవ: ఈ విధముగా ద్వైతమతములను నిరసించి ఉపనిషత్తుల తాత్పర్యమగు అద్వైత మతమును ప్రకటించుచున్నారు.

చార్వాకులాది నైయాయికుల వరకు వారు నిరూపించిన ఆత్మతత్త్వము తత్త్వము గానేరదని నిరూపించుటచే పరమార్థ చింతకులు నిరుత్సాహపడుదురు. ద్వైతవాదుల మతము కుదరనందున జ్ఞానేచ్ఛాదులు, ఇంద్రియములు మున్నగు వాని పుట్టువును, నాశనమును కనుగొనువాని పుట్టువును, నాశనమును కనుగొను చేతనుడయిన సాక్షి చైతన్యమే ఆత్మతత్త్వమని వెల్లడించుచున్నారు. ఇట్టి చైతన్యమే ఆత్మయని వేదాంతములు సకల సంరంభముతో నిరూపించినవి.

అద్వైత-2
31

అవస్థాత్రయమను పురత్రయమందు సంగరహితుడై విహరించుచున్నవాడును, ఇంద్రియములను ప్రాణమనస్సుల ఇచ్ఛా సంకల్పములను బుద్ధి యొక్క ఉత్పత్తి నాశములను చూచుచున్నట్టివాడును, ఎన్నడూ లోపములేని చైతన్యమై యథార్థరూపమైనట్టిదైన ఆత్మ యొకటి కలదు. ఆ సాక్షి చైతన్యము అవస్థాత్రయ మందు తిరుగుచుండును గాని అవస్థా ధర్మములను మాత్రము పొందదు.

అవ: ఆత్మను స్వయం ప్రకాశమనుచున్నారు.

సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాక్కు వీటిని పదార్థములను తెలిపే ప్రకాశము లనబడును. వాగింద్రియమే కాక ఇతరేంద్రియములు కూడా పదార్థములను చూపగలవు. ఇట్టి ఇంద్రియములు స్వప్నావస్థ యందు విరమింప, సూర్యచంద్రా గ్నులు అస్తమించగా కేవల ఆత్మ మాత్రమే యుండును. అట్టి ఆత్మ స్వయంజ్యోతి స్వరూపమైనందున వాసనామయములగు పదార్థములను చూచుచుండును. ఇంద్రియ సముదాయములయమగుటచే స్వప్రకాశరూపుడును, స్వప్న దృశ్యము లను మరియు జాగ్రతయందు వాసనామయములగు పదార్థములను ప్రకటించు చున్న ప్పటికీ వాటితో సాంగత్యము లేనట్టి చిద్రూపుడగు కేవల చైతన్యమే అంతరాత్మయని శ్రుతులచే చెప్పబడెను.

జనక మహారాజు సభయందు యాజ్ఞవల్క్యుని తోడ బ్రహ్మవేత్తలు ఆత్మ విమర్శచేసిన ప్రకరణము బృహదారణ్యకోపనిషత్తునందు కలదు. అట్టి ప్రకరణ మందు ఆత్మ స్వయంజ్యోతి రూపత్వమును తెలుపు భాగమునకు జ్యోతిర్బ్రాహ్మణ మని పేరు. జాగ్రదాద్యవస్థలయందు సూర్యచంద్రాది ప్రకాశములున్నప్పుడు ఆత్మకుస్వయం జ్యోతిరూపత్వము తెలుపశక్యము గాకుండును. స్వప్నావస్థయందు అట్టి ప్రకాశములు లేకున్నను స్వప్న పదార్థములను చూచుచుండును. కావున జీవుడు స్వప్రకాశరూపుడనుట స్పష్టము. స్వప్నపదార్థములను చూచుట అను భవము కాదనియు, స్మరణమాత్రమని కొందరందురు. అట్లనుట తగదు. జాగ్రతా నుభవమువలె స్వప్నము తెలియుచున్నది. మరియు అంతకుపూర్వము తెలియని అంశములందు చూచు చుందుము. అటువంటి వానిని స్మరణములనవచ్చును కాని స్వప్నములను చూచుట అనుభవమనబడును. ఇట్టి అనుభవములను ప్రకాశించువాడు వేఱొకండు లేనందున జీవుడు

స్వప్రకాశుడనుట స్పష్టము. జాగ్రితమందు జీవుడు ఇంద్రియములచే బాహ్య పదార్థములను తెలియు చుండును. ఆ ఇంద్రియములను బుద్ధిచే కనుగొనుచుండును. అట్టి బుద్ధిని తాను స్వయముగ తెలియుచుండును. అనగా తాను స్వప్రకాశుడని భావము. ఇతడు ఈ తనువనుభవనమందు దీపమువలె ప్రకాశించుచుండును. స్వయముగ ప్రకాశించుచున్న ఆత్మబహిర్ముఖములగు ఇంద్రియములకు గోచరుడు కానేరడు.

అవ: ఆత్మ సుఖరూపమనుచున్నారు.

లోకమున గృహ, ధన, పుత్ర, భార్యాదులను ప్రేమింతురు. తన గృహము కనుకను, తన ధనము కనుకను, తన పుత్రుడు కనుకను తనకు ప్రియములగును. ఇట్లే తనను తాను ప్రేమించుచుండును. కాని గృహదారాదులందలి ప్రేమవలెనే తన యందలి ప్రేమ మఱియొకని కొఱకుకాదు. తన కొఱకై యుండును. కాని పుత్రుడు పుత్రుడు గనుకను, భార్య భార్య కనుకను ప్రేమింపజాలడు. తన సంబంధము లేక బాహ్య వస్తువులు ప్రేమాస్పదములు కానేరవు. పరునికొఱకు, పరునికొఱకు అను చెప్పు పారార్థ్యము తన యందు విశ్రాంతమగును. ఏ ఆత్మ పరుని కొఱకు అనుదానికి పరమావధి స్వరూపమో, ఏ ఆత్మ ఇతరుని కొఱకు తానను మాట లేనివాడో అట్టి అంతరాత్మ ఆనంద సముద్రమని తెలియ దగి యున్నది. ఈ అంశము

"న వా అరే సర్వస్సకామాయ సర్వం ప్రియం భవతి ।
ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి ॥"

అను శ్రుతియందు విశదీకరింపబడెను. బాహ్యవస్తువులు తన సంబంధముచే ప్రియములయి యుండ తాను ప్రేమాస్పదుడనని చెప్పనవసరములేదు. కాని బాహ్యవస్తువుల యందలి ప్రేమ తన నిమిత్తమయినట్లుగా తన యందలి ప్రేమ మఱియొకని నిమిత్తము కాదు. కావున తాను ప్రేమాస్పదుడనియు, పరమానంద రూపుడనియు స్పష్టమగుచున్నది. అట్టి ఆత్మ సకల కోశములకు లోపలగల జీవాత్మరూపుడైయున్నాడు. నీటియందును, కుండ, మూకుడు, నూతులు మొదలగు వానియందును సూర్యుడు ప్రతిఫలించును. అట్టి ప్రతిబింబమందు ఘటశరా వాదుల ధర్మములగు వక్రత్వచాంచల్యాదులను అజ్ఞానముచే ఆరోపించి ప్రతి

బింబము కదులుచున్నదని మనము చెప్పుదుము. సూర్యునియందు చలన వక్రత్వాదులు లేవు. అట్లే పరిశుద్ధమైన ఆత్మయందు అజ్ఞానముచే శరీరేంద్రియాదులను, వాని ధర్మములను తనయందు తలంచుచుండును. అంతఃకరణము తాననియు, అంతఃకరణ ధర్మములు తన ధర్మములనియు ఆరోపించుకొనుట వలన ఉపాధులను, ధర్మములను "అహమ్- ఇదమ్" నేను ఇదియనియు, ఇది నేననియు తలంచుచున్నాడు. అందువలననే కర్తృత్వభోక్తృత్వాదులు కలుగుచున్నవే గాని స్వతస్సిద్ధముగ జీవునకు కర్తృత్వ భోక్తృత్వాదులు లేవు.

ఆత్మపరిచ్ఛేద రహితమనియు, అసంగమనియు, సచ్చిదానంద స్వరూపమనియు వేదాంతులు నిర్ణయించిరి. ఇట్లుండ కర్తృత్వ భోక్తృత్వాదులు లోకమున కనబడుచున్నవి గదా! దేహేంద్రియాదులు అచేతనములగుటచే వానికి కర్తృత్వాదులు సంభవింపవు. ఇట్లుండ ఈ కనబడు కర్తృత్వాదులెవరికి కల్గునను సంశయము పుట్టుట సహజము. కావున విచారించి నిర్ణయింపవలెనని వాదుల ఆశయము. కాని కర్తృత్వ భోక్తృత్వాదులు అధ్యాస మూలములు. ఇవి రజ్జు సర్పము, శుక్తిరజతము, గొడ్రాలి పుత్రుడు మున్నగువానివలె మిథ్యాభూతములగుటచే వీనికి విచార నిర్ణయములు ఆవశ్యకములని వేదాంతుల తాత్పర్యము. ఈ శుక్తి రజతము ఎవ్వరిది అని విచారణ చేయుటగాని, ఇది విష్ణుశర్మకు చెందిన శుక్తి రజతమనిగాని నిర్ణయించుట సంభవించదు. ఈ గొడ్రాలి కుమారుడెవని పుత్రుడను విచారణ నిర్ణయములు సంభవింపవు.

ఆత్మ పరిశుద్ధము. దేహేంద్రియాదులు అపరిశుద్ధములు. పరిశుద్ధాత్మను అజ్ఞానము ఆవరింపగా తాను దేహమనియు, ఇంద్రియములు తనవని తలచి, దేహధర్మములే తన ధర్మములని తలంచును. ఇట్లే దేహేంద్రియాదులందు ఆత్మ స్వరూపమును, ఆత్మధర్మములను తలంచును. నిర్గుణ సచ్చిదానంద స్వరూపమగు ఆత్మ ఆనందము మొదలగునవి వేఱుకాకున్నను, ధర్మములులేకున్నను ధర్మము లున్నట్లు గోచరించును. అట్టి ఆనందాది ధర్మములను దేహమునందలి ఆనంద మని తలంచును. దేహేంద్రియాదులను, దేహసంబంధీకులను "నేను" "నాది" అని తలంచుచుండును. ఇట్లు తాను

కాని వస్తువు తానని తలంచుట "అధ్యాస" అనబడును. ఇట్టి అధ్యాసకు మూలము అజ్ఞానము. అజ్ఞాన మూలమగుటచే కర్తృత్వాదులు మిథ్యాభూతములనియు, ఇట్టి కర్తృత్వాదులు ఎవనికి సంభవిం చుననియు విచారించి నిర్ణయింప పూనుకొనుట వ్యర్థము.

అవ: అధ్యాసకు కారణమగు అనిర్వచనీయ అజ్ఞానమును నిర్వచించు చున్నారు.

రాహువు చంద్రుని ఆవరించును. రాహువు చంద్రుడిని ఆవరించుటకు పూర్వము కనబడకున్నను, ఆవరించిన పిమ్మట చంద్రునిచే ప్రకాశింపబడి కనిపించును. ఇట్లే అనాదియగు అజ్ఞానము ఆత్మను ఆవరించి అట్టి ఆత్మచే భాసింపబడి తెలియుచుండును. ఇట్టి అజ్ఞానము కలదనుటకు "నేనజ్ఞునుడను" అను లోకానుభవము ప్రమాణము. ఈ అజ్ఞానము పలువిధముల విక్షేపము పొంది తనకాశ్రయమగు ఆత్మను భ్రమింపచేయుచుండును. చిద్రూప బ్రహ్మమందే విషయమైనట్టియు, "ఇది ఇట్టిది" యని నిరూపింప శక్యము గానట్టియు, నేను అజ్ఞుడనై యున్నానని పుట్టువులేని అజ్ఞానము చిద్రూపమును ఆవరించి, చిద్రూపము చేతనే విక్షేపరూపమున పరిణమించి చిద్రూపమును భ్రమింప చేయుచున్నది.

"నేనజ్ఞానుడను" అను సర్వలోకానుభవము కలదు. ఇందు అజ్ఞాన శబ్దము అజ్ఞానమను భావపదార్థమును చెప్పును. కాని జ్ఞానాభావమును అభావ పదార్థమును చెప్పజాలదు. జ్ఞానాభావమును చెప్పి "నేను అజ్ఞానుడను" అను అనుభవమున నట్టి జ్ఞానాభావము అర్థమనుట తగదు. ఘటాభావమిందు కలదనియు, పటాభావమిందు కలదనియు చెప్పునతడు ఘటపటములను తెలియకుండా ఘటాభావము కలదనియు, పటాభావము కలదనియు తెలియ జాలడు. అనగా అభావము తెలియ వలయుననిన దాని ప్రతి యోగి తెలియక తెలియజాలడని భావము. జ్ఞానాభావమను అర్థమును చెప్పవలయునన్న అద్దానికి ప్రతి యోగి యగు జ్ఞానము తెలిసి యుండవలయును. కావున ప్రతి యోగియగు జ్ఞానము తెలియుటచే జ్ఞానము కలవాడై యుండగా, జ్ఞానాభావము గలవాడనను అనుభవము ప్రమాణము కాకపోవును. కనుక అజ్ఞానుడనను

పద మందలి అజ్ఞాన శబ్దము భావరూపాజ్ఞానమును చెప్పును. ఇట్టి అజ్ఞానము నకు పుట్టుక లేదు.

"జీవ ఈశో విశుద్ధా చిత్తథా జీవేశయోర్భిధా ।
అజ్ఞాన తచ్చితోర్యోగః షడస్మాకమనాదయః ॥"

జీవుడు, ఈశ్వరుడు, శుద్ధచైతన్యము, జీవేశ్వరులకుగల భేదము, అజ్ఞానము, అజ్ఞానముతోడ చైతన్యమునకు గల సంబంధము అను ఈ ఆరింటిని అనాదులన బడును. ఇట్టి అజ్ఞానము చైతన్యమును ఆశ్రయించి యుండును. చైతన్యమునే తనకు విషయముగ గోచరింప చేయును. అనగా అజ్ఞాన విషయమాత్మ అని భావము. కావుననే

"ఆశ్రయత్వ విషయత్వ భాగినీ నిర్విభాగచితి రేవకేవలా।
పూర్వసిద్ధతమ సోహి పశ్చిమోనాశ్రయో భవతి నాపి గోచరః॥"

అజ్ఞానము సిద్ధించిన పిమ్మట తన్మూలముగ సిద్ధము కాగల జీవుడు ఆ అజ్ఞానమునకు ఆశ్రయము కానేరడు. విషయము కానేరడు. నిర్విభాగమగు శుద్ధచైతన్యమే అజ్ఞానమునకు ఆశ్రయమును, విషయమును కాగలదని పెద్దలు చెప్పిరి. ఇట్టి అజ్ఞానమునకు ఆవరణశక్తి యనియు, విక్షేప శక్తియనియు రెండు శక్తులు గలవు. ఆవరణశక్తి యనగా ఉపవస్తువును ఆవరించుట. విక్షేపశక్తి యనగా లేని వస్తువును ఉన్నట్లు చూపుట. అజ్ఞానము త్రాడును ఆవరించుటయు, పామును చూపుటయు లోకవిదితము. ఇట్లే ఆత్మకు గల సచ్చిదానందాది నిజ రూపమును కప్పిపుచ్చి లేని అసద్దుఃఖ రూపములను చూపును. ఇట్టి అజ్ఞానము సద్రూ పము కాదు. సద్రూపము కానిచో బాధలేకుండుటచే జీవునకెన్నడును ముక్తి సంభవింపనేరదు. అజ్ఞానము అసద్రూపము కాదు. అసద్రూపమయినచో గొడ్రాలి పుత్రునివలె కానరాదు. సదసద్రూపమనుటయు విరుద్ధమగుటచే చెప్ప శక్యముగాదు. కావున అజ్ఞానము అనిర్వచనీయము.

తాను సిద్ధించుటకు తాను కారణమగుట లోకమున కనబడదు. కాని లోకమున సకలము అధ్యాస చేయుటకు అజ్ఞానము కారణము కావచ్చును. కాని ఆ అజ్ఞానమును అధ్యాసచేయుటకు తగిన కారణములేకున్న ఆ అజ్ఞానము

ఎట్లు సిద్ధింపజాలుననను సంశయము కల్గుచున్నది? అజ్ఞానము సకల బ్రహ్మాండా ధ్యాసకు కారణమని వెల్లడించిరి. అట్టి అజ్ఞానము ఆత్మకు సహజము కాదు. కావున దానిని అధ్యస్తమన వలయును. అందుచే బ్రహ్మాండాధ్యాసకు అజ్ఞానము, అజ్ఞానాధ్యాసకు మఱియొక అజ్ఞానము కారణమను అనవస్థ తటస్థము కాగల దని వాదుల ఆశయము. కాని చైతన్యము తన సంబంధముచే ఇతర పదార్థము లను భాసింపచేయుచు, తానును భాసించును. చైతన్య ప్రకాశమును, భేదమును స్వతసిద్ధములుగాని పరాపేక్షములు కావు. ఈ విధముగ అజ్ఞానము సైతము సకల బ్రహ్మాండాధ్యాసను, తన అధ్యాసనునిర్వహించును. ఇంతియేగాక అజ్ఞానమునకు 'మాయ' అనే నామాంతరము కలదు. మాయ అనగా పొసగని అంశములను సయితము పొసగింపజాలునది అని అర్థము. ఘటపట ములకు భేదము కలదు. అనగా ఘటభేదము పటమందును పటభేదము ఘటమందును కలదని భావము. అట్టి భేదము ఘటమందును పటమందును తానుండునపుడు, భిన్నమగు ఘటమందును భిన్నమగు పటమందును నుండునా యని వికల్పము చేయగా, భిన్నములగు ఘటపటములందు యుండుననియే చెప్పవలయును. ఘటాభిన్నమగు పటమందు ఘటభేదముండ జాలదు. అందువలన ఘటమందు భేద ముండుటకు పూర్వమే ఘటము పటమునకన్న భిన్నమయి యుండునన వలయును. కావున అనవస్థయను దురవస్థ తటస్థము కాగలదు. కావున భేదము తాను భిన్నమగు ఘటమందుండుటకు వేఱొక భేదమును అంగీకరింపదు. కావున భేదమే స్వపర నిర్వాహకమందురు. అట్లు అజ్ఞానమొక్కటియే స్వపరా ధ్యాసకు కారణమగును.

ఒక్క అజ్ఞానమే స్వపరాధ్యాసకు కారణమెట్లు కాగలదనే సంశయపడరాదు. ఇంద్రజాలికుడు అసంభవ అర్థములను చేయుట లోకమందరికీ విదితమే. ఇట్టి అర్థములను మాయామయములందుము. మాయకు చేయదగని కార్యము లుండవు. ఈఅజ్ఞానము సైతము మాయ అనబడును. కావుననే మాయ అఘటిత ఘటనా సామర్థ్యము కలిగియుండి సకల నిర్వాహకము చేయునని భావము.

అవ: అధ్యాస లక్షణము చెప్పుచు అధ్యాస భేదములను చూపుచున్నారు.

అది కాని వస్తువు నందు అదియను బుద్ధిని అధ్యాస అనబడును.

అనగా వస్తువునకు గల సామాన్య విశేషాంశములలో విశేషాంశము తెలియని వస్తువు నందు ఆ వస్తువును చూచి వేఱొక వస్తువని భ్రమించుట అధ్యాస అనబడును. ఆత్మతత్త్వమును విశదముగ తెలియని ఆత్మయందు ఇట్టి అధ్యాస సకలానుభవ సిద్ధమయి స్పష్టముగ తెలియుచున్నది. "నేను అజ్ఞుడను, దుర్బలుడను, నరుడను, దరిద్రుడను, నా తనయు లెట్లు జీవింపగలరు" అనే లోకానుభవము అందరకు తెలియును.

ముత్యపుచిప్ప రూపమునుగాని, త్రాటిరూపమును గాని విశదముగ తెలి యనిచో ముత్యపుచిప్పను వెండియని, త్రాడును పామని భ్రమింతురు. ముత్యపు చిప్ప యందలి ఒక అంశమును తెలిసియు, మఱియొక అంశమును తెలియ నందున వెండి అని భ్రమపడుదురు. నేను 'అజ్ఞానుడను' అను అధ్యాసయందు నేను అనునది అంతఃకరణ తద్ధర్మాధ్యాస అనబడును. అజ్ఞానుడను అనునది అవిద్యా తద్ధర్మాధ్యాస అనబడును. ఇట్లే జ్ఞానేంద్రియములను, వాని ధర్మములను తనయందు అధ్యసించుట జరిగింది. బలము ప్రాణధర్మము. కావున దుర్బలుడను అనునది ప్రాణాధ్యాస అనబడును. కర్మేంద్రియములను సయితము జీవుడిట్లే అధ్యసించుకొనును. నరుడను అనునది స్థూలశరీరాధ్యాసము. దరిద్రుడను అనునది బాహ్యమగు ధనప్రయుక్తమగు అధ్యాసము. పుత్రులందు, వారి జీవనము నందును తన పుత్రులనియు, వారి జీవనము తనకు చెందిన జీవనమనియు అధ్యాస జరుగుచున్నది. ఇట్లే నేను జ్ఞానిని, నేను బలవంతుడను మొదలగు విశేషణములతో అధ్యాస జరుగుచున్నదని చెప్పవచ్చును. కాని సాధారణముగ అధ్యాస దుఃఖ హేతువు కాగలదని తెలుపుటకై అజ్ఞానిననియు, దుర్బలుడనియు తెలిపిరి. దరిద్రుడననుపుడు దుఃఖము తెలియు రీతిగా ధనికుడనను నపుడు దుఃఖము తెలియకపోవుట స్పష్టము.

ఆత్మపరిశుద్ధము, ఆనందరూపము, శాశ్వతము, జ్ఞానరూపము. ఇట్టి ఆత్మ ధర్మములన్నిటినీ శరీరమందు తలంచి తాను శుద్ధుడననియు, సంతుష్టుడననియు, స్థిరుడననియు, జ్ఞానిని అనియు తలంచుచుండును. ఇట్లే గౌరవర్ణముగల స్థూల కాయుడననియు, కావుననే చూడదగిన మంచిరూపము గలవాడననియు, పాట

వముగలవాడననియు ఆత్మస్వరూపమందు దేహధర్మములను తలంచుచుండును. ఇట్లు పరస్పరము అధ్యసించుకొనుట వలన మిశ్రమములైన సత్యానృతములే దేహముగా గలవాడైన జీవుడు ఎఱ్ఱగ కాల్చిన నిప్పు ఇనుముతోడ సమ్మెట దెబ్బలు పొందు రీతిగా సకల సంసారబాధలను పొందుచున్నాడు. ధర్మస్వరూప ములగు ఆత్మానాత్మలను పరస్పరము అధ్యసింపక, వాని ధర్మములగు శుద్ధా నందములను స్థౌల్యాధి రూపములను అధ్యసింపనేరడు. కాగా మలమూత్రాదులచే అపరిశుద్ధమగు దేహమును పరిశుద్ధమనియు, నిరాకారమగు ఆత్మను స్థూల మనియు, అభిరూపము గలదనియు తలంచుట సర్వలోక సిద్ధము. కావున పరస్పరాధ్యాసయు, పరస్పర ధర్మసంసర్గాధ్యాసయు లోకానుభవసిద్ధము. అనాత్మకు ధర్మములున్నను ఆత్మకు ధర్మములు లేవనరాదు. పంచపాదికారులు:

"ఆనందో విషయాను భవో నిత్యత్వంచేతి
సంతిధర్మా అపృథక్త్వేపి చైతన్యాత్పృథ గివావ భాసంతే ॥"

ఆనందము, విషయానుభవము, నిత్యత్వము అనునవి చైతన్యము కన్న భిన్నము లు గాకున్నను, భిన్నములన్నట్లు కనబడు ధర్మములు గలవనిరి. ఈవిధముగా సత్యానృత సంవళిత రూపుడయి తత్త్వమును విచారింప కర్తృత్వము దేహమునకే గాని ఆత్మకు సంభవింపదు.

అవ: అధ్యసింపదగిన వస్తువుతోడ పోలికయు, రూపము గల వస్తువులను చూచి మఱియొక వస్తువుగ భ్రమపడుటయు లేదా అధ్యసించుటయు లోకమున తెలియుచున్నది. వేదాంతుల మతమున బ్రహ్మమునకు పోల్చదగిన వేఱొండు వస్తువుగాని రూపముగాని కన్పించవు. అట్లయిన అధ్యాస ఎట్లు పొసగునను సంశయమును బాపుచున్నారు.

విషయి విషయరూపములగు ఆత్మానాత్మలకు తేజస్తిమిరములకువలె పరస్పరము విరోధము కలదు. కావున ఒకదానిని చూచి మఱియొకటిగ భ్రమింప దగదు. పండితులకు సైతము శరీరేంద్రియములు తాననియు, తనవనియు అధ్యాస కనబడుచున్నది. శరీరాదులకన్న ఆత్మ భిన్నమని తెలిసిన విద్వాంసులును వ్యవహార సమయమునందు అభేదమును మఱచి వ్యవహరింతురు. లోకవ్యవహా

రమందే కాక, వైదిక వ్యవహారములగు యజ్ఞాదులందు సయితము శాస్త్రసిద్ధమగు అకర్తృత్వాత్మ రూపమును మఱచి ఆత్మను కర్తగ తలంచి ప్రవృత్తింతురు. ఈ విధముగా విద్వాంసులు సయితము లౌకిక వైదిక వ్యవహారములందు ఆత్మ తత్త్వమును విపరీతముగ తలంచి భాష్యమున "పశ్వాదిభిశ్చా విశేషాత్" విద్వాంసులకు పశువులతో విశేషములేదనిరి. పండితుల వ్యవహారము సయితము పశ్వాది వ్యవహారతుల్యము. వ్యవహారము చేయు అవసరమున సామ్యము కనబడుటవలన లోకమున కనబడు వ్యవహారము అధ్యాసమూలమని సిద్ధము. పోలిక లేని ఆత్మయందు గజాదుల ఆరోపము స్వప్నమందు ఆవశ్యమంగీకరింపవలెను. స్వప్నము, ముత్యపుచిప్ప-వెండి మున్నగువాని విషయమందు, రూపములేని ఆకాశమందు నీలి రంగుకల్పన మున్నగువాని అధ్యాస విషయమున పోలిక లేకున్నను, రూపములేకున్నను అధ్యాస కన్పించుట సర్వానుభవ సిద్ధము. కావున ఆత్మానాత్మలకు పోలికలేకున్నను, ఆత్మకురూపము లేకున్నను అధ్యాస సంభవింప గలదని భావము. కావున ఈ అధ్యాస విషయమున చైతన్యమే అధిష్ఠానము కాని వేఱొండు లేదు.

ఆత్మానాత్మలు పరస్పర భిన్నములనుట స్పష్టము. కాగా "సింహో మాణవకః అగ్నిర్మాణవకః" ఈ బాలుడు సింహమనియు, ఈ బాలుడు అగ్నియనియు చెప్పు రీతి "నేను స్థూలకాయుడను మున్నగు ప్రతీతులు గౌణములనదగును. అగ్ని మాణవకులకును, సింహమాణవకులకు భేదము తెలియుచుండగా, ఈబాలుడు అగ్నియనియు, సింహమనియు చెప్పుట గౌణమనబడును. శుక్తిరజతములకు భేదము తెలియని దశలో శుక్తిని చూచి రజతమని చెప్పుట అధ్యాసయనబడును. ఆత్మానాత్మలకు భేదము తెలియనిచో శుక్తి రజతమువలె తాను స్థూలకాయుడను, నేను గౌరవర్ణముగలవాడును మొదలగు జ్ఞానము అధ్యాసము. కాని భేదము కనబడు అగ్నిమాణవకులకువలె గౌణజ్ఞానము కాదని భావము. ఆత్మానాత్మలకు పోలికలేకున్నను, ఆత్మకు రూపములేకున్నను అధ్యాసము సంభవింపగలదని భావము.

అవ: వైరాగ్యమందు కుతూహలము పుట్టింప అధ్యాసము వలన కలుగు అనర్థమును చూపుతున్నారు.

అద్వైత-2
35

శ్రుతి స్మృతి సదాచారాది ధర్మములను అనుష్టించుట వలన ఆ ధర్మముల తారతమ్యమును అనుసరించి దేవతా భావమును పొందును. శాస్త్రవిహిత కర్మము లను ఆచరింపక పోవుటచేతను, నిషిద్ధ కర్మములను చేయుట చేతను రౌరవాది నరకములందు దుఃఖములను అనుభవించును. అట్టి విహితా విహిత కర్మాచర ణములతో వృక్షములు మొదలగుస్థావరాది దేహములను పొంది మాటి మాటికి పుట్టుచు, గిట్టుచు ఎప్పుడేని మానవజన్మను పొందును. కర్మోపాసనలను రెండిం టిని ఆచరింప హిరణ్యగర్భుని లోకమును చేరును. ఆ లోకము నందు జ్ఞానో దయము కాగా ముక్తిని పొందును లేదేని రాగద్వేషములచే మరల ఈలోకమందు జన్మించును. ఇట్లు జీవుడు విరామము లేకుండా సంసారమందు తిరుగుచుం డును. పుణ్యాపుణ్యములచే దేవత్వమును, స్థావరాది భావము సంభవించు చుండగా మానవజన్మ సంభవించుట దుర్లభము. కావుననే "క్వచిదపిలభతే" ఎందేని మానవజన్మ కలుగుననిరి. కర్మోపాసనలచే హిరణ్య గర్భలోకమును చేరి అచట వేదాంత శ్రవణము చేయగా జ్ఞానము ఉదయించినచో కలుగు ముక్తిని క్రమముక్తి యందురు. హిరణ్యగర్భునితో పాటు ప్రతీ ప్రళయ సమయ మున విద్యా సంపన్నులయి పరమ పదవిని పొందుదురు. జ్ఞానము కలుగనిచో మరల పుట్టుదురు. ఇట్లు మరల మరల పుట్టుచు గిట్టుచు సంసార దుఃఖమును మరల మరల పొందుచు వైరాగ్యమును పొందకుండుట శోచనీయము.

స్వర్గసుఖానుభవమునకు పిమ్మట స్వర్గము నుండి క్రిందకు వచ్చినపుడు దుఃఖము, నరకయాతన ననుభవించునపుడు దుఃఖము, గర్భవాసమున దుఃఖము, పుట్టిన పిమ్మట క్షుత్పిపాసాదులను తొలగించు టకు స్వాతంత్ర్యము లేకపోవుటచే దుఃఖము, బాలగ్రహములచే దుఃఖము, రోగములచే దుఃఖము మొదలగు దుఃఖములు బాల్యమందు కలుగుచున్నవి. యౌవనమందు క్రోధము చేతను లోభముచేతను దుఃఖము, వ్యసనములచే దుఃఖము, పరాభవములచే దుఃఖము, రాజచో రాగ్న్యాదులచే కలుగు ఉద్వేగముచే దుఃఖము, దారిద్ర్యముచే దుఃఖము మొదలగు దుఃఖములు కలుగుచున్నవి. వృద్ధాప్యమందు ఇష్టబంధు జనవియోగముచే దుఃఖము, మతిమరపుచే దుఃఖము, ఇంద్రియ పటుత్వము

తగ్గుటచే దుఃఖము, దీర్ఘరోగముచే దుఃఖము, మరణసమయమున మిక్కిలి దుఃఖము కలుగుచున్నది. కావున సంసార చక్రము దుఃఖ భూయిష్టము. స్వర్గము నుండి క్రిందికేతెంచునపుడు దుఃఖమనుటచే స్వర్గమందు సుఖము కలుగవచ్చు నని కొందఱు తలచెదరు. కాని స్వర్గమందును రాక్షస బాధలుండుట వినియుం దుము. రాక్షసులు వీరి విమానాదులను అపహరింప దుఃఖము, పదభ్రష్టులను చేయ దుఃఖము, ఋషులు శపియింప దుఃఖము. కావుననే:

"ఇంద్రలోకే మహద్దుఃఖం ప్రాజాపత్యేత దైవచ ।
విష్ణులోకేచ రౌద్ర చ దుఃఖమేవ విచారతః ॥"

ఇంద్రలోకమందు దుఃఖము, హిరణ్యగర్భ లోకమందునట్లే దుఃఖము, విష్ణు లోకమందు రుద్రుని లోకమందును విచారింప దుఃఖమేయని వ్యాసభగవాను డనెను. కావున వైరాగ్యమును బొంది పునర్జన్మలేని పదవిని పొందవలెను.

అద్వితీయుడగు పరమాత్మ అజ్ఞాన వశమున జీవుడాయెను. ఏ పరమాత్మ కామ్యకర్మవాసలనచే పోషింపబడిన అజ్ఞాన సంబంధము వలన జీవరూపుడై కర్మబద్ధుడై దేహేంద్రియాదులకు వశుడై తానీ దేహమని భ్రమించుచున్నాడు. భ్రమించి అనవరతము సంసార చక్రమున తిరుగజొచ్చెను. జన్మసముదాయము లతో ఊర్ధ్వాధో లోకములందు సంచరించుచూ దుఃఖముయొక్క అంతును తెలియ జాలకున్నాడు. ముందు వెనుక జన్మములను తలంపనేరడు. అట్టి జీవునకు అజ్ఞానమే సర్వానర్థ మూలము. కావున ఆ అజ్ఞానమును తొలగించు విధానముచే సచ్చిదానంద రూపమైన ఆత్మను నిజమగు స్వారాజ్యమందు అభిషిక్తుని చేయుటకు వేదాంతములుపక్రమించినవి. కరుణామయిలగు శ్రీమచ్ఛంకరులు మున్నగు వారులు వేదాంత సూత్ర భాష్యము మున్నగు గ్రంథముల భాష్యాది సారమును తెలిపి జీవుని అజ్ఞానము తొలగించుటకు పూనుకొనిరి.

అద్వైతసిద్ధి గ్రంథ వివరణమున తొలి అధ్యారోపమను ప్రకరణము సమాప్తము.

అపవాద ప్రకరణము

సకలానర్థ శూన్యమగు నిర్విశేష పరబ్రహ్మమును భ్రాంతులగు జిజ్ఞాసువు లకు బోధించుటకై వారి దృష్టికి కనబడు పదార్థములను, వానికి గల భేదములను అంగీకరించి, అధ్యారోప అపవాద ప్రకరణముల రెండింటికి నిర్విశేష పర బ్రహ్మమే విషయమై, రెండింటి యందు సిద్ధించు తత్పదార్థమునకు, త్వం పదార్థ మునకును లక్ష్య, లక్షణభావమును తొలుత చూపుచున్నారు.

బ్రహ్మము సకల జగత్తు ఉత్పత్తి స్థితి లయములకు నిమిత్త కారణమనియు, ఉపాదాన కారణమనియు తొలిప్రకరణమున చెప్పిరి. నిర్గుణ బ్రహ్మము జగము లను పుట్టింపజాలదు. పాలింపజాలదు. లయము చేయజాలదు. కావున పై లక్షణములతో బ్రహ్మమునకు సాక్షాత్సంబంధము లేకపోవుటచే సృష్టి, స్థితి, లయములకు కారణమను లక్షణము బ్రహ్మ స్వరూపమును బోధింపజాలదు. బ్రహ్మమునకు పై లక్షణముతోడ అధ్యస్త సంబంధమున్నందున పై లక్షణము శాఖా చంద్ర న్యాయముచే నిజాధిష్ఠానమగు పరబ్రహ్మమును సూచించగలదు. చంద్రుని తెలుసుకొనవలెనని కోరునతనికి చెట్టుకొమ్మలను చూపి ఆ కొమ్మల మీద గల బింబమే చంద్రుడని తెలియచెప్పెదరు. దీనిలో చంద్రునకు కొమ్మలతో సాక్షాత్సంబంధములేదు. అయినను కొమ్మలపైన సూటిగ అంతరిక్షమున చంద్రుడు యుండుటచే జిజ్ఞాసువు చంద్రబింబమును తెలియుచున్నాడు. దీనిని శాఖా చంద్రన్యాయమందురు. లక్ష్యమగు పరబ్రహ్మము కేవల సచ్చిదానంద రూపము. ఏ విధమగు ద్వైతసంబంధము దానియందు కనబడదు. ఆ పర బ్రహ్మము సూక్ష్మాతి సూక్ష్మము. అవాఙ్మనసగోచరము. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" "యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసాసహః" యను శ్రుతులు నిర్గుణ పరబ్రహ్మమునే చాటుతున్నవి. ఇట్టి పరబ్రహ్మము హృదయ పుండరీకమందు నెలకొని యుండును. ఏ విధమగు ద్వైత సంబంధము పరబ్రహ్మమునకు లేక పోవుటచే పై లక్షణములతోడను బ్రహ్మమునకు సంబంధము సంభవింపజాలదు. అభిన్ననిమిత్తోపాదాన కారణమను లక్షణము సాక్షాత్సంబంధము లేకపోయినను అధ్యస్త సంబంధముండుట వలన

లక్షణమయిన రీతి లక్ష్యమగుచున్నది.

కారణములు వివర్తకారణములనియు, ఉపాదానకారణములనియు, నిమిత్తకారణమనియు మూడు విధములు. సంజవేళ త్రాడునుచూచి పామనియు, ముత్యపుచిప్పను చూచి వెండియనియు భ్రమింతుము. త్రాడునకు, ముత్యపు చిప్పకు ఏ వికారము లేకున్నను త్రాడు సర్పముగను, ముత్యపుచిప్ప వెండిగను కనబడును. కనబడు సర్పరజతములకు త్రాడు, ముత్యపుచిప్ప కారణమనబడును. ఇట్లు కారణములనబడు వానికి ఏ విధమగు వికారము లేక కారణములయినచో అవి వివర్తకారణములనబడును. కుమ్మరిచేయుకుండలకు మట్టియు, స్వర్ణకారుడు చేయు నగలకు బంగారము కారణములనబడును. ఇవి ఉపాదాన కారణములు. కారణములనబడు వస్తువులు కార్యరూపమున పరిణమింప ఆ కారణములు ఉపాదానకారణములనబడును. అట్టి ఉపాదాన కారణములగు మట్టిని కుండల రూపమును, బంగారమును నగల రూపముగను పరిణమింపచేయు ఇతర సాధనములన్నియు నిమిత్త కారణములనబడును. కడవలకు కుమ్మరియు, నగలకు కంసాలియూ నిమిత్తకారణములగుదురు. కులాల స్వర్ణకారులకు ఉప కరణములగు దండచక్రాదులు, సుత్తి మున్నగునవి నిమిత్త కారణములనబడును.

బ్రహ్మ మద్వితీయము. కావున కుంభకారునకు దండ చక్రాదులవలె బ్రహ్మ మీ జగన్నిర్మాణము చేయునపుడు ఉపకరణములు సంభవింపవు. కావున బ్రహ్మమే నిమిత్త కారణమై యుండవలెను. జగన్నిర్మాణమునకు వేఱొండు ఉపాదాన కారణము లేనందున బ్రహ్మమే ఉపాదాన కారణమయి యుండవల యును. కావుననే వేదాంతులు జగన్నిర్మాణమునకు బ్రహ్మమును అభిన్ననిమిత్తో పాదాన కారణమందురు. వేదాంతులు వ్యావహారిక దృష్టిననుసరించి బ్రహ్మమును అభిన్ననిమిత్తోపాదానమందురు. కావున బ్రహ్మము జగదాకారమున పరిణామము తప్పనిసరియగుటచే వికారాది దోషములు అనివార్యములు కాగలవు. కావుననే వేదాంతులు పరమార్థ దృష్టిని అనుసరించి జగన్నిర్మాణమునకు బ్రహ్మము వివర్త కారణమందురు. బ్రహ్మమును వివర్తకారణమనుటయే వేదాంతములకు పరమ తాత్పర్యము. అందువలన

రజతములకు వివర్త కారణమగు ముత్యపుచిప్పవలెను, సర్పమునకు వివర్తకారణమగు త్రాటికివలెను సకల జగములకు వివర్త కారణ మగు బ్రహ్మమునకు వికారాది దోషము ఇసుమంతయు కలుగనేరదు.

కూటస్థమగు బ్రహ్మము మాయాసాహాయ్యములేక ప్రపంచమును పుట్టింప జాలదు. మిథ్యాభూతములగు వస్తువులందు 'మాయ' అను శబ్దము ప్రసిద్ధమయి యుండుటచే నామాయయు మిథ్యాభూతమనుట తథ్యము. వేదాంతులీమాయను 'అవిద్య' యనియు పేర్కొందురు. బ్రహ్మ విద్యోదయముచే అవిద్య తొలగునని "తమేవవిది త్వాతి మృత్యుమేతి" "తరతి శోక మాత్మవిత్" అని వేదాంతములందు కన్పించుచున్నది. రాక్షసుల మాయచే నిర్మింపబడిన వస్తువులు యుద్ధాదులను నిర్వహింప సమర్థములై యుండుట పురాణాదులందు మనము వినుచున్నాము. మిథ్యాభూతములగు పదార్థములు సయితము కార్యసమర్థములయి. తెలియబడి యున్నవి. కావున మాయానిర్మితమయిన ఈప్రపంచము సకల వ్యవహారార్హమయి యుండకపోవును. ఈప్రపంచము యొక్క తత్త్వమిట్టిది యని నిర్ణయింపజాలము. నెమలి పింఛపు కాంతివలె ఈ ప్రపంచతత్త్వము కూడా దురవగాహము. ఇట్టి దురవగాహమగు ప్రపంచము రజ్జు వివర్తమగు సర్పమువలె బ్రహ్మ వివర్తమయి యున్నది.

వేదాంతులు మాయను, మాయాకల్పితమగు ప్రపంచమును మిథ్య యందురు. మిథ్యాత్వమును వేదాంతులలో పలువురు పలువిధముల వక్కాణించిరి. సద్రూపమనియు, అసద్రూపమనియు, నిర్వచింపబడరానిదనియు, మిథ్యయని కొందఱందురు. త్రికాలములందు నిషేధింపబడదగి యుండునది మిథ్యయని కొందఱు, జ్ఞానముచే తొలగునది మిథ్యయని కొందఱందురు. తాను లేని తావున తాను కనబడునది మిథ్యయని కొందఱు, బ్రహ్మమునకన్న అన్యమగునది మిథ్య యని మఱికొందరందురు. అనిర్వాచ్యమగునది మిథ్యయనియు, మాయాకల్పిత మగునది మిథ్యయనియు మిథ్యాత్వ స్వరూపమును పలువిధములుగ నిర్వచింప వచ్చును. ఎట్లు నిర్వచించినను, మిథ్యాభూతములగు రజ్జు సర్పాదులా నిర్వచన మునకు లోబడి యున్నందున మిథ్యా వస్తువులు కాగలవు. పైనిర్వచనములలో జ్ఞానముచే తొలగునది

మిథ్యయను నిర్వచనమును "పరసమధిగ మాత్తన్ని వృత్తి శ్రుతేశ్చ" యను పదముచే గ్రంథకారులు వెల్లడించిరి. కాగా జ్ఞానముచే తొలగునది మిథ్యయను లక్షణము గ్రంథకారులకు సమ్మతమని స్పష్టమగుచున్నది. మాయావిద్యలకు భేదమేమియులేదు. బ్రహ్మవిద్యోదయముచే విద్యకు విరుద్ధ మగు అవిద్య తొలుగునే కాని విద్యా విరోధము లేని మాయయు ఏల తొలగ గలదను సంశయమునకు అవకాశములేదు. మాయయు తొలగగలదు. అంత మాయా కల్పితమగు ప్రపంచము కూడా అంతరించును.

అవ: ప్రపంచము బ్రహ్మరూపమనుటచే లక్ష్యమగు బ్రహ్మమద్వితీ యమ నుటను స్పష్టము చేయుచున్నారు.

"యతోవా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి యత్ప్రయం త్యభి సంవిశంతి"యను వేదమీ సకలప్రపంచము బ్రహ్మము వలన పుట్టుననియు, బ్రహ్మముచే పాలింపబడుననియు, బ్రహ్మమున లయమగుననియు వెల్లడించు చున్నది. "వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్" అను శ్రుతియు మట్టివలన పుట్టి, మట్టియందుండి, మట్టి యందు లయమగు కుండ, మూకుడు మొదలగు మార్తిక వికార మంతయు నామధేయ మాత్రమనియు, మృత్తికా రూపమనియు తెలుపుచున్నది. ఇట్లే ఈ ప్రపంచమంతయు బ్రహ్మము వలన పుట్టి, బ్రహ్మముచే పాలితమై, బ్రహ్మమున లయమగుటచే బ్రహ్మరూపమనుట స్పష్టము. బ్రహ్మమున కన్న వేఱొండు వస్తువు గానేరదు. సద్రూపమగు బ్రహ్మము కన్న భిన్నమగునేని అసద్రూపము కావలసియుండును. తొలిపక్షానుసారము ఈప్రపంచము సద్రూప మగు బ్రహ్మస్వరూపమైనను, లేక మలిపక్షాను సారము సద్రూమగు బ్రహ్మముకన్న వేఱగుటచే అసద్రూపమయినను బ్రహ్మమందు ప్రపంచ మూలమగు భేదమే విధముగను సిద్ధింపజాలదు. కావున ప్రపంచము బ్రహ్మరూపమనవలయును లేక బ్రహ్మమునకన్న భిన్నమనవలయునే కాని పరస్పర విరుద్ధమగుటచే భిన్నా భిన్నమనదగదు. ఈ మూడు విధములకు మించిన మఱియొక మార్గాంతరము లేదు. కావున పరస్పర విరుద్ధములగు భేదాభేదములు రెండును సంభవింపనేరదు. భేదశూన్యమగు బ్రహ్మమున ప్రతిష్ఠింపగల భేదము సంభవింపనేరదు. కావున బ్రహ్మమద్వితీయము.

సకల ప్రపంచము గోచరించుచుండగా బ్రహ్మమద్వితీయ మెట్లు కాగలదను సంశయము కల్గుట సహజము. కాని కనబడు ప్రపంచమంతయు అనిర్వాచ్యము. అనగా సద్రూపమనియు, అసద్రూపమనియు, సదసద్రూపమనియు చెప్పశక్యము గాదని భావము. జగములు సద్రూపమయినచో "నేహ నానాస్తికించన" ఈ బ్రహ్మమునందే విధమగు భేదము లేదను నిషేధము సంభవింపదు. కావున సద్రూపము గానేరదు. కుందేటి కొమ్మువలె అసద్రూపమయినచో కనబడనేరదు. కావున అసద్రూపముగానేరదు. సద్రూపము, అసద్రూపమనుట పరస్పర విరు ద్ధము. కావున సదసద్రూపము గానేరదు. కనుక ఈప్రపంచము ఇది ఇట్టిదియని చెప్పరానిది. కావున అనిర్వాచ్యము. ఇంద్రజాలిత నిర్మితములగు వస్తువులవలె మిథ్యాభూతము.

"వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్"

ఘటశరావాది వికారమంతయు నామధేయము మృత్తిక మాత్రమే సత్యము. కారణస్వరూపము మాత్రమే పరమార్థమనియు, కార్యమంతయు మిథ్యయని చెప్పుటచే ప్రపంచము మిథ్యాభూతము. కావున బ్రహ్మమద్వితీయము.

అవ: ద్వైతము లేదనుటకై భేదాసిద్ధిని చూపుచున్నారు.

లోకమున చంద్రుడొక్కడే గలడు. అట్టి చంద్రుని పలువురుగ చూచుట భ్రమ. ఇట్లే దూరమున గల చెట్లొక్కటిగ తోచుటయు మిథ్య. స్వతసిద్ధముగ చంద్రుని యందు భేదమును, దూరదూరమున గల చెట్లయందభేదమును లేదు. కావున భేదములేని వస్తువును భిన్నముగను, భిన్నమగు వస్తువును అభిన్నముగను చూచుట మిథ్యయనుట స్పష్టము. కావున వస్తువునందుండు భేదముగాని, అభేదముగాని స్వతసిద్ధముగానేరదు. ధర్మములచే వస్తువునకు భేదము సిద్ధించు ననగా ధర్మములు ధర్మికన్న భిన్నములా? అభిన్నములా యని చెప్ప శక్యముగాదు. అత్యంత భిన్నములగు గోమహిషములు రెండింటికి ధర్మియు, ధర్మమును కాదు. కావున ధర్మధర్ములకు అత్యంత భేదము సంభవింపదు. అత్యంతమభిన్నమైనచో చంద్రుడు చంద్రునకు ధర్మియు, ధర్మము కాదు. కావున ధర్మధర్మి భావము పొసగదు. భేదాభేదము పరస్పరవిరుద్ధమగుటచే ధర్మములు ధర్మికన్నభిన్నములు, అభిన్నములు అని

చెప్పజాలము. వస్తువుతోడ వస్తువునకు గల ధర్మములకు భేదమే సిద్ధించినను, లేక అభేదమే సిద్ధించినను లోకమున ఇది ధర్మియనియు, ఇది ధర్మమనియు వ్యవస్థయు ఏర్పడజాలదు. ఇట్లు విమర్శింప ధర్మధర్మి భావము సయితము కుదరనందున ధర్మములు సయితము ధర్మికి భేదాభేదములను కలిగింపనేరవు. కావున "ఏకమేవా ద్వితీయమ్" అని అభేదరూపమున వేదాం తములచే తెలుపబడిన బ్రహ్మము అభిన్నమేకాని భిన్నము కానేరదు.

అవ: ధర్మహేతుకమగు భేదము సంభవింపదని ప్రకారాంతరముచే చూపు చున్నారు.

స్వతసిద్ధముగగాని, అన్యమూలకముగ గాని భేద నిరూపణము శక్యము గాదు. స్వతసిద్ధముగ భేదములేని వస్తువులు ఇతర భేదము చేత భిన్నములు గానేరవు. వస్తువునందు భేదము చూపునపుడు ఏ వస్తువునందు మనము భేదము చూపుదుమో ఆ వస్తువు అభిన్నమగునేని భేదముండజాలదు. భిన్నమేని ఆ వస్తువు నందు పూర్వమే భేదము సిద్ధింపవలయును. ధర్మముల భేదముచే ధర్మిభిన్నము కాజాలదు. ధర్మములు ధర్మికన్న భిన్నములుగావని లోకానుభవ సిద్ధము. ఒక ధర్మికి గల సకల ధర్మములు తమ ధర్మితోడ అభిన్నములగుటచే తాము అభిన్న ములేగాని భిన్నములు కాజాలవు. తమలో తాము ఒక ఇంచుక అయినా భేదము లేని ధర్మములు తమ సంపర్కముచే ధర్మి స్వరూపమున భేదమును ఎట్లు కలిగిం చును? కావున అనవస్థయు, దానిని పరిహరింపబూనినచో చక్రకము, దానిని పరిహరింపబూనినచో పరస్పరాశ్రయము, దానిని పరిహరింపబూనిన ఆత్మాశ్ర యము కలుగును.

బ్రహ్మము అభిన్నమనియు, అఖండమనియు వేదాంతులందురు. ద్వైతులు ఇట్టి బ్రహ్మమునందు భేదమును చూపుటకు ప్రయత్నింతురు. అభిన్నము, భేదము లేని బ్రహ్మమునందు భేదమును చూపుట 'నా తల్లి గొడ్రాలు' అనునట్లుగా పొసగ జాలదు. భేదమును చూపుటకు పూర్వమే బ్రహ్మము భేదము కలది అనివాదులు నిరూపింపవలయును. వాదులిపుడు చూపబూనిన భేదమునకు పూర్వము బ్రహ్మము నందు భేదముండినచో ఆ భేదము భేదమే కావున

తాను బ్రహ్మము నందుండు టకు మఱియొక భేదమిట్లే అవసరము కాగలదు. భేదము బ్రహ్మము నందు కలదని ఊహించు భేదము తాను బ్రహ్మమునందుండుటకు మఱియొక భేదమును అపేక్షింపక తనను మాత్రమే అపేక్షించి తాను బ్రహ్మము నందుండ జాలుననిన, తనకుతాను కారణమగుటచే 'ఆత్మాశ్రయమను' దోషము సంభవిం చును. వాదులిపుడు చూపు భేదము పూర్వమే బ్రహ్మమునకు గల భేదమును అపేక్షించుచుండుటచే రెండింటి అపేక్ష రెండింటికి గలదు కావున పరస్పరాశ్రయ మను దోషము సంభవించును. అట్లుగాక మఱియొక భేదమును అంగీకరించి, వాదులిపుడు చూపబూనిన భేదమునకు పూర్వము బ్రహ్మమున కలదని ఇపుడూ హించు భేదము మఱియొక భేదమును అపేక్షించుననియు, ఆమఱియొక భేదము సయితము భేదమే కావున తానుండుటకు ఇపుడు వాదులు చూపబూనిన భేద మును అపేక్షించుననియు తెలుపగా, ఈభేదము మూడింటికి ఒకదాని అపేక్ష మఱియొక దానికి చక్రమువలె తిరుగుచుండును కావున చక్రకమనుదోషము సంభవించును. ఇట్లు తిరుగుచుండెడి అపేక్షను పరిహరింపదలచి మూడవ భేదము మొదటి భేదమును అపేక్షింపదనియు, దాని అపేక్షతీర్చుటకు నాలుగవ భేదమును, దాని అపేక్షను తీర్చుటకు ఐదవ దానిని, దాని అపేక్షను తీర్చుటకు ఆఱవ భేదమును అంగీకరించుచుండవలయును. ఇట్లు అంగీకరించుటచే నిలుకడలేని అనవస్థాదోషము తటస్థము కాగలదు కావున బ్రహ్మమునందు భేదము నిరూపింప శక్యము గాదు.

దేనియందు భేదము చూపుదుమో దానిని ధర్మి యందుము. దేని భేదము చూపెదమో దానిని ప్రతియోగి లేక ప్రతిభటము అందుము. ఇట్టి భేదమును ఎందుచూపదలచినను ధర్మి, ప్రతియోగులు రెండును తొలుతనే మనకు తెలిసి యుండవలయును. తెలియనిచో భేదమును చెప్పుటగాని, చూపుటగాని జరుగదు. రెండును వేర్వేరుగా మనకు తెలియవలెననిన, ఆ రెండింటి యందు భేదము తొలుతనే సిద్ధమయి యుండవలెను. మొదటనే సిద్ధమయియుండు భేదము, భేదమే కావున దానికి పూర్వము మఱియొక భేదము అవసరమగును. ఇట్లు ఈ భేదసిద్ధికి నిలుకడలేక అనవస్థాదోషము తటస్థము

కాగలదు. అనగా మనమిపుడు చూపదలచిన భేదమెన్నటికిని సిద్ధింపజాలదు. లేక ఈ అనవస్థా యను దురవస్థను పరిహరింపదలచి ధర్మి ప్రతియోగులకన్న భేదము వేఱు కాదనియు, ధర్మిప్రతియోగుల తోడ అభిన్నమని చెప్పునెడల, ధర్మి ప్రతియోగుల కన్న భిన్నము కాని భేదమును భిన్నమని మనము తెలియుట మిథ్య యగును. కావున భేదమును ఏ వస్తువు నందు చెప్పెదమో ఆ వస్తువుకన్న భిన్నమనుటయు, అభిన్నమనుటయు పొసగనేరదు. భిన్నమనవలయును లేక అభిన్నమనవలయునే కాని వేఱొండు గత్యంతరములేదు. కావున భేదము మిథ్య కాని తథ్యము కాదు.

భేదమనునది లోకమునందు ఏదైనా రెండు వస్తువులకు సంభవించును. ఘటపటములకు గల భేదము ఘటపటములు రెండింటి యందు ఉండును. కావున యీ భేదమును ఘటరూపమని కాని, పటరూపమని కాని నిర్ణయింప జాలము. అన్యోన్యాభావము కావున ఏ ఒక్కదాని స్వరూపమని నిర్ణయించడానికి వీలులేనందున భేదము నిరుపాఖ్యమనదగి యుండును. ఇట్టి భేదము ఘటపట ములతోడ సంబంధింప చేయగల సంబంధము భావరూపమయి యుండును. రెండింటిని కలుపచూచిన తాను రెండింటితోడను సంబంధ పడకుండా రెండింటిని కలుపజాలదు. ఇట్లుండ భావరూపమగు సంబంధము తాను భావ రూపములగు ఘటపటములతోడ సంబంధపడగలదై, నిరుపాఖ్యమగు భేదము తోడ సంబంధపడ జాలదు.

కావున సంబంధము భావరూపము గాక అభావ రూపమనిన, భేదము సయితము అభావరూపమే కావున ఆ రెండింటికిని భేదము పొసగదు. కాగా ఘటపటములతో కలుపవలసిన భేదము కన్నా భిన్నమగు సంబంధములేనందున భేదమునకు ఘటపటములతోడ సంబంధము సంభవింపజాలదు. సంబంధులగు ద్రవ్య భేదముల స్వరూపము సయితము కానేరదు. సంబంధులగు ద్రవ్య భేదము లకు భావాభావములకన్న భిన్నమగు సంబంధ స్వరూపమేదియు లేదు. ఆ కారణముచేత సంబంధము భావరూపమనవలయును లేదా అభావరూపమన వలయునేగాని మఱియొక రూపమనుటకు తగిన మార్గము లేదు. ఏ విధమగు సంబంధము లేకున్నను ముత్యపు చిప్ప యందు కనబడు వెండివలె భేద

అద్వైత-2
40

సంబంధము పొసగని బ్రహ్మమందు కనబడు భేదము మిథ్యగాని తథ్యము గానేరదు.

భేదము నిరుపాఖ్యము కావున భావరూపములగు సంయోగ సమవాయాది సన్నికర్షముల సంబంధము నిరుపాఖ్యమగు భేదమునకు సంభవింపవు. కావున భేదము ఇంద్రియగోచరము కానేరదు. నిరుపాధికమగుటచే ఏవిధమగు సంబం ధములేని భేదమునకు వ్యాపిజ్ఞానము సంభవింపదు. నిరుపాఖ్యమగు భేదము సాదృశ్యము కానేరదు. వేదాంతముల తాత్పర్యము అద్వైతము కావున భేదము నందు శబ్దము ప్రమాణముకానేరదు. అనుపలబ్ధియు, అర్థాపత్తియు ప్రమాణము కాకపోవుటచేతను, అనుమాన ప్రమాణము నందే అంతర్భూతమైనందున భేద మను పదార్థవిషయమున ప్రమాణములు కానేరవు. ఈభేదమునందు మఱియొక ప్రమాణములేదు. ప్రత్యక్షమగు ఈ భేదము స్వప్నమునందు కనబడు మాయా నగరమువలె మిథ్యా రూపమే కాగలదు.

పదార్థములు ప్రత్యక్షమగునపుడు సంయోగమనునది సన్నికర్షమనబడును. ఇట్టి సన్నికర్షము నిరుపాఖ్యములగు కుందేటి కొమ్ము వంటి వస్తువులకు సంభవిం పదు. ప్రత్యక్షము కాజాలని వస్తువులకు వ్యాప్తియు సంభవింపదు. నిరుపాఖ్యము లగు వానియందు పోలికయు సంభవింప నేరదు. శబ్ద ప్రమాణము అద్వితీయ బ్రహ్మమునందు తాత్పర్యము కలది కాని భేదమందు తాత్పర్యము లేదు.

"నేహ నానాస్తి కించన, మృత్యోః స, మృత్యు మాప్నోతి, య ఇహ నావేవ పశ్యతి." బ్రహ్మమందు ఏవిధమగు భేదములేదు. ఎవ్వడు భేదమును చూచునో అతడు మరల మరల మృత్యువువాత పడుచుండును.

"ఏక ధైవాను ద్రష్టవ్యమ్" ఏకరూపమున బ్రహ్మమును తెలియవలయును. "అత్రభి దామివ మన్యమానః" "ఉదరమంతరం కురుతే అథ తస్య భయం భవతి" భేదముండునట్లెవ్వడు చూచునో, నెవ్వడైతే భేదమును కనుగొనునో అతనికి మృత్యుభయము కలుగుననియు భేదమును నిరాకరించుచున్నవి.

"అథయోన్యాం దేవతా ముపాస్తే అన్యోసావ, న్యోహయ స్మీతి నసవేదయ ధాపశుః." ఎవ్వడు తాను ఉపాసించు దేవతను తనకన్న భిన్న స్వరూపముగా

ఉపాసించునో అతడు ఆ దేవతను తెలియడు. అతడు పశువువలె దేవతలకు భోగ్య వస్తువగుచున్నాడని వేదాంతములు నిందించుచున్నవి.

అనుప లబ్ధి ప్రమాణము అభావ పదార్థములను గోచరింపజేయును గాని భావరూపమగు ప్రపంచమును చూపజాలదు. అర్థాపత్తియు ప్రపంచములేదని తెలుపును. "నేహనా నాస్తి కించన" బ్రహ్మమందు ఏ విధమగు భేదము లేదు అని తెలుపు వేదాంతములు ప్రపంచ మిథ్యాత్వము లేని యెడల కుదరవు. కావున ప్రపంచము మిథ్యాభూతము. మఱియు "సదేవసోమ్యేద ఇదమగ్రే ఆసీత్" "ఏకమేవా ద్వితీయమ్" మొదలగు శ్రుతులును ప్రపంచ మిథ్యాత్వమును అంగీ కరింపక పొసగజాలవు. ఇట్లు సకల ప్రమాణములును భేదనిషేధమును చూపు చున్నవి కావున భేద మేవిధమునయినను సంభవింపదు.

క్రియాకారక ఫలభేదము లేకున్న సకల ప్రమాణ ప్రమేయ వ్యవహారము లుచ్ఛిన్నమగుననియు కావున కర్మకాండ ప్రామాణ్యమంతరించుననియు మీమాంసకులందురు. మఱియు గురుశిష్య శాస్త్రాది ద్వైతమేలేకున్న శ్రవణాదులు సంభవింపవు కదా! అట్లయిన వేదాంతములకు ప్రామాణ్యమెట్లు సిద్ధించుననియు మీమాంసకులు చెప్పుదురు. కాని ప్రమాణముల ప్రామాణ్యము వ్యావహారికము. అనగా కర్తృత్వాదులాత్మకు కలవని అభిమానము గల మనుజుడు కర్మలను చేయును. అట్టి అభిమానము అసత్యమేగాని సత్యము కాదు. కావున కర్మకాండోక్త కర్మలను ఆచరించు నతడు వేదాంత వేద్యమగు ఆత్మ తత్త్వమును ఎఱుంగడనుట తథ్యము. కావున కర్మకాండ అవిద్య విషయమనుటయు స్పష్టము. ఇట్లే శ్రవణా దులను చేయుచు తనకు లేని కర్తృత్వము తన యందు ఆరోపించుకొని ప్రవృత్తిం చుననుట నిర్వివాదము. కావున సకల శాస్త్రములు అవిద్య విషయములు. ఇట్టి శాస్త్రములకును, లోకసిద్ధములగు విషయములందు ప్రవర్తింపచేయు ప్రమాణము లకును గల ప్రామాణ్యము వ్యావహారిక మనబడును. సచ్చిదానంద బ్రహ్మమును బోధించు వేదాంతములను తెలుపునది పారమార్థిక ప్రామాణ్యము. త్రికాలము లందు బాధింపబడని అర్థమును తెలుపు ప్రమాణములకు గల ప్రామాణ్యమును తెలుపునది పారమార్థిక ప్రామాణ్యము. వ్యవహార కాలమున బాధింపబడని అర్థములను తెలుపు

ప్రమాణములకు గల ప్రామాణ్యము వ్యావహారిక ప్రామాణ్యము. ప్రతిభాసముందు పర్యంతము యథార్థమగు వస్తువును తెలుపు ప్రమాణమునకు గల ప్రామాణ్యమును ప్రాతిభాసిక ప్రామాణ్యమందురు. కనబడు పర్యంతము యథార్థముగా తోచు రజ్జు సర్పము, శుక్తి రజతము మొదలగునవి ప్రాతిభాసిక ప్రమాణములచే తెలుపబడును. ఈవిధముగా భేదము ప్రమాణ సిద్ధముకానందున కనబడు ఈ భేదము స్వప్నమాయా నగరమువలె మిథ్యాభూతము.

అవ: ద్విత్వాది రూపమగు భేదమును నిరసించుచున్నారు.

ద్విత్వమనునది బాహ్య పదార్థమనియు, బుద్ధి మాత్రముచే ఘటపటాదు లందు పుట్టుననియు నైయాయికులందురు. బాహ్యార్థములు ఆయా కారణ కలాపము వలన పుట్టును కాని బుద్ధిమాత్రముచే పుట్టజాలవు. అట్లు పుట్టునేని పుట్టిన బాహ్యార్థము ఎల్లరకు కన్పించును, పరులకు తెలియవలెను. ద్విత్వమట్లు పుట్టునేని గిరిశిఖరమున మనోరథ మాత్రముచే ప్రభవమగు ప్రాసాదమువలె మృషాభూతమగునని భావము. మఱియు స్వప్న పదార్థములై పురుషులకు మాత్రము తెలియునవి. మఱియు నైయాయికులు ద్విత్వమనునది కడవలు రెండింటి యందు ఉండునందురు. ఒక్కొక్క కడవ యందుండజాలదందురు. ద్విత్వము ఒక్కొక్కకడవయందు లేకుండుటచే ఒక్కొక్కకడవ ద్వయము కానేరదు. ఒక్కొక్క కడవ ద్వయము కానప్పుడు రెండు కడవలును ద్వయము కానేరవు. తెల్లకలువ ఒక్కొక్కటియు నల్లకలువ గాదు. అట్టి తెల్లకలువలు రెండు నల్లకలువ లెట్లుకాగలవు. కావున అట్టికలువలు రెండింటిని ద్వయమని మనము తెలియుట మిథ్య. మఱియు యిది యొకటి, యిది యొకటి యనునది అపేక్షాబుద్ధియనియు, ఈ బుద్ధి వలన ద్విత్వ నిర్వికల్పక జ్ఞానముదయించిన పిమ్మట ద్విత్వము గల కడవల జంటయను సవికల్పక జ్ఞానము పుట్టుననియు నైయాయికులందురు. మఱియు వీరి మతమున జ్ఞానేచ్ఛాది గుణములలో పూర్వపూర్వమునకు ఉత్తరోత్తర గుణముచే నాశనము వాటిల్లుననియు చెప్పుదురు. ఇట్లుండగా అపేక్షాబుద్ధిచే ద్విత్వ నిర్వికల్పక జ్ఞానము పుట్టిన పిమ్మట ద్విత్వ నిర్వికల్పక జ్ఞానముచేగాని లేక తత్కాలమందు పుట్టిన మఱియేదేని జ్ఞానముచేగాని అపేక్షా

అద్వైత-2
42

బుద్ధినశించుననుట స్పష్టము. కారణమగు అపేక్షాబుద్ధి నశించినచో కార్యమగు ద్విత్వమునశించును. కావున ద్విత్వసవికల్ప జ్ఞానముదయింపజాలదు. ద్విత్వము గల కడవల జంటయను జ్ఞానము పుట్టియు ప్రమాణము కానేరదు. ద్విత్వము నశించుటచే ద్విత్వము లేని కడవలను చూచి రెండుగా తలచుట రజతము కాని ముత్యపుచిప్పను చూసి రజతమని తలచునట్లుగా మిథ్యయగును. పూర్వ క్షణమందు ఆ కడవలయందు ద్విత్వము కలదు కావున ఇపుడు ద్విత్వము గల కడవల జంట అనే జ్ఞానము ప్రమాణమనినచో విష్ణుశర్మయొక్క కుండలము లను దొంగలు అపహరించిన పిమ్మట విష్ణుశర్మ కుండలముల మండితుడని నేడు పుట్టిన జ్ఞానము కూడా ప్రమణము కావలయును. ఇంతియేకాక ద్విత్వ త్రిత్వాదులు సంకరములగును. కావున ఇందు ద్విత్వమనియు, ఇందు త్రిత్వ మనియు చెప్పు అవకాశము లేకపోవునని భావము. ఇదియొకటి, యిది యొకటి అనే అపేక్షాబుద్ధివలన ద్విత్వము పుట్టునట్లు, ఇవి రెండు, ఇది ఒకటియను అపేక్షాబుద్ధి వలన త్రిత్వము పుట్టునందురు. నైయాయికుల మతమును అనుసరించి రెండు కడవలందు ద్విత్వము పుట్టిన పిమ్మట అందొక కడవ యందుండ 'ఇదియొకటి' అను జ్ఞానముచే రెండు కడవల యందు త్రిత్వము పుట్టవలయును. కావున రెండు కడవలను మూడుగ మనము తలంపవలయును. ఇట్లే త్రిత్వమునకు తగిన అపేక్షాబుద్ధియు, మఱియు ఇది యొకటి అను అపేక్షా బుద్ధియుచేరి నాలుగు అనే బుద్ధియు పుట్టునని నైయాయికులందురు. అప్పుడు నాలుగు కడవలు, మూడు కడవలు అనే అవసరము లేకుండా మూడింటి యందు, రెండింటి యందు నాలుగు, మూడు అను జ్ఞానముదయింపగలవు.

పై దోషమును పరిహరించుటకు నైయాయికులు ప్రాగభావముచే వ్యవస్థను కల్పింతురు. ప్రాగభావమనునది వీరి మతమునందు ఒక పదార్థము. పదార్థముదయించుటకు ప్రాగభావము కారణమందురు. ద్విత్వము కడవల జంటయందు పుట్టును. ద్విత్వప్రాగభావము ఆ జంటయందు ఉండును కాని మూడింటి యందుండదు. మూడింటి యందు త్రిత్వప్రాగభావమే ఉండును. కావున ఈ ప్రాగభావములచే ఆయా ద్విత్వ, త్రిత్వాదులందందు పుట్టునందురు. ఇదియు సమంజసము కాదు. ప్రాగభావము కార్యవైలక్షణ్యమును కల్పించ

జాలదు. కల్పించునేని గుణగుణులకు ప్రాగభావ భేదము చేతనే భేదము సిద్ధింప గలదు. అప్పుడు గుణగుణులొక దాని వెంట నొకటి క్రమముగ పుట్టుననియు, కావున గుణగుణులకు భేదమనియు లోకానుభవ విరుద్ధముగ నైయాయికులు చెప్పనవసరములేదు. గుణగుణులు ఒకదాని వెంట నొకటి పుట్టుట లోకానుభవ విరుద్ధము. గుణగుణులు అత్యంత భిన్నములయి వేఱువేఱుగ పుట్టుననిన, అత్యంతభిన్నములగు గోవు, మహిషములు పరస్పరము గుణగుణులు కానేరవు. కావున నిష్ప్రయోజనమగు ప్రాగభావమును వేదాంతులు అంగీకరింపరు. పుట్టిన కడవ మరలా ఏల పుట్టదను సంశయమును బాపుటకు ఈ ప్రాగభావమును నైయాయికులు అంగీకరింతురు. కడవ పుట్టిన వెంటనే దాని ప్రాగ భావము నశించుననియు, ప్రాగభావ రూపమగు కారణము లేనందున కడవ మరల పుట్టజాలదనియు వీరలందురు. కాని పుట్టిన కడవ మరల పుట్టుటకు ప్రతిబం ధకమనియు, ప్రతిబంధకమున్నందున పుట్టిన కడవ మరల పుట్టనేరదనియు వేదాంతులందురు. కావున ప్రాగభావమే నిరర్థకము. మఱియు అపేక్షాబుద్ధి క్లుప్తముగాదు. ఇది యొకటి యిది యొకటి అను అపేక్షాబుద్ధిచే ద్విత్వమును, ఇదియొకటి యిదియొకటి, యిదియొకటి అనిగాని లేక ఇవి రెండు యిది ఒకటి అను అపేక్షాబుద్ధిచే త్రిత్వమును పుట్టును. ఇట్లే యిదియొకటి, యిదియొకటి, యిదియొకటి, యిదియొకటియను అపేక్షాబుద్ధిచేగాని చతుష్ట్వము పుట్టవల యును. ఇట్లు పైపైన చెప్పుచూ పోగా అపేక్షాబుద్ధుల సంఖ్యయు పెరుగుచుండును. త్రిత్వాదులు పుట్టుటకు అనేకములగు అపేక్షాబుద్ధులుండుటచే ఇది త్రిత్వము పుట్టుటకు తగిన అపేక్షాబుద్ధియను నియమము లేకపోవును. అపేక్షాబుద్ధి క్లుప్తమయి యుండునని నైయాయికుల ఆశయము. అదియు సంభవింపదు. కావున ద్విత్వరూపమగు భేదము సంభవింపదు. ద్విత్వము సంభవింపకుండుటకు చెప్పిన హేతువులను పృథక్త్వమను భేదమందును ఈ సమస్త దూషణమును చొప్పింప పృథక్త్వమను భేదము సయితము సిద్ధింపదు కావున భేదము మిథ్య.

అవ: భేద ద్విత్వాది రూపమగు భేదము లేకున్నను, కార్యకారణములకు ప్రాభాకరమతమందువలె అధికరణ స్వరూపమగు భేదము సంభ వించునను సంశయమును బాపుచున్నారు.

కార్యకారణములలో కారణమనగా ఉపాదానకారణము. కార్యము ఉపాదానకారణముకన్న వేఱుగా తోచుటలేదు. కావున కార్యము ఉపాదానకారణము కన్న భిన్నము కానేరదు. నిమిత్త కారణమగు కులాలుని కన్న భిన్నమగును. ఉపాదాన కారణముకన్నను భిన్నమనిన, ఉపాదాన నిమిత్త కారణములకు భేదము సంభవింపదు. కార్యకారణములకు భేదముండుననియు, ఆ భేదము అధికరణ స్వరూపమనియు చెప్పదగదనుచున్నారు. కారణముకన్న వేఱుగ కార్యము తెలియనందున అన్యము కానేరదు. కార్యకారణ రూపమున కనబడుచున్నదే గాని వేఱుగ కనబడుటలేదు. కావున కార్యకారణములకు అభేదమే కాని భేదములేదు. కావున కారణము ఉపాదానకారణమని భావము. నిమిత్త కారణమునకు,కార్యమునకుభేదమున్నట్లుగా,ఉపాదానకారణమునకు, కార్యమునకు భేదమున్నచో ఉపాదానకారణమునకు నిమిత్తకారణమునకు భేదమే సిద్ధింప జాలదు. స్వతాదాత్మ్యపన్నమగు కార్యమును పుట్టించునది ఉపాదాన కారణ మనియు, స్వాతిరిక్తమగు కార్యమును పుట్టించునది నిమిత్త కారణమనియు లక్షణము చెప్పవలయునేగాని, వేఱొండు విధములేనందున కార్యము ఉపాదాన కారణము కన్న భిన్నము కానేరదు.

సమవాయమను సంబంధమును అంగీకరించి నైయాయికులు వ్యవస్థ చేయబూనుదురు. సమవాయముచే తన యందు కార్యమును కలిగించునది ఉపాదానమనియు, సమవాయముకన్న భిన్నమగు మఱియొక సంబంధముచే కార్యమును పుట్టించునది నిమిత్త కారణమనియు నైయాయికులు చెప్పుదురు. సమవాయమును అంగీకరింపని వేదాంతుల మతమున ఇదియు పొసగదు. ఘటపటములకు సంయోగము సంబంధము. అట్లే మట్టికుండలకు సమవాయ సంబంధమందురు. ఘటపటములకు గల సంయోగము తాను ఘటపటముల తోడ సంబంధించి ఘటపటములను కలుపును. అప్పుడు సంయోగము తాను ఘటపటములతోడ సంబంధించునపుడు సంయోగము గుణము కావున సమ వాయమను సంబంధముచే సంభవించునందురు. అట్లే మట్టికుండలకు సమ వాయ సంబంధమనిన, ఆ సమవాయము మట్టికుండలతో సంబంధించుటకు తానే సంబంధమగునేని ఆత్మాశ్రయము. మఱియొక సంబంధమును అంగీకరింప, అదియు సంబంధపడుటకు తాను

సంబంధించునపుడు సంబంధాంతరాపేక్షయు కావలయును. అందుకే తొలి సమవాయమును అపేక్షింపగ మలి సమవాయము తొలిసమవాయమును, మలిసమవాయమును తొలిసమవాయము అపేక్షించుటచే పరస్పరాశ్రయ దోషము సంభవించును. అట్లుగాక మలిసమవాయము మూడవ సమవాయమును అపేక్షింప, అదియు తొలి సమయవాయమును అంగీకరింప చక్రికమను దోషము సంభవించును. ఆ మూడవ సమవాయము తొలిసమవాయమును అపేక్షించుచుపోవ అనవస్థయను దోషము సంభవించును. కావున సమయవాయముచే వ్యవస్థయు సంభవింపదు. మఱియు వేదాంతులు ఈ సమవాయమును అంగీకరింపరు. మఱియు ఈ సమవాయమను పదార్థము ఒక్కటియందురు. కాగా మృత్పిండమందు ఘటమును, తంతువులందు పటమును, గోవునందు గోత్వమును ఏక సమవాయముచే నుండునేని సర్వసాంకర్యముచే వ్యవస్థయు కుదరదు.

కారణమునగల గుణము కార్యమున సజాతీయ గుణాంతరము పుట్టించునని నైయాయికులందురు. కార్యకారణములకు భేదమనియు చెప్పుదురు. వేదాంతుల మతమునందు ఇది పొసగదు. కార్యకారణములకు భేదమున్నచో బంగారముకన్న స్వర్ణకార్యములగు కుండలాదులు మూల్యవృద్ధి పొందవలయును. స్వర్ణపిండము నుండి పుట్టు కటక కుండలాదులందు గురత్వము, కార్యగురుత్వము యుండవలయును. కావున స్వర్ణమూల్యముకన్న కటక కుండలాది మూల్యము వృద్ధి పొంద వలసియుండును. అట్లుండుట లోకానుభవ విరుద్ధము. స్వర్ణమునకు బిండ, కటక, కుండలాద్యవస్థా భేదముచే భిన్నమగునేని మానవులు సయితమా స్థితి,గతి, శయనాద్యవస్థలచే భిన్నులు కావలయును. అట్లు మాటిమాటికి ప్రతీయొక్కడు భిన్నుడగుట లోకానుభవ విరుద్ధము. లోకవ్యవహారము సయితము ప్రతిక్షణము భేదమంగీకరింప సంభవింపనేరదని భావము. కావున భేదమేవిధము చేతను సిద్ధింపనేరదు.

అవ: కార్యకారణములను భేద బుద్ధి మాయాకల్పితము కాని యథార్థము కాదనుచున్నారు.

మట్టికి మృత్పిండావస్థయనియు, ఘటావస్థయనియు అవస్థలు రెండు.

ఈ అవస్థలు రెండింటిని వేర్వేఱుగా తలచునతనికి ఘటము కార్యమనియు, మృత్పిండము కారణమనియు తోచును. కాని ఘట మృత్పిండముల తత్త్వమును విచారించగా మట్టేగాని వేఱొండుగాదు. ఈతత్త్వము తెలిసినవారికి ఘటమృత్పిండములు వేర్వేఱుగా కన్పించవు. కావున వీటిని కార్యకారణములనియు అతడు తెలియజాలడు. ఈవిధముగా మాయనువశము చేసుకొని యుండు ఈశ్వరుడు వేఱనియు, ప్రపంచము వేఱనియు తలచునతని దృష్టికి ఈశ్వరుడు కారణ మనియు, ప్రపంచము కార్యమనియు తెలియుచుండును. కాని వీరి తత్త్వము సద్రూపమగు చైతన్యము గాక వేఱొండు లేదని దృఢముగ విశ్వసించు నతనికి ఈశ్వరబ్రహ్మాండములు వేర్వేఱుగా గోచరింపవు. కావున అతని దృష్టికి ఈశ్వరుడు కారణమనియు, బ్రహ్మాండము కార్యమనియు తోచదు. ఘటశరావాది మూర్తికము లన్నియు కేవల మృణ్మయములయినట్లు సకల బ్రహ్మాండము కేవల సద్రూపమగు బ్రహ్మచైతన్యమే కాని వేరుగాదు.

అవ: సకల బ్రహ్మాండము మిథ్యాభూతమయినను సత్యముగా ఎట్లు తోచు చున్నదను సంశయమును బాపుచున్నారు.

సృష్టికి పూర్వము సద్రూపమగు బ్రహ్మమొక్కటియే కలదని “సదేవ సోమ్య ఇదమగ్రే ఆసీత్” అను మొదలగు శ్రుతులందు తెలియుచున్నది. కుండ పిడత మొదలగు వానిని యందు వ్యాపించి గోచరించు మృత్తికవలె సద్రూపమగు బ్రహ్మమే సృష్టికి పిమ్మట ఈసకల బ్రహ్మాండమంతయు నిండియుండును. కావుననే బ్రహ్మాండమునందలి సకల వస్తువులు ఘటము సత్తు అనియు, పటము సత్తు అనియు గోచరించుచుండును. సంజవేళ త్రాడును చూచి పామని భ్రమించునట్లు గా ఈసకల ప్రపంచము ఆ బ్రహ్మమందు కల్పితము. త్రాడునందు కల్పింపబడిన సర్పమునకు త్రాటి స్వభావము గాక వేఱొండు స్వభావము సంభవింపనట్లుగా సద్రూపమగు బ్రహ్మమునందు కల్పితమైన ఈసకల బ్రహ్మాండమునకు సద్రూప మగు బ్రహ్మస్వభావము గాక వేఱొక్క స్వభావము సంభవింపనేరదు. అట్లు గాక బ్రహ్మాండమంతయు సద్రూపమగు బ్రహ్మముకన్న వేఱగునేని, అసద్రూపము కావలసియుండును. సద్వాదులగు వైదికులు ఈ వాదమును అంగీకరింపరు. కావున సకల బ్రహ్మాండము

బ్రహ్మరూపమేగాని బ్రహ్మముకన్న వేఱుగానందున త్రాటియందు కల్పించిన సర్పమువలె మిథ్యాభూతమే గాని తథ్యము గాదు.

అధిష్ఠానమందలి ధర్మములతో కల్పిత వస్తువులు భాసించును. రజ్జువునందు గల వంకరలు సర్పమునందు కనబడును. అట్లే సద్రూపమగు బ్రహ్మమందు కల్పితమగు నీ సకలము బ్రహ్మమునందు గల సత్త్వముతోడ ఘటము సత్తనియు, పటము సత్తనియు భాసించుచున్నది. రజ్జువు నందు కల్పితమగు సర్పము రజ్జు స్వభావమును, ముత్యపు చిప్పయందు కల్పితమగు రజతము ముత్యపుచిప్ప స్వభావమును కలిగియుండును. అనగా రజ్జు సర్పము రజ్జు స్వభావము, శుక్తి రజతము శుక్తి స్వభావముకన్న వేఱొండు స్వభావము. వానికి లేదని భావము. రజ్జువుకన్నను, శుక్తికన్నను వేఱుగాలేవని భావము. అట్లే బ్రహ్మమందు కల్పిత మైన ఈ బ్రహ్మాండమంతయు బ్రహ్మమే కాని బ్రహ్మముకన్న వేఱుగాదు. కావున బ్రహ్మము అద్వితీయము మఱియు సద్రూపము. ఈ బ్రహ్మాండము అట్టి బ్రహ్మ రూపముకానిచో అసద్రూపమగును. అనగా గొడ్రాలి పుత్రుడువలెను, కుందేటి కొమ్మువలెను అసద్రూపమగును. (ఇట్టి వాదము శూన్యవాదులది కాని వేదాంతు లది కాదు) కుందేటి కొమ్మువంటి జగములచే బ్రహ్మము సద్వితీయము కానేరదు. అసద్రూపమగు బ్రహ్మముతోడ భేదము లేకపోయిన అసద్రూపమగు బ్రహ్మస్వరూపమే యగును.

అవ: సకల బ్రహ్మాండము సద్రూపమగు బ్రహ్మమే అయినచో ముత్యపుచిప్ప యందు కనబడు వెండికి బాధయు, అంగటి యందుండు వెండికి ఆ బాధ లేకుండటయు ఎట్లు పొసగునను సంశయమును బాపుచున్నారు.

పసుపుతో కలిపిన ఎఱుపురంగు వస్త్రమందు, స్ఫటికముతో చేసిన కుండిక యందు ఎఱ్ఱనిరంగు భాసించును. ఆ ఎఱుపువన్నె వస్త్రమందును, కుండిక యందును తుల్యముగ భాసించినను ఎఱ్ఱని వస్త్రమగు జ్ఞానము మిథ్య కాదు. ఇట్లే బ్రహ్మ సత్తా ఒక్కటియే అంగళ్ళ యందలి వెండి యందును, ముత్యపుచిప్ప యందు కనబడు వెండియందును భాసించుచుండును. బ్రహ్మ సాక్షాత్కార ముదయించనప్పుడు సకల ప్రపంచమును, అంగళ్ళయందలి వెండియు

సత్యమని తోపించుచుండును. బ్రహ్మసాక్షాత్కారము తరువాత ఇవి మిథ్యయని తెలియును. ఇక ముత్యపుచిప్ప యందు కనబడు వెండి కనబడు కాలమందు సత్యమని తోచును. అనగా ప్రపంచము వ్యావహారిక సత్యమనియు ముత్యపుచిప్పయందు కనబడు వెండి ప్రాతిభాసిక సత్యమనియు భావము. కనుకనే ముత్యపుచిప్ప యందలి వెండికి తత్కాలమందే బాధయు, అంగళ్ళయందలి వెండికి తత్కాలము నందు బాధ లేకుండుటయు పొసగగలదు.

సత్యము పారమార్థికమనియు, వ్యావహారికమనియు, ప్రాతిభాసికమనియు మూడు విధములు. త్రికాలములందు బాధింపబడని వస్తువు పారమార్థికము అనబడును. వ్యవహారిక కాలమున బాధింపబడని వస్తువు వ్యావహారిక మన బడును. అనగా బ్రహ్మజ్ఞానముచే బాధింపబడునని భావము. కనబడు పర్యం తముయుండు వస్తువు ప్రాతిభాసికమనబడును. అనగా దేనియందా ప్రాతిభాసి కము కల్పితమో దానిని తెలిసినచో బాధింపబడునని భావము. అంగళ్ళ యందలి వెండి బ్రహ్మ జ్ఞానముచే బాధింపబడుటచే వ్యావహారికమనియు, ముత్యపుచిప్ప యందు వెండి శుక్తిజ్ఞానముచే బాధింపబడుటచే ప్రాతిభాసికమనియు భావము. కావున సర్వము బ్రహ్మరూపమైనను లోకవ్యవహారము పొసగగలదని భావము.

బ్రహ్మము సచ్చిదానందైకరసము. అందు సత్‌చిత్ ఆనందము అను అంశ ములు వేర్వేఋలేవు. కాని మూఢులా బ్రహ్మమును మిథ్యయనియు, జడమనియు, దుఃఖరూపమనియు తలంతురు. ఇట్టి భ్రమను తొలగించుటకై "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అను వేదాంత వాక్యములు ఆ బ్రహ్మమందు సద్రూపమనియు, జ్ఞానరూపమనియు, ఆనంద రూపమనియు కల్పించినవి. అట్టి బ్రహ్మమందు ఈసకల ప్రపంచము కల్పితం. కల్పితవస్తువులందు అధిష్ఠానమందలి ధర్మములు కొన్ని భాసింపగలవు. మఱికొన్ని భాసింపనేరవు. ఎట్లనగా ముత్యపుచిప్ప సత్యమైన వస్తువు. దానియందు కల్పితమైన వెండి మిథ్య. ముత్యపుచిప్పయందలి సత్యత్వము ముత్యపుచిప్ప యందు కల్పితమైన వెండి యందు కలసి భాసించి, వెండి సత్యమని తోచును. ముత్యపుచిప్ప యందు శుక్తిత్వమను మఱియొక ధర్మము కలదు. ఈ శుక్తిత్వమను ధర్మము వెండి యందు భాసింపదు. ఇట్లే

బ్రహ్మమందు సచ్చిదానం దములను రూప భేదములున్నను, బ్రహ్మమందు కల్పితమగు ప్రపంచమున ఘటము సత్తనియు, పటముసత్తనియు సత్తాంశము మాత్రము భాసించుచుండును. ఆబ్రహ్మమునందుగల చిత్తు, ఆనందములను రెండంశములు మాయావరణముచే కప్పబడియున్నందున గోచరింపనేరవు. కాని బ్రహ్మము నందు సామాన్యాంశము, విశేషాంశము కల్పితమయి యున్నందున బ్రహ్మమీ బ్రహ్మాండమును కల్పింప అధిష్ఠానము కాగలదనియు, బ్రహ్మము సచ్చిదానంద రూపమగుటచే సుఖకాము లెల్లరు ఆ బ్రహ్మమును పొందగోరుదురనియు భావము. సచ్చిదానందములను వేర్వేఋగా శిష్యబుద్ధికి గోచరమగునటుల కల్పింపబడు అంశములున్నందున బ్రహ్మమధిష్ఠానము కాగలదని భావము. కాని నిర్గుణ పరబ్రహ్మము వాస్తవముగ అధిష్ఠానము కానేరదు.

అవ: అధిష్ఠానమగు బ్రహ్మమును తటస్థలక్షణముచే బోధించుచున్నారు.

రాజును ఎఱుంగని మనుజుడు ఈ సమాజమందు రాజు ఎవరని ప్రశ్నిం పగా మదపుటేనుగు పైభాగమున గల అంబారీలో తెల్లని ముత్యాలగొడుగు నీడలో కూర్చున్న అతడే రాజుయనియు తెలియచెప్పుదురు. అంతట ప్రశ్నించునతడు ఏనుగు, అంబారీ, ముత్యాలగొడుగు మొదలగు సకల విశేషములను చూచి వాటిని విడనాడి ఒక్క పురుషశ్రేష్ఠుని మాత్రము "ఇతడు రాజు" అని తెలియగలడు. అంతియేగాని ఆ విశేషములన్నిటిని రాజు అని తెలియజాలడు. ఏలనగా పై విశేషములన్నియు రాజు స్వరూపమున చేరినవికావు. అయినను వాని మూల ముగ రాజు స్వరూపమును గుర్తింప గలుగుచున్నాడు. కావుననే మఱియొక కాలమున ఈలక్షణములులేని రాజును చూచి ఆరాజు ఇతడే అని తెలియగలుగు చున్నాడు. అట్లే సకల బ్రహ్మాండము సృష్టి, స్థితి, లయములకు కారణము బ్రహ్మము అనునది తటస్థ లక్షణము. ఇది సకల బ్రహ్మాండమునకు అధిష్ఠానమగు పరబ్రహ్మమును మాత్రము బోధింపగలదు. బ్రహ్మమునకు సచ్చిదానందరూపమే స్వరూప లక్షణము. బ్రహ్మము సచ్చిదానంద రూపమని చెప్పిన సాధారణులు తెలియజాలరు. కావుననే తటస్థలక్షణముచే నిరూపింతురు. రాజును తెలుపుటకు

ముత్యాలగొడుగు, ఏనుగు, అంబారీ మొదలగు విశేషములకు రాజు స్వరూపమును తెలుపుటకన్న ప్రయోజనము వేఱొండులేదు. కావున పురుషశ్రేష్ఠుడొక్కనిని రాజుగ వెల్లడించి విశేషములు ఉపశమించును. అట్లే పరబ్రహ్మమును తెలియగోరునతనికి పరబ్రహ్మమును తెలుపదలచి వేదాంతములు బ్రహ్మాండ నిర్మాణక్రమమును వర్ణించినవి. అట్టి బ్రహ్మాండ నిర్మాణాది విశేషములా పరబ్రహ్మ స్వరూపమున చేరనేరవు. కావున బ్రహ్మాండ నిర్మాణమును చెప్పు వేదాంతములు శుద్ధ చైతన్యైకరసమగు పరబ్రహ్మమును మాత్రమే గుర్తింపచేయగలవు.

రాజస్వరూపము తెలియగోరు నతడు ముత్యాల గొడుగు, ఏనుగుమున్నగు విశేషములను పరిత్యజించి రాజు స్వరూపమును మాత్రము తెలియుచున్నాడనియు, కావుననే మఱియొక కాలమునందీ విశేషములు లేకున్నను రాజును గుర్తెఱుగుచున్నాడనియు చెప్పిరి. రాజును గుర్తెఱుగుటకు ఈ లోకదృష్టాంతము సమంజసముగనే యున్నది. కాని బ్రహ్మ విషయము నందీ దృష్టాంతము తగదు.

"కింకారణం బ్రహ్మకుత్మజాతాః" "కుత అజాతాకుత ఇయం విసృష్టిః" "నతం విదాదయ ఇమాజ జాన" అనియు "యతోవా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి, యత్ప్రయంత్యభి సంవిశంతి" అనియు వేదాంతముల పోకడ జూడ కారణత్వముగల బ్రహ్మమును తెలుపగోరుట స్పష్టమగుచున్నది. కావున నిర్విశేష పరబ్రహ్మము వేదాంతములకు తాత్పర్యమని ఎట్లు ఒప్పును? అని భేదవాదుల ఆశయము.

కాని తైత్తిరీయమున "బ్రహ్మవిదాప్నోతిపరమ్" బ్రహ్మవేత్త పరమ పదమును బొందునని ఉపక్రమించి, ఆ బ్రహ్మము "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని పరబ్రహ్మమును సత్యజ్ఞానాంతరూపమని స్వరూప లక్షణముతో వెల్లడించెను. సత్యజ్ఞానానంత రూపమగు నిర్విశేష బ్రహ్మము తెలియశక్యముగాదు. కావుననే "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః" అట్టి యీ ఆత్మనుండి ఆకాశము పుట్టెననుచు తటస్థలక్షణము చెప్ప ఆరంభించెను. కావున తైత్తిరీయమున ఉపక్రమ మున గల నిర్విశేష బ్రహ్మము నందే తాత్పర్యము. భృగువల్లియందు సయితము "అధీహి భగవో బ్రహ్మేతి" నాకు బ్రహ్మమును బోధింపుమని

జనకుని చెంతచేరిన భృగువునకు పరమ పురుషార్థరూపమగు పరబ్రహ్మమునే వరుణుడు బోధింప దలచి "యతో వా ఇమాని భూతాని జాయంతే" ఏ బ్రహ్మము నుండి యీ సమస్తము పుట్టుచున్నదో అను తటస్థ లక్షణమును ఆరంభించెను. కావుననే బ్రహ్మస్వరూపమగు ఆనందము తెలియు పర్యంతము మరల మరల పుత్రునకు బోధింపసాగెను. కావున సచ్చిదానందరూపమగు బ్రహ్మస్వరూపమే భృగువల్లికి తాత్పర్యమనుట స్పష్టము.

పతితులును, నాస్తికులును వేదము చదువ అధికారము గలవారలు కారు. కాగా శ్రద్ధాళువులయి వేదవేదాంగములను చదివిన వివేకులు "నిర్గుణం నిష్క్రియం శాంతమ్" బ్రహ్మము గుణక్రియారహితము శాంతము అనియు, "ఏకమేవా ద్వితీయం" "నేహ నానాస్తి కించన" బ్రహ్మమద్వితీయమనియు, ఈ బ్రహ్మమునందెట్టి భేదము లేదనియు, "యత్ర నాన్య త్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్య ద్విభూతి స భూమా" ఎట్టి ముక్తావస్థ యందేదియు జూడదు, ఏదియు వినదు, ఏదియు తెలియదు, అట్టి స్వరూపము భూమ శబ్దవాచ్యమనియు, "యత్త దద్రేశ్య మగ్రాహ్య మపూర్వమన పరమ్" ఏ బ్రహ్మము ఉపదేశింప శక్యము గానిదో, గ్రహింప శక్యము గానిదో, కారణము లేనిదో, కార్యము లేనిదో, అట్టిది బ్రహ్మమనియు సామాన్యముగ తెలియు, ఆ బ్రహ్మతత్త్వమరయుటకు విమర్శింప బూనుదురు. కాగా నిర్విశేష బ్రహ్మమే వారి జిజ్ఞాసకు విషయమని భావము. ఇట్లు "కింకారణం బ్రహ్మ" అనునపుడును, కారణమగు బ్రహ్మస్వరూప మెట్టిది? అని ప్రశ్నకు తాత్పర్యము. కావుననే ప్రకరణాంతమందు "నిర్గుణం నిష్క్రియం శాంతం నిరవద్యం నిరంజనమ్" అని నిర్విశేష పరబ్రహ్మమందే ఉపసంహరింప బడెను.

"తత్త్వమసి" వాక్యమున తత్, త్వం పదార్థముల అభేదము బోధింపబడెను. కాని భిన్న స్వభావములు గలవిగ తోచు తత్ పదార్థము, త్వంపదార్థములగు ఈశ్వర, జీవులకు అభేదము పొసగజాలదు. కనుక తత్, త్వం పదార్థములందు విరుద్ధముగ తోచు స్వభావములను పరిత్యజించి, తత్ త్వం పదములు రెండింటికి శుద్ధచైతన్యము మాత్రమే లక్షణావృత్తిచే అర్థము కాగలదని వర్ణించెదరు. తత్, త్వం పదముల అర్థములగు జీవేశ్వరులు అభిన్నులని "తత్త్వమసి"

వాక్యమున చెప్పుటయు, ఆచెప్పిన అభేదము పొసగకుండుటయు ఈలక్షణావృత్తిని ఆశ్ర యించుటకు బీజము. కాని సృష్టి వాక్యములందిట్టి అభేదబోధయు, ఆ అభేదము పొసగకుండుటయు కానరాదు. కావున సృష్టివాక్యముల పదములందు లక్షణ ము చెప్పవలనుపడదు. తాత్పర్యము నిర్ణయించు ఉపక్రమాది కారణములుండు టచే ఈ సృష్టి వాక్యములకు పరబ్రహ్మ మును బోధించు తాత్పర్యము కలదనుట స్పష్టము. భేద సంబంధముచే ఒకదాని తోడ నొకటి కలియజూసిన ఆ సృష్టి వాక్యములు పరస్పరాన్వయము బొంది, సచ్చిద్రూపమగు అద్వితీయ బ్రహ్మమును గుర్తింపగలవు.

పదముల అర్థమును బోధించుటకు అభిధావృత్తియనియు, లక్షణావృత్తి యనియు రెండు శక్తులుండును. "గంగ యందు గొల్లపల్లె" అను వాక్యమునందలి గంగా శబ్దమునకు అభిధావృత్తిచే ప్రవాహము అని అర్థము. కాని ప్రవాహమందు గొల్లపల్లె యుండ జాలదు. కావుననే గంగా శబ్దమునకు లక్షణావృత్తిచే గంగా తీరమనే అర్థమును వర్ణింతురు. ఇట్టి అర్థము క్షణికార్థమనబడును. తాత్పర్యానుప పత్తిగాని, అన్వయానుపపత్తిగాని యిట్టి లక్షణావృత్తిని ఆశ్రయించుటకు మూలము. "తత్త్వమసి" యను వాక్యము జీవేశ్వరుల అభేదమును చెప్పుచున్నది. కాని జీవేశ్వరులు పరిమిత, అపరిమిత శక్తులు గలవారలగుటచే ఈ వాక్యమందు కనబడు అభేదాన్వయము పొసగదు. కావున జీవేశ్వరులకు గల పరిమితాపరిమిత శక్తులను పరిత్యజించి "తత్" "త్వమ్"అను శబ్దములకు అర్థము శుద్ధచైతన్యమే అని వర్ణించు లక్షణావృత్తిని ఆశ్రయించుదురు.

"ప్రకృష్ణ ప్రకాశుడు చంద్రుడు" అనునపుడు ప్రకృష్ణ ప్రకాశము, చంద్రుడు అను రెండుపదార్థములులేవు. కావున అభేదమును బోధించు "ప్రకృష్ణ ప్రకాశుడు చంద్రుడు" అను సమాన విభక్తిగల పదములుండుటచే అభేదము బోధింపబడ గలదు. ప్రకృత సృష్టి వాక్యములందు అన్వయానుపపత్తియు, అభేద బోధయు కానరావు. కాగా సృష్టి వాక్యములు లక్షణావృత్తిచే అద్వితీయ సచ్చిదానంద రూపమును ఎట్లు గుర్తింపగలవని వాదుల సంశయము.

పరబ్రహ్మ తాత్పర్యమును నిర్ణయించుటకు ఆఱు ప్రమాణములు కలవు. అందు ఏదోనొక ప్రమాణముచే తాత్పర్యమును నిర్ణయింపనగును. అట్లు నిర్ణ యింప ప్రకృత సృష్టివాక్యములకు నిర్విశేష పరబ్రహ్మమే తాత్పర్యము కాగలదు. అవి:

"ఉపక్రమోప సంహారావభ్యా సోపూర్వతా ఫలమ్ ।
అర్థవాదోప పత్తీచ లింగం తాత్పర్యనిర్ణయే ॥"

ఉపక్రమోప సంహారములు, అభ్యాసము, అపూర్వతము, ఫలము, అర్థ వాదము, ఉపపత్తి అనునవి ఆఱు.

ప్రకృతమగు "యతోవా ఇమాని భూతాని జాయంతే" అను సృష్టి వాక్యము గల తైత్తిరీయము "బ్రహ్మ విదాప్నోతి పరమ్" యని ఉపక్రమించెను. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" యని ఉపసంహరించెను. "సయశ్చాయం పురుషేయశ్చాసా వాదిత్యేస ఏకః" ఈ పురుషుని యందును, ఆదిత్యుని యందును గల ఆత్మ యొక్కటేయని అభ్యసించెను. "యోవేద నిహితం గుహాయామ్" బుద్ధియను గుహయందున్న ఆత్మనెవ్వడెఱుంగుననునది అపూర్వత్వము. అనగా వేదాంత ములు ఉపదేశించుటకు పూర్వమీ ఆత్మ నెవ్వరు తెలియజాలరని భావము. "అభయం ప్రతిష్ఠాం విందతే" భయ రహితమయినది బ్రహ్మము. అట్టి బ్రహ్మ మందు బ్రహ్మవేత్త ప్రతిష్ఠ బొందునని ఫలము. "సో కామయత" హిరణ్యగర్భుడు కోరెననుట అర్థవాదము. అనగా భువన పాలకుడగు హిరణ్యగర్భుడు కోరెననిన ఈ బ్రహ్మ పదమంత ఉత్కృష్టమని భావము. "అసన్నేవసభవతి" బ్రహ్మము అసద్రూపమని తెలియునతడు అసద్రూపుడగును. అనగా సత్పురుషుడు కానేర దనునది ఉపపత్తి. ఈఆఱింటి యందు ఏ ప్రమాణమున్నను వేదాంతములకు నిర్విశేష పరబ్రహ్మమున తాత్పర్యము నిర్ణయింపనగును.

ఇట్లే చాందోగ్యమున "సదేవ సోమ్య ఇదమగ్రే ఆసీత్" అని నిర్విశేష బ్రహ్మము తోడ ఉపక్రమించి "ఐతదాత్మ్య మిదం సర్వం" అని ఈ సమస్త ప్రపంచము బ్రహ్మముకన్నా వేరుగాదు అని ఉపసంహరించెను. "తత్త్వమసి" ఆ పరబ్రహ్మనివి నీవే అని తొమ్మిది సార్లు అభ్యసించెను. "అత్ర వావ కిల

సన్సోమ్య్య నని బాలయ స్వేత్రైవకినేతి" ఆ తత్త్వమసి వాక్యము ప్రత్యక్షాది ప్రమాణములకు తెలియదని, గురూపదేశ బుద్ధికి మాత్రమే తెలియునని అపూర్వత్వమును, "ఆచార్యవాన్ పురుషోవేద" ఆత్మసాక్షాత్కారం పొందిన బ్రహ్మవేత్త బ్రహ్మమేయగునని ఫలము, "యేనా శ్రుతం శ్రుతం మవిజ్ఞానం విజ్ఞాతం భవత్య మతం మతం" ఆ పరబ్రహ్మ మును తెలుసుకొనుట చేత సమస్తము తెలియబడునో అని అర్థవాదమును, "వాచారంభణం వికారో నామధేయం మృత్తు కత్వేవ సత్యం" అని కారణవస్తువును ఎఱిం గినచో కార్యవస్తువు మిథ్య అని తెలియును. ఉపపత్తిని షడ్‌లింగముల ద్వారా తెలియజేసెను. పదములయందు లక్షణములేకున్నను వాక్యములందు లక్షణము గలదనియు, కావున సృష్టివాక్యములు ఏకమై నిర్విశేష బ్రహ్మమును బోధింప గలవనియు భావము.

అవ: సృష్టిని వెల్లడించు వేదాంతములు నిర్విశేష బ్రహ్మమును గుర్తింప జేయదలచినట్లయితే మాటిమాటికి సృష్టాదులను ఏల కీర్తింపవలయునను సంశయమును బాపుచున్నారు.

అద్వితీయ బ్రహ్మజ్ఞానము పరమ పురుషార్థ సాధనమని వేదాంతముల వలన తెలియుచున్నది. ప్రపంచము మిథ్యయని చెప్పినచో బ్రహ్మము అద్వితీయ మగును కాని ప్రపంచము సకల ప్రమాణములచే తెలియుచుండగా బ్రహ్మము అద్వితీయము కానేరదు. కావున ప్రపంచము యొక్క పుట్టుపూర్వోత్తరములను జూపి ప్రపంచము మిథ్యయని నిరూపింపదలచిన వేదాంతములు సృష్టి ప్రక్రియను చెప్పుచున్నవి. ప్రత్యక్షాది ప్రమాణములు బాహ్య ప్రపంచమంతయు సత్యమని చిరకాలమునుండి వెల్లడించుచున్నవి. అట్లు అనాది కాలము నుండి భేదభ్రమవృద్ధిచెంది స్థిరమయియుండగా, వేదాంతములు ఒక్కసారిగా అద్వితీయ బ్రహ్మమును బోధింపజాలవు. ఈసమస్త ప్రపంచము మిథ్యయని నిరూపించిన గాని బ్రహ్మము అద్వితీయమగును. కావున బ్రహ్మము అద్వితీయమని నిరూపిం చుటకు తొలుత ప్రపంచమంతయు మిథ్యయని నిరూపింపదలచి వేదాంతములు సృష్టి, స్థితిసంహార పక్రియను రచింపబూనినవి. కార్యములు ఉపాదానకారణము లందుండును. ఘటము కపాలమందును, పటము తంతువులందును నెలకొని

యుండుట లోకానుభవము. ఈబ్రహ్మాండమునకు బ్రహ్మము ఉపాదానకారణ మనిన, ఈప్రపంచము బ్రహ్మమునందే యుండవలయును. కనుక మిథ్యాభూత మని స్పష్టమగును. కావున సృష్టి, స్థితి, లయములను తెలుపు వేదాంతములకు సృష్టి, స్థితి, లయములను తెలుపు తాత్పర్యము లేదనియు, నిర్విశేషమగు అద్వితీయ బ్రహ్మమును వెల్లడించుటయందే తాత్పర్యమని భావము.

ముందుచెప్పిన తాత్పర్యము నిర్ణయించు ఉపక్రమాదులు బ్రహ్మవల్లియందును గాంచనగును. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" యని బ్రహ్మము సచ్చిదానంద రూపమని ఈ ఉపనిషత్తు మొదట చెప్పెను. సచ్చిదానంద రూపము కనుకనే సకల వాగతీతమనియు, మనోగోచరము కాదనియు ఉపసంహరించెను. ఇట్టి బ్రహ్మము పంచకోశముల మధ్యమందు నెలకొని యున్నదనియు విశదముచేసెను. ఇట్టి బ్రహ్మము లౌకిక ప్రమాణములచే తెలియరాదు. కేవల వైదేక గమ్యము. ఇట్టి బ్రహ్మమును తెలియునతడు పరమప్రాప్తి పొందునని మొదలిడుటచే ఈ ఉపనిషత్తునందు అద్వితీయ బ్రహ్మమును వెల్లడించు తాత్పర్యము స్పష్టమగు చున్నది. ఈ పరబ్రహ్మము రెండు తెగలగు ప్రపంచమును పుట్టించి, అందు ప్రవేశించి సర్వము నిండియుండెను. అందుకొన్ని వస్తువులు పామరుల దృష్టికి సత్యములనియు, మఱికొన్ని అసత్యములనియు గోచరించును. తాను స్వయ ముగ సత్యమయి యుండును. ఈవిధముగా చెప్పుచు ఈ ఉపనిషత్తు బ్రహ్మమ ద్వితీయమని స్పష్టముగ వెల్లడించెను.

"అథాతో బ్రహ్మ జిజ్ఞాసా" అని బ్రహ్మసూత్రములను సూత్రించిన పిమ్మట "జన్మాద్యస్యయతః జగజ్జన్మాది కారణత్వమును సూత్రీకరించుటచే సూత్రకారులకు జగజ్జన్మాది కారణమగు సగుణ బ్రహ్మమే తాత్పర్యమయి యుండునని కొందఱు మందమతులు తలచెదరు" కాని సూత్రకారులు మున్ముందు "మాత్ర వర్ణిక మేవచ గీయతే" అని సూత్రీకరించుటచే తొలుత తైత్తిరీయోపక్రమ మంత్రముచేచెప్పబడిన నిర్గుణ బ్రహ్మమే సూత్రకారులకును తాత్పర్యమనుట స్పష్టము. తైత్తిరీయోపక్రమ మంత్రము "బ్రహ్మ విదాప్నోతి పరమ్" అని నిర్గుణ బ్రహ్మమును ఉపక్రమించెను. కావున శ్రుతి సూత్రముల రెండింటికి నిర్గుణ బ్రహ్మమే తాత్పర్య విషయము.

బ్రహ్మమును తెలియు నతడు పరమ పదవి నొందునని "బ్రహ్మ విదాప్నోతి పరమ్" అను శ్రుతి వెల్లడించెను. పిమ్మట ఆ బ్రహ్మమును తెలియగోరు నతనికి బ్రహ్మము సద్రూపమనియు, చిద్రూపమనియు, అద్వితీయమనియు స్పష్టము చేసెను. తనకు నిజస్వరూపప్రాప్తియే బ్రహ్మము తెలియుటకు ఫలము. ప్రపంచము సత్యము కాజాలదని నిరూపించు పర్యంతము బ్రహ్మమద్వితీయమనుట పొసగదు. అందుచే ప్రపంచముయొక్క పుట్టుపూర్వోత్తరములను తెలుప నారం భించెను. ప్రపంచము యొక్క పుట్టుపూర్వోత్తరములను తెలిపి, మిథ్య అని నిరూ పించి బ్రహ్మము సద్రూపమనియు, అద్వితీయమనియు చెప్పవలయునే కాని, ప్రకారాంతమున ఇది పొసగజాలదు. కావున సృష్టి వాక్యములు ప్రపంచము యొక్క పుట్టుపూర్వోత్తములను తెలిపి, మిథ్యాత్వమును నిర్ణయించుటకే ఆరం భించెననవలయును కాని వేఱు మార్గాంతరములేదు. "బ్రహ్మ విదాప్నోతి పరమ్" అను ఉపక్రమోప సంహారాది తాత్పర్య నిర్ణాయకములగు ప్రమాణములచే వేదాంత ములకు అద్వితీయ బ్రహ్మమునందే తాత్పర్యమనుట స్పష్టము.

అవ: ఇట్లే ఋగ్వేదోపనిషత్తునకు సయితము అద్వితీయ బ్రహ్మము నందే తాత్పర్యమనుచున్నారు.

"ఆత్మావా ఇదమేక ఏ వాగ్రే ఆసీత్" ఈ కనబడు ప్రపంచమంతయు సృష్టికి పూర్వము ఆత్మరూపమై యుండెను. వేఱొండు వస్తువులేదు. అద్వితీయమగు బ్రహ్మముతోడ ఉపక్రమించుటచే అద్వితీయ బ్రహ్మమందు తాత్పర్యమనుట స్పష్టము. అట్టి బ్రహ్మము "సర్వ క్షత లోకాన్ను సృజా ఇతి" అని యీ జగము లనెట్లు పుట్టింపవలయునని ఆలోచించి సకల బ్రహ్మాండమును పుట్టించెను. అట్లు పుట్టించిన పిమ్మట "స ఇమాన్లో కాన సృజత" ఆ యాత్మ ఈ లోకములను సృజించెను. తొలుత సూక్ష్మభూతములను, పిమ్మట పంచ మహాభూతములను, ఆ పిమ్మట నీ దేహాంతము నుండు భౌతికములను పుట్టించెనని భావము. అంతట నీ శరీరమును జూచి "కథం న్విదం మదృతే స్యాత్" రాజులేని నగరమువలె "నేను" లేక యీ శరీరమెట్లుండ జాలునని తలంచి "స ఏ తమేవ సీమానం విదార్య ఏ తయా ద్వారా ప్రాపద్యత" అతడీ బ్రహ్మకపాలమును జీల్చి

తన్మూలమున తనువున ప్రవేశించెను. అట్లు ఈ తనువున ప్రవేశించి స్వప్నతుల్యములనదగు జాగ్రత, స్వప్న, సుషుప్తులను మూడవస్థలను చూచుచుండెను. కొంతకాలమునకు జన్మాంతర సుకృత వశమున గురువు వేదాంతములను ఉపదేశింపగా ఆ వేదాంత ములను విమర్శించుటచే తెలివొందెను. అనగా తాను నిజముగ శుద్ధ చిద్ఘనుడగు పరమాత్మయే కాని జాగ్రత స్వప్న సుషుప్తముల తిరుగు జీవుడను కానని మేల్కాం చెనని భావము.

"యాని శా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయ మీ
యస్యాం జాగ్రతి భూతాని సానిశా పశ్యతో మునేః"

సకల ప్రాణులు సాధారణముగ బ్రహ్మమును తెలియజాలక నిద్రించు చుండును. అట్టి బ్రహ్మమున యోగి మేల్కాంచి యుండుననియు, సకల ప్రాణులే ప్రపంచ విషయమున మేల్కాంచియుందురో, అట్టి ప్రపంచ విషయమున యోగి నిద్రించుననియు చెప్పుటచే వివేకుల దృష్టికి జాగ్రత స్వప్న సుషుప్తములు మూడును స్వప్నములనదగి యుండును. లోకము నందలి సమస్తానందములు ఆ బ్రహ్మరూపము కావున ఆ బ్రహ్మానంద ఘనమై యుండును. అట్టి ఆనంద ఘనమగు బ్రహ్మరూపుడైనను మోహవశమున తెలియనేరక యుండీ తనువున ప్రవేశించిన ఆత్మగురూపదేశమును బొంది మేల్కాంచెను. అట్లు తెలిసి మేల్కాం చుటచే అతనికి సమస్త కామములు తన తోడనే సిద్ధించియున్నవి. సమస్తము బ్రహ్మానందరూపమగుటచే తెలివినొంది సమస్తకామములు నశించగా అమృతుడై యుండెననెను. బ్రహ్మము జరామరణ శూన్యము కావున జ్ఞానియు అమృతుడై యుండును.

అవ: యజుర్వేదోపనిషత్తునకు సయితము అద్వితీయ బ్రహ్మము నందే తాత్పర్యమని చూపుచున్నారు.

భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశములలో మొదటి మూడింటిని మూర్తములనియు, చివరి రెండింటిని అమూర్తములనియు పేర్కొందురు. బృహదారణ్య కోపనిషత్తు మహాభూతములను పరబ్రహ్మమున ఇరుతెగలరూపమని

తొలుత కల్పించెను. పిమ్మట ఇది కాదనియు, ఇది కాదనియు ఆ కల్పించిన రూపములను నిశ్శేషముగ నిషేధించెను. కావున అద్వితీయ పరబ్రహ్మమే వేదాంతములకు తాత్పర్యమయి యుండుట స్పష్టమగుచున్నది. ఈసద్రూపమగు బ్రహ్మమును పామరులకు బోధింపదలచి వేదాంతము పరబ్రహ్మమునకు పై రూపములను కల్పించెను. అట్లు కాదేని యా కల్పిత రూపములను నిశ్శేషముగ నేల నిషేధించునని భావము. కావున ఈ ఉపనిషత్తునకు సైతము అద్వితీయ బ్రహ్మము నందే తాత్పర్యమనుట స్పష్టము.

అవ: సామవేదోపనిషత్తు సయితము అద్వితీయ బ్రహ్మమునందే సమన్వయము పొందగలదనుచున్నారు.

సామవేదోపనిషత్తు "సదేవ సోమ్య ఇదమగ్రే ఆసీత్" అని మొదలిడి యీ కనబడు సకల ప్రపంచము సృష్టికి పూర్వము కేవల సద్రూపమగు బ్రహ్మరూపమయి యుండెననియు, ఆ బ్రహ్మమును తెలియ ఈ బ్రహ్మాండమంతయు తెలియు ననియు ప్రతినజేసెను. ఒక్క మట్టిని విచారించిన మట్టినుండి తయారయినకుండ, మూకుడు మొదలగునవన్నియు మట్టికన్నా వేరుకాదని తెలియుట లోకాను భవము. ఆరుణి అను మహర్షి తన పుత్రుడగు శ్వేతకేతువును గురువు వద్దకు విద్యాభ్యాసమునకై పంపెను. అతడు పన్నెండేళ్ళు గురు శుశ్రూష జేసి వేద వేదాంగములను చదివి మరలివచ్చెను. వచ్చిన కుమారునకు విద్యాగర్వము కలదని కనిపెట్టి, తండ్రి అయినవాడు పుత్రుల గర్వాపహారము చేయనిచో తండ్రి కానేరడని తలంచి పుత్రుని పిలిచి "నాయనా! ఏ ఉపదేశము పొందితే ఇక పొందవలసినది లేదో, తెలియనివన్నియు తెలియునో అట్టి ఉపదేశమును గురువు ద్వారా పొందితివా?" అని అడిగెను. అంతట శ్వేతకేతువు అట్టి విషయమున్నదని తెలియనందులకు విచారపడి తండ్రిని తెలియజెప్పమని వేడుకొనెను. అట్టి పుత్రునకు ఏ పరబ్రహ్మము తెలిసిన సకలము తెలియునో ఆ తత్త్వమును ఉపదే శింపబూని మృత్పిండాది పలు నిదర్శనములను జూపెను. మట్టి నుండి పుట్టిన కుండ, మూకుడు, బాన, మున్నగునవి మట్టికన్నా వేరు కానట్లుగా, ఈ సకల బ్రహ్మాండము బ్రహ్మమునుండి

పుట్టినందున బ్రహ్మముకన్న అన్యము కాకయుం డును. ఈ బ్రహ్మాండమునకు మూలకారణము తెలియవలయునన్న బ్రహ్మమును తెలియవలెను. బ్రహ్మమును తెలిసినచో ఆ బ్రహ్మముతోడ అభిన్నమగు బ్రహ్మాండ మంతయు తెలియగలదు. ఈతత్త్వమును తెలియజెప్పుటకై శ్రుతియు ఈబ్రహ్మము సకల జగములను పుట్టించెనని చెప్పెను. "సదేవ సోమ్య ఇదమగ్రే ఆసీత్, ఏకమేవా ద్వితీయమ్" అనుచు ఏకత్వముతోడ ఉపక్రమించి, పై దృష్టాంతముతోడ వివరించుచు చెప్పిన సృష్టియంతయు ఏకత్వమును దృఢపఱుచుటకే యనుట స్పష్టము. మఱియు "తత్త్వమసి" నీవా బ్రహ్మరూపుడవై యున్నావనుచు తొమ్మిది మాఱులు ఉపదేశించుట అను అభ్యాసము సయితము ఏకత్వమునే వెల్లడింప గలదు.

ఈ సమస్త ప్రపంచము బ్రహ్మము వలన పుట్టెను. బ్రహ్మమునందే వృద్ధి బొంది పాలితమగుచున్నది. అవసానకాలమునందు ఆ బ్రహ్మమందే లయమగుచున్నది. ఈ ప్రపంచము బ్రహ్మముకన్న వేఱగు సద్వస్తువు కానేరదు. ఈ ప్రపంచమంతయు బ్రహ్మమునందు కల్పితము. కావున బ్రహ్మముకన్న వేఱగు ఈ ప్రపంచమంతయు మిథ్య. ఏయే వస్తువులు ఎందెందు కల్పితమో ఆయా వస్తువులు దానికన్నా వేఱుగా సద్వస్తువులు కానేరవు. సూర్యకిరణములు పడిన ఎడారి ప్రాంతమందు నీరు లేకపోయినను కనబడును. సూర్యకిరణముల కన్నా నీరు వేరుగా లేదు. ఇట్లే బ్రహ్మము నందు కల్పితమగు ఈ ప్రపంచము బ్రహ్మముకన్న వేఱుగాదు. కనుక బ్రహ్మమద్వితీయము. సృష్టిక్రమమును జూపు ఈ ప్రకరణమందు కార్యము కనబడుచున్నదనియు, అదియు కారణము లేక సంభవింపదనుచున్నారు. అన్న మనిన ఫృథివి. అట్టి పృథివిచే ఫృథివి మూలమగు నీటిని తెలియుము. నీటిచే నీటికి కారణమగు అగ్నిని తెలియుము. అగ్నిచే వాయువును, వాయువుచే ఆకాశమును, ఆకాశముచే సద్రూపమగు బ్రహ్మమును తెలియుము. ఈ సకల ప్రజయు ఆ సద్రూప బ్రహ్మము నుండే పుట్టి అందే యుందురని తెలుపుటకై సృష్టి క్రమమును వెల్లడించెననుట స్పష్టము.

అవ: అధర్వణ శాఖ యందు సృష్టి వాక్యములకు సయితము నిర్విశేష బ్రహ్మమందే తాత్పర్యమనుచున్నారు.

అధర్వణ వేదోపనిషత్తు బ్రహ్మమును సకల ధర్మవివర్జితమనియు, సూక్ష్మాతి

సూక్ష్మమనియు చెప్పెను. ధర్మములు గల వస్తువులు ఆ ధర్మములు నశింపగా క్రమక్రమముగా నశించును. బ్రహ్మమునకు ఏ ధర్మములు లేనందున నాశనము వాటిల్లదు. అట్టి అక్షరమగు బ్రహ్మము వలన సకల బ్రహ్మాండము పుట్టును. ఆ బ్రహ్మ మొక్కటియే సత్యము. బ్రహ్మాండమంతయు మిథ్య. సకల జగములకు అధిష్ఠానమగు బ్రహ్మమును విచారణజేసి, దానిని తెలియునతడు ఆ బ్రహ్మ స్వరూపుడైయున్నందున తెలియునంతనే ఆ బ్రహ్మరూపుడగుచున్నాడు. బ్రహ్మమీ బ్రహ్మాండమును పుట్టించి ఈ శరీరములందు తాను ప్రవేశించెననెను. ప్రవేశానంతరవము అధ్యానచే శరీరవములు తానని తలంచి సంసారబంధమునపడెను. తాను బ్రహ్మమని తెలియునంతనే బ్రహ్మమగును. కావున జీవునకు బ్రహ్మభావము నిత్యము పొందబడియున్నదని చెప్పుచున్నది. కావున ఈ ఉపనిషత్తునకు అద్వితీయ బ్రహ్మమునందే తాత్పర్యమనుట స్పష్టము.

అవ: మాండూక్య శ్రుతి తాత్పర్యమును చెప్పుచున్నారు.

ప్రపంచము భూత, భవిష్యద్, వర్తమాన కాలభేదముచే మూడు విధము లగును. అట్టి ప్రపంచమును, ఆ ప్రపంచమునకు కారణమగు బ్రహ్మమును ప్రణవ స్వరూపమని మండ్యూకశ్రుతి వెల్లడించెను. ఓంకారమున అకార, ఉకార, మకారములను అంశములుగ విభజించి, జాగ్రత, స్వప్న, సుషుప్తుల యందుండు జీవుని వాచ్యవాచక భేదములను తొలగించి క్రమముగా ఓంకార పాదములతో లయము గావించెను. పిమ్మట ద్వైత లక్షణము లేనట్టియు, నాలోదయినట్టియు, రెండవ వస్తువు లేనట్టియు, ఆత్మస్వరూపమును అథర్వణోపనిషత్తు చెప్పెను.

అవ: తటస్థ లక్షణము యొక్క ఫలమును చెప్పుచున్నారు.

వేదాంతములందును, ఉపక్రమోప సంహారాదులను పరిశీలించి అద్వితీయ బ్రహ్మమందు సృష్టివాక్యముల తాత్పర్యమును నిర్ణయించవలెను. ఇందులకు పూర్వాచార్యులు చెప్పిన యుక్తులు వేదాంతములు తోడు కాగలవు. జగత్కారణ త్వము ఏది చెప్పబడినదోయని మొదలిడి చెప్పిన తటస్థలక్షణ స్వరూపమిదియే. బ్రహ్మము సద్రూపమనియు, దేశకాల వస్తుపరిచ్ఛేదములేవియు ఆ బ్రహ్మమునకు

లేవని నిరూపణ చేయుటయే తటస్థ లక్షణముల యొక్క ఫలము.

అవ: స్వరూప లక్షణమును చెప్పుచున్నారు.

సచ్చిదానందరూపమే బ్రహ్మమునకు స్వరూపలక్షణము. బ్రహ్మము ఆనంద రూపముగాకున్నను, అట్టి ఆనందము తెలియకున్నను, ఆయానందము సత్యము గాకున్నను పురుషార్థము గానేరదు. కావున బ్రహ్మము సచ్చిదానంద రూపమని, ఏకరసమని వేదాంతములు వెల్లడించినవి. సత్, చిత్, ఆనందము లను మూడంశములుండగా బ్రహ్మము ఏకరసమెట్లు కాగలదను సంశయము చెందనక్కరలేదు. బ్రహ్మము అసద్రూపము కాదనియు చెప్పుటకు సత్‌పదమును, జడము కాదనియు చెప్పుటకు చిత్‌పదమును, దుఃఖరూపము కాదనియు చెప్పు టకు ఆనందస్వరూపమను పదములు అవసరములాయెను. ఈ పదములు బ్రహ్మము అనృతము కాదనియు, తెలియనిది కాదనియు, దుఃఖరూపము కాదనియు తెలుపును కాని బ్రహ్మము ఏకరసమనుటను భగ్నము చేయజాలవు. కావున బ్రహ్మమందు సత్, చిత్, ఆనందము మున్నగు ధర్మములు లేవు. అందుచే బ్రహ్మము సచ్చిదానంద రూపము, ఏకరసము.

లోకమునందు ఏఏ వస్తువులకు ఆయా శబ్దములందు ప్రవృత్తించుటకు నిమిత్తములు అనేక విధములు. ఘటమందు ఘటత్వమను ధర్మముండును. కావున ఘటమనబడును. ఇట్లే పటమందు పటత్వమను ధర్మముండును. కావున పటమనబడును. ఇట్లే సత్త్వము, ఆనందము మున్నగు ధర్మములుగల వస్తువులు ఆయాశబ్దములచే చెప్పబడుననియు, కావున బ్రహ్మమునందీ ధర్మములు అనివార్య ములనియు కొందరనవచ్చును. కాని ఆయా ధర్మములుగల వస్తువులు ఆయా శబ్దములచే చెప్పబడునట్లుగా, ఆయా స్వరూపములగు వస్తువులు ఆయా శబ్దము లచే చెప్పబడగలవు. కావున బ్రహ్మమందు సత్యత్వాదులు లేకున్నను, బ్రహ్మము సద్రూపమగుటచేతను, ఆనందరూపమగుటచేతను సచ్చిదానంద శబ్దములచే చెప్పబడియున్నదని భావము.

బ్రహ్మము అతిసూక్ష్మము. ఈప్రపంచము నందలి వస్తువులకు కారణమును తెలుసుకొనగోరి పూర్వాపూర్వపు కారణములను వెదకుచూబోయిన యెడల చివరకు బ్రహ్మముపైన వేఱొండు కారణములేనందున సర్వకారణములు బ్రహ్మమునందే కారణత్వము విశ్రాంతి నొందునట్లుగా, సూక్ష్మాతి సూక్ష్మమును చూడబోయిన బ్రహ్మమున కన్న సూక్ష్మములేనందున సూక్ష్మత్వమును బ్రహ్మము నందే విశ్రాంతము కాగలదు. అట్లు పరమకారణమును, పరమసూక్ష్మము కావున బ్రహ్మము సత్యము. బాలురు ఆకాశమునందు నీలిరంగును ఆరోపింతురు. అట్లే పరబ్రహ్మమందు సకల ప్రపంచమును ఆరోపింతురు. ఆరోపితమగు నీలి రంగు, సకల జగములు ఆధేయములనబడును. ఆకాశము, బ్రహ్మము ఆధార మనబడును. ఆధేయమగు నీలిరంగు అసత్యమగుటయు, ఆధారమగు ఆకాశము మాత్రము సత్యమగుటయు మనకు తెలియును. ఇట్లే సకల ఆధారము కావున పరబ్రహ్మము మాత్రమే సత్యము. సకల వస్తువులందు సద్రూపమయి యున్నం దున పరబ్రహ్మమే సత్యము. ఈ పరబ్రహ్మము ఒకదాని యందు ఆధేయమయి యుండదు. అట్లు ఆధేయమయి యారోపితమగునేని, మిథ్య కాగలదు. ఆధేయము కానందున సత్యము. పరబ్రహ్మము సకలమును భాసింపచేయును కావునసత్యము. నిషేధింపబడిన వస్తువులకు పరబ్రహ్మము పరమావధి కావున సత్యము. బ్రహ్మము నిస్సంగము. నిస్సంగమగు బ్రహ్మము సత్యమనుట యందు ఏ విధమగు విరోధములేనందున బ్రహ్మము సత్యము. బ్రహ్మము సర్వవ్యాపకము, సర్వవస్తువులకు స్వరూపము, సకలమునకు సాక్షి కావున సత్యము. ఈ పరబ్రహ్మ మున కన్న వేఱొక ద్రష్టయు, శ్రోతయు, మంత్రయులేడు. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" యని సకల వేదాంతములు బ్రహ్మము సత్యమని చెప్పుటచేతను, బ్రహ్మ వేత్తలు ఆ పరబ్రహ్మము సత్యమని స్వానుభవమున తెలియుటచేతను బ్రహ్మము సత్యము.

బ్రహ్మము జ్ఞానరూపము. సకలమునకు స్వరూపము "ఆత్మ" అనుటచే బ్రహ్మము సర్వజ్ఞము. ఈ బ్రహ్మము "ఈక్షితృ" అనగా చూచెడివాడని చెప్పుట వలనను, సమస్తమును వశము చేసుకొని యుండుటచేతను బ్రహ్మము సర్వజ్ఞ మనుట సిద్ధమగుచున్నది. బ్రహ్మము వేదములను రచియించెను. ఆ వేదములే

బ్రహ్మమును తెలుపగలవు. ఇంతియేగాక బ్రహ్మమునకు ప్రపంచములను పుట్టింపవలెనని కోరిక గలదనియు, సృజియింపగోరి ఆలోచించెననియు చెప్పుటచే బ్రహ్మము సర్వజ్ఞమని తెలియుచున్నది. వెలుగొందు సూర్యచంద్రాదు లకు వెలుగునిచ్చువాడును, ఇతరాపేక్ష ఇసుమంతలేని అపరోక్ష స్వరూపుడనుట వలనను, పుణ్యపాపములకు సాక్షియగుటవలనను బ్రహ్మము సర్వజ్ఞమనుట స్పష్టమగుచున్నది. బ్రహ్మము సర్వజ్ఞమని సకల వేదాంతములు చెప్పుటచే బ్రహ్మము చిత్స్వభావము కాగలదు కాని వేఱొండు స్వభావముకలది కానేరదు. కావున సద్రూపమగు బ్రహ్మము సర్వజ్ఞము, జ్ఞానస్వభావము గలది.

బ్రహ్మానందమే పరమానందము. తైత్తిరీయము మనుష్యానందము మొదలిడి బ్రహ్మానంద పర్యంతముగల ఆనందములను వివరించెను. లోకమున గల ఆనం దములన్నియు గణతుల్యములనియు, ఈ బ్రహ్మానందమే ఆనంద కణములకు సముద్ర వంటిదనియు వెల్లడించెను. ముక్తులగు జీవులు బ్రహ్మమును చేరెద రనియు వేదములు వెల్లడించుచున్నవి. బ్రహ్మము ఆనందరూపము కనుకనే ముముక్షువులు దానిని చేరగోరుదురు. "యో వై భూమా తత్సుఖం యదల్పం తన్మర్త్యమ్" అని వేదాంతములు ఆ పరబ్రహ్మమును పరిమితిలేని పరమానంద రూపమనుచున్నవి. సకల ప్రాణులకు తన స్వరూపమందు ప్రేమాస్పదమయి యుండును. బ్రహ్మము సకల ప్రాణులకు ప్రత్యగాత్మ స్వరూపము కావున ప్రేమా స్పదమయి యుండును. భూగర్భమందలి నిధికిపైన మనుజులు సంచరించు చున్నను భూగర్భమందుగల నిధిని తెలియజాలరు. ఇట్లే జీవులు నిత్యము సుషుప్తి యందు బ్రహ్మముతోడ ఐక్యమును పొందియు బ్రహ్మమును తెలియజాల కున్నారు. తిరిగి తిరిగి వేసారి సంజవేళలందు గూటికి చేరు పక్షుల మాదిరి, జాగ్రత స్వప్నములందు తిరిగి తిరిగి విసిగి వేసారిన సకలజీవులు సుషుప్తియందు బ్రహ్మమును చేరుదురు. కామినీ సంగతుడగు కాముకుడు బాహ్యాంభ్యంతరములు ఏ మాత్రము తెలియనిరీతి జీవులు ఆ బ్రహ్మమునుచేరి పరమానంద భరితులయి యుందురు. మఱియు బ్రహ్మము రసరూపమనియు వేదాంతములు వెల్లడించుట

వలన సద్రూపము చిద్రూపమునగు బ్రహ్మము ఆనందరూపము.

అవ: బ్రహ్మమునకు చెప్పిన సచ్చిదానంద లక్షణమును జీవాత్మయందు చూపుచున్నారు.

ప్రత్యగాత్మ రూపుడగు జీవుడు బ్రహ్మమువలె నిరాధారుడు, నిర్వికారుడు, సచ్చిదానంద స్వరూపుడు. జీవునకు లోకమునందలి వస్తువులు తనకు ఆనంద దాయకములగుటచే ప్రియములు. ధనపుత్ర భార్యాదులందలి ప్రేమ యందు ఈ విధమగు తన సంబంధముచే ప్రేమాస్పదత్వము కనబడుచున్నందున తన యందలి ప్రేమ ముఖ్యమనుట స్పష్టము కాగలదు. ఇతర వస్తువులు తనకు ఆనందదాయకములగుట వలన ప్రియములనినచో తనకు తాను ప్రియమనుట వేఱుగ చెప్పనేల? మఱియు ఉపాధుల భేదముచే వస్తువులకు భేదము సిద్ధింప జాలదు. ఆ పరబ్రహ్మము ఈ సకలమును పుట్టించి, ఈ శరీరమున తాను ప్రవేశించి జీవుడనబడెనని చెప్పుచుంటిరి. బ్రహ్మము ఆనందరూపమని చెప్పు చుంటిరి. కావున పరబ్రహ్మరూపుడగు జీవుడు కూడా ఆనంద రూపుడనుట స్పష్టము. తనువున ప్రవేశించిన బ్రహ్మ చైతన్యమునకు శరీరోపాధి సంబంధ మున్నను, వస్తు స్వభావము మార్పు చెందదు. జీవుడు పరబ్రహ్మమునకు అంశీ అంశ స్వరూపుడగుట చేతను, దేహేంద్రియాదులను భాసింపచేయుచు తాను స్వప్రకాశుడై యుండుటచేతను జీవుడు సయితము సచ్చిదానంద రూపుడనుట యుక్తియుక్తము. సమస్తమును నెఱుంగు స్వభావముగలజీవునకు బాధమొదలగు వికారములు లేకపోవుటచేతను, ప్రేమకు ఆస్పదమగుట వలనను జీవుడు పరమా నంద స్వరూపమనుటయు స్పష్టము.

స్వప్నద్రష్టయగు జీవుడు స్వప్న పదార్థములను జూచును. జాగ్రత కాలమున అవి బాధింపబడుటయు కనుగొనును. ఈ స్వప్న పదార్థములకును, వాని బాధకును తాను ద్రష్టగా యుండి తన నాశనమును తానెట్లు కనుగొనును? స్వప్న పదార్థములు నశించు జాగ్రత దశయందు తాను నశింపకుండుటయు మనకు తెలియును. మఱియు స్వప్న పదార్థములు కాని, వాని బాధకు కాని వేఱొక ద్రష్ట కలడనుటకు ప్రమాణములేదు. వేఱొక ద్రష్ట కలడన్నను ఇరువురూ

దృక్ స్వరూపులయి యుండగా, ఒకరినొకరు కనుగొనుటయు సంభవింపదు. తుల్య స్వభావములగు రెండు వస్తువులెన్నడు పరస్పర ఉపకారోపకారక భావమును పొందజాలవు. ఇంతియేగాక ప్రత్యగాత్మ నిర్వికారుడు, పరిమితి లేనివాడు కావున ప్రత్యగాత్మయగు జీవుడు పరమాత్మవలె సద్రూపుడు.

జ్ఞానము ప్రకాశరూపము. జీవుడు ప్రకాశరూపమగు జ్ఞానస్వరూపుడు. భిన్నభిన్నములగు బాల్య, యవ్వన, కౌమార, వార్ధక్య దశలు మారుచున్నను, ఆ అవస్థలయందుండు జీవుడు మాత్రము అన్ని అవస్థలలోను “నేను, నేను” యని ఏకరూపుడై భాసించుచున్నాడు. స్వప్నావస్థయందు సకలేంద్రియములు లయమయి యున్నను, నిజమగు ప్రకాశముచే స్వప్న పదార్థములను జాగ్రత కాలములో జాగ్రత పదార్థములవలె ప్రత్యక్షముగ చూచుచున్నాడు. సుషుప్తావస్థ యందు అహంకారము విలయము పొందును. కాని తాను సుషుప్తానందమున కును, సుషుప్తియందు గల అజ్ఞానమునకును సాక్షిభూతుడై యున్నాడు. ద్రష్ట యొక్క దృష్టికెన్నడు లోపము లేదనుచు, జీవుడు నిత్యచైతన్య రూపుడనియు శ్రుతి చాటుచున్నది. కావున జీవుడు జ్ఞానరూపుడు.

జీవుడు ఆనందస్వరూపుడు. ఇష్టవస్తువులు కావలయుననే కోరికయు, అనిష్ట వస్తువులను పరిత్యజింపవలయునను కోరికయు సర్వులకు సహజమే. లోకులు సమస్తవస్తువులను తమకు ప్రియములుగా భావింతురు. కాని వేదము అట్టి ప్రియమగు వస్తువులు సయితము తమ వినియోగముచే మిమ్ములను దుఃఖపెట్టగలవనుచున్నది. వియోగముగాని, నాశనముగాని లేక శాశ్వతానంద మునుగాని సమకూర్చునది ఆత్మ వస్తువొక్కటే. జీవుడు తానెన్నడు మరణింప రాదనియు, శాశ్వతముగ ఇట్లే యుండవలయుననియు కోరుచుందురు. ఈ కోరికను చూడగా జీవుడు సుఖస్వరూపుడని తెలియుచున్నది. జీవుడు ప్రతీ దినము సుషుప్తావస్థ యందు పరమాత్మతో ఐక్యము చెందుచున్నాడుయని వేదము చాటుచున్నది. అక్కడ వస్తువులు, విషయములు లేకున్నా నేను ఆనందముగా యున్నాను అని నిద్ర నుండి లేచాక ఆ ఆనందాన్ని వ్యక్తపరచుచున్నాడు. కావున ఆనంద స్వరూపుడు. జీవాత్మ, పరమాత్మలు ఇరువురు ఏకస్వరూపులు కనుకనే,

వేదము వీరిరువురకు చూపు ఈ అబేధము సంభవింపగలదు. కావున జీవుడు ఆనంద స్వరూపుడు.

అవ: "తత్త్వమసి" యను వాక్యమునందు గల అర్థమును చెప్పుచున్నారు.

శ్రుతులచేతను, గురూపదేశముచేతను, యుక్తియుక్తులచేతను, స్వానుభవము చేతను ఆత్మతత్త్వము విమర్శింపవలయును. ఇట్లు నిరంతరము విమర్శించగా ఏకస్వభావముగల జీవేశ్వరుల తత్త్వము చక్కగా తెలియగలదు. "తత్త్వమసి" మొదలగు మహావాక్యములందు గల ఉపక్రమోప సంహారములను పరిశీలించిన ఆ మహావాక్యములకు జీవేశ్వరుల అబేధము నిరాటంకముగా చెప్పినవని తెలి యును. "సదేవ సోమ్య ఇద మగ్రే ఆసీత్" అను శ్రుతి సృష్టికి పూర్వము ఈ ప్రపంచమంతయు సద్రూపమగు బ్రహ్మమయి యున్నది యని స్పష్టము చేసి, పిమ్మట "తదైక్షత" అని మొదలిడి, అసద్రూపమగు బ్రహ్మము అగ్న్యాది భూత ములను పుట్టించెననియు, పిమ్మట ఆ సృజించిన వానియందు తాను ప్రవేశించెననియు వెల్లడించెను. అట్లు ప్రవేశించిన సద్రూప బ్రహ్మమే జీవుడనబడునని వక్కాణించి "ఐతదాత్మ్య మిదం సర్వమ్" అను శ్రుతులచే ఈసమస్తమగు నామ రూపాత్మక ప్రపంచమునసత్యము కాదనియు, మిథ్యామాత్రమనియు నిరూపించెను. అట్టి సద్రూప బ్రహ్మమే "తత్త్వమసి" వాక్యమందలి తత్ శబ్దమునకు అర్థము. జీవుడు "త్వం" అను శబ్దమునకు అర్థము. "అసి" అను పదము వర్తమాన కాలమును బోధించును. సద్రూపమగు పరబ్రహ్మమే నీవైయున్నావని వాక్యార్థము.

నామ పదార్థములను రెండింటిని సమాన విభక్తితో తెలుపుట సామానాధికరణ్యమనబడును. ఇట్టి సామానాధికరణ్యము బాధయందలి సామానాధికరణ్యమనియు, అధ్యాసయందలి సామానాధికరణ్యమనియు, విశేషణ విశేష్యభావ మందు సామానాధికరణ్యమనియు, ఐక్యమున సామానాధికరణ్యమనియు నాలుగు తెగలు. "తత్త్వమసి" వాక్యమున నీవా బ్రహ్మమనుటచే సామానాధికరణ్యము కనబడుచున్నది. ఈ సామానాధికరణ్యము బాధయందలి సామానాధికరణ్యము కానేరదు. అట్లేని జీవుడుగాని, బ్రహ్మముగాని బాధింపబడుననుట

అద్వైత-2
54

స్పష్టము. జీవుడు బాధితుడు కానంత మోక్షమును గోరుజీవుడు లేకపోవుట వలనను, బ్రహ్మము బాధితము కానంత పొందదగిన బ్రహ్మము లేకపోవుట వలనను, మోక్షము సంభవము కానేరదు. మోక్షమును జూపిన వేదాంతములు వ్యర్థములు కాగలవు. కావున ఈ సామానాధికరణ్యము బాధ యందలి సామానాధికరణ్యము కాజాలదు. "తత్త్వమసి" వాక్యమునకు చుట్టుప్రక్కల ధ్యానోపాసనాదులేవియు కానరావు. మఱియు ధ్యానోపాసనాదులను కల్పించినను అనిత్యములగు స్వర్గాదులేవానికి ఫలములగును. కాని నిత్యమగు మోక్షము ధ్యానోపాసనాదుల ఫలము కానేరదు. కాగా "తత్, త్వం" పదములందరి సామానాధికరణ్యము అధ్యాస యందలి సామానాధికరణ్యమనుటయు పొసగదు. తత్ శబ్దార్థమగు బ్రహ్మము సర్వజ్ఞుడు. త్వం శబ్దార్థమగు జీవుడు అల్పజ్ఞుడు. విరుద్ధ స్వభావములు గల వీరిరువురకు తాదాత్మ్యము కుదరదు. కావున విశేషణ విశేష్య భావ మందలి సామానాధికరణ్య మనుటయు తగదు. కావున "తత్, త్వం" పదార్థములందు కనబడు ఈసామానాధికరణ్యము జీవేశ్వరులకు గల ఐక్యమునందే సంభవింపగలదు. కావున తత్, త్వం పదార్థములగు జీవేశ్వరులకు అబేధమే కలదు కాని బేధము సంభవింపదు.

అవ: లక్షణావృత్తిచే "తత్త్వమసి" వాక్యార్థవర్ణన ప్రకారమునే నిరూపించుచున్నారు.

విరుద్ధ ధర్మములు కల రెండు వస్తువులకు ఐక్యమెన్నడు సంభవింపదు. తత్ పదవాచ్యార్థమగు సర్వజ్ఞ చైతన్యమునకు, త్వం పదవాచ్యార్థమగు అల్పజ్ఞ చైతన్యమునకు పరస్పర విరోధముండుట వలన ఐక్యము పొసగజాలదు. అన్వయము కుదరనిచోట లక్షణావృత్తిచే అర్థము చెప్పుట కలదు. కాని తత్త్వమసి వాక్యమునందలి తత్ శబ్దమునకు జీవ విశిష్ట బ్రహ్మ పదార్థమందు గాని, త్వం శబ్దమునకు బ్రహ్మ విశిష్ట జీవపదార్థమందు గాని లక్షణావృత్తిని ఆశ్రయింపవలను పడదు. ఏలనగా విశిష్ట పదార్థములందు లక్షణమును చెప్పుట మోక్షోపయోగి కానేరదు మఱియు ఉపక్రమోప సంహారములును పొసగజాలవు.

"గంగయందు గొల్లపల్లె కలదు" అనునపుడు గొల్లపల్లె గంగయందున్నచో

ప్రవాహమందు కొట్టుకొనిపోవును. కాని ఈ వ్యవహారమునకు గంగా తీరమున గొల్లపల్లె కలదను అర్థమును కల్పింతురు. గంగా సంబంధము గల తీరమొకటి కలదు. కావున తీరమునందు గంగా పదమునకు వృత్తిని కల్పించిరి. మహా వాక్యమునందు తత్, త్వం పదముల అర్థమగు సర్వజ్ఞ, అల్పజ్ఞ చైతన్యముల కన్న మఱియొక వస్తువు కానరాదు. కావున తత్, త్వం పదముల రెండింటిలోను ఏదో ఒక దాని యందు భాగ త్యాగలక్షణమును చెప్పరాదు. అట్టి భాగ త్యాగ లక్షణము తత్, త్వం పదములలో ఏ పదమునకు చెప్పవలయునను సంశయ నివారకమగు కారణములేదు. నిరూపించుటయు శక్యము కాదు.

తత్, త్వం పదములకు సర్వజ్ఞ కించిద్జ్ఞ చైతన్యములు అర్థము. ఇవి రెండును విరుద్ధ ధర్మములు గలవి. కావున వానికి అభేదాన్వయము కుదరకపోవుట స్పష్టము. లక్షణావృత్తిచే "తత్త్వమసి" పదముల అర్థమును బోధింపవలెననిన "గంగయందు గొల్లపల్లెకలదు" అని చెప్పునప్పుడు గంగా పదార్థము, గొల్లపల్లె పదార్థమున కన్నను మూడవదైన తీరమును వాచ్యార్థముతో అన్వయించినగాని పదార్థాంతరము కానేరదు. తత్త్వమసి వాక్యమునందట్టి మూడవ వస్తువు లేదు. "యష్టీః ప్రవేశయ" అను వాక్యమునందు యష్టులను ప్రవేశపెట్టుమనగా, యష్టి శబ్దమునకు విశిష్ట పురుషుని యందు లక్షణావృత్తిని ఆశ్రయింతుము. అట్లు ఒక పదార్థ విశిష్టమును మఱియొక పదార్థమందు లక్షణావృత్తిని ఆశ్రయించుట నిరుపయోగము, ఉపక్రమాది విరుద్ధము. భాగత్యాగ లక్షణావృత్తిచే తత్, త్వం పదములు రెండింటిలో ఏదో ఒక పదమున లక్షణమును చెప్పెదమనిన, ఏ పదమునందు చెప్పవలయునను నియామకములేదు. ఏదో ఒక నియామకమును జూపుటకు ప్రయత్నింపగా అదియు పొసగనేరదు.

తత్ పదమునకు గౌణవృత్తిచే సర్వజ్ఞ బ్రహ్మ సదృశమను అర్థమును చెప్పి, జీవుడు బ్రహ్మసదృశుడని నిర్ణయింపవలను పడదు. ఏలనగా జీవునకు బ్రహ్మ సదృశ్యమని చెప్పదగిన మఱియొక రూపము కలదనుటకు తగిన ప్రమాణము లేదు. ముక్త దశయందు జీవునకు అట్టి రూపము సంభవింపగలదన్నను, ఆ రూపము వర్తమాన కాలము నందు లేనందున వర్తమాన కాలమును తెలుపు

అసిపదము కుదురజాలదు. ఇంతియే గాక జీవుడు వర్తమాన కాలమున బ్రహ్మ రూపుడై యున్నాడని 'అసి' పదముచే తెలియుచుండగా, ఆ తెలిసిన అర్థమును గ్రహింపకుండా, తెలియని మఱియొక అర్థమును గ్రహించుట యను రెండు విరుద్ధములు సంభవింపగలవు. ప్రమాణ సిద్ధమైన నిజరూపమును తెలియపరచు అర్థమును పరిత్యాగముచేయుటవలన శ్రుతులకు హానిసంభవించును. వినబడని అర్థము యొక్క కల్పనవలన అశ్రుతగతి సంభవించును. కావున తత్, త్వం పదములకు గతి సంభవించును. కావున తత్, త్వం పదములకు భాగ త్యాగ లక్షణమును అంగీకరింపవలయును. భాగత్యాగమనిన ఒక భాగమును పరిత్య జించుట. తత్ పదమునకు సర్వజ్ఞ చైతన్యము వాచ్యార్థము. త్వం పదమునకు కించిద్జ్ఞ చైతన్యము వాచ్యార్థము. ఇట్టి విరుద్ధ ధర్మములు గల రెండు వస్తువులకు అభేదము పొసగదు. కావున విరుద్ధములగు సర్వజ్ఞత్వ, అల్పజ్ఞత్వములను పరిత్యజించి అర్థమును వర్ణింపవలయును. అట్టి పరిత్యాగము భాగత్యాగమన బడును. తత్, త్వం పదముల రెండింటికి విశిష్టమగు చైతన్యమే అర్థము. కావున చైతన్యమునకు చైతన్యముతోడనే అభేదము సంభవించును.

వాచ్యార్థమును గ్రహించుట ముఖ్యమనియు, లక్ష్యార్థమును గ్రహించుట అముఖ్యమనియు లోకమున ప్రసిద్ధి. కావున లక్ష్యార్థము చెప్పదగదని వాదులం దురు కాని "సదేవో సోమ్య ఇదమగ్రే ఆసీత్, ఏకమేవా ద్వితీయమ్" అనుచు ఏకత్వముతోడ ఆరంభించుటయు, ఏకవిజ్ఞానముచే సర్వము తెలియునని ప్రతిజ్ఞ చేయుట చేతను అద్వితీయ ఆత్మతత్త్వమును వేదాంతము బోధించుచున్నదని స్పష్టముగా తెలియుచున్నది. అభేదమును పొసగించుటకై లక్షణావృత్తిని ఆశ్రయించినను వాక్యార్థము ముఖ్యమే యగును కాని అముఖ్యము కానేరదు. గౌణవృత్తి మొదలగు వానిచే వాక్యార్థమును వర్ణింప అవకాశము లేదు.

పూర్వమొకప్పుడు దేవదత్తుడను పురుషుని మనము చూచియున్నాము. కొంత కాలమునకు అతడు మరల మనకు కనబడునపుడు అతడే దేవదత్తుడే నని గుర్తింతుము. అప్పటి దేవదత్తునకు, నిన్నటి దేవదత్తునకు దేశకాల

కృతమగు భేదము కలదు. అయినను దేవదత్తు డొక్కడే కావున దేశము, కాలము వలన కలిగిన భేదములను విడిచి "సోయం దేవదత్తః" అతడే ఈ దేవదత్తుడను వాక్యమున దేవదత్తుడనే వ్యక్తిని మాత్రమే గ్రహించుచున్నాము. దేవదత్తుడొక్కడే అను నిశ్చయ తత్త్వముచే ప్రతిబంధింపజేయు దేశకాల కృతభేదములను గ్రహింపక పరిత్యజించుచున్నాము. అట్లే తత్త్వమసి వాక్యమందు తత్, త్వం పదార్థములకు గల అభేదమును నిరోధింపజేయు సర్వజ్ఞత్వ, అల్పజ్ఞత్వాది ధర్మములను పరిత్యజించి, దేహేంద్రియ మనోబుద్ధులకు సాక్షిభూతమగు జీవ చైతన్యము త్వం శబ్దార్థమనియు, పరిమితిలేని బ్రహ్మచైతన్యము తత్ శబ్దార్థ మనియు లక్షణావృత్తిచే గ్రహింపనగును. ఇట్లు లక్షితమగు చైతన్యము అఖండము. కావున తత్త్వమసి వాక్యమునకు అఖండ చైతన్యమే అర్థము.

అవ: తత్, త్వం పదములకు శుద్ధచైతన్యమే అర్థమని అర్థము కానంత ఆ రెండింటి యందు ఒక్క పదము వ్యర్థము కాగలదను సంశయమును బాపు చున్నారు.

తత్పద లక్ష్యార్థము పరబ్రహ్మమనియు, త్వంపద లక్ష్యార్థము జీవుడనియు చెప్పుదురు. అప్పుడు జీవుని బోధించు త్వం పదము లేకున్న పరబ్రహ్మము పరోక్షమనియు, వాస్తవము కాదనియు రెండు సంశయములు మనకు తోచ వచ్చును. త్వం పదమున్న యెడల జీవుడు అపరోక్ష స్వరూపుడగుటచేతను, నిత్యప్రాప్తుడగుట చేతను పై సందేహములు వైదొలగగలవు. ఇట్లే త్వం పదము మాత్రముండునంత జీవుడు పూర్ణుడుగాడనియు, దుఃఖములకు ఆటపట్టనియు మఱి రెండు సందేహములు కలుగవచ్చును. పరబ్రహ్మమును గుర్తింపజేయు తత్ పదమున్న యెడల పరబ్రహ్మము పూర్ణమగుటచేతను పై సంశయములు వీడిపోవును. ఈ విధముగా జీవునకు వాస్తవరూపమయినట్టియు, అలౌకికమయి నట్టియు ఆత్మతత్త్వమును బోధించుటకు తత్, త్వం పదముల రెండింటికి పరస్పరాపేక్ష కలదు. కావున ఈ రెండింటి యందు ఏ ఒక్క పదము వ్యర్థము కాజాలదు. మఱియొక పదార్థముతోడ సంబంధము లేని సత్యమగు పదార్థమును బోధించుట అఖండార్థమనబడును. లేదా జాతిగుణాది

సంబంధము లేని ప్రాతి పదికార్థమును మాత్రము బోధించుటయు అఖండార్థమనబడును. తేజో మండ లమున గలవానిలో 'చంద్రుడెవరు' అని ప్రశ్నించిన వారితో "ప్రకృష్ణ ప్రకాశుడు చంద్రుడు" అని సమాధానము చెప్పెదము. చంద్ర స్వరూపమును మాత్రము తెలియగోరునతనికి చంద్రస్వరూపమును మాత్రమే చెప్పిన అడిగిన ప్రశ్నకు తగిన సమాధానమయి యుండెను. అట్లుగాక తెలియగోరిన దానికి మించిన సమాధానము చెబితే ప్రశ్న, ప్రతివచనములు అసంగతములు కాగలవు. చంద్రుడెవరు అని ప్రశ్నించునతడు చంద్ర స్వరూపమును మాత్రమే తెలియగోరి ప్రశ్నించెను. చెప్పునతడు చంద్రస్వరూపమును మాత్రమే చెప్పజూచునుగాని తెలియగోరని అంశములను తెలుప ప్రయత్నించడు. అట్లు తెలుపుటయు సమం జసము కానేరదు. కాగా జిజ్ఞాసువు చంద్రస్వరూపమునే తెలియగోరెను గాని ప్రకర్షము, ప్రకాశత్వము, చంద్రత్వము మొదలగు ధర్మములతోడ చంద్రుని యందు గల భేదమును ప్రశ్నించి యుండలేదు. ఇట్లుండ ప్రకృష్ట ప్రకాశుడు చంద్రుడను సమాధాన వాక్యమువలన ఈ అంశములెట్లు తెలియగలవు? తెలియ గోరని పదార్థ విషయమును వాక్యము తెలుపజాలదు. అట్లు తెలుపజూచు వాక్యము సమాధాన వాక్యము గానేరదు. "ప్రకృష్ట ప్రకాశుడు చంద్రుడు" అను వాక్యము చంద్రస్వరూపమును మాత్రమే తెలుపుటకై పుట్టిన వాక్యము కావున చంద్రస్వరూపమునే తెలుపునుగాని చంద్ర స్వరూపమునకు మించిన అంశము లను తెలుపజాలదు. జాతి గుణాది సంబంధము లేని చంద్రస్వరూపమును మాత్రమే బోధించుటవలన ఈవాక్యము అఖండార్థమని ప్రసిద్ధి చెందెను. అట్లే తత్త్వమసి వాక్యమున గల తత్, త్వం పదముల అర్థము కేవల చైతన్యమే గావున తత్త్వమసి వాక్యము అఖండార్థమునే బోధించుచున్నది. అన్యశేషము గాని అర్థమును బోధించు వాక్యము సయితము అఖండార్థమనబడును. "తత్త్వమసి" వాక్యమున బోధింపబడిన జీవేశ్వరుల అభేదము అన్యశేషము గాదు. కావున "తత్త్వమసి" వాక్యము అఖండార్థము గలది.

అవ: ఋగ్వేదాంతర్గతమగు "ప్రజ్ఞానం బ్రహ్మ" అను వాక్యము అఖండార్థ

మని స్పష్టము చేయుచున్నారు.

తొలుత పరమాత్మ యొక్కడే కలడనియు, పిమ్మట ఆ పరమాత్మ ఈ సకల భువనములను విరాట్ స్వరూపమును పుట్టించి తాను శరీరాదులందు ప్రవేశిం చెదనని ఋగ్వేదోపనిషత్తు చెప్పెను. భువనముల పుట్టుకయు వివర్తము. సంజ వేళ త్రాటిని చూచి పామని భ్రమపడినప్పుడు, ఆ పాము పడగవిప్పినట్లు, బుస కొట్టినట్లు భ్రమించినట్లే పరబ్రహ్మమొక్కటే యుండగా సకల భువనములు గలవని మనము భ్రమించుటయేగాని వాస్తవము కాదు. సర్పజిహ్వాదులకు త్రాటియందు పుట్టుక లేని రీతిగా బ్రహ్మమందు భువనములకు పుట్టుకలేదు. ఇట్లే సకల భువనములును పరమాత్మ వివర్తములు. పరమాత్మ పంచభూతాది సకల భువన స్వరూపము. ఈ పరమాత్మ చైతన్యము నిమిత్త మాత్రమయి యుండ, లోకులు చూచుచుందురు. మాట్లాడుచుందురు. తలంచుచుందురు. ఈ క్రియ లన్నియు పరమాత్మ చైతన్యము నందే సంభవించుచుండును కాని వేఱొండు కారణము వలన గాదు. ఈ పరమాత్మ చైతన్యము నందు అంశములు లేవు. ఈచైతన్యము నిర్వికారము. ప్రజ్ఞానఘనము. ఏ పరమేశ్వరుని చేత ప్రాణిలోకము చూచుచున్నదో, మాట్లాడుచున్నదో, తలంచుచున్నదో అట్టి ప్రజ్ఞాన ఘనస్వరూపు డగు పరమాత్మనేనైయున్నానని "ప్రజ్ఞానం బ్రహ్మ" అను మహావాక్యమునకు తాత్పర్యము. అట్టి చైతన్యము అఖండము కావున మహావాక్యము అఖండార్థమని భావము.

అవ: యజుర్వేదాంతర్గతమగు "అహంబ్రహ్మాస్మి" అను వాక్యము అఖండార్థ మనుచున్నారు.

ఆ పరబ్రహ్మమే తమః ప్రధానమగు మాయావశమున ఈ కనబడు నానావిధ ప్రపంచరూపమున పరిణమించెననియు, ఆ పరబ్రహ్మమే సమస్త ప్రాణికోటి యందును నఖశిఖ పర్యంతము నిండియున్నదనియు యజుశ్శాఖో పనిషత్తు చెప్పెను. ఆ పరబ్రహ్మము లోకములను పుట్టించుటకును, తాను పుట్టించిన లోకములందు ప్రవేశించుటకు పూర్వము పరిపూర్ణమై, సర్వవ్యాపక మయియున్నను, పుట్టించిన లోకములందు ప్రవేశించుటకు పూర్వము పరి

పూర్ణమై, సర్వవ్యాపకమయియున్నను, పుట్టించిన లోకములందు ప్రవేశించిన పిమ్మట మునుపటివలె పూర్ణముగాక, పరిచ్ఛిన్నమయి జీవుడను పేరుతో వ్యవహరింపసాగెను. ఈ శరీరములందు ప్రవేశించి వెలుగొందు చైతన్యము ఆ పరబ్రహ్మమే కావున అదియే మిక్కిలి ప్రేమాస్పదమయియున్నది. ఆ పర బ్రహ్మమునకు మించిన వేఱొక వస్తువు లేదు. ఆ పరబ్రహ్మమే తానును పరబ్రహ్మమయి యున్నట్లు తెలిసికొనెను. పరబ్రహ్మముకన్న వేఱొక వస్తువు లేనందున మోక్షము కావలయునను కోరికయు ఆ పరబ్రహ్మమునకే చెప్ప వలయును కాని జీవునకు చెప్పరాదు. ఏ పరబ్రహ్మము తమః ప్రధానమగు మాయచే, వివిధాకారమగు జగద్రూపమయ్యనో ఏ పరబ్రహ్మము శరీరాదులందు ప్రవేశించి సర్వవ్యాపకమయ్యనో, ఏ పరబ్రహ్మము పరమ ప్రేమాస్పదమయ్యనో, ఏ కారణము వలన పరబ్రహ్మమే సకలమునై యున్నదో ఆకారణము వలన ఆ పరబ్రహ్మము నేనైయున్నానని తెలిసికొనునో, ఆ కారణము వలన నేను వాస్తవముగ పరబ్రహ్మమయి యున్నాను. కావున "అహం బ్రహ్మాస్మి" అను వాక్యము అఖండ పరబ్రహ్మమును బోధించును కనుక ఈ మహావాక్యము అఖండార్థమని భావము.

తైత్తిరీయ శాఖావేదాంతములు "యశ్చాయ మత్ర పురుషే" అని పురుషుని యందు పంచకోశ గుహ మధ్యమున నెలకొనియున్న చైతన్యముతోడ ఉపక్రవించి "యశ్చాయ మాదిత్యే" యని సూర్యమండల మందున్న చైతన్యముతోడ అభేదమును స్పష్టముగ వెల్లడించినవి. ఇట్టి అభేదమును తెలియుటచే ఈ సకల జగములు ఆ చైతన్యమందు లయము చెందుననియు ప్రకటించినవి. త్రాటియందు కల్పితమగు సర్పాదులు త్రాడు తెలిసిన వెంటనే ఆ త్రాటియందు లయమగు విధముగా ఈ సకల ప్రపంచము ఏకరసమగు బ్రహ్మచైతన్యమున కల్పితమగుటచే ఆ బ్రహ్మ చైతన్య తత్త్వము తెలియుట వలన ఆ పురుషుని యందే సకల ప్రపంచము లయమగునని వేదాంతములందు జీవబ్రహ్మైక్యము స్పష్టముగ చెప్పబడెను.

అవ: సామవేదాంతర్గతమగు "తత్త్వమసి" మహావాక్యమును తొమ్మిదిసార్లు

ఉపదేశించుచున్నారు.

అరుణి మహర్షి తన పుత్రుడగు శ్వేతకేతునకు ఉపదేశించిన వాఖ్యాన రూపమున ఛాందోగ్య శ్రుతి "తత్త్వమసి" మహావాక్యమును ఉపదేశించెను. తత్త్వోపదేశమునకు పాత్రుని జేసిన పుత్రునితో "ఓ శ్వేత కేతువా! నీవు ప్రపంచ సృష్టికి పూర్వము పరబ్రహ్మరూపుడవయి యుంటివి. మిథ్యాభూతమగు ఈ ప్రపంచమును పుట్టించితివి. పుట్టించిన భూత జాతమునందు ప్రవేశించితివి. ప్రవేశించిన పిమ్మట ఈ సకల వస్తువులనే నీవని భావించుచు జీవుడవయితివి. ఆకాశాది పంచ మహాభూతములు మొదలు దేహ పర్యంతము గల సకల కార్యజాతము నీవు గాదని తెలుసుకొని నీ నిజరూపమును తెలియుము. అద్వితీయమగు చిదానంద రూపమగు సద్రూప బ్రహ్మమే నీవయి యున్నావు" అని శ్వేత కేతునకు ఈ చాందోగ్యశ్రుతి తొమ్మిది పర్యాయములు ఉపదేశించెను. "సతా సోమ్య తదా సంపన్నో భవతి" అనుచు జీవునకు సుషుప్తావస్థ యందు బ్రహ్మస్వరూపముతోడ ఐక్యమును చెప్పెను. అట్టి బ్రహ్మమే జీవునకు వాస్తవ స్వరూపము. ఆ బ్రహ్మమే సకలమును పుట్టించి తాను శరీరాదులందు ప్రవేశించెను. సుషుప్తావస్థ యందు ఉపాధి సంపర్కము తొలగగా బ్రహ్మరూపుడై యుండెను.

అవ: జీవుడు వాస్తవముగ సచ్చిదానంద రూపుడైయున్నను, తాను సచ్చి దానంద రూపుడనని ఏల తెలియకున్నాడనే సంశయమును బాపుచున్నారు.

తేనెటీగలు ఒక్కొక్క పుప్పు నుండి ఒక్కొక్క మధుకణమును తెచ్చి తేనెను సమకూర్చును. కాని ఆ మధుకణములు తాము ఫలాన పుష్పములనుండి వచ్చిన జాడలను యెఱుంగజాలవు. ఇట్లే సకల ప్రాణులును సుషుప్తావస్థయందు తమ ఆకార ఉపాధులను విడచి పరబ్రహ్మమునందు ఐక్యమును పొందుదురు. కాని అచ్చట కారణోపాధియగు అజ్ఞానముండుటచే తాము సద్రూపులమైయున్నట్లు తెలియజాలరు. ఆ సద్రూప బ్రహ్మభావము నుండి భ్రంశము పొందిన పిమ్మట జాగ్రదావస్థ యందు వెనుకటివలె దేహేంద్రియాదులు తామని తలంచి మరల దుఃఖముల పాలగుచున్నారు. వాస్తవముగ సకల జీవులు సచ్చిదానంద రూప

మగు బ్రహ్మస్వరూపులే కాని దుఃఖ భాజనులగు సంసారులు కారు. కార్యకారణో పాధులెన్నడును జీవుని విడనాడకపోవుటచే సద్రూపమగు బ్రహ్మభావము జీవులకు గోచరించుట లేదు.

అవ: సద్రూప బ్రహ్మము నుండి భ్రంశులయిన జీవులు సద్రూపబ్రహ్మము నుండి భ్రంశులమయితిమనియు జాగ్రదావస్థ యందు స్మరింపజాలకున్నారని చెప్పుచున్నారు.

సూర్యుడు సముద్ర జలములను తన కిరణముల ద్వారా కొనిపోయి పిమ్మట మేఘరూపమున ఆ నీటిని వర్షింప ఆ సముద్రపు నీరు నదీ భావమును పొందును. నదీభావమును పొందిన సముద్రపు నీరు నేను "పూర్వము సముద్ర మును'' అనే సముద్రబుద్ధిని విడుచు రీతిగా అఖండ సచ్చిదానందరూపమగు బ్రహ్మము దేహేంద్రియాదులనే ఉపాధులచే ఖండమయి, జీవభావమును బొంది నిజరూపమగు అఖండ సచ్చిదానంద రూపమును మఱచి యుండును. ఓ శ్వేత కేతువా! నీవు ఆ పూర్ణభావమును స్మరణకు తెచ్చుకొనుము. సద్రూప మగు బ్రహ్మమే నీవయి యున్నావు.

అవ: సకల జీవులు సద్రూప బ్రహ్మము వలన బుట్టి బ్రహ్మమున లయము బొందుదురేని, సముద్రమున పుట్టిన అలలు, బుడగలు తిరిగి సముద్రమున లయమగునట్లుగా జీవులు అనిత్యులు కాగలరు. మఱియు బ్రహ్మము వలన పుట్టి బ్రహ్మమున లయమగుట చేత "తాను తానను" అనెడి అహంకారము పొసగుటచే అనిత్యములగు శరీరాదులే జీవులనదగును. సముద్రము మాదిరి బ్రహ్మము వికారి కాగలదను సంశయములను బాపుచున్నారు.

దేహము ఆత్మ కానేరదు. దేహముకన్న ఆత్మవిలక్షణమై యుండును. అట్టి ఆత్మ కేవల చైతన్య స్వరూపము. సకల భూతములందు ఈ ఆత్మ నెలకొని యుండును. పాషాణాదులందును, వృక్షాదులందు ఆత్మ చైతన్యము వ్యాపించి యుండును. వృక్షములందు చైతన్యము వ్యాపించియుండుటచే వృక్షములు నవనవలాడుచుండును. వృక్షమునందు ఒక శాఖను నరుకగా, ఆ శాఖ నుండి చైతన్యము తొలగగా ఆశాఖ శోషించుట లోకానుభవము. వృక్షమును

నరుకగా ఆ వృక్షము నుండి చైతన్యము తొలగి వృక్షమే శుష్కించును. జీవచైతన్యము శరీరమునందు నెలకొని యున్నవేళల నవనవలాడుచూ కనబడును. జీవ చైతన్యము తొలగునంత వాడిపోయి శుష్కించును. దీనివలన జీవుడు శరీరము కన్న వేఱని మనము గుర్తించగలము. అట్టి ఆత్మయు నిత్యము. ఈ సమస్త ప్రపంచము అద్వితీయ పరబ్రహ్మమైయున్నది. నీవును పరబ్రహ్మ స్వరూపుడవయి యున్నావు. నేను పరబ్రహ్మరూపుడను కానను భ్రమను విడువుము. సకల శరీరవ్యాపి చైతన్యమే గలదనియు, అది శరీరము నుండి తొలగగా శరీరము శుష్కించి, చెడుననియు స్పష్టము.

"జీవాపీతం వా వకిలేదం మ్రియ తే న జీవో మ్రియతే"

జీవచైతన్యము తొలగినంతనే దేహము మరణించుచున్నది కాని జీవుడు మరణించుట లేదు. అను శ్రుతియు పై అర్థమునకు చేయూత నిచ్చును. మఱియు

"అజోనిత్యః శాశ్వతోయం పురాణో నహన్యతే హన్యమానే శరీరే" అను శ్రుతియు ఇదే అర్థమును తెలుపును. "అచ్ఛేద్యోయ మదాహ్యోయ మక్లేద్యో శోష్య ఏవచ" అని జీవ నిత్యత్వమును చెప్పు స్మృతులు అనేకములు గలవు. అట్టి జీవచైతన్యము శరీరమునందొక భాగమునుండి తొలగుటయు, వృక్షములందేగాక మనుష్యులందు సయితము గాంచనగును. పక్షవాతమను వ్యాధిచే పీడితులయి శరీరమునందు కాలు,చేయి చచ్చుపడిపోవుట ఇందులకు నిదర్శనము. శరీరము నందు ఒక భాగము నుండి తొలగిన జీవుడు మరియొక భాగమునందుండునట్లు, సకల శరీరముల నుండి తొలగియు, మరియొక శరీరము నందుండగలడు. కావున జీవుడు నిత్యుడనుట స్పష్టము. శాఖా భేదమున్నను వృక్షమొక్కటే యను నట్లుగా శరీరభేదమున్నను జీవైక్యము సైతము ఈదృష్టాంతమువలన స్పష్టము కాగలదు. ఇంతియేగాక సకల ప్రపంచము ఇట్టి ఆత్మరూపమని వక్కాణించు "ఐత దాత్మ్య మిదం సర్వమ్" అను శ్రుతియు ఏకాత్మ వాదమును దృఢపరచును. అట్టి ఆత్మరూపుడవు నీవని శ్వేతకేతునకు ఉపదేశించెను.

అవ: ఈ జగములకు బ్రహ్మము ఉపాదాన కారణమగునేని సకల జగములు మిథ్యకావచ్చును. బ్రహ్మము అతిసూక్ష్మము. జగములు అతి స్థూల ములు. సూక్ష్మమగునది స్థూలమగు దానికి కారణమగుట చూచియుండము. కావున సూక్ష్మమైన బ్రహ్మము స్థూలమయిన జగములకు కారణము కానేరదను సంశయమును బాపుచున్నారు.

సూక్ష్మమగునది స్థూలమగుదానికి కారణము కాజాలదనుట తగదు. అతి సూక్ష్మములగు మఱ్ఱి విత్తనము అతి విశాలమగు వటవృక్షములకు కారణము లగుట లోకమున కనబడుచున్నది. ఇప్పుడు అతి విశాలముగా కనబడు మఱ్ఱివృక్షము మొదట అతిసూక్ష్మమగు మఱ్ఱివిత్తనమునందు ఇమిడియుండుట స్పష్టమే కదా! ఇదే విధముగా ఈ సకల జగములును సృష్టికి పూర్వము సద్రూప మగు బ్రహ్మమునందే ఇమిడియుండగలవు. సృష్టి సమయమున ఈ విశాల రూపముతోడ ఆవిర్భవింపగలవు. ఆ బ్రహ్మము సూక్ష్మాతి సూక్ష్మము. గురువాక్య ములందును, వేదాంతములందును శ్రద్ధగలవారలు మాత్రమే అద్దానిని తెలియగలరు. అద్దానిని పొందగలరు. సూక్ష్మమగు వస్తువులు స్థూలమగువానికి కారణములగుట లోకమునందు స్పష్టముగ తెలియుచుండుటచే సూక్ష్మమగు బ్రహ్మము స్థూలమగు ప్రపంచమునకు కారణము కాగలదనియు, కావున సకల ప్రపంచము మిథ్య కాగలదనియు భావము. "స ఏషోణిమా అణోరణీయః" అను శ్రుతులచే అణువు కన్నను అణువయినట్టియు, సూక్ష్మాతి సూక్ష్మమనియు వినబడుచుండుటచే బ్రహ్మము స్థూలమగు ఈ బ్రహ్మాండమునకు కారణము కానేరదనియు కొందఱు తలంచెదరు. ఈ సంశయమును బాపుటకు "న్యగ్రోధ ఫలమత ఆహార" వటబీజమును తెమ్ము అని శ్వేతకేతువునకు చెప్పిన దానికి తాత్పర్యమును సంగ్రహించుచున్నారు. వటబీజము అత్యల్పమైనను, మహోన్నత మగు విశాల వటవృక్షమునకు కారణమగును. కావున స్థూలములే స్థూలములకు కారణములన తగదు. కావున బ్రహ్మోపాదానమగు బ్రహ్మాండము బ్రహ్మభిన్నము గావున ఏకత్వ భంగమిసుమంతయు లేదని భావము. ఇట్టి బ్రహ్మము సూక్ష్మాతి

సూక్ష్మము. కావున శ్రద్ధగలవారలు అద్దానిని తెలియగలరు. మఱియుబ్రహ్మము ఈ బ్రహ్మాండమునకు వివర్త కారణమని వేదాంతరహస్యము. రజ్జు వివర్తమగు సర్పమువలె, సకల బ్రహ్మాండము బ్రహ్మరూపమనుట స్పష్టము. కావున బ్రహ్మము అద్వితీయమనియు, ఆ బ్రహ్మమే శరీరములందు ప్రవేశించి జీవుడన బడుచూ, అతడే సత్యమనియు భావము.

అవ: బ్రహ్మము దేహమునందే యున్న యెడల ఏల కనబడదు? కనబడు స్వభావము ఆ బ్రహ్మమునకు లేదేని, మనము ఆ బ్రహ్మమును తలంచుటకు చేయు ప్రయత్నములన్నియు వ్యర్థములు కాగలవను సంశయములను బాపు చున్నారు.

ఉప్పు నీటియందు వేసిన అది నీటిలో కఱుగును. మొదట ఆ ఉప్పు కంటికి కనబడుచుండును. కాని నీటిలో కఱిగిన పిమ్మట నీటియందున్నను కంటికి కనబడదు. చేతితో పట్టజాలము. ఇట్లే బ్రహ్మచైతన్యము సాక్షిరూపమున సకల ప్రాణికోటికిని హృదయ ఫలకమున ప్రకాశించుచునే యుండును. సకల ప్రాణుల హృదయసీమలందు నెలకొనియున్నను, చక్షురాదీంద్రియములకు గోచరము కానేరదు. నీటకలిసిన లవణరసమును నాలుకచే కనుగొందుము. ఇట్లే హృదయసీమలందు నెలకొనియున్న బ్రహ్మ చైతన్యమును మహావాక్యపూర్వక ముగ గురూపదేశముచే స్వానుభవము తెలియగలరు. కనుకనే “ఆచార్యవాన్ పురుషోవేద” ఆచార్యుడు గల మనుషుడే బ్రహ్మ తత్త్వమును తెలియగలడని వేదాంతములు తెలుపుచున్నవి. అట్టి సద్రూపమగు బ్రహ్మము నీవైయున్నావు. కంటికి కనబడు దృశ్యమెన్నడును నీవు కాదు. బ్రహ్మచైతన్యము దేహమందేయు న్నను ఎల్లవేళల కనబడదు. గురుముఖమున వేదాంతోపదేశముచే స్వానుభవ మున గోచరము కాగలదు.

అవ: సద్గురూపదేశమే బంధమును తొలగింపజాలునని దృష్టాంత పూర్వక ముగ చెప్పుచున్నారు.

సంపన్నుడైన గృహస్థుడు తన ఇంట పరుండి నిద్రించుచుండగా, చోరులు

ఆ ఇంటియందు ప్రవేశించి అతని కాళ్ళుచేతులు కట్టి, నోరు తెఱవనీయకుండా అతనిని పట్టుకొనిపోయి, కీకారణ్యమున చేర్చి, అతని యొద్ద నుండు సర్వస్వ మును అపహరింతురు. అట్లు అపహరించియు వాని బంధములను విడదీసి, వారిని విడిపింపక, అరణ్యమునందే విడచి తమ త్రోవను తాము పోవుదురు. పాపమా గృహస్థుడు దిక్కులేకయందే పడియుండగా, దైవవశమున ఆ త్రోవ యందు పోవు బాటసారులు దయజూపి, బంధములను తెగత్రెంపి, విముక్తుడను చేయగా, వారు చెప్పిన త్రోవనుబట్టి తన గృహమును చేరును. ఇట్లే కామక్రోధా దులను శత్రువులు జీవుని నిజపదము నుండి భ్రష్టునిజేసి దేహేంద్రియాదులను ఘోరారణ్యమున కూలద్రోసిరి. పాపమాజీవుడు దేహేంద్రియాదులందు తగుల్కొని, వాటి నుండి విడివడి నిజపదమును జేరు త్రోవ గానక, దేహేంద్రియాదులే తన నిజపదమని భావించుచు, దుఃఖముల పాలు కాజొచ్చెను. ఇట్లుండగా పూర్వపుణ్యవశమున సంప్రాప్తమయిన సద్గురువు ఇతని స్థితిని జూచి జాలిగొని, కామక్రోధాదుల బాఱి నుండి విడువడు మార్గమును జూపగా, ఆ తత్త్వమును తెలుసుకొని దేహేంద్రియాదులు తాను కానని తెలిసి, దుఃఖముల నుండి విడివడి సుఖించును. ఓ శ్వేతకేతువా! నీవా సద్రూపమగు బ్రహ్మమే అయివున్నావు. నీ నిజరూపమును తెలియుము. పొందుము. సద్గురూపదేశము లేనిచో తత్త్వమును తెలియుట శక్యము కాదని భావము.

అవ: అజ్ఞానికివలె జ్ఞానికి మరణక్రమము సమానమే అయినను, మరణ మునకు పిమ్మట విశేషము కలదనుచున్నారు.

జ్ఞానియు, అజ్ఞానియు మరణించునపుడు భేదముండదు. వారికి గల చక్షురా దీంద్రియములు శాస్త్రమందు చెప్పబడిన రీతిగా సకలేంద్రియములు అంతః కరణమందును, అంతఃకరణము ప్రాణమందును, ప్రాణము పరమాత్మయందును, క్రమము తప్పక విలయము బొందును. ఈ క్రమమున బ్రహ్మమును ఎఱుంగని వారికిని బ్రహ్మమును ఎఱింగిన వారికిని తారతమ్యమేమియు కానరాదు. కాని అట్లు మృతులయిన వీరిరువురలో అజ్ఞాని క్రమముగ జన్మబంధమున మరల ప్రవేశించును. అట్లు జన్మబంధమున

ప్రవేశించుటకు మూలము అజ్ఞానము. విద్వాంసునకు ఈ అజ్ఞానము అస్తమించుటచే అతడు మృత్యువును వంచించును. అనగా జన్మబంధమున మరల ప్రవేశింపడు. ఓ శ్వేత కేతువా! నీవట్టి సద్రూప బ్రహ్మమయి యున్నావు. ఈ తత్త్వమును తెలుసుకొని మృత్యుబంధమును తరింపుము. జ్ఞానికి మరణ క్రమము అజ్ఞానితోడ సమానమయినను, మరణానంతరమున సచ్చిదానందరూపుడై యుండునే కాని, మరల ఈ లోకములందు పుట్టజాలడని భావము.

అవ: విద్వాంసుని వ్యవహారము అవిద్వాంసుని వ్యవహారముతోడ సమానమై యుండగా, అవిద్వాంసునివలె విద్వాంసుడేల బంధమును అనుభవింపడను సంశయమును బాపుచున్నారు.

పూర్వకాలమున సత్యాసత్యములను గుర్తించుటకు న్యాయస్థానములందు ఒక ఆచారము కలదు. రాజభటులు ఒక దొంగను బంధించి రాజసభకు తీసుకొని వచ్చుదురు. అతడు నేను ఆ దొంగతనము చేయలేదని చెప్పుచుండెను. వాని మాటల యందలి సత్యాసత్యములను తెలియుటకు రాజాజ్ఞచే ఒక ఇనుప గొడ్డలిని ఎఱ్ఱగకాల్చి, ఆదొంగను దానిని పట్టుకొనమందురు. అతడు నిజముగా దొంగ కాని యెడల ఆ ఇనుప గొడ్డలి పట్టుకొనినచో అతనికి కాలదు. అట్లు కాలనిచో అతనిని విడుదల చేయుదురు. అట్లుగాక అతడు నిజముగ దొంగ తనము చేసినచో ఆ గొడ్డలిచే అతడు కాల్చబడును. రాజాజ్ఞచే బంధింపబడును. ఇట్లే ఆత్మజ్ఞానములేని మూఢుడు తానుగాని దేహేంద్రియాదులను తానని తలంచి దొంగవలె అసత్యవాదియై తొలుత మృత్యువాతబడి, పిమ్మట జన్మబంధమును పొందును. నిజమగు ఆత్మస్వరూపమును తెలిసిన వివేకి సత్యాభిసంధి గలవాడ గుటచే జన్మబంధమును పొందజాలడు. ఓ శ్వేత కేతువా! అట్టి సద్రూపమగు బ్రహ్మము నీవైయున్నావు. నీకీ జన్మబంధము మరల మరల రాగలదను సంశ యమును చెందకుము. నిజముగా దొంగతనము చేసిన వానికే బంధము సంభవించు రీతిగా ఆత్మజ్ఞానము లేని మూఢునకే జన్మబంధము సంభవించును. దొంగతనము చేయని పురుషుడు విడుదల పొందినట్లుగా ఆత్మజ్ఞానియు

విడుదల చెందునని భావము.

"సోనృతాభి సంధో నృతేనాత్మాన మంతర్ధాయ ।
పరశుం తప్తం ప్రతి గృహ్ణాతి సదహ్యతే ధహన్యతే ॥"

అసత్యమును చెప్పునతడు ఆత్మస్వరూపమును సత్యముచే కప్పిపుచ్చి కాల్చిన గొడ్డలిని పట్టుకొనును. అగ్ని తప్తుడగును. పిమ్మట దండించబడును అను శ్రుతియుపై నిర్ణయమునకు చేయూతనిచ్చును. ఆత్మజ్ఞానములేని వారిని చోరునిచే పోల్చుటచే ఆత్మజ్ఞానములేని వాని జన్మకడు శోచనీయమనుట స్పష్టము.

"యోన్యథా సంతమాత్మాన మన్యథా ప్రతిపద్యతే ।
కింతేన నకృతం పాపం చోరేణాత్మ పహారిణా ॥"

ఒక తీరున ఉండు ఆత్మ తత్త్వమును మఱియొకతీరున తలచు చోరుడు చేయని పాపమేమి కలదు? సకల పాపము జేసెనని భావము. చోరుడు తన కొఱకు ఇతర వస్తువులను అపహరింప ఇతడు తన ఆత్మ తత్త్వమునే అపహరిం చునని భావము.

ఆరుణి యను నతడు తన పుత్రుడగు శ్వేతకేతువునకు "తత్త్వమసి శ్వేతకేతో" అని తొమ్మిదిసార్లు వేదాంత తత్త్వమును ఉపదేశించెను. శ్వేత కేతువు ఆ తత్త్వమును గుర్తించి తాను అద్వితీయమగు సచ్చిదానంద స్వరూపుడనని తెలిసి స్వారాజ్య సౌఖ్యమును పొందెను. కృతార్థుడాయెను. మఱియెవ్వడేనియు, ఈ తత్త్వమును విమర్శించి తాను అద్వితీయ సచ్చిదానంద స్వరూపుడనని తెలుసుకొనిన, అతడును అట్లే స్వారాజ్య సుఖమును అనుభవింపగలడు. కృతార్థుడు కాగలడు. ముక్తి పొందును.

అవ: అధర్వణ శాఖ యందలి "అయ మాత్మా బ్రహ్మ" అను మహావాక్యము అఖండార్థమనుచున్నారు.

మాండూక్య శ్రుతియందు "ఓమిత్యేత దక్షర మిదం సర్వమ్" ఈసమస్తము

ఓంకార రూపమని ఉపక్రమించి, అకార, ఉకార, మకారములను ఆ ఓంకారమునకు కల్పించెను. పిమ్మట ఆ పాదములను క్రమముగ ఒక దానియందు మఱియొక దానిని లయము చేసి మిగిలిన అఖండ చైతన్యము 'ఆత్మ' అనెను. అనగా అకారము ఉకారమందు, ఉకారము మకారమందు లయము చేయగా మిగిలిన అర్థమాత్రుకే చైతన్యము. ఈ ప్రకారము జాగ్రదావస్థను స్వప్నమందు లయము చెయ్యాలి. అంటే స్వప్నం మాదిరి ఈ ప్రపంచాన్ని అంటిముట్టనట్లుగా దర్శించాలని అర్థం. స్వప్నాన్ని సుషుప్తిలో లయం చెయ్యాలి. అంటే స్వప్నం కూడా నామరూపాత్మకమే కాబట్టి సుషుప్తి మాదిరి నామరూపరహితంగా చూడాలని అర్థం. సుషుప్తిని మరలా సమాధిలోకి లయం చెయ్యాలి. చివరకా శూన్యాన్ని మరలా శుద్ధ చైతన్యంతో భర్తీ చేసుకొని అభావంగా కాక భావ రూపంగా అనుభవానికి తెచ్చుకోవాలి. అట్టి ఆత్మ ఈదేహమందు గల చైతన్యమేననుచు "అయమాత్మా బ్రహ్మ" ఈదేహమున గల ఆత్మబ్రహ్మమని వెల్లడించెను. ఈ ఆత్మ స్వరూపమే బ్రహ్మమనియు ఆ ఆత్మ అఖండమనియు, జీవబ్రహ్మములకు ఐక్యమనియు అథర్వణ వేదముచే స్పష్టముగ చెప్పబడెను.

అవ: ఇట్లు నాలుగు వేదముల ఉపనిషత్తులకు తాత్పర్యమయి సిద్ధించిన జీవబ్రహ్మైక్యమునకు ప్రయోజనము చెప్పుచున్నారు.

ప్రత్యగ్బ్రహ్మస్వరూపము నిత్యము. జ్ఞానఘనము. మాయ, అవిద్యసంబంధము లేవియు ప్రత్యగ్బ్రహ్మమున లేవు కావున అది పరిశుద్ధము. లోకమున గల వస్తువులకు సంభవించు భావవికారములు ఆఱు తెగలు. అవి ఉండుట, పుట్టుట, వృద్ధిచెందుట, పరిణమించుట. అపక్షయము పొందుట, నశించుట మొదలగు నవి. లోకమునందే వస్తువైనను మొదట పుట్టుచున్నదను భావవికారమును పొందును. పిమ్మట వృద్ధి చెందును. పరిణామమును పొందును. పిదప ఆ వస్తువునకు అపక్షయమును, నాశనమును వాటిల్లును. ఈ లోకమునందే వస్తువు నకు పై భావవికారములలో తొలిభావ వికారమగు పుట్టువు కలిగినచో మలిభావ వికారములు ఆ వస్తువును చుట్టుముట్టి తుదముట్టింపగలవు. ప్రత్యగ్బ్రహ్మమునకు పుట్టువు లేకుండుటచే ఈ ఆఱింటినందే

భావవికారము దానిని అంటదు. కావున ప్రత్యగ్బ్రహ్మము నిర్వికారము. అందువలన ఎల్లప్పుడు ముక్తస్వభావమయి యుండును. ఆ ప్రత్యగ్బ్రహ్మము నిరవయము. లోకమునందు అవయవములు గల వస్తువులు అవయవములు నశింప నశించును. ఈ ప్రత్యగ్బ్రహ్మము నిరవయము. కావున ఈ బ్రహ్మమునకు నాశనము వాటిల్లదు. ఈ ప్రత్యగ్బ్రహ్మము పరమార్థ సద్రూపము, నిరవయము కనుకనే సూక్ష్మాతి సూక్ష్మము. పరమార్థ సద్రూపమగు ఈ బ్రహ్మమునకు తోడుగ మఱియొక వస్తువులేదు. కావున బ్రహ్మ మద్వితీయము. ఆనంద రూపమగు ఈ బ్రహ్మము బ్రహ్మాండమునంతయు నిండి పూర్ణమయి యుండును. నేనా ప్రత్యగ్బ్రహ్మ స్వరూపు డనైయున్నాను. సహజముగ దేదీప్యమానుడయి వెలుగొందు సూర్యుని యందు చీకటివలె సహజ స్వప్రకాశము, సచ్చిదానంద రూపమునగు నాయందు ఈ ప్రపంచము పూర్వకాలమునలేదు. వర్తమానకాలమునలేదు. భవిష్యత్ కాలమున సంభవింపబోదు. ఈ విధముగా గురూపదేశముచే నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త స్వభావమైనది ఆత్మయనియు, అట్టి ఆత్మస్వరూపమును తనయందు తెలియు జీవునకు జీవభావము తొలగును. బ్రహ్మభావము ఆవిర్భవించును. కావునే శ్రీ సురేశ్వరాచార్యులు:

"తత్త్వమస్యాది వాక్యోత్థ సమ్యగ్ధీజన్మ మాత్రతః ।
అవిద్యా సహకార్యేణ నాసీ దస్తి భవిష్యతి ॥"

గురూపదిష్టమగు "తత్త్వమసి" మహావాక్యము వలన బ్రహ్మాత్మైక్య జ్ఞానము కలుగునంతనే అవిద్య అంతరించుననిరి. ముత్యపుచిప్పను చూచి వెండియని భ్రమపడిన మనుజుడు ముత్యపుచిప్ప తత్త్వము తెలియగానే ఇప్పుడు ఇది వెండి కాదనియు, పూర్వము వెండికాదనియు, ముందు కాలమున సయితము వెండి కాదనియు తెలియును. ముత్యపుచిప్ప యందు కనబడు వెండి కల్పితము గాని వాస్తవము కాదు. కల్పితవస్తువుల తత్త్వము ఆ వస్తువుల కల్పనకు ఆధారమగు వస్తువుకన్న వేఱొండు కానేరదు. కల్పనాధారము కనుగొనిన కల్పితవస్తువులు త్రికాలములందు లేవను తత్త్వము గోచరించుట తెలియుచున్నది. ఇంతియేకాదు ముత్యపుచిప్ప తత్త్వము తెలియగా, ముత్యపుచిప్పను ఆవరించియున్న అజ్ఞానము సయితము తొలగును. అట్లే

ఆత్మ తత్త్వము తెలిసినచో ఆ ఆత్మను ఆవరించి యున్న అజ్ఞానము తొలగును. అవిద్య తొలగగా అవిద్యవలన పుట్టిన సకల బ్రహ్మాండము తొలగును. త్రికాలము లందు అజ్ఞానము లేదనే జ్ఞానము ఉదయించును. ఇట్టి జ్ఞాని జీవన్ముక్తుడనబడును. ప్రారబద్ధ భోగావసానమున విదేహ కైవల్యమును పొందును

"తస్యతావ దేవచిరం యావన్న। విమోక్ష్యే అథ సంపత్స్యే ॥"

అట్టి జ్ఞాని శరీరము విడుచినంతనే బ్రహ్మభావమును పొందుచున్నాడను శ్రుతి ఇందులకు ప్రమాణము. కావున జీవన్ముక్తియనియు, విదేహ ముక్తియనియు ముక్తి రెండు విధములు.

జ్ఞానము పరోక్షమనియు, అపరోక్షమనియు రెండు విధములు. చక్షురాదీంద్రి యములవలన పుట్టు జ్ఞానము పరోక్షమనబడుననియు, వాక్యమెన్నడు అపరోక్ష జ్ఞానమును పుట్టింపజాలదనియు వాదుల ఆశయము. కాని "దశమస్త్వమసి" నీవు పదవవాడవను వాక్యము అపరోక్ష జ్ఞానమును పుట్టించుట లోకానుభవ సిద్ధము. కావున "తత్త్వమసి" వాక్యము అపరోక్ష జ్ఞానమును పుట్టించుట లోకాను భవ సిద్ధము. కావున "తత్త్వమసి" వాక్యము అపరోక్ష జ్ఞానమును కలిగించుననుట తథ్యము.

అవ: బ్రహ్మమునకు తోడుగ ఐక్యజ్ఞానమున్నందున బ్రహ్మము అద్వితీయము కానేరదను సంశయమును బాపుచున్నారు.

అరణిని మదింప అగ్ని పుట్టును. ఆ పుట్టిన అగ్ని తాను దహించదగిన తృణకాష్టాదులను దహించి తాను ఉపశమించును. అట్లే మహావాక్యములను విమర్శింపగా అఖండ బ్రహ్మాకారమగు జ్ఞానము ఉదయించును. అట్లు ఉదయించిన ఆత్మజ్ఞానము సకల దృశ్యములను సమూలముగ పోగొట్టి తాను కైవల్యసంజ్ఞ గల సచ్చిదానందరూప బ్రహ్మమున లీనమగును. లోకమునందు బురదనీటిని శుభ్రము చేయుటకు ఇండుపగంధమును నీటియందు కలుపుదురు. ఈ గంధము సయితము ఒక విధమగు మట్టే అయినను నీటియందు కలసి నీటి యందలి బురదను తొలగించి తాను సయితము నీటియందు కలసి నీటిని

శుభ్రపరచును. ఇట్లే మహావాక్యములను విమర్శింపగా పుట్టిన అఖండ బ్రహ్మాకార జ్ఞానము అజ్ఞాన సహితమగు సమస్తద్వైతమును తృణమువలె వెంటనే దహింపచేసి తానును లయమగుచున్నది. కావున బ్రహ్మమునకు తోడుగ ఐక్యజ్ఞానములేనందున బ్రహ్మము అద్వితీయము గాని, సద్వితీయము కానేరదు.

అజీర్ణ వ్యాధి పీడితుడు వైద్యుని వద్దకు రాగా అతడు ఔషధమును ఇచ్చును. అంతకుపూర్వము ఉదరమున గల పదార్థమును జీర్ణింప చేయుచు ఈ ఔషధము స్వయముగ జీర్ణించును. అట్లే బ్రహ్మజ్ఞానము సకల ద్వైతమును తొలగించుచు తానును తొలగును. కట్టెలను దహించిన పిదప తానును ఉపశమించు అగ్నివలె బ్రహ్మజ్ఞానము సయితము సకల ద్వైతమును తొలగించి తానును తొలగుటచే అద్వితీయ బ్రహ్మము ఏ విధముగను సద్వితీయము కానేరదు.

కఫపిత్త వాతముల సన్నిపాతమున పుట్టిన జ్వరము కష్టసాధ్యమగుట లోకానుభవ సిద్ధము. ఈ సంసార బంధ ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక తాపములు సన్నిపాతమున విషమించిన రోగములు. ఈ ఉద్రేకములచే విష మించిన సంసారబంధమను రోగము రూపుమాపుటకు ఈ అఖండ బ్రహ్మాకార జ్ఞానమే తగిన ఔషధము. ఈ బ్రహ్మ సాక్షాత్కారము స్వారాజ్య సంపద. ఈ సాక్షాత్కారము అపరిమితానందమును చేకూర్చును. ఈ సాక్షాత్కారముచే భస్మీభూతములగు కర్మబీజములు తిరిగి మొలకెత్తజాలవు. ఆత్మ స్వరూపమును తెలిసినంతనే అవిద్యయందు పుట్టిన సకల సంశయములు, దుఃఖములు తొలగును. చిదచిద్గ్రంథియు వీడును.

"భిద్యతే హృదయ గ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశయాః।
క్షీయంతేచాస్య కర్మాణి తస్మిన్దృష్టే పరావరే ॥"

ఆ పరమాత్మను తెలియ సకల సంశయములు తొలగును. చిదచిద్గ్రంథియు వీడును. సకల కర్మములు క్షీణించునని వేదాంతములు వెల్లడించినవి. పాపప్రతి బంధములుండునంత పరమాత్మ దర్శనము కానేరదు. పరమాత్మను దర్శింప

కర్మములు తొలుగుననగా పరస్పరాశ్రయమను దోషము సంభవించునని భయపడవలదు. "తస్మిన్ దృష్టే పరావరే" ఆ పరమాత్మ కనబడదను మాటకు ఆ పరమాత్మ దర్శనము నిమిత్తము గానంతయని అర్థము. అనగా పరమాత్మ దర్శనము కాబోవునంత సకల కర్మములు తొలగునని భావము. పై పదము నందలి సప్తమీ విభక్తికి నిమిత్తమని అర్థము. సప్తమీ విభక్తి నిమితార్థమును వర్ణించుట:

"చర్మణి ద్వీపినం హంతి దంతయోర్హంతి కుంజరమ్ ।
కేశేషు చమరీం హంతి సీమ్ని పుష్కల కోహతః ॥"

చర్మ నిమిత్తము పులిని, దంతముల నిమిత్తము ఏనుగును, కేశముల నిమిత్తము చమరీ మృగమును చంపుచున్నాడనియు, పునుగుపిల్లి యండ కోశము నిమిత్తము చంపబడుచున్నదని పై పద్యమున కాంచనగును.

అద్వైతసిద్ధి వివరణమున
రెండవ అపవాదమను ప్రకరణము సమాప్తము.

కైవల్య ప్రకరణము

తొలి అధ్యారోప అపవాదములను ప్రకరణములు రెండింటియందును రెండవసాటిలేని బ్రహ్మము ప్రత్యగ్ భిన్నమనియు, వేదాంతవాక్యముల విచారణ చేయగా ఆ ప్రత్యక్ష రూపమగు అద్వితీయ బ్రహ్మము సాక్షాత్కరించుననియు తెలియజెప్పిరి. కాని వాక్యమునకు సాక్షాత్కారము పుట్టించు సామర్థ్యమెందును కానరాదు. కావున పైన చెప్పిన సాక్షాత్కారము పొసగజాలదను సంశయమును బాపుచున్నారు.

జ్ఞానము పరోక్షమనియు, అపరోక్షమనియు రెండు విధములు. ఆయా

వస్తువులను తెలుపుటకు పుట్టు జ్ఞానము ఆయా వస్తువులను సాక్షాత్కరింపజేయు జ్ఞానము అపరోక్షమనబడును. అట్లు కాదేని పరోక్షమనబడును. జ్ఞానమునకు గల పరోక్షత్వ, అపరోక్షత్వములు రెండును అజ్ఞానముచే తెలియబడు వస్తుస్వభావమును అనుసరించి యుండునే కాని, ఆ జ్ఞానముదయించుటకు సాధనముగా గల ఇంద్రియ శబ్దాదులను అనుసరించి యుండదు. కాగా ప్రకృతమున తెలియదగు వస్తువు అఖండ బ్రహ్మము. ఆ బ్రహ్మము స్వయం జ్యోతి స్వరూపమగుటచే ఎల్లవేళల సాక్షాత్ అపరోక్షమయి వెలుగొందుచుండును. కనుక ఆ బ్రహ్మమును తెలుపుటకు పుట్టు అఖండార్థ జ్ఞానము వేదాంతవాక్యముల వలన పుట్టి సాక్షాత్కారము కాగలదు. పరోక్షము కాజాలదు.

మందబుద్ధులగు పదిమంది ఒకప్పుడు నదీప్రవాహమును దాటి ఆవలి ఒడ్డుకు చేరిరి. పదిమంది తీరమును దాటిరా యని నిర్ణయించుటకై ఒక్కొక్కడు తనను విడిచి లెక్కపెట్టి తొమ్మండుగురే యున్నారని నిర్ణయించిరి. పదవవాడు నదీ ప్రవాహమున మరణించెనని విశ్వసించి విచారింప సాగిరి. బుద్ధిమంతుడగు బాటసారి యొకడు ఆ మార్గమున పోవుచూ వారి విచారమునకు కారణమును తెలుసుకొని, జాలిపడి వారి విచారమును పోగొట్టదలచి, వారిలో ఒకనిని పిలిచి లెక్కింపుమనెను. అతడు పూర్వమువలెనే తనను విడిచి లెక్కించగా బాటసారి "నీవు పదియవవాడవను" తత్త్వమును వెల్లడించెను. ఆ మాటలను వినిన అతడు తనను పదవవానిగ తెలుసుకొని సంతసించెను. ఇట్లు ఒక్కొక్కరు తనను పదవవానిగ తెలుసుకొని ఏ ఒక్కరు మరణించకుండుటకు పరమానందభరితులయిరి. ఇచ్చట "నీవు పదియవవాడవు" అనునది వాక్యము. ఆ వాక్యము తెలియుట వలన తెలియదగిన పదియవవాడు తానై యుండెను. తనకు తానెల్లప్పుడు అపరోక్ష స్వరూపుడే గావున "నీవు పదియవ వాడవను" వాక్యము పుట్టియు "నేను పదియవవాడ"నను జ్ఞానము అపరోక్షమగుచున్నది. నేను నీవు పదియవవాడనని ఆప్తుడు పలుకుమాటలను చక్కగ విని తనను పదియవ వానిగ తెలుసుకొనునే గాని, పదవవానిని సాక్షాత్కరించుటకు తగిన ప్రయత్నాం తరములను చేయజాలడు. తెలియదగిన పదవవాడు

తానైయున్నందున తనను తాను సాక్షాత్కరించుకొనుటకు ప్రయత్నాంతరములు చేయ పనిలేదు. "నీవు పదవవాడవ"ను మాటలను వినినంతనే తనను పదవవానిగ సాక్షాత్కరించి సంతసించుచుండెను. ఇట్లే తెలియదగిన బ్రహ్మము అపరోక్షము కావున ఆ బ్రహ్మమును తెలుపు జ్ఞానము వాక్యము వలన పుట్టినను అపరోక్షమే కాగలదు కాని పరోక్షము కానేరదు.

ఆత్మవస్తువు స్వతస్సిద్ధముగ అపరోక్షము. అట్టి ఆత్మను తెలుపు జ్ఞానమే "తత్త్వమసి" మొదలగు వేదాంత మహావాక్యముల వలన పుట్టును. వాక్యములకు పరోక్షజ్ఞానమును పుట్టించు సామర్థ్యము లోకమున ప్రసిద్ధమయి ఉండుట సత్యము. కాని స్వతస్సిద్ధముగ అపరోక్షమయి యుండు ఆత్మతత్త్వము వాక్యమువలన పుట్టుజ్ఞానమున గోచరించు అపరాధ మాత్రమున పరోక్షము కాజాలదు. మనము ఘటపటాది వస్తువులను సూర్యకాంతిచే కనుగొందుము. లేదా దీపకాంతిచే కనుగొందుము. దీపకాంతిచే కనుగొన్నను, సూర్యకాంతిచే కనుగొన్నను ఘటము ఘటముగను, పటము పటముగను గోచరించుచున్నది కాని మార్పు లేదు. కావున పరోక్షత్వ, అపరోక్షత్వములు వస్తుస్వభావమును అనుసరించి యుండునే కాని ఆయా వస్తువులను తెలుపు జ్ఞానముదయించుటకు తగిన సాధనములను అనుసరించి యుండజాలదు. బ్రహ్మము అపరోక్షము కనుక వేదాంతములవలన పుట్టుజ్ఞానము అట్టి అపరోక్షబ్రహ్మమును అపరోక్షముగ తెలుపకుండా పరోక్షముగ తెలిపినచో ఆ వేదాంతములు ప్రమాణములు కాక అప్రమాణములు కావలసియుండును. వేదవాదులే యొక్కరును వేదాంతములు అప్రమాణములనుట సహింపరు. కావున వాక్యముల వలన పుట్టియు, అపరోక్ష స్వభావము గల ఆత్మను తెలుపు జ్ఞానము అపరోక్షమేగాని పరోక్షము కాజాలదు.

లోకమున గల వస్తుస్వభావములు అతి విచిత్రములు. తొండజాతికి చెందిన ఊసరవెల్లి యిందులకు ఉదాహరణ. మనము చూస్తుండగానే తన దేహచ్ఛాయను అపురూపమైన రంగులతో మార్పుచేయగల శక్తి ఊసరవెల్లికి కలదు. మఱియు సూక్ష్మములగు వస్తువులు దూరదర్శన యంత్రము సహాయముతో చూడగా

అతిస్థూలముగ కన్పించును. పై ఉదాహరణలందు వస్తువుల స్వభావము మూలమున గాని, వానిని చూపు సామాగ్రి స్వభావము మూలమునగాని ఆయా వస్తువులు భాసించు విషయమున కొంతమార్పు కనబడుచున్నది. కాని ఊసరవెల్లిని ఊసరవెల్లిగను, ఆయాజాతికి చెందిన సూక్ష్మవస్తువులు, ఆయా జాతికి చెందిన స్థూల వస్తువులుగను గోచరించుట గ్రహింపదగియున్నది. కొన్ని వస్తువులకుగల సహజమగు స్వభావ భేదముచేగాని వానిని కనుగొను సామాగ్రి భేదమునగాని ఆ వస్తువులు ప్రకాశించు విషయమున మార్పు సంభవించిన సంభవింపవచ్చు. కాని అపరోక్షబ్రహ్మము సయితము పరోక్షముగ గోచరించుటకు తగిన కారణములు ఏవైనా యుండవచ్చు అని సంశయపడరాదు. అపరోక్షమగు ఆత్మను పరోక్షముగ తెలుపు వేదాంతములు ప్రమాణములు కాజాలవు. ప్రమాణములను వానిలో పరమప్రమాణములగు వేదాంతములు అపరోక్ష బ్రహ్మమును అపరోక్షముగనే తెలుపగలవు.

అవ: అపరోక్ష జ్ఞానము ఇంద్రియముల వలన పుట్టవలయునను కాని ఇంద్రియము కాని వాక్యము వలన పుట్టు జ్ఞానము అపరోక్షము కాజాలదను సంశయమును తొలగించుచున్నారు.

సుఖదుఃఖేచ్ఛా ప్రయత్నములు ప్రత్యక్షముగ తెలియుట లోకానుభవ సిద్ధము. అయినను వీనిని తెలుపు జ్ఞానము ఇంద్రియముల వలన పుట్టజాలదు. ఇంద్రియముల వలన పుట్టు జ్ఞానముచే సుఖదుఃఖాదులు గోచరించుననుటకు వేదాంతులు సమ్మతించరు. చీకటి ప్రత్యక్షముగ తెలియుచుండును. కాని దీనిని తెలుపు జ్ఞానము సయితము ఇంద్రియముల వలన పుట్టజాలదు. మఱియు స్వప్నమందు కనబడు వస్తువులన్నియు ప్రత్యక్షముగ తెలియుచుండును. ఆ సమయములో బాహ్యేంద్రియములన్నియు లయమయి యుండుటచే స్వప్నపదార్థ ములను జూపు జ్ఞానము ఇంద్రియముల వలన జనింపలేదనుట స్పష్టము. ఇంతియేగాక కనబడు వస్తువులకు పరోక్షత్వము, అపరోక్షత్వములను నిర్ణయిం చుట కనబడు వస్తువులకుగల యోగ్యత కాని, వేఱొండు కానేరదు. పై కారణ ముల వలన ఇంద్రియములవలన పుట్టు జ్ఞానము అపరోక్షత్వమును

నియమింప బడజాలదు.

సుఖదుఃఖేచ్ఛా, ద్వేష, ప్రయత్నాదులాత్మ గుణములని న్యాయవైశేషికు లందురు. కాని వేదాంతులు వీనిని మనోధర్మములందురు. “యదాసర్వే ప్రముచ్యంతే కామాయేస్య హృదిస్థితాః” అను శ్రుతియు, “కామసంకల్పో విచికిత్సా శ్రద్ధాశ్రద్ధా ధృతిరధృతిర్హీర్ధీర్భీరిత్యే తత్సర్వం మన ఏవ” అను శ్రుతియు కామ సంకల్పాదులను మనోమాత్రములని వక్కాణించుచు, మనోధర్మములను వేదాంతుల మతమునకు చేయూతను ఒసంగుచున్నది. మనోధర్మములగు సుఖదుఃఖేచ్ఛా ప్రయత్నాదులు వేదాంతుల మతమున సాక్షివేద్యములనబడును. ఇంద్రియ వేద్యములనబడవు.

లోకమున గల పదార్థములన్నియు భావపదార్థములనియు, అభావపదార్థము లనియు రెండు రకములు. చీకటియను పదార్థము ఘటపటాదులవలె భావ పదార్థమైన కావచ్చును. లేక కుందేటి కొమ్మువలె అభావపదార్థమైన కావచ్చును. న్యాయవైశేషికులు దానిని అభావ పదార్థమందురు. వేదాంతులు చీకటిని కుందేటి కొమ్మువలె అభావ పదార్థమనకుండా, ఘటపటాదులవలె భావ పదార్థమందురు. చీకటి వేదాంతులు చెప్పు విధమున భావ పదార్థమయినను, లేక న్యాయవైశేషి కులు తలంచు విధమున అభావ పదార్థమయినను కంటికి కనబడనేరదు. పదార్థములను కనుగొనుటకు వెలుతురును, కనబడు పదార్థములతోడ కంటికి సంబంధమును ముఖ్యావసరములు. వెలుతురు లేకున్నను కనబడు వస్తువులతోడ కంటికి సంబంధములేకున్నను కన్ను వస్తువులను కనుగొనజాలదు. చీకటి కుందేటికొమ్మువలె అభావ పదార్థమయినచో దాని తోడ కంటికి సంబంధము సంభవింపనిచో కంటికి కనబడజాలదు. ఘటపటాదులవలె భావ పదార్థమైనచో వెలుతురుండు సమయమున చీకటి కంటికి కనబడనేరదు. వెలుతురు సహాయము లేక కన్ను పదార్థములను కనుగొనజాలదు. కావున వేదాంతులు దానిని సాక్షి వేద్యమందురు.

బాహ్యపదార్థములను చూచురీతిగా ప్రత్యక్షముగ అనేక వస్తువులను

మనము కలలందు కాంచుట నిర్వివాదము. కలగను వేళలందు చక్షురాది బాహ్యేంద్రియములన్నియు లయమయియుండుటయు ఎల్లరకు తెలియును. కావున స్వప్న పదార్థములను అపరోక్షముగ జూపు జ్ఞానము ఇంద్రియముల వలన పుట్టకుండుట తేటతెల్లమగుచున్నది. కావున అపరోక్షజ్ఞానము ఇంద్రియములవలన పుట్టవలయునను నియమమును అంగీకరింపవలయునను నిర్బంధము ఇసుమంతయు కానరాదు. వేదాంతుల మతమున స్వప్న పదార్థము లను సాక్షి భాస్యములనబడును.

బ్రహ్మమును ఆవరించియుండు అజ్ఞానము సర్వానుభవసిద్ధమై యున్నందున జీవాత్మవలె బ్రహ్మము అపరోక్షముగ కనబడుటలేదు. మహావాక్యముల వలన పుట్టు అఖండ బ్రహ్మాకారజ్ఞానముచే ఆ అజ్ఞానము అంతరింపగలదు. అజ్ఞానాదు లచే కప్పబడియుండు పదార్థములను తెలుపు జ్ఞానము పరోక్షమనుట సత్యము. అట్టి పదార్థములను తెలుపుటకై ఉపదేశింపబడు “తత్త్వమసి” మహావాక్యముల వలన కలుగు జ్ఞానముచే ఆ పదార్థములను కప్పియుండు అజ్ఞానము భగ్నము కాగలదు. ఇట్లు అజ్ఞానము భగ్నమగుటయు తత్త్వవేత్తల అనుభవ సిద్ధమయి యున్నది.

ఛాందోగ్యోపనిషత్తునందు ఈ క్రింది కథ కనబడుచున్నది. సకల విద్యలను నేర్చియు, నారదుడు తృప్తి చెందక పరమార్థమును తెలియగోరి సనత్కుమారుని ఆశ్రయించెను. అంత సనత్కుమారుడు అతనిని పరీక్షించి విద్యోపదేశార్హత కనుగొని క్రమక్రమమున తత్త్వమును ఉపదేశించెను. “యత్రనాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి సభూమా। అథ యత్రా న్యత్పశ్య త్యన్యచ్ఛృణోన్య ద్విజానా తితదల్పిమ్ । యో వైభూమా తదమృతమ్ । అథయదల్పం తన్మర్త్యమ్” ముక్తుడు ఏ గుణత్రయా తీతావస్థయందు తనకన్న భిన్నమగు దానిని ఎద్దాని యందు చూడడో, వినడో, తెలియడో అట్టి వస్తువు ‘భూమ’ శబ్దముచే చెప్పబడు చున్నది. బద్ధుడు గుణత్రయావస్థయందు తనకన్న భిన్నమగు దానిని కను చుండును, వినుచుండును, తెలియుచుండును అట్టిది అల్పమనబడును. భూమ శబ్దముచే చెప్పబడునది అమృతము.

అల్పమనబడునది మృత్యుగ్రస్తము. ఇట్లు ఉపదేశించి "తస్మైమృదిత కషాయాయతమసః పారం దర్శయతి భగవాన్స నత్కుమారః" సనత్కుమారుడు చిత్తశుద్ధి కల నారదునకు జ్ఞానసారమును జూపి యూరకొనెను. తత్త్వవేత్తలు జిజ్ఞాసువులను పరీక్షించి బ్రహ్మోపదేశము చేయు దురు. చిత్తశుద్ధి గల జిజ్ఞాసువులకు అంతట అజ్ఞానము నశించగలదు.

"ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యోమంతవ్యో నిధి ధ్యాసితవ్యః" యను బృహదారణ్యక శ్రుతి ఆత్మను జూడవలెననిన శ్రవణము జేయవలయునని విధించుచున్నది. ఆ శ్రవణము వేదాంత వాక్యముల విమర్శయే విషయముగా గలది. విమర్శన పూర్వకముగ వేదాంత శ్రవణము చేయగా, ఆత్మసాక్షాత్కారము ఉదయించును. సుకేశుడు మొదలగు పలువురు జిజ్ఞాసువులు పిప్పలాదుడను గురువువద్ద వేదాంత శ్రవణమును చేసిరి. శ్రవణమాత్రముననే అజ్ఞానాంధకార మును తరించిరి. అట్లు కృతార్థులయిన సుకేశాదులు తమ మోహాంధకారమును తొలగించిన పిప్పలాదుడు తమకు జనకుడయియున్నాడని స్తుతించిరి. కావున శ్రవణ మాత్రము చేతనే అపరోక్ష జ్ఞానముదయింప గలదని స్పష్టమగుచున్నది.

బృహదారణ్యకోపనిషత్తునందీ కథ కలదు. యాజ్ఞవల్క్యుడను బ్రహ్మవేత్తకు మైత్రేయి, కాత్యాయిని అనియు ఇరువురు భార్యలు కలరు.వారిలో మైత్రేయి పరమార్థచింతనను, కాత్యాయిని గృహచింతనను కలిగియుండిరి. యాజ్ఞవల్క్యుడు గృహస్థాశ్రమమును పరిత్యజించి సన్యసింపగోరి మైత్రేయిని కాత్యాయినిని పిలిచి తన వద్దనున్న ధనమును ఇద్దరికీ పంచి ఇచ్చి సన్యసింప బోవుదునని చెప్పెను. పరమార్థ చింతాక్రాంతులగు మైత్రేయి "తనకు గల సంపదనంతయు వెచ్చించగా తనకు మోక్షము కలుగునా" అని ప్రశ్నించెను. సంపద ముక్తికి తోడ్పడజాలదని యాజ్ఞవల్క్యుడు వెల్లడించెను. ముక్తికి తోడ్పడరాని ధనముతో తనకు పనిలేదని స్వీకరింప నిరాకరించి, ముక్తినిచ్చు ఆత్మతత్త్వమును ఎఱింగించమని వేడుకొనెను. యాజ్ఞవల్క్యుడు అందులకు మిక్కిలి సంతసించి ఆత్మతత్త్వమును ఎఱింగింప ఉపక్రమించెను. లోకమున భార్యాపుత్రాదులు, భార్య యగుటచేతను, పుత్రు డగుటచేతను భార్యాపుత్రులు ప్రియులు కాజాలరు.

తన భార్య యగుటచేతను, తన పుత్రుడగుటచేతను తనకు ప్రియులగుచున్నారు. ఇట్లే లోకమున ప్రియ మగునవన్నియు తన కొఱకు ప్రియమగుచున్నవి. దీనిని బట్టి తాననునది ముఖ్య ప్రేమాస్పదమనుట స్పష్టమగుచున్నది. అట్టి "తాను" ఎవరో తెలుసుకొనగోరినచో శ్రవణము చేయవలయును. నిధి ధ్యాసనము చేయవలయునని "ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యోమంతవ్యో నిధి ధ్యాసితవ్యః " అను శ్రుతి ముఖమున వెల్లడించెను. దర్శనమనిన జ్ఞానము, శ్రవణమనిన వేదాంత వాక్యవిచారణము. శ్రుతార్థమునందలి ఉపపత్తిని విమర్శించుట మననమనబడును. ఉపపత్తి పూర్వక ముగ విమర్శించి నిర్ణయించిన అర్థమును ఎల్లప్పుడు హృదయమందు భావిం చుట నిధి ధ్యానమనబడును.

ఘటమును చూచునతనికి ఇది ఘటమనియు, పటమును చూచునతనికి ఇది పటమనియు జ్ఞానముదయించుట సహజము. ఒకరికి ఘటముగాని, పటముగాని చూపి నీవు అద్దానిని ఘటమని, పటమని తెలియవలయునని విధింపపనిలేదు. జ్ఞానమెన్నడును విధేయము కానేరదు. ఇట్లుండ పైన చెప్పిన దర్శన, శ్రవణ, మనన, నిధిధ్యాసములందు తొలిదర్శనము విధింపబడ జాల నందున మలి శ్రవణాదులు మాత్రమే విధింపబడుచున్నవని కొందఱందురు. కావుననే "ద్రష్టవ్యః" అను పదమున గల "తవ్య" ప్రత్యయము విధి కాదనియు, విధి సదృశమగు ప్రత్యయమనియు వీరి భావము. దర్శనము సయితము విధింప దగుననియు, కావుననే "ద్రష్టవ్యః" యను పదమునందలి తవ్య ప్రత్యయము విధి ప్రత్యయమనియు మఱికొందఱు తలంతురు. ఎట్లయినను శ్రవణ విధాన మును ఉభయులు సమ్మతించెదరు. ఈవిధమున వేదాంతములు ఆత్మసాక్షాత్కా రము కొఱకు శ్రవణమును విధించుటచే వేదాంత వాక్య శ్రవణము చేయగా ఆత్మసాక్షాత్కారముదయింప గలదని తేటతెల్లమగుచున్నది.

అవ: వేదాంతుల మతమున విషయము అపరోక్షమగుటకు చైతన్యా భేదము కారణము. అట్టి చైతన్యాభేదము వృత్తి మూలమైయుండును. ఆ వృత్తి ఇంద్రియ మూలము. కావున బ్రహ్మ సాక్షాత్కారమునకు ఇంద్రియాపేక్ష కలదను సంశయ మును బాపుచున్నారు.

అపరోక్షమనునది ముఖ్యమనియు, గౌణమనియు రెండు రకములు. పరాపేక్షలేని వస్తువునకు గల అపరోక్షత్వము ముఖ్యమనదగును. పరాపేక్ష గల వస్తువుల అపరోక్షత్వము గౌణమనబడును. బ్రహ్మము స్వతసిద్ధముగ స్వయం ప్రకాశము. కావున బ్రహ్మము అపరోక్షమయినందున పరాపేక్ష యుండజాలదు. కావున బ్రహ్మమునకు గల అపరోక్షత్వము ముఖ్యము. బ్రహ్మము అజ్ఞానముచే ఆవృతమయి యుండును. బ్రహ్మమును ఆవరించు అజ్ఞానము భగ్నము కాగా ఆ బ్రహ్మము తోడ సంబంధమేర్పడగా బాహ్య వస్తువులగు ఘటపటాదులు అపరోక్షములు కాగలవు. ఇచ్చట ఘటపటాదులు అపరోక్షములగుటకు బ్రహ్మమును ఆవరించు అజ్ఞానము భగ్నమగుటయు, బ్రహ్మముతోడ సంబంధము అపేక్షతములయి యున్నవి. ఘటపటాదులకు గల అపరోక్షత్వము పరాపేక్ష కలిగి యుండుటచే గౌణమనబడును. బాహ్య వస్తువులు అపరోక్షముగ కనబడు నెడల ఆ బాహ్యవస్తువులకు చైతన్యముతోడ సంబంధమేర్పఱుచుటకై ఇంద్రియముల వలన పుట్టు అంతఃకరణ వృత్తి అవసరమై యుండదగును. కాని బ్రహ్మము చైతన్యరూపము కావున చైతన్య సంబంధము ఆ బ్రహ్మమునందెల్లప్పుడూ గలదు. ఆ బ్రహ్మము అజ్ఞానావృత్తమయి యున్నందున ఆ ఆవరణ భంగమునకై మనము యత్నింపవలసి యున్నది. వేదాంత వాక్య శ్రవణము చేయగా, వాక్యము వలన పుట్టు అఖండ బ్రహ్మాకార వృత్తి ఆవరణమును తొలగించును. ఆవరణము తొలుగునంతనే చైతన్యము స్వతస్సిద్ధముగ స్వయం ప్రకాశమయి యుండుటచే చైతన్యము అపరోక్షముగ ప్రకాశించును.

అవ: వస్తువులపరోక్షము కాగల సందర్భమున వేదాంతులు చెప్పు ప్రక్రియ.

చైతన్యములేని వస్తువులెందును లేవు. ఘటపటాది బాహ్యవస్తువులన్నిటి యందు చైతన్యము కలదు. వానిని తెలియు జీవుడు చైతన్యస్వరూపుడు. ఘటపటాదులందరి చైతన్యమును విషయచైతన్యము లేక జ్ఞేయచైతన్యమందురు. వానిని తెలియు జీవచైతన్యమును ప్రమాతృ చైతన్యము లేక జ్ఞాతృచైతన్యమనియు పేర్కొందురు. పై చైతన్యములు రెండింటికి సంబంధమును కలుపు అంతఃకరణ వృత్తిని ప్రమాణ చైతన్యమందురు. బ్రహ్మరూపుడగు జీవుడు బ్రహ్మమువలె పరిమితి లేనివాడయ్యి, అంతఃకరణమను ఉపాధిచే పరిమితుడై శరీరమున సంచరించుచుండును. ఇట్టి జీవునకు బాహ్యవస్తువులను జూపునపుడు వానితోడ సంబంధము కావలయును. కాలువనీరు బోదెమూలమున ప్రవహించి, పొలమునందు ప్రవేశించి, ఆ పొలమునకు గల ఆకారమున పరిణమించు రీతిగా, అంతఃకరణము చక్షురాదీంద్రియములను ద్వారముల మూలమున బయలువెడలి, ఘటపటాది విషయములను ఆక్రమించి, తత్తదాకారమున పరిణమించును. అప్పుడు అంతఃకరణమున గల దేశముల నుండి ఘటపటాదులు కల దేశము వఱకు వ్యాపించి విద్యుద్దీపికవలె దందాయయమానమయియుండు చైతన్యమే ప్రమాణ చైతన్యమనబడుచున్నది. అంతఃకరణ ఇంద్రియములను ద్వారముల నుండి బయలు వెడలునపుడు ఆ అంతఃకరణముచే పరిమితమైన జీవచైతన్యము సయితము అంతఃకరణముతోడ బయలువెడలి, ఘటపటాది బాహ్యవస్తువులను ఆక్రమించి, ఆయా వస్తువుల ఆకారమును బొందును. కాగా ఘటపటాదుల యందలి విషయచైతన్యము, అంతఃకరణముచే పరిమితమగు జీవచైతన్యము ఏకము కాగలవు. ఈవిధముగా విషయ చైతన్యము, ప్రమాతృ చైతన్యము అభిన్నము కాగా, విషయముల పరోక్షములగును. పైన చెప్పిన ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయ చైతన్యములు త్రిపుటి యనబడును. ఘటపటాది బాహ్యవస్తువుల పరోక్షములగునెడ, ఆ బాహ్యవస్తువులందు గల చైతన్యమును ఆవరించియుండు అజ్ఞానమును తొలగించుటకు చక్షురాది ద్వారమూలమున పుట్టు అంతఃకరణ వృత్తియు, ఘటపటాదులు జడములగుటచే వానిని ప్రకాశింప చేయుటకు చైతన్యవ్యాప్తి లేక చైతన్యసంబంధమును అవసరమగును. వీనినే వృత్తివ్యాప్తి ఫలవ్యాప్తులందురు. బ్రహ్మము అపరోక్షమగు నెడల అద్దానిని కప్పి యుండు అజ్ఞానము తొలగింప మహావాక్యముల వలన పుట్టు బ్రహ్మాకారమగు అంతఃక కరణ వృత్త్యవసరమున్నను, బ్రహ్మము చైతన్యరూపమగుట చేతను, స్వయముగ ప్రకాశించుట చేతను, చైతన్య సంబంధము కలుపుటకు చైతన్యవ్యాప్తి అవసరములేదు. కాగా బ్రహ్మ సాక్షాత్కారమునకు ఇంద్రియ ద్వారమున అంతఃకరణము బయల్వెడల

పనిలేదు. కావున ఇంద్రియాపేక్ష కన్పించదు.

అవ: బాహ్యవస్తువులను తెలుపునపుడు వృత్తివ్యాప్తి, ఫలవ్యాప్తులు రెండును ఫలములనుచున్నారు.

ఘటపటాది బాహ్యపదార్థములు జడములనియు, వానియందుగల చైతన్యము అజ్ఞానముచే కప్పబడియుండుననియు తెలిపితిమి. కావున చైతన్యమును కప్పియుండు అజ్ఞానము పాయుటయు, ఘటపటాదులు జడములగుటచే వానికి చైతన్యవ్యాప్తి కలుగుటయు ఘటపటాదులు గోచరించుటకు ముఖ్య కారణములు. అంతఃకరణము విషయాకారమును పొందిననే ఘటపటాదుల యందలి చైతన్యమును ఆవరించు అజ్ఞానము అంతరింపగలదు. ఘటపటాదు లకు చైతన్యవ్యాప్తియు ఏర్పడగలదు. అందువలన బాహ్యవస్తువులను తెలియు సందర్భమున ఇంద్రియార్థ సంబంధ పద్ధతి అవసరమగుచున్నది. వృత్తివ్యాప్తి ఫలవ్యాప్తులిందే సార్థకములు. బ్రహ్మసాక్షాత్కారమున బ్రహ్మమును ఆవరించు అజ్ఞానము తొలగవలయుననే కాని, బ్రహ్మము స్వప్రకాశము కనుక చైతన్య సంబంధము లేక చైతన్యవ్యాప్తి అనవసరమని భావము.

మృగేంద్రము ముందుముందుకు సాగిపోవుచు వెనుక వెనుకకు తిరిగి చూచు విధమున మఱొక్కమారు ఆత్మ స్వరూపమును ముచ్చటించుచున్నారు. చక్షురాది జ్ఞానేంద్రియములు ఆత్మను జూడనేరవు. ఈ ఆత్మ ప్రకాశబలముతో చక్షురాదులు తమ తమ కార్యములను కొనసాగించుచున్నవి. వాగాది కర్మేంద్రియములు ఈ ఆత్మను అందుకొనలేవు. ఈ ఆత్మబలముననే వాగాది కర్మేంద్రియములు తమ తమ వ్యవహారములను సాగించుచున్నవి. ప్రాణము సయితము మీ యాత్మ బలముననే యన వరతము శ్వాసోచ్ఛ్వాసములను చేయుచుండును. ఏ బ్రహ్మముచేత శరీరేంద్రియ మనోబుద్ధులు ప్రకాశింపజేయపడినవో అట్టి బ్రహ్మమునకు అవిద్యాది మాలిన్యములు లేనందున అది పరిశుద్ధము. స్వతస్సిద్ధము. ఆఆత్మకు రెండవది సాటిలేదు. ఆఆత్మ నిర్భయరూపము. సచ్చిదానంద స్వరూపము. ఆ ఆత్మయే జీవాత్మ.

మహనీయులు బోధించు ఆత్మతత్త్వమట్లుండదగునా యని సంశయించు వారికిని, రాగద్వేషాదులచే చిత్త స్థైర్యము లేనివారికిని ఆత్మ తత్త్వము తెలియజాలదు. సంశయగ్రస్తుడగువాడు మహనీయుల సహాయము తోడను, తాను స్వయముగ వేదాంత వాక్యములను విచారించు మనస్సు కలవాడైయుండి, తత్త్వమునుతెలుసుకొనవలయును. చిత్తచాంచల్యము గలవాడు ఇంద్రియములను, మనస్సును విక్షేపములంతరించుటకై లాలనముల చేతగాని, బలాత్కారమునగాని బంధింపవలయును. అట్లు బంధించి వివిక్త ప్రదేశమున సుఖాసీనుడై అంతము లేనట్టి సచ్చిదానంద రూపమును ధ్యానింపవలయును. ఇంద్రియ నిగ్రహము, శ్రద్ధగల వానికీ ఆత్మసాక్షాత్కారము సంభవింపగలదు. అవిద్యకు రెండు శక్తులు గలవు. ఒకటి ఆవరణశక్తి. రెండు విక్షేపశక్తి. ముత్యపుచిప్పను త్రాడును తెలియక పోవుట అజ్ఞానము. ఈ అజ్ఞానము ముత్యపుచిప్పను, త్రాడును మనకు కనబడకుండా కప్పిపుచ్చును. ఇట్లు కప్పిపుచ్చుటయే ఆవరణశక్తి. అజ్ఞానమంతట విరమింపక ముత్యపుచిప్పయందు లేని వెండిని, త్రాటియందు లేని సర్పమును మనకు జూపును. ఇదియే విక్షేపశక్తి. విక్షేపశక్తులుడిగిన గాని ఆత్మసాక్షాత్కారము సంభవింపదు. చిత్తచాంచల్యమెల్లఱకు తెలియును. శంకరుడు కపాలములను చేతబూని భిక్షమెత్తుట లోకవిదితము. భిక్షగానికి ఆడించుటకు ఒక కోతి దొఱికిన భిక్షము ఎక్కువగా లభింపగలదు. కావున శ్రీ శంకర భగవత్పాదులు తమ శివానందలహరి యందు తమ యొద్ద ఒక కోతి గలదనియు, దానిని స్వీకరింపుమనియు శివుని వేడుచున్నారు. శ్రీ శంకర భగవత్పాదుల యొద్ద నున్న కోతి చిత్తమనునది. ఈ కోతి యెల్లప్పుడు మోహమను కీకారణ్యమున తిరుగుచుండును. వనితల కుచ పర్వతములందు ఎగిరి గంతులు వైచుచుండును. ఆశలను తరు శాఖలందు తిరుగుచుండును. వేయేల, ఇందందు యథేచ్ఛముగ విహరించుచు పట్టరానిదై యుండును. కైలాసనాథ! దీనిని బట్టి, భక్తి యను పగ్గమున బంధించి, నీ ఆధీనము గావింపుము. చిత్తమును భక్తి భావముచే పరమేశ్వరుని యందు బంధింప విక్షేపము లుడుగుననియు, పిమ్మట బ్రహ్మ సాక్షాత్కారము కలుగుననియు భావము.

అవ: యోగ విధానమును జూపుటచే ధ్యానమునే నిరూపించుచున్నారు.

ధ్యానింపదలచునతడు ధ్యాన నిరోధకమగు సాంగత్యమును విడువవలయును. యోగశాస్త్రమందు చెప్పబడిన సాత్త్వికాహారమును మితముగ తినుచుండవలయును. యోగశాస్త్రోక్త విషయములను విమర్శించి తెలియుచుండవలయును. మశకమృగాది ఉపద్రవములు లేని పవిత్ర ప్రదేశమున సుఖాశీనుడుగావలయును. క్షుత్పిపాసాది భేదములకు లోనుగారాదు. యమనియమములను ఆచరించుచు చిత్తచాంచల్యమును నిర్మూలనముచేసి, చిత్తమును వశపఱచుకొని, తొలుత స్థూలమూర్తి యందా చిత్తమును నిలిపి ధ్యానము చేయవలయును. స్థూలమూర్తిని ధ్యానించుట యందారి తేఱి పిమ్మట సూక్ష్మమగు చిదానందమూర్తిని ధ్యానించవలయును. అట్లు చేయగా, క్రమక్రమమున చిత్తచాంచల్యముడిగి, చిదానందైకరసమగు బ్రహ్మమున శాశ్వతముగ మనస్సు లగ్నముకాగలదు. పిమ్మట సాధకుని అజ్ఞానబంధము తెగత్రెంపులయి, సంసారబంధము నుండి విడుదల పొందును.

ఆత్మసాక్షాత్కారమును గోరునతడు యోగాభ్యాసము చేయవలయును. యోగమునకు యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణము, ధ్యానము, సమాధి యను ఎనిమిది అంగములు.

అహింసయు, సత్యము, అస్తేయము, బ్రమ్మచర్యము, అపరిగ్రహమను నైదును యమములనబడును. శౌచము, సంతోషము, తపము, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము అనునైదును నియమములనబడును. అహింస యనగా త్రికరణశుద్ధిగ ఎల్లప్పుడు ఏ ప్రాణికిని ద్రోహము చేయకుండుట. సత్యము పలుకుచుండుట, దొంగిలింపకుండుట, బ్రహ్మచర్యము సలుపుట, పరిగ్రహము చేయకుండుట యోగికి ముఖ్య కర్తవ్యములు. శౌచము బాహ్యమనియు, ఆంతరమనియు రెండు విధములు. స్నానాదులు బాహ్య శౌచములు. హితమిత భోజనము, మైత్ర్యాదులు ఆంతర శౌచములు. లభింపనివాని కొరకు పరితాపము బొందక లభించిన దానితో తృప్తిజెందుట సంతోషము. తపమాచరించుటయు, వేదశాస్త్రములను అధ్యయనము చేయుటయు తాము చేయు సకల కర్మలను

ఈశ్వరార్పణ జేయుచు నిరంతరం ఈశ్వరుని ఆధీనుడయి యుండవలయును. పై యోగాంగములను సాధించుచుండ క్రమముగా కర్మబంధము వీడును.

సాధకుడు గురూపదేశపూర్వకమగు మహావాక్యముల వలనగాని, యోగము వలన గాని, అపరిమితానంద రూపమగు పరమాత్మ సాక్షాత్కారమొందును. పిమ్మట ఆ ఆనందానుభవనమున మునిగి తేలుచు ఆజన్మాంతరము దృఢసమాధి నిష్ఠుడు కావచ్చును. లేక లోకసంగ్రహము గోరి దైవప్రాప్తములగు సకల విషయములను సేవింపవచ్చును. ఎట్లయినను కర్మబంధమున మరల జిక్క జాలదు. మహావాక్య జ్ఞానముగాని, యోగాభ్యాసము గాని ముక్తికి కారణమనుట గ్రంథకారుల సమ్మతమని కొందఱు భావింపవచ్చును. గ్రంథకారుల ఆశయము మాత్రమది కాదు. మహావాక్య జ్ఞానమే మోక్షకారణమని వారి అభిప్రాయము. "తమేవ విదిత్వాతి మృత్యుమేతి నాన్యః పంథా విద్యతేయనాయ", "తరతి శోక మాత్మవిత్" మొదలగు శ్రుతులు ఆత్మజ్ఞానమే మోక్షహేతువని వక్కాణించి, ముక్తి పొందుటకు వేఱొక కారణము లేదని నిరాకరించుచున్నవి. అట్టి ఆత్మజ్ఞానము గురువులు ఉపదేశించు మహావాక్యము వలన బుట్టును. శ్రోతకు చిత్తశుద్ధి లేకుండుటచేతను, రాగద్వేషాది మాలిన్యములుండుట చేతను గురూపదేశములు అతనికి జ్ఞానోదయము కలిగింపలేకపోవుటయు తథ్యము. చిత్తమున రాగద్వేషాది వృత్తిమాలిన్యము తొలగించుటకును, తన్మూలమున చిత్తశుద్ధి సంపాదించుటకును యోగాభ్యాసము చేయవలయును. "యోగశ్చిత్త వృత్తినిరోధః" అను పాతంజలి యోగ సూత్రము చిత్తవృత్తులను నిరోధించుటయే యోగమని వివరించుచున్నది. చిత్తమలహరణమే యోగాభ్యాసమునకు ఫలము. యోగాభ్యాసముచే మాలిన్యము తొలగగా గురూపదిష్టమగు మహావాక్యముల అర్థము గోచరింపగలదు. కావున మహావాక్యార్థ జ్ఞాన మూలముననే మోక్షమనియు, ఆ మహావాక్యార్థ జ్ఞానము సంపాదించుటకు యోగాభ్యాసము తోడ్పడగలదనియు గ్రంథకారుల తాత్పర్యము.

జ్ఞానులగు జనకాదులు లోకసంగ్రహము గోరి కర్మాచరణ తత్పరులయి యుండుట పురాణములయందు కన్పించుచున్నది. గీతాతత్త్వోపదేష్టయగు

శ్రీకృష్ణ పరమాత్మయు "లోక సంగ్రహమేవాపి సంపశ్యన్కర్తుమర్హసి" యని జ్ఞానిని సయితము లోకసంగ్రహము కొఱకు కర్మలను జేయనుపదేశించు చుండెను. కావున బ్రహ్మజ్ఞానులు ఎల్లవేళల బ్రహ్మనిష్ఠయందేయున్నను, లోకవ్యవహారము చేయుచున్నను కర్మబంధము వారిని అంటరాదని భావము. జ్ఞానులు విధి నిషేధాతీతులు. కావున జ్ఞానులు నిషిద్ధాచరణము చేయవచ్చునని సంశయమొంద పనిలేదు. అనేక జన్మముల నుండి చిత్తశుద్ధికై ఫలములను కోరకుండా కర్మలను ఆచరించుటచే ఇప్పుడు జ్ఞానసంపన్నులయిరి. అట్టి జ్ఞానులు వారి పూర్వ కర్మ సంస్కార వశమున విహిత కర్మలనే ఆచరింతురు. నిషిద్ధ కర్మలను చేయబూనరు. జ్ఞానులు రాగద్వేష విహీనులగుటచే కర్మాచరణముల సంభవింపరాదనియు జెప్పవలను కాదు. లోకసంగ్రహమే జ్ఞానుల కర్మాచరణమునకు కారణము. ఇట్లుండ ఏదో ఒక కారణమున జ్ఞానులందు నిషిద్ధాచరణము గాన్పించినను, నిగ్రహానుగ్రహ సమర్థులగుటచే నిషిద్ధాచరణము అట్టి జ్ఞానులకు మాలిన్యమును తేజాలదు. పరశురాముడు మాతృహననము చేసియు లోకనిందకు పాత్రుడు కాలేదు. శ్రీకృష్ణపరమాత్మ గోపికా లోలుడుగ గాన్పించియు అస్ఖలిత బ్రహ్మచారి యని ప్రసిద్ధి చెందెను.

చతుర్ముఖ ప్రజాపతి భువనములకు పాలకుడు. ఈ చతుర్ముఖ ప్రజాపతు లొకరి వెనుక మఱియొకరు భువనములను పాలించుచుందురు. చిరకాలమట్లు పాలించు చతుర్ముఖులిప్పటికి పృథివీ పరమాణు సంఖ్యకు మించిన సంఖ్య గల వారలతి క్రమించియుందురు. అట్టి దీర్ఘకాలమున మనకెన్నడు ముక్తి లభించి యుండలేదు. ఎట్టకేలకు నేడాపదము నొందగలిగితిమి. అందు దుః ఖమా వంతయు గానరాదు. ముక్తిపద సుఖమింతింతయని చెప్పనలవికాదు. ఆ ముక్తి పదము తొలుత నుండియు తన రూపమయి యున్నది. ఇట్టి ముక్తిపదము దొఱకుట కన్న మించిన లాభమేమియులేదు. ఈ సంసారమనునది ఒక విశాల మగు నాటకశాల. ఇందు విధి నిర్మితములగు ఈ వేషములను ఒకదాని వెనుక మఱియొకటి గైకొనుచుంటిని. మాతృగర్భమునందీ వేషము దాల్చి, మాతృ యోని ద్వారమను తెర తొలగించి, వెలుపలికేగి పరమేశ్వరా! నీ యెదుట నా వేసములను జూపుచుంటిని. నీవు సర్వము తెలిసినవాడవు.

దయామయుడవు. జగదేకపాలకుడవు. నా వేసములను మెచ్చి, నన్ను సత్కరింపజాలుదువు. నీయావికి నేనర్హుడను. ఆ యావిని బెద్దగ గోరు ఆశయు నాకు లేదు. చిరకాలము నుండి వేసముల నాడి యాడి విసువు చెంది యుండుటచే నీవేసములను జాలింపనీ యనుమతి వేడగోరుదును.

దేవ మానవులకు కాలమానమున భేదము కలదు. దేవమానము మానవ మానమును అతిక్రమించి యుండును. అనగా చతుర్ముఖ ప్రజాపతి నూఱు సంవత్సరములతని కాలమానమును అనుసరించి, జీవించి, పాలించు కాలమున మానవులు పుట్టుచుననేక జన్మములను జూడవలసియుండును. అట్టి చతుర్ముఖులనేకులిప్పటికి కాలగతి బొందియుందురు. కాని మనకింతకు పూర్వమెన్నడు నాముక్తి పదము దొఱకకపోవుట సత్యము. మనకాపదము దొఱికియున్న నేడిట్లు పుట్టియుండము. "త ఇమం మానవమావర్తం నా వర్తంతే" "అతి మృత్యుమేతి" మొదలగు శ్రుతులు ముక్తి బొందిన వానికి పునర్జన్మము లేదనుచున్నవి. ఎన్నడు దొఱకని ముక్తి పదము నేడు దొఱుకుట కన్న గొప్ప లాభము వేఱొక్కటి యుండదనియు, ముక్తిబొందుట కడుదుర్లభమనియు భావము. ఆత్మరూపమగు ముక్తిపదము దొఱకుటయు వాస్తవము కానేరదు. కాని తెలియనితనమున దొఱకని రీతి నుండి తెలియుటవలన దొఱికినట్లు కన్పించగలదు.

వేదాంతములు "ఆత్మేత్యేవోపాసీత" యని మొదలిడి ఆత్మ జ్ఞానమును ఉపదేశించినవి. డెక్కల గుఱుతుచే పశువుల జాడ తెలియు విధమున ఆత్మజ్ఞానముచే సకలము తెలియనగుచున్నవి. కంఠాభరణము పోయెనని విచారించు మూఢుని ప్రక్కనగల పురుషుడు కంఠాభరణము నీ కంఠమందే కలదని బోధించును. అంతకుముందు నష్టము కాని కంఠాభరణము నష్టమాయె నష్టమాయెనని విచారించు మూఢుడు దొఱకకున్నను దొఱికినట్లు సంతోషించును. దీనినే కంఠచామీకర న్యాయమందురు. చంటిపాపను ఊయలయందు పరుండ బెట్టి చంటిపాప కొఱకు ఊరు గాలించు తల్లివలె తానైయున్న ఆత్మస్వరూపమును మఱచి ఎక్కడెక్కడో వెదుకుచున్నాము. ఆత్మ స్వరూపము తానై యుండుటచే

ఎల్లవేళలనది లబ్ధమయి యుండును కాని అలబద్ధము కానేరదు.

అవ: బాధితమయినయ అజ్ఞానము ప్రపంచమువలె మరల సంభవింప వచ్చునను సంశయమును బాపుచున్నారు.

అజ్ఞానము బాధితము. ధ్వంసముకాదు. బాధితమను పదమునకు, ధ్వంసమను పదమునకు భేదమెంతేని కలదు. ధ్వంసములగు వస్తువులు సూక్ష్మరూపమున తమ కారణముల యందుండును కావున ధ్వంస వస్తువులు సద్వస్తువులనదగి యుండును. బాధితమగు వస్తువు మూలఛిన్నమయినదగుటచే సూక్ష్మరూపమున సయితము నిలువనీడలేక అసద్వస్తువనదగియుండును. ధ్వంసానుధిష్ఠాన రూపమగు కారణము కన్న వేఱయి యుండును. అజ్ఞానము యొక్క బోధయు అధిష్ఠానముకన్న వేఱగు ధ్వంసరూపము కాదు. ఇంతియేగాక బాధ బుద్ధికి అభావమను ప్రసిద్ధి బొందజాలదు. బాధ బుద్ధికిని, అభావ బుద్ధికిని స్వరూపము నందు సయితము భేదము కలదు. “ఇందు ఘటము లేదు” అనునది అభావబుద్ధి. ఈ బుద్ధి ఘటమిచట లేదని మాత్రము గ్రహించును. “ఇది సర్పము కాదు, త్రాడు” అనునది బాధబుద్ధి. ఈ బాధబుద్ధి పాము కాదని గ్రహించి, విరమింప త్రాడనే అధిష్టానమును గ్రహించును. కావున బాధాభావ బుద్ధులకు భేదము స్పష్టమగుచున్నది. కావున అజ్ఞానము బాధితమయ్యును ప్రపంచమువలె మరల కన్పించజాలదు. బాధాభావ బుద్ధులకు పైన చెప్పిన భేదమును అంగీకరింపక, బాధబుద్ధియు, అభావబుద్ధియు ఒక్కటియే యున్నను అజ్ఞాన బాధయు అధిష్ఠానమగు బ్రహ్మరూపమయి యుండును. కాని అజ్ఞానము మరల సంభవింపనేరదు.

అవ: అధిష్ఠానమగు బ్రహ్మము నెఱుంగునతనికి భయము లేదనుచున్నారు.

జీవులకు గల కర్మములు సంచితము, ప్రారబ్ధము, ఆగామి యని మూడు విధములు. సంచితము తూలా రాశివలె జ్ఞానాగ్ని యందు భస్మము కాగలదు. ప్రారబ్ధము భోగముచే క్షీణమగును. వివేకముచే వెలుగొందునతడు నీటియందలి తామరాకువలె రాబోవు కర్మముల నంటరాడు. ప్రారబ్ధకర్మ సంచితమువలె భస్మము కాజాలదనియు, రాబోవు కర్మమువలె నిర్బీజము కాజాలదనియు

చెప్పిరి. ప్రారబ్ధము భోగమునిచ్చి క్షయమగుననిరి. ప్రారబ్ధ కర్మమున కిట్టి గొప్పతనమేల? ప్రారబ్ధము సయితము సంచితమువలె భస్మమేల కాజాలదు? అనే సంశయములు సాధకులకు కలుగును. కాని ప్రారబ్ధమను శబ్దమునకు ఆరంభింపబడినది యని అర్థము. ఒకడు ధనస్సునందు బాణమును సంధించి, క్రూరమగు పులిని లక్ష్యముచేసి విడిచెను. విడిచిన బాణము అతి వేగమున పోవుచుండును. ఏ యొక్కరు దాని వేగమును ఆపజాలరు. వేగముండు వఱకు బోయినిలిచి, మార్గమున పులి అడ్డు తగిలినను చంపును లేదా గోవు అడ్డు తగిలినను జంపును. పులికాని, గోవుకాని అడ్డము తగలకున్నను బాణము తనంతట తాను దూసుకుపోయి వేగముపశమింప నిలుచును. వేగముపశమించుటకు పూర్వము గోవు ఆ మార్గమున వచ్చుట చూచి, గోవును చంపరాదని యెంచి, మనమెన్ని శపథములను జేసినను బాణము విడువబడియుండుటచే ఆ బాణము నిలువజాలదు. అట్లే ప్రారబ్ధమగు దేహము నడచుట ప్రారంభించెను. కావున నడుమ జ్ఞానోదయమయినను ప్రారబ్ధకర్మము పశమించు పర్యంతము నశింపజాలదు. “తస్యతావదేవ చిరం యావన్న విమోక్షేథ సంపత్స్యే” అను శ్రుతియు, బ్రహ్మజ్ఞాని శరీరమును విడిచినంతనే ముక్తి బొందునని చెప్పుటచే ప్రారబ్ధము భోగపర్యంతము నశింపదని తెలియుచున్నది. కాని ప్రారబ్ధ దేహముకన్న భిన్నమగు కర్మసముదాయము జ్ఞానాగ్నిచే వెంటనే భస్మీభావమును పొందుచున్నది.

అవ: ప్రారబ్ధ భోగశేషముండు గాక. భోగసాధనమగు ద్వైతము బాధితము గానంత భోగమెట్లు సంభవించును? మూలాజ్ఞాన ముచ్ఛిన్నము గానంత ప్రారబ్ధము సయితమెట్లు శేషించును? అనే సంశయములను తొలగించుచున్నారు.

కలలందున్న చోర వ్యాఘ్రాదులు మెలకువ కలిగినంతనే బాధితములగును. కాని వాటిని చూచుటచే కలిగిన భీతియును, దేహకంపమును మెలకువ కలిగిన పిమ్మట కొంత కాలమట్లే యుండుట అనుభవమున నున్నది. వస్త్రము కాల్చినను, వస్త్రాకారమగు భస్మము కొంతకాలమట్లే యుండుటయు తెలియ వచ్చుచున్నది. ఇట్లే ప్రపంచము బాధితమయ్యును వివేకులు దేహమును

చాలించునంత వఱకు భోగార్హమయి యుండును.

అవ: విద్వాంసునకు అహంకార మమకారములు లేవు. కావున భోగమెట్లు సంభవింపగలదను సంశయమును అంగీకారముచే పరిహరించుచున్నారు.

పుట్టయందు పాము కుబుసము విడుచుటకు పూర్వము ఆ కుబుసము తన దేహమయి యుండుటచే దానిని తలచుచుండును. కుబుసము విడిచిన తర్వాత ఆ కుబుసము పుట్టయందు కనబడుచున్నను తనను వీడిపోవుటచే దానిని తలంపకుండును. ఇట్లే జ్ఞానసంపన్నుడగు విద్వాంసుడు జీవించి శరీరముతోడ సంచరించుచున్నను, శరీరము తాననియు, తనదనియు తలంపడు. చూచువారలు మాత్రము అతడితరులవలె సంచరించుచున్నందున ఆతనికి తమకువలె శరీరాదులుండునని కల్పింతురు. పరులు శరీరాదులు కల్పించినంత మాత్రమున వివేకము కలవానికి ఇసుమంతయు హాని వాటిల్లదు. పరమార్థమును పరికింప ప్రారబ్ధ భోగము సయితము విద్వాంసునకు వాస్తవము కానేరదు.

అవ: ప్రారబ్ధమపహార్యమేని విద్వాంసునకు సయితము జయవిజయాదు లకు సంభవించిన రీతిని విలక్షణాదృష్టము వలన జన్మాదులు సంభవింపవచ్చు నను సంశయమును బాపుచున్నారు.

లోకమునందు గల సకల దేవాసురులును సకల విధముల ప్రయత్నించియు తత్త్వవేత్తకు అపకారము చేయజాలరు. తనకు తాను అపకారము ఏ ఒక్కడు చేసుకొనబూనడు. ఈ యతీశ్వరుడు దేవాసురల కెల్లరకు ఆత్మరూపుడయి యుండుటచే జయవిజయాదుల వంటివాడు కానేరడు. కనుక ఏ విధమునను బ్రహ్మవేత్తకు జన్మాదులు సంభవించు నవకాశము లేదు. విద్వాంసునకు రాగద్వేషాదులు లేకపోవుటచే నతడెవ్వరికి అనిష్టము చేయబూనడు. ఏ యొక్కడు విద్వాంసునకు అనిష్టము చేయజాలడు.

మంచి నడతకుగాని, చెడునడతకుగాని రాగద్వేషాదులు కారణములు. బ్రహ్మము నెఱింగిన విద్వాంసునకు రాగము, లోభము, మోహము, ప్రమోదము

మొదలగు దోషములు క్షీణించుటచే ఒకప్పుడు దుష్టమగునడత యందు ఆసక్తుడు కాడు. అనేక జన్మలనుండి మంచి నడత కలిగియుండును. లేకున్నచో ఇప్పుడు బ్రహ్మవిద్యను బడయజాలడు. పూర్వజన్మ సంస్కార వశమున సాధు సచ్చరిత్రము బాలింప నుద్యుక్తుడయి, సత్పురుషునివలె ఉంటూ, ఇతరులకు అపకారము చేయబూనడు.

బ్రహ్మజ్ఞాని దుఃఖసంబంధము లేశమాత్రము లేని పరమానంద రూపుడయి యుండును. అతనికి బొందదగిన సుఖముకాని, విడువదగిన దుఃఖము కాని లేదు. అతడసంగమగు ఆత్మరూపుడయి యుండును కావున దుఃఖములతనికి నంటరావు. జూచువారలు బ్రహ్మవేత్తకు గొప్ప కష్టములు సంభవించెనని యొకప్పుడును, సంతోషము సమకూడెనని యొకప్పుడు తలంచుచుందురే కాని బ్రహ్మవేత్త మాత్రము మేరువువలె నిశ్చలుడయి యుండును. ఎల్లవేళల పరమానందభరితుడై ఒక్కచోట నిలుకడలేక ప్రపంచమంతటా తిరుగుచుండును. విషయముల వలన జనించు సుఖదుఃఖములతనిని అంటరావు.

బ్రహ్మవేత్తల కెల్లరకు ఒకే తీరును ప్రారబ్ధము సంభవింపదు. వారి వారి కర్మానుసారము వారివారి ప్రారబ్ధము వేర్వేఱు తీరున నుండును. కనుకనే వశిష్ఠాదులు కొందఱు వర్ణాశ్రమాచార తత్పరులయి యుందురు. జడభరతాదులు కొందఱు అజ్ఞులవలెను, బాలురవలెను, ఉన్మత్తులవలెను, బాలగ్రస్తులవలెను కన్పింతురు. సౌభరి మున్నగు మరికొందఱు అనురాగము కలిగి భోగతత్పరులయి యున్నారు. జైగీషుడు మొదలగువారు ధ్యాన నిష్ఠ యందుండి పరబ్రహ్మానంద మున తేలియాడుచుందురు. ఈ విధముగా చిత్రమగు వేర్వేరు నడతకు విద్వాంసుల ప్రారబ్ధ కర్మయందలి వైచిత్ర్యమే కారణము.

యోగులెల్లప్పుడు స్వతస్సిద్ధమయి యుండు ఆత్మానందమున మునిగి తేలుచుందురు. వారి సంచార క్రమమును లోకులు గుర్తింపనేరరు. వారి ఆచరణ మెల్లప్పుడు లోకకల్యాణము సమకూర్ప జాలియుండును. వారి ఆచరణ మందు సంగము కన్పించదు. వారి ఆచరణమును లోకులు ప్రతిబంధింప జాలరు. నీటియందు చేపలు ఈదుటయు, ఆకాశములో ఎగిరేపక్షుల జాడయు,

వాయువు దిగంతములందు తిరుగుచుండుటయు గుర్తింపరానట్లే బ్రహ్మవేత్తల నడతయు గుర్తింపరానిది.

జగన్నాథుడగు శ్రీహరి పాద కమలములను యోగీశ్వరులెల్ల వేళల ధ్యానించుచుందురు. బ్రహ్మవేత్తలగు జ్ఞానులా శ్రీహరి రూపులనుటకు జగత్ప్రసిద్ధి గాంచిన భగవద్గీత "జ్ఞానిత్వాత్మైవ మేమతమ్" అని సాక్ష్యమిచ్చును. అట్టి శ్రీహరి బ్రహ్మవేత్తల పాదధూళిచే తాను పవిత్రుడు కాగలననుచు వారిని వెంబడింతు ననెను. సకల జగన్నాథుడు శ్రీహరి యిట్లు చెప్ప ఇతర దేవాసుర దానవులీ బ్రహ్మవేత్త పాదకమలములకు వంగి నమస్కరింతుననుట చెప్పనేల? బ్రహ్మానంద మున మునిగి తేలియాడునిట్టి జగద్గురువగు బ్రహ్మవేత్తకన్న మఱియొక ధన్యుడీ బ్రహ్మాండము నందెవడు కలడు? దుస్తరమగు సంసార సముద్రమును తరించిన బ్రహ్మవేత్త కృతకృత్యుడు. నిత్యతృప్తుడు. అజ్ఞానమను సముద్రము యొక్క దరిని చేరి, పూర్ణమనోరథుడయ్యును, సకల ప్రాణహితమందు ఆసక్తుడై స్వతస్సిద్ధమగు కుతూహలము వలన పృథివిని సంచరించుచున్నవాడయి అనుక్షణము ఆత్మానందమును అనుభవించుచుండును.

జనన మరణములనెడి సంసారము స్వతస్సిద్ధముగ సంకట భూయిష్టము. నేనట్టి సముద్ర మధ్యమున చిరకాలముగ మునిగియుండి, దరిగానక వెదుకుచుంటిని. పూర్వ పుణ్యవశముచే అమృతమునిచ్చు చింతామణి రూపుడయి సద్గురువు చిరకాలమునకు దొరికెను. స్వచ్ఛమయినట్టి, మధురమైనట్టి గురువాక్యములచే నా అజ్ఞానాంధకారము తొలగి బ్రహ్మరూపము బోధింపబడెను. ఇపుడు నేను పరిపూర్ణమయిన అపరిమితానందమున క్రీడించుచున్నాను. దురవగాహమగు బ్రహ్మమును నేనెట్లు చూడగలిగితినని ఆశ్చర్యము, ఎట్లేని చూడగలిగితినను కుతూహలము, కృతార్థుడనైతినని ఆనందము, నావలెనే సకల జనులు దీనినెట్లు తెలియగలుగుదురను కరణయు, గురుబోధచే నాలో ఉప్పొంగుచున్నవి. ఇట్లు జననమరణ సంసారతాపము తాళలేని సకలజీవులు అమృతమును అందింప గల గురువును ఆశ్రయించి పరమానంద భరితులగుదురు.

అవ: విద్యావిద్యలు రెండింటికిని తన అనుభవ సిద్ధమయిన ఫలమును చెప్పుచున్నారు.

జ్ఞానోదయమునకు పూర్వము అజ్ఞానముచే నా కండ్లు కప్పబడి యుండెను. కాచ కామిలాది దోషగ్రస్తులు ఎదుట నుండు వస్తువును గానకుండుటయు, నద్దానిని మఱియొక వస్తువుగ జూచుటయు గలదు. అట్లే అజ్ఞానము నా కండ్లను కప్పియున్నందున స్వతస్సిద్ధమగు నిజానందము స్వయముగ భాసించుచున్నను, అద్దానిని నేనిప్పుడు తెలియకుంటిని. ఇప్పుడు జ్ఞానమనే కాటుకచే నిర్మలమగు దృష్టి కలవాడనైన నాకు చిదానందము భాసించుచున్నది. మిథ్యాభూతమగు ఈ ప్రపంచము నాకిపుడు కనబడుచున్నను, సత్యమని తెలియజాలకున్నాను. జ్ఞానోదయమునకు పూర్వము ప్రపంచము సత్యముగ తోచును, సచ్చిదానందము తెలియరాదు. జ్ఞానోదయమునకు పిమ్మట సచ్చిదానందము తెలియునే కాని ప్రపంచము సత్యమని గోచరించదు.

ఈ సమస్త ప్రపంచము ముత్యపుచిప్ప యందు వెండివలె బ్రహ్మమున కల్పితమయియున్నది. ముత్యపుచిప్ప తెలియగానే వెండి మాయమయినట్లుగా బ్రహ్మమునందు కల్పితమయిన ప్రపంచము బ్రహ్మము తెలియునంతనే సునాయాసముగ లీనమగును. స్వతస్సిద్ధముగనే తెలియరానట్టియు, తెలియ కుండునది కానట్టియు, వాగింద్రియముచే చెప్పరానట్టియు, స్వీకరింపరానట్టియు, క్షణకాలమయినను కప్పిపుచ్చరానట్టియు ఆత్మ స్వరూపము మనకు అఖండాకార జ్ఞానముచే గోచరించును.

ముత్యపుచిప్ప యందు వెండిని, త్రాటియందు పామును కల్పన చేయు రీతిగా ఈ ప్రపంచమును బ్రహ్మమునందు మనస్సు కల్పించును. మనస్సు సయితము బ్రహ్మమందే కల్పితమయియున్నది. కల్పితమగునవియన్నియు నెందు కల్పితములగునో నందే లయము చెందుట స్పష్టమయియున్నది. మనస్సు బ్రహ్మరూపుడయిన నాయందుపశాంతము కాగా సకల ప్రపంచము ముత్యపు చిప్పయందు వెండివలెను, త్రాటియందు పామురీతిని అంతార్థనము పొందెను. నిజముగ ప్రపంచము లేనందున ప్రపంచమంతర్ధానమగుటయు, నిజము కాదని

తెలుపుటకై సూర్యాదులస్తమించు విధమున ప్రపంచమస్త మించెనో, ఘట పటాదులవలె ధ్వంసమాయెనో, ఉపమర్దనము పొందెనో, అగ్నిసంయోగము వలన నేయివలె విలయము చెందెనో, గాలితాకిడిచే వికసించిన తామరపూలరేకు వలె విడివడిపోయెనో, పామునోట బడిన కప్పవలె మ్రింగబడెనో లేక మితమగు లఘ్వాహారమువలె ప్రపంచమును, దాని అస్తమయమును ఇట్టివియని చెప్పరాని అనిర్వాచ్యములని భావము.

ప్రపంచము మనోమాత్ర విజృంభితము. దాని లయమును విద్యారణ్యులు "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అని నుడివిరి. ప్రపంచము మనోమాత్ర విజృంభితములగు కలలవలె వారి వారికి కన్పించవలయునే కాని, యెల్లఱకు నొక్కరీతి కనబడజాలదని కొందఱందురు. కాని ప్రపంచము ఈశ్వర సృష్టమనియు, అంతఃకరణ సృష్టమనియు నిరుతెగలు కాగలదు. అందీ కనబడు ప్రపంచమంతయు ఈశ్వర సృష్టము. అట్టి విశ్వమును జీవుడు తన మనోవృత్తిచే తనకిది ఇష్టమనియు, ఇది అనిష్టమనియు కల్పించును. ఇది జీవసృష్టమనబడును. ఇట్లు జీవుని మనస్సుచే కల్పింపబడిన ప్రపంచము బంధకమగును. ఈశ్వరకల్పితమగు ప్రపంచముబంధకము కానేరదు. కావుననే విద్యారణ్యులు మనస్సును బంధమోక్షములకు కారణమనిరి. దూరదేశమున మన బంధువులు సుఖంవంతులయి యుందురు. కాని తుంటరి యొకడు ఆ బంధువులు ఆపదలో మునిగియున్నారనుచు మనకు వర్తమానము చేయగా, అంతట మనము మనోవృత్తిచే బంధువులను దుఃఖవంతులుగ కల్పించి దుఃఖింతుము. బంధువులకు దుఃఖము లేకున్నను, మనస్సుచే కల్పితమగు దుఃఖము ఇప్పుడు బంధకమనుట స్పష్టము. ఇట్లే నిజముగ ఆ బంధువులు ఆపదలో యున్నను, మనకావర్తమానము తెలియక, బంధువులు సుఖవంతులని భావించుచు మనము సుఖించుటయు గాంచనగును.

అవ: జగముల పుట్టువు మున్నగునవి అనిర్వాచ్యములనుచున్నారు.

ఆత్మయనునది ఇతర వస్తు సంబంధములేని సహజ చైతన్యరూపము. కావున నిర్వికార రూపమయి యుండును. ఇట్లు నిర్వికారమయి ఇతర వస్తు

సంబంధములేని ఆత్మయందీ ప్రపంచమెట్లు పుట్టును? ఎట్లుండును? ఎట్లు లయమగును? అను విషయములను నేర్పుతో విమర్శించి యెట్లును బుట్టజాలదనియు, ఉండజాలదనియు, లయము కాజాలదనియు తెలిసి మిథ్యయని నిర్ణయించితిని. ఇది యిట్లని చెప్పనలవి కాకుండుటయే మిథ్యయనియు, అనిర్వాచ్యమనియు చెప్పబడును. ప్రపంచము యొక్క జన్మస్థితి లయములు ఎండమావుల యందు నీటివలె మిథ్యా భూతములు. జగన్నిర్మాణము జేయునని మనమూహించు పరబ్రహ్మమునకు నిలువ ఆధారమగు దేహములేదు. ఆకారము లేదు. కరచరణాద్యవయవములు లేవు. అట్టి బ్రహ్మము అంతటా నిండియుండు టచే అచంచలము. ఇట్టి బ్రహ్మమునకు కార్యము చేయవలయునను స్పృహయు కానరాదు. ఆ బ్రహ్మకు సహాయ భూతమగు రెండవ వస్తువు లేదు. బ్రహ్మము అసంగము కావున మాయ సంబంధము దానికిలేదు. మాయయు నద్దానినంట రాదు. ఇట్టి రెండవసాటిలేని పరబ్రహ్మమునకు ప్రపంచమును నిర్మింపవలయు ననిన అంతరంగ బహిరంగ సాధనములు కావలయును. మాయ బహిరంగ సాధనము కాగలదు కాని బ్రహ్మము నిస్సంగమగుటచే మాయ బ్రహ్మమును నంటరాదు. అంతరంగ సాధనములనదగు కరచరణాదులాత్మకు లేవు. అట్టి బ్రహ్మము త్రిభువనముల నెట్లు పుట్టింపగలదు. పుట్టింపనేరదని భావము. పుట్టువు సంభవింపజాలని త్రిభువనములకు స్థితిలయములు సంభవింపకపోవుట స్పష్టము.

బ్రహ్మము లోకములను పాలించుట అద్భుతము. పాలించు నతనికి భటులు, మంత్రులుండవలయును. పాలించువేళలు, గజతురగాది బలములు, పరిపూర్ణములగు ధనాగారము లుండవలయును. గ్రామ పట్టణాది ప్రదేశములు, మిత్ర బృందములుండవలయును. ఇన్నిటిని కలిగి శత్రుసేనలను తుదముట్టించి నిజరాజ్య పాలనము చేయవలయును. కాని బ్రహ్మమునకు ధరింపదగిన దేహాదులు లేవు. మంత్రివర్గమనదగు బుద్ధ్యాదులు లేవు. పాలింపదగిన శబ్దాది విషయములుగాని, గజతురగాది బలములనబడు ఇంద్రియములుగాని లేవు. అసత్యములయిన ధనాగారములవంటి అన్నమయాది కోశమలయిదు

శూన్యములు. గ్రామ పట్టణముల వంటి స్థూలసూక్ష్మకారణ శరీరాధ్యాసములు లేవు. మిత్రుని వంటి శుభవ్యాపారములు లేవు. ఇట్లు ఏకాకియయ్యును, నిజబలముచే సకలమును తుచ్ఛముచేసి, స్వస్వరూప బలముచేతనే మిథ్యాభూత మయిన కామక్రోధాది శత్రుసేనలను జయించి సమస్త ప్రపంచమును పాలించుట అద్భుతము. లోకములన్నియు మిథ్య కావున వాటి పాలనయు మిథ్య.

బ్రహ్మము అసంగము, ఉదాసీనము, పాణిపాదోదరములు సయితమా బ్రహ్మమునకు లేవనుట "అపాణిపాదః" అను శ్రుతుల వలన స్పష్టము. అట్టి బ్రహ్మమునకు దేహము సయితము చైతన్యము గాక, వేఱొండు గాన్పింపదు. అసంగము కనుకనే మాయా సంబంధము సయిత మీయాత్మకు పొసగదు. ఇట్టి ఆత్మ ఛిద్రము లేనిది. స్వయముగ అవకాశ శూన్యుడయ్యును, సంహారము చేయు తలంపులేనివాడై, మాయా సహితమయిన లోకత్రయమును ఎట్లు సంహరించుచున్నాడో తెలియరాదు. బ్రహ్మము సంహారకార్యము చేయజాలునది. ప్రపంచమునకు పుట్టువు, పాలన పొసగనందున సంహారమును సంభవింపదు.

చోరునకు, తత్త్వవేత్తకు లోకము నందెన్నేని అంశములు తుల్యములయి కానవచ్చుచున్నవి. మూఢులు సత్యమని తలంచు విశ్వమును తత్త్వవేత్త బహు యత్నములచే నిరాకరించుచున్నాడు. చోరుడు, మూఢులు, భూస్థాపితముచేసి నిలువజేసిన ధనమును నేర్పుతో అపహరించును. ఆత్మకాక వేఱొండు వస్తువు యథార్థము కాకపోవుటచే తత్త్వవేత్తకును, మఱియొక చోరుని సయితము విశ్వసించకపోవుటచే చోరునకు విశ్వసింపదగిన వాడీ విశ్వమందు లేడు. తత్త్వవేత్తకు యముడు మున్నగువారు మిథ్యా భూతులగుటచేతను యిరువురకును యముని వలన భయము లేదు. ఆత్మ నిర్గుణమగుటచే బ్రహ్మవేత్త బ్రహ్మకు గుణములు కలవనుటను ద్వేషించును. చోరుడు మంచి గుణములను ద్వేషించుట స్పష్టమే కదా! బ్రహ్మవేత్త స్వార్థప్రియుడు. అనగా స్వస్వరూపమగు బ్రహ్మరూప పదార్థమే బ్రహ్మవేత్తకు ప్రియము కాని వేఱొండు ప్రియము కానేరదని భావము. చోరుడు స్వార్థప్రియుడు. అనగా స్వప్రయోజనపరుడని భావము.

బ్రహ్మవేత్త ప్రపంచము మిథ్యయనుట చేతను, చోరుడు జగద్వంచన చేయుట చేతను వీరిరువురి చరిత్రము చిత్రమయియున్నది. చోరుల మాటలనే యొక్కడు నిజమని తెలియజాలడు. ప్రపంచమంతయు సత్యముగ కనబడుచుండగా, ప్రపంచము మిథ్యయని చెప్పు బ్రహ్మవేత్తల పలుకులను సయితము ఏ యొక్కడెందును తెలియజాలడని భావము. "యతతామపి సిద్ధానాంకశ్చిన్మాంవేత్తి తత్త్వతః" యనుటచే బ్రహ్మవేత్తలు చేయు తత్త్వోపదేశము నేయొక్కడేని తెలియగలడని భావము. ఇంతియేగాక:

శ్రవణా యాపి బహు భిర్యోన లభ్యః
శృణ్వంతోపి బహవోయంన విద్యుః ।
ఆశ్చర్యోవక్తా కుశలోస్య లబ్ధా
ఆశ్చర్యో జ్ఞాతాకుశలాను శిష్టః ॥

అనుటచేత నీ దురవగాహమగు బ్రహ్మతత్త్వము తెలుపునతడు దుర్లభు డనియు, తెలియునతడును దుర్లభుడనియు తెలియుచున్నది.

బ్రహ్మవేత్త బ్రహ్మరూపుడై యుండును. బ్రహ్మమునకు పుట్టువు లేకపోవుటచే బ్రహ్మవేత్తకును పుట్టువులేదు. కావున బ్రహ్మవేత్తకు జనకుడు లేడని భావము. బ్రహ్మమునకు పరిమితి లేనందున బ్రహ్మవేత్తకును పరిమితి లేదు. బ్రహ్మమ సహాయమగుటచే స్నేహితుడును లేడు. బ్రహ్మమునకు శరీరమను గృహమునందు దీర్ఘజీవనమునకు తగిన ధనములేదు. బ్రహ్మమునకు క్షుత్పిపాసులు లేవు. బ్రహ్మము సర్వప్రదేశములందు నిండియుండుటచేవాయు, ఆకాశములు అతనికి లేవు. బ్రహ్మమునకు కట్టబట్టయు, తినతిండియు, త్రాగునీరును, శ్వాసోచ్ఛ్వాస ములు లేవు. సర్వవ్యాపకమయి యుండు అద్దానిని ఏ ఇంద్రియము కాని తెలియజాలదు. బ్రహ్మమిట్లు దురవగతమయి యుండుటచే ఆ బ్రహ్మరూపుడగు బ్రహ్మవేత్తకు నాదౌర్గత్యము కలదు. లోకమున సయితము జనకహీనుడు, మిత్ర బృందరహితుడు, అన్నపానములు, ధనములేని గర్భదరిద్రుడు, కట్ట బట్టలేక యోగక్షేమములరయు బంధువర్గము లేక పృథివి యందు సంచరించుచుండును. లోకులట్టి వాని యోగక్షేమములరయురు.

ఇవన్నియు లేని బ్రహ్మము పరిమితి లేని ఆనందరూపమగుటచే నిరుపమానమగు సుఖసామ్రాజ్యము కలిగియున్నది. ఆ పరబ్రహ్మ మీ సమస్త జగదాకారము. వాస్తవమునకీ జగములు లేవు. కావున బ్రహ్మము జగదాకారము కాజాలదు. బ్రహ్మమీ సమస్త జగములకు లోపల వెలుపల నిండియుండును. ప్రపంచము లేదు గావున లోపల వెలుపల నుండజాలదు. బ్రహ్మ మీ సంసారమున కావలియొడ్డు. కాని బ్రహ్మమునకు పరిమితిలేదు కావున బ్రహ్మమునకు అవధిలేదు. ఆ బ్రహ్మము అహంకారమున కాస్పదము కాజాలదు. అట్టి బ్రహ్మము నేనయియుంటిని.

అవ: తాను హిరణ్యగర్భుడనను చున్నారు.

బ్రహ్మవేత్తకును, హిరణ్యగర్భునకును హస్తి మశకాంతరము కలదు. హిరణ్యగర్భుడు నివసించు లోకము సత్యలోకము. కావున నతడు సత్యలోక నివాసియగును. బ్రహ్మవేత్తకు సకల లోకము మిథ్య కనుక నతనికి సత్యలోకము కాని, సత్యలోక నివాసము కాని సంభవింపదు. హిరణ్యగర్భుడు కమలాసనుడు. బ్రహ్మజ్ఞానోదయమునకు పూర్వము బ్రహ్మవేత్త హృదయ కమలాసీనుడయి యున్నను, బ్రహ్మజ్ఞానోదయమునకు పిమ్మట మునుపటివలె పరిమితి లేక పోవుటచే సకల బ్రహ్మాండము నిండియుండును. కావున హృదయ కమలాసనుడు గానేరడు. బ్రహ్మవిష్ణు మహేశ్వరులు ముమ్వురు సత్త్వరజస్తమోగుణ ప్రధానులు. అందు హిరణ్యగర్భుడు రజోగుణము కలవాడు. బ్రహ్మవేత్త త్రిగుణాతీతుడగుటచే హిరణ్యగర్భునివలె రజస్సంపర్కము కలవాడు కాడు. హిరణ్యగర్భునకు విధియని పేరు. కావున విధి శబ్దమాతని యందు ప్రవర్తించును.కాని బ్రహ్మవేత్త విధి నిషేధములనతి క్రమించి యుండును. హిరణ్యగర్భునకు సరస్వతీదేవి తోడను, వేదములతోడను సంబంధముండును. బ్రహ్మవేత్త వాగాది సకలాతీతు డగుటచే వేదాది వాక్సంబంధములేనివాడు. హిరణ్యగర్భుడు సంకట భూయిష్టము లగు లోకములను నిర్మాణముజేయు వ్యసనమున దగిలియుండును. బ్రహ్మవేత్తకు నిదియులేదు. అయినను బ్రహ్మవేత్త సర్వాత్మరూపుడగుటచే హిరణ్యగర్భుడు కాగలడు. సమూహము సర్వాత్మరూపుడని చాటుచున్నందున బ్రహ్మవేత్త

హిరణ్యగర్భుడని భావము.

అవ: తాను విష్ణువనను చున్నారు.

విష్ణువు మాయావి. “మమ మాయాదురత్యయా” అని శ్రీకృష్ణ పరమాత్మ తనకు మాయ కలదని నొక్కి వక్కాణించెను. బ్రహ్మవేత్తకు మాయ విలయము జెందెను. మహావిష్ణువు సర్పశయనుడు. బ్రహ్మవేత్తకు భోగములుడుగుటచే భోగికాడు. మునుపటివలె నిపుడంతఃకరణమున పరుండుటలేదు. అనగా అంతః కరణ పరిమితిచే పరిమితుడు కాడని భావము. విష్ణువు చక్రధారియని ప్రసిద్ధి. సంసార చక్రము విరమించుటచే బ్రహ్మవేత్త చక్రి కానేరడు. విష్ణువు దశావతార ముల నవతరించెను. బ్రహ్మవేత్త జాగ్రదాద్యవస్థల యందు నవతరింపక, అవస్థాతీతుడయి యుండును. విష్ణువునకు పాలింపదగిన లోకములు కలవు. సకలము మిథ్య కావున బ్రహ్మవేత్తకు పాలింపదగిన లోకములు లేవు. ఇట్లు బ్రహ్మవేత్తకును, విష్ణువునకును భేదమెంతేని కనబడుచున్నది. విష్ణు శబ్దమునకు సర్వవ్యాపకుడని అర్థము. బ్రహ్మవేత్త సర్వాత్మ స్వరూపమగు పరబ్రహ్మమయి యున్నందున, సర్వము నిండియున్నందున బ్రహ్మవేత్త విష్ణువనబడును.

అవ: శివుడనను చున్నారు.

శంకరునకు పంచభూతములును, యజమాన సూర్యచంద్రులను ఎనిమిది మూర్తులు కలవు. అండజ, స్వేదజ, ఉద్భిజ, జరాయు, జాప్య, తైజస, వాయనీయ, మానస రూపములగు శరీరములు బ్రహ్మవేత్తకు లేకపోవుటచే నష్టమూర్తి కానేరడు. శివుడు ముక్కంటిడగుటచే విషయ దృష్టిగలవాడు. బ్రహ్మము సత్యమనియు, లోకములు అసత్యమని తెలియుటచే బ్రహ్మవేత్త విషయ దృష్టి కానేరడు. శంకరుడు విభూతి లిప్తాంగుడగుటచే భూతి లేపనుడు. బ్రహ్మవేత్తకు జనక సంబంధము లేకపోవుటచే భస్మలేపము లేక జన్మ సంబంధము లేదు. శంకరుడు వృషభవాహనుడై సంచరించును. బ్రహ్మజ్ఞానముచే బ్రహ్మవేత్త వృషశబ్దార్థమగు ధర్మాధర్మములచే లోకాంతర సంచారము జేయ జాలడు. శంకరుడు భోగి భూషణుడగుటచే సర్పభూషణ సంబంధము గలవాడు. బ్రహ్మరూపుడగు బ్రహ్మవేత్తకు భోగిశబ్దవాచ్యులగు జీవులతోడ

సంబంధములేదు. కావున బ్రహ్మవేత్త భోగి సంగుడు కాడు. శంకరుడు మదన సంహారమొనర్చెను. బ్రహ్మవేత్తకు కోరికలు లేవు కావున వాని విఘాతమును లేదు. ఇట్లుండియు బ్రహ్మవేత్త సాక్షాత్పర శివుడైయున్నాడు. అనగా బ్రహ్మవిష్ణు మహేశ్వర పదములందు గల ఆనందము బ్రహ్మవేత్తకు గలదని అర్థము.

ఆత్మస్వరూపమునిపుడు సింహరూపమున నిరూపించుచున్నారు. సింహము అడవులందు సంచరించుచుండును. ఆత్మసింహము జాగ్రత్స్వప్న సుషుప్తులను వనములందు తిరుగుచుండును. కాని ఆత్మ అసంగమగుటచే ఆత్మకాజాగ్రదాద్య వస్థల సంపర్కములేదు. సింహము అడవులందు తిరుగునపుడు దాని బలాధిక్య మునకు వెఱచి లేళ్ళు మున్నగు క్షుద్ర జంతువులు సింహమునకు భయపడి పారిపోవును. అట్లే పరమార్థ సత్త్వముగల ఆత్మ మూడవస్థలందును స్వేచ్ఛగా సంచరించుచున్నను ఇంద్రియములు ఆత్మసింహమును కంటజూడనేరవు. కనుగొనలేవు. అడవులందు తిరుగు సింహ సంచారపు జాడలేమాత్రము గుర్తించినను, వనమందలి మదపుటేనుగులు నిస్సత్త్వములయి జీవచ్ఛవములవలె పడియుండును. అట్లే బ్రహ్మవేత్త చేసిన వేదాంత వాక్యశ్రవణములచే పుట్టిన అఖండ బ్రహ్మాకార వృత్తి అజ్ఞానమను మదపుటేనుగును, మహామోహమును పరిహరించును. కావున కాలము మొదలగు ప్రపంచము లేనిదైన ఆత్మసింహ మిపుడు కాలాతీత పదమున వెలుగొందుచున్నది.

అవ: జీవన్ముక్తుడు లోకములను పవిత్రము చేయుచున్నాడనుచున్నారు.

లోకుల అజ్ఞానమపహరించుటకు మేల్కాంచిన జ్ఞాని సూర్యునివలె లోకములను పవిత్రము చేయుచున్నాడు. సూర్యకిరణములు లోకమున గల అంధకారమును తొలగించును. బ్రహ్మవేత్త పలుకులను వినెడివారల అజ్ఞానమును తొలగించును.

"నతత్ర సూర్యోభాతిన చంద్ర తారకం
నేమా విద్యుతో భాంతికుతో యమగ్నిః ।
తమేవభాం త మనుభాతి సర్వం
తస్యభాసా సర్వమిదం విభాతి ॥"

అని శ్రుతులు పలుకుటచే సూర్యుని యందు కనబడు తేజమతనికి స్వతస్సిద్ధము కానేరదు. సత్యపదార్థమగు బ్రహ్మతేజముచే భానుడును, అతని కిరణములును వెలుగొందుచుండును. బ్రహ్మవేత్త పలుకులును సత్యమగు బ్రహ్మ పదార్థమును వెల్లడించుటచే భాసించుచుండును. సూర్యోదయము కానంత వేదవిహిత కర్మానుష్ఠానము చేయ అనర్హములు కావున సూర్యుని కిరణములు శ్రుతులకు, అనగా వేదములకు సుఖములు. బ్రహ్మవేత్తలు పైన చెప్పిన విధమున కీర్తించుటయు శ్రవణము చేయుటై యుండును. సూర్యకిరణములు నిద్రించువానిని మేల్కొలుపును. బ్రహ్మవేత్త పలుకులు వినువారలను అమృతులను జేసి మేలుకొలుపును. భానుడుదయించుట జూచి పుణ్యాత్ములు ప్రణతులగుదురు. బ్రహ్మవేత్తల ఆగమనము జూచి జన్మాంతరమున సుకృతము కలవారలును ప్రణతులగుదురు. ప్రణతులగువారికి భాస్కరుడు ఆరోగ్యమును జేకూర్చి ఆనందింపజేయును. శివస్వరూపుడగు బ్రహ్మవేత్తయు ప్రణతులగు జిజ్ఞాసువుల అజ్ఞానమును పోగొట్టి ఆత్మతత్త్వమును జూపి వారలకు ఆనందమును జేకూర్చును. "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్, జ్ఞానమిచ్ఛేన్మహేశ్వరాత్" అను ప్రమాణ వచనములు పై అర్థమునకు తోడు కాగలవు. ఇట్లు బ్రహ్మము నెఱింగిన జీవన్ముక్తులు లోకములను నెఱింగిన జీవన్ముక్తులు లోకములను భానునివలె పవిత్రము చేయుచున్నారని భావము.

బ్రహ్మవేత్త ఫలత్యాగపూర్వకముగ వాసనా సహితమగు సర్వకర్మలను పరిత్యజించును. ఆత్మ స్వరూపమే వేదాంత సారము. అట్టి ఆత్మ సుఖరూపము నిర్భయము. తన చిత్తము ఆ బ్రహ్మమందు నిలిపి బ్రహ్మవేత్త సుఖించుచుండును. ఇట్టి బ్రహ్మవేత్తకన్న ధన్యుడు వేఱొక్కడు లేడు. ఇతడు కృతార్థులలో కెల్ల అగ్రగణ్యుడు. సకల లోకులచే గౌరవింపదగినవాడు. అనాయాసముగ నిట్టి బ్రహ్మానందమితనికి లభించుటచే ఇతడు పుట్టిన కులము ధన్యాతి ధన్యము. సకల కర్మలను పరిత్యజించి చిత్తమును ఈశ్వరార్పణము చేసి సుఖించుట కన్న వేఱొండు సుఖము లేదనుట స్పష్టము.

అవ: విద్వాంసునకు విదేహ కైవల్యమును చెప్పుచున్నారు.

బ్రహ్మవేత్తకు సిద్ధింపవలసిన కోరిక లేవియులేవు. అతడు పూర్ణమనోరథుడు.

అయినను పతితులను ఉద్ధరించుటకు సహజమగు కరుణతో లోకమున తిరుగుచుండును. అతని దయా ప్రవాహమున మునుగువారలు చిరకాలము ఈ పృథ్వీ మండలమున తిరిగి ప్రారబ్ధశేషము తొలుగునంత విదేహకైవల్యమును బొందును. అంతట ప్రారబ్ద శోకము సయితముపశమింప "ఆప్నోతి స్వారాజ్యమ్" అనెడి వేదము చెప్పు సుఖసామ్రాజ్యమును అధిగమించి, ఆనంద సముద్రుడయి యుండునని భావము.

అవ: బ్రహ్మీభూతుడగు విద్వాంసునకు జనన వికారము మరల రాగలదను సంశయమును బాపుచున్నారు.

లోకమునగల చంద్రునకు ఉదయాస్తమయములు కలవు. వృద్ధి క్షయములు గలవు. ఇట్లు వృద్ధి క్షయములు గల చంద్రునకు కాంతియును "తస్యభాసా సర్వమిదం విభాతి" యను శ్రుతియు పరబ్రహ్మము నుండి సంప్రాప్తమగునని ప్రకటించుచున్నది. ఆ పరబ్రహ్మమను చంద్రునకు తేజో విషయమున పరాపేక్షలేదు. సహజమగు తన కాంతిచే నెల్లప్పుడు వృద్ధి క్షయములును ఉదయాస్తమయములును లేక వెలుగొందుచుండును. లోకమున కనబడు చంద్రుడు అమృత రూపుడనియు, దేవతలమృతాంధసుగుటచే "ఆప్యాయస్వ అపేక్షీయస్వ" యనుచు ఆ అమృతమును ఆస్వాదించుచుందురనియు వేదమున కనబడుచున్నది. కావుననే చంద్రునకు వృద్ధి క్షయములు సంభవించును. ప్రత్యగాత్మ యను చంద్రుడు ఉదయింపడు. అస్తమింపబడు. వృద్ధిబొందదు. క్షయమును బొందదు. ఆత్మయను చంద్రుడు సహజమగు సుఖామృతముచే నిండియుండును. ఇట్టి సుఖామృతము సహజమగుటచే బ్రహ్మమను చంద్రుడు ఎల్లప్పుడూ అమృతపూర్ణుడు. లోకములోని చంద్రునికి ఒక కళంకము గలదు. ఆత్మచంద్రునకు ద్వైతమను కళంకములేదు. కావున ఆత్మచంద్రుడు నిష్కళంకుడు. ఈ ఆత్మచంద్రుడిట్టి వాడని చెప్పనలవికాదు. ఇట్టి ఆత్మ చంద్రుడెల్లప్పుడూ భాసించుచుండును. కావున బ్రహ్మభూతునకు జననమరణాది వికారము లెన్నడు సంభవింపజాలవని భావము.

స్రక్చంద వనితాది విషయములనుభవింప, ఆయాసుఖములు మన అనుభవముకు గోచరములైయున్నవి. ఈ ఆనందములన్నియు బ్రహ్మానందమను

అద్వైత-2
79

భగవద్గీత విశిష్టత

- వ్యాఖ్యాత:
కాకర్ల రామకృష్ణవేణి

భగవద్గీత శృతి, యుక్తి స్వానుభవమును బోధించుచున్నది. కొన్ని శృతి ప్రమాణములను స్వీకరించుచు యుక్తిని అంగీకరించవు. మరికొన్ని శాస్త్రములు శృతి, యుక్తులను అంగీకరించుచు అనుభవమును అంగీకరించవు. శృతి, యుక్తి స్వానుభవముతో విచారించిన శాస్త్రమే శాస్త్రం. కొన్ని శాస్త్రములు ప్రవృత్తిని మాత్రమే బోధించును. కొన్ని కేవల నివృత్తిని మాత్రం బోధించును. శాస్త్రమనగా, నివృత్తి-ప్రవృత్తులను బోధించునది శాస్త్రము. కావున భగవద్గీత శాస్త్రము యనబడెను.

మానవునకు మూడు దోషములు గలవు. మలము, విక్షేపము, ఆవరణ. ఈమూడుదోషములు తొలగించుటకు మూడుసాధనలు చెప్పబడినవి. 1.మల దోషనివారణ కొరకు నిష్కామకర్మానుష్టానము 2. విక్షేపదోషనివారణకు అంతఃకరణశుద్ధికొర్కై ఉపాసించుట. 3. ఆవరణదోష నివారణకు ఆత్మానాత్మవిచారణ. ఈ క్రమమును భగవద్గీత బోధించినది. వేదము ఏ విధముగ కాండత్రయమో ఇట్లే గీతయు కాండత్రయము. మొదటి ఆరు అధ్యాయములలో కర్మషట్కం మధ్యలో గల ఆరు అధ్యాయములలో భక్తిషట్కము (ఉపాసన) చివరి ఆరు అధ్యాయములలో జ్ఞానషట్కమును బోధించెను. కొన్ని శాస్త్రములు కేవల కర్మమును కొన్ని కేవల ఉపాసనను మరికొన్ని కేవలజ్ఞానమును ప్రతిపాదించినవి. కావున కర్మశాస్త్రమును మాత్రమే ఆశ్రయించినచో ఉపాసన మిగిలియుండును. కేవలజ్ఞాన శాస్త్రమును ఆశ్రయించినవారికి మిగతా కర్మ, ఉపాసన శాస్త్రములు మిగిలియుండును. ఇట్లుగాక ఈ మూడు ఒకే గ్రంథములో యున్న గ్రంథం భగవద్గీత. ఇది గీతలో గల విశిష్టత.

మనకు **1,180** ఉపనిషత్తులు గలవు. ఇందులో **840** కర్మకాండను, **232** ఉపాసనకాండను,**108** జ్ఞానకాండను బోధించుచున్నవి. **1,180** ఉపనిషద్

అద్వైత-2
80

లను పఠించి వాటి అర్థమును గ్రహించుటకు జీవితము సరిపోదు. కావున ఆదిశంకరాచార్యులవారు 10 ఉపనిషద్‌లకు మాత్రమే భాష్యమును రచించినారు. పదింటిలో కర్మ, ఉపాసన, జ్ఞానమును క్రమముగా కొన్నింటిలో చెప్పబడినది. కొన్నింటిలో నేరుగా జ్ఞానము చెప్పబడినది. మహావాక్యములు ఈ 10ఉపనిషద్ లలోనే గలవు. వేదాంతమనగా 1. అవస్థాత్రయ విచారణ 2. దేహత్రయ విచారణ 3. పంచకోశ విచారణ 4. మహావాక్య విచారణ 5. ఓంకారవిచారణ. ఈ అయిదింటిలో ఏ ఒక్క దానిని, విచారించిన మిగతా వాటిని విచారించినట్లగును. ఉదాహరణ: అవస్థాత్రయమును విచారించినచో దేహత్రయ, పంచకోశ విచారణచేసినట్లగుచున్నది. ఈవిషయమును వేదాంతపంచదశిలో విద్యారణ్యుల వారు చెప్పియున్నారు. ఆత్మకులక్షణములు మూడు. 1.సత్తు 2.చిత్తు 3.ఆనందం. సత్తు నిర్ధారణకు దేహత్రయము, చిత్తు నిర్ధారణకు అవస్థాత్రయము, ఆనంద నిర్ధారణకు పంచకోశ విచారణ దెలియపరిచారు. ఇట్లే సత్తును విచారించిన చిత్తును విచారించినట్లగును. చిత్తును విచారించిన సత్తును విచారించినట్లగును. ఈరెండింటి విచారణద్వారా ఆనందమును విచారించినట్లగును. ఈమూడును ఏకస్వరూపమై ఉన్నందున సత్‌యనియు, స్ఫురించినందున చిత్తనియు, ఈ చిత్తుయందు రెండవది లేనందున ఆనందమనబడెను. అగ్నికి ఎఱుపు, కాల్చుట రెండును ఎట్లు విడదీయజాలమో ఇట్లే ఈ లక్షణములు ఆత్మకు స్వరూపమైయున్నవి. ఈ విషయమును గీతలో బాల్య, యవ్వన, వార్ధక్యములలో ఆత్మమారుట లేదని చెప్పుటచేత దేహత్రయమును విచారణ చేసినట్లయినది.

> ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభి ధీయతే ।
> ఏతద్యోవేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥

సారాంశం: దేహేంద్రియ సంఘాతమై ప్రత్యక్షముగా దెలియబడుచున్నట్టి ఈ శరీరమే క్షేత్రమనబడుచున్నది. రాగద్వేషాది దోషములు గలవాడైన పురుషుడు దీని ద్వారా క్షీయంతే నశించుచున్నాడు. కావున ఈ శరీరమునకు క్షేత్రమని పేరు. తనకు తానే క్షీణించిపోవుచున్నది కావున క్షేత్రం. గోచరమగు ఈ శరీర

మును ఎవడు ఎఱుంగుచున్నాడో, అనగా దేహం మొదలుకొని బుద్ధిని కూడా తనకంటె వేరైనదానిగా ఎవడు ఎఱుంగుచున్నాడో అట్లు ఎఱుంగువాడే క్షేత్రజ్ఞుడు. క్షేత్రమున కన్నను క్షేత్రజ్ఞుడు వేఱుగా కనబడుటలేదేయను శంక రాగా! నిజమే మనకు రెండు బాధలుయున్నవి. 1. ఆత్మయుండి కనిపించక ఒక బాధ. జగత్తు లేకపోయిన కనిపించుట మరొక బాధ. ఆత్మకు నామరూపములు లేనందున లేదనుకొంటారేమోనని ఉన్నదని భావించమన్నారు. జగత్తు నామరూపాలతో కనిపించుచున్నందున ఉన్నదనుకొంటారేమోననిలేదని భావించమన్నది శాస్త్రము. అదెట్లనగా, లోకంలో లేకనే కనిపించునవి కొన్ని, ఉండి కనిపించనివి కొన్ని. కనిపించనంత మాత్రంచేత లేదనగలమా! వాయువు, ఆకాశం సుఖ-దుఃఖాదులు - బుద్ధి, వీటన్నింటిని - గుర్తెంరిగే జ్ఞానం ఆత్మ వీటిని లేదనగలమా? ఇట్లే ఆత్మ యున్నది. లేకనే కనిపించునవి ఎండమావుల యందు నీరు, ఆకాశమునకు నీలిరంగు, స్వప్నపదార్థములు. ఇవి లేకనే కనిపించుచున్నవి. ఇట్లే అధిష్ఠాన జ్ఞానం లేనందున జగత్తు దోచుచున్నదే కాని యథార్థంలో లేదు. క్షేత్రమును ఎఱుంగునట్టి క్షేత్రజ్ఞుడే లేకపోయిన యెడల ఇది శరీరం, ఇది ఘటము, ఇది పఠంయను దృశ్యానుభవమే లేకపోవలసివచ్చును. క్షేత్రజ్ఞుడు లేని పక్షమున జగత్తే కనబడకుండ పోవలయును. సూర్యుడిచేతనే ఈ సమస్త ప్రపంచము తెలియుచున్నది. ఇట్లే క్షేత్రజ్ఞునిచేతనే కదా. మహత్తుమొదలు స్థూల పర్యంతము గల సమస్త దృశ్య సమూహమూ లోపల, వెలుపల తన ప్రకాశంచే వ్యాపింపబడి ఇది యంతయు ప్రకాశింపబడుచు... ఇది ఫలానది, ఇది ఫలానది అని సమస్తమును తెలిసికొనబడుచున్నది. క్షేత్రజ్ఞుడే లేకున్న లోపలి మహదాదులు, వెలుపలి ఘటాది పదార్థములు, సుఖ-దుఃఖాది వృత్తులు, జాగ్రదాది అవస్థలు వీటి యొక్క స్వరూప వివేచనగాని అనుభవంగాని లేకపోవలసియుండును. కావున మూడవస్థలలో యుండుటచేత సత్తు స్వరూపుడు మూడవస్థలలో నిర్వికారముగా సాక్షిగా యున్నందున చిత్ స్వరూపుడనియు, మూడవస్థలలో ఆనందముగా యుండుటచే ఆనంద స్వరూపుడనబడెను. క్షేత్రజ్ఞుడు లేడు అనినచో తానే లేకపోవలసి వచ్చును.

అద్వైత-2
81

జాగ్రత, స్వప్న, సుషుప్తి యందు అభిమానం గలవారైన విశ్వ, తైజస, ప్రాజ్ఞులు వికారములు గలవారగుటచేత వీరికి నిత్యత్వం సంభవింపదు. ఒక్కొక్కనికి మూడవస్థల జ్ఞానం సంభవింపనేరదు. ఎట్లనగా జాగ్రతయున్నప్పుడు స్వప్నం లేదు. స్వప్నంలో జాగ్రత లేదు. ఈ రెండు సుషుప్తిలో లేవు. కావున విశ్వాదులకు నిత్యత్వం సంభవింపదు. ఎవడు జాగ్రతననుభవించెనో, ఎవడు స్వప్నమును చూచెనో, ఎవడు సుఖముగా నిద్రించెనో అనగా ఏకకాలంలో జాగ్రత, స్వప్న, సుషుప్తి అనుభవములు ఎవనికి దెలియుచున్నవో వాడే ఆత్మ. మూడవస్థలు నాకే దెలియుచున్నవి కావున నేనే మూడవస్థల సాక్షియైన ఆత్మను.

మూడవస్థల అనుభవం దేనికి దెలియుచున్నదో అదే ఆత్మ అనినచో అజ్ఞానులు మాకును దెలియుచున్నవి యనుచున్నారు. అట్లయిన జ్ఞానికి అజ్ఞానికి వ్యత్యాసం ఏమి? మాకును ఆత్మజ్ఞానం కలిగినట్లేనా? యని శంక రాగా అట్లు గాదు అజ్ఞాని మూడింటి అనుభవం బుద్ధికి యనుకొనును. జ్ఞానియో ఆత్మకు యనుకొనును. అజ్ఞానిని ఇట్లు ప్రశ్నించవచ్చు సుషుప్తిలో నీవు యున్నావు? సుషుప్తి అనుభవం నీదేనా యనిన నేను లేననును(బుద్ధి) నీవులేకుండ ఎట్లు చెప్పితివి కావున ఆత్మయొక్క అనుభవమును బుద్ధి తన యందు ఆరోపించుకొని చెప్పుచున్నది. ఇనుమునకు చల్లదనము, నల్లదనము, బరువు, స్వభావము. ఇనుము అగ్ని సానిధ్యంచేత నల్లదనం, చల్లదనం, బరువును పోగొట్టుకొని అగ్నివలె చెలామణి అయినట్లుగా, బుద్ధి జడమయినప్పటికి ఆత్మయొక్క సచ్చిదా నంద లక్షణములను తనయందు ఆరోపించుకొని నేను కర్తను, భోక్తనుయను చున్నది. ఇట్లే మూడవస్థలలో తాను వికారిగా యుంటూ అనిత్యమైనను శుద్ధిత్వమును నిత్యత్వమును ఆరోపించుకొనుచున్నది. ఈ విధముగా గీత దేహత్రయ విచారణ, అవస్థాత్రయ విచారణ మరియు పంచకోశ విచారణయు చేసినది.

ఇంద్రియాణి పరాణ్యాహు రింద్రిమేభ్యః పరంమనః ।
మనసస్తు పరాబుద్ధేః ర్యోబుద్ధే పరతస్తు సః ॥

అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అని అయిదు కోశములు గలవు. పంచకోశములలో మూడు శరీరములు గలవు. స్థూలశరీరం అన్నమయ కోశము. పాణమయ మనోమయ విజ్ఞానమయతో మూడు కోశములు కలిసి సూక్ష్మశరీర మనబడును. ఆనందమయ కోశము కారణశరీరమనబడును. ఈమూడుశరీరములను విచారించిన పంచకోశములను విచారించినట్లగును. కావున ఈ రెండింటిని విచారించినచో మూడవస్థలు విచారించినట్లగుచున్నది. మూడవస్థలను విచారించినచో దేహత్రయమును, పంచకోశములను విచారించినట్లగును. కావున ఈ మూడు ప్రక్రియలను వేదాంతమందురు.

ఇట్లే కార్యకారణ ప్రక్రియ = అనగా ఓంకార విచారణ మహావాక్య విచారణ అనగా అధ్యారోప అపవాద ప్రక్రియలు. అన్ని శాస్త్రములలో గల వేదాంత ప్రక్రియలన్నియును పరంపరా సాధనములైన కర్మోపాసనలను గీతలో చెప్పబడినవి. కావున గీత నొక్క దానిని ఆశ్రయించినచో మరొక గ్రంథమును ఆశ్రయించనవసరంలేదు జ్ఞానగురువును ఆశ్రయించినచో మిగతా గురువులను ఆశ్రయించనక్కర లేనట్లుగా గీతను ఆశ్రయించినచో సర్వశాస్త్రములను ఆశ్రయించినట్లే. కావున భగవద్గీతకు ఇంతటి ప్రాధాన్యత వచ్చినది. కావుననే ప్రస్థానత్రయములో శంకరులు చేర్చియున్నారు.

గీత సార్వజనీయము. అనగా గీత ఎవరినో ఉద్దేశించి చెప్పినదిగాదు. మరియు గీత ఏ ఉత్తమశ్రేణి సాధకునకో అవసరమైన ధర్మములను బోధించినది గాదు. ఉత్తమ, మధ్యమ, మందాధికారులందరికిని అవసరములైన, ఆచరణీయములైన వాక్యములను గీతబోధించినది. కావున గీత సార్వజనీయము, సర్వ జనహితమును గోరు విశాలభావ సంపన్నమగు మహోత్తమగ్రంథం. దేహము కన్నను ఇంద్రియములు, ఇంద్రియముల కన్నను మనస్సు, మనస్సు కన్నను బుద్ధి ఉత్కృష్టత గలది. దేహమును దేహం గుర్తించుటలేదు కావున జడం. దేహమును ఇంద్రియాదులు గుర్తించుచున్నందున చైతన్యం గలవి. ఇవియును స్వయముగా గుర్తించలేవు. మనస్సు సహకారం చేత గుర్తించగలుగుచున్నందున

మనస్సు చైతన్యం గలది యగుచున్నది. మనస్సునకు స్వయం ప్రకాశంలేదు. బుద్ధినిశ్చయించినచో వ్యవహారము జరుగుచున్నది. కావున మనస్సు జడం. బుద్ధియు స్వయం ప్రకాశంగాదు, ఆత్మయొక్క సత్తా చేతనే వ్యవహరింప గలుగుచున్నది. కావున బుద్ధియు జడమే. భిన్నతయు బుద్ధికి సిద్ధించియేయున్నది. సూక్ష్మమయి యుండుట, వ్యాపకమై యుండుట, కారణముగా యుండుట, నడుపునదిగా యుండుట, ప్రకాశముగా యుండుట మున్నగు ధర్మములచేత ఏది స్వయముగా బుద్ధి మొదలు స్థూలదేహము వరకు గల కార్యకారణ సంఘాతమునంతటిని వ్యాపించి, తన సాన్నిధ్య మాత్రముననే నడుచునట్లు చేయుచు దాని ధర్మములను, కర్మలను, దాని గుణములను, దాని వికారము లన్నింటిని ఎట్టి వికారమునూ పొందకయే సాక్షాత్తుగా చూచుచు, ప్రకాశింప చేయుచూ ఉన్నదో ఆ ఆత్మయే బుద్ధికంటెను, అన్నిటికంటే గూడ నిత్యమై ఉండుట వలనను, సర్వజ్ఞమై ఉండుటవలనను, సర్వప్రకాశమై యుండుట వలనను, సర్వసాక్షిగా నుండుటవలనను, మిగులఉత్కృష్టమైనది. ఈవిధముగా ఆత్మకంటెను గొప్పది ఏదియులేదు. ఇట్టి యాత్మను నీ స్వరూపముగా గుర్తెంగుము యనుటచేత భగవద్గీత తత్త్వమసి మహావాక్యమును బోధించినట్లయినది.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
మామకాః పాణవాశ్చైవ కిమ కుర్వత సంజయ ॥

అనే శ్లోకంతో ప్రారంభమయినది గీత. ధర్మప్రధానమైనది ధర్మక్షేత్రము. అట్టి కురుక్షేత్రమున యుద్ధము చేయదలంచిన నా పుత్రులు, పాండుపుత్రులు యుద్ధము చేసిరా? అని ధృతరాష్ట్రుడు, సంజయుడిని అడిగెను. ఇక్కడ శంక ఏమిటంటే యుద్ధం చేయడానికి వచ్చాక యుద్ధమే జరుగును కదా! యుద్ధం చేసిరా అని అడుగుట ఏమిటి? అంటే ఆ క్షేత్రమహిమచే దుర్యోధనుడు ధర్మపరుడై వారి రాజ్యభాగం వారికే ఇచ్చెనా? లేక ధర్మము గలవాడైన ధర్మరాజే యుద్ధం నుండి విరమించెనా? అని అడుగగా? యుద్ధమే ఖాయమా యనని సంజయుడు ఇట్లు చెప్పుచున్నాడు.

యత్ర యేగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయోభూతి ర్ధ్రువా నీతిర్మతిర్మమ ॥

ఎచ్చట యోగీశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారి అగు అర్జునుడు ఉందురో అచ్చట ఐశ్వర్యము, విజయము, విభూతి, నీతి కలుగును.

యోగేశ్వరః కృష్ణో: శరీరేంద్రియముల నుండి ఆత్మను విడదీసి తన స్వస్వ రూపాన్ని అనుభవమొనర్చుకొన్న వాడే యోగీశ్వరుడైన కృష్ణుడు.

పార్థోధనుర్ధరః! శరీరేంద్రియముల నుండి ఆత్మను వేరొనర్చి తన స్వస్వరూపాన్ని అనుభవమొనర్చుకొను లక్ష్యమును సాధన చేయు సాధకుడే ధనుర్ధారి అగు అర్జునుడు. శ్రవణ, మనన, నిధిధ్యాసనలనే సాధన ద్వారా సాధించబడు శాశ్వతము, జ్ఞానము, ఆనందములే ఐశ్వర్యములు. అశాశ్వతము, అజ్ఞానము, దుఃఖము వీటిని తొలగించుకొనుటే విజయము. ఈ జగత్ అంతయూ బ్రహ్మమేనని అనుసంధానము చేయుటే విభూతి. సత్, చిత్, ఆనందానుభవములను పొందిన సాధకుడు నిత్యుడగును ఇదే నీతి. ఈ తత్త్వాన్ని భగవద్గీత షడ్లింగములతో బోధించినది. షడ్ లింగములు అనగా ఉపక్రమోప సంహారము, అభ్యాసము, అపూర్వము, ఫలము, అర్థవాదము, ఉపపత్తి.

1. ఉపక్రమోపసంహారము అనగా ఉపక్రమము, ఉపసంహారము. అనగా ప్రారంభంలో ఏది చెప్పబడినదో చివరిలోను దానినే చెప్పుట. భగవద్గీత **1**అ-**1**శ్లో॥ "ధర్మక్షేత్రే" ధర్మాలతో ప్రారంభమై సకల ధర్మాలను ఆచరించమని బోధిస్తూ... అనగా కర్మ, భక్తి, ఉపాసన అనే ప్రవృత్తి మార్గమును, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే వర్ణాశ్రమ ధర్మాలను బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసములనే ఆశ్రమ ధర్మాలను ధర్మ, అర్థ, కామ, మోక్షమనే పురుషార్థాలను దేహేంద్రియ, ప్రాణ, మనోబుద్ధులనే ఇంద్రియ ధర్మాలతో సహా సకల ధర్మాలను ఆచరించమని బోధించి చివరకు **18**అ-**66** శోక్లంలో

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహంత్వా సర్వ పాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచః ॥

సర్వధర్మాలను పరిత్యజించి, నిర్గుణపరబ్రహ్మమైన నన్నే శరణు పొందుము, అవిద్యా, కామ, కర్మలనే పాపములు నశించి మోక్షం కలుగును అని భగవద్గీత బోధించినది. ప్రారంభంలో సకల ధర్మాలను ఆచరించవలసినదేనని బోధించి మరల త్యజించవలసిందేననుట ఏమిటి? అనే శంకరాగా! వర్ణ, ఆశ్రమ ధర్మాలన్నియు, మల, విక్షేప, ఆవరణ దోషాలతో కూడియుండుట చేత వాటి కర్మఫలంగా స్వర్గాదిలోకాలు ప్రాప్తించినా "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" అన్నట్లు జన్మకు రాక తప్పదు. కావున వీటినుండి బయటపడి జన్మరాహిత్యమును పొందమని చెప్పెను.

దైవీ హ్యేషా గుణమయీ మయ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యంన్తే మాయా మేతాం తరన్తితే ॥

సజాతీయ, విజాతీయ, స్వగత బేధ రహితుడు, ఆకాశమువలె నిర్గుణుడు పరబ్రహ్మము. అట్టి నిర్గుణ పరబ్రహ్మము నందు ఆకాశమునకు నీలిరంగువలె త్రిగుణాత్మకమైన మాయ ఆవరించియున్నది. అట్టి మాయను దాటవలెనంటే ఉపాయము ఆత్మజ్ఞానమే. అమృతమును ఆశ్రయించిన వారికే అమృతత్వము పొందుట అసాధ్యమయితే విషమును త్రాగువానికి అమృతత్వము సాధ్యమా? సర్వసంగ పరిత్యాగులు సైతము ఈ మాయను దాటలేకున్నారు. అనగా సన్యాసికి కూడా దేహ వాసన, శాస్త్రవాసన అను ఆవరణ దోషములుండుటచే సర్వధర్మాలను పరిత్యజించి నన్ను ఆశ్రయించినవారే ఈ త్రిగుణాత్మకమైన మాయను దాటగలరు. కనుక జ్ఞానికి నివృత్తి మార్గమే కర్తవ్యమైయున్నదని భగవద్గీత ఉపసంహారము చేయుచు బోధించెను.

2. అభ్యాసము: భగవద్గీత "ధర్మక్షేత్రే"లో 'ద' అను అక్షరముతో ప్రారంభమై "యత్రయోగీశ్వర"లో "మతిర్మమ" అని మమ అను అక్షరంతో పూర్తయింది. అంటే 'దమము' కలిగి యుండుమని భగవద్గీత బోధించినది. దమము అనగా ఇంద్రియ నిగ్రహము. "అభ్యాసేనతు కౌన్తేయ వైరాగ్యేణచ గుహ్యతే" అభ్యాస వైరాగ్యముల ద్వారానే ఇంద్రియములను అరికట్టవచ్చునని

తెలిపింది. శ్రుతి, స్మృతి, యుక్తులచేత సమస్త ప్రపంచమును మిథ్యగానే దర్శించుచు అట్టి విషయములు అసత్యములు, తుచ్ఛములు, బంధకములను భావమును బాగుగా అభ్యసించుటచేతను, తీవ్ర వైరాగ్యము చేతను మనస్సు నిగ్రహపడును. ఈ విధంగా విషయవృత్తులను నిరోధించి తీవ్ర మోక్షేచ్ఛతో బ్రహ్మాకారవృత్తులే సాధనములుగా నిత్యనిరంతరము అభ్యాసవైరాగ్యములతో నుండవలెనని భగవద్గీత బోధించినది.

3. అపూర్వము: మొదటి ఆరు అధ్యాయములలో 'త్వం' పదమును, తరువాత ఆరు అధ్యాములలో 'తత్' పదమును చివరి ఆరు అధ్యాయములలో 'అసి' పదమును బోధించి 'తత్త్వమసి' మహావాక్య విచారణ చేసెను.

అశోచ్యానన్వ శోచస్త్వం ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే ।
గతాసూన గతాసూంశ్చ నాను శోచన్తి పణ్డితాః ॥

చనిపోయిన వారి గూర్చి, చనిపోబోయే వారి గూర్చిగాని దుఃఖింపదగదు. ఎట్లనగా "దుర్లభోమానుషో దేహినాం క్షణభంగుర" జీవునకు ఈ మనుష్య దేహము దుర్లభమయినను క్షణభంగురమనియు నశించునదేననియు బోధించుటచేత దుఃఖింప తగని పని. ఇక లక్ష్యార్థమగు ఆత్మ "అజో నిత్యః శాశ్వతః" ఆత్మ పుట్టుకలేనిది. నిత్యమైనది. ఇట్టి ఆత్మ తన స్వరూపమే అయి ఉన్నదని గురూపదేశము ద్వారా ఆత్మసాక్షాత్కారము కలుగుటయే అపూర్వము. ప్రత్యక్షముగా కనబడని బ్రహ్మనివి నీవే అని చెబుతూ "జ్ఞానీ త్వాత్మైవ మేమ తమ్" జ్ఞానికి, నాకు బేధము లేదు. జ్ఞానిని నేనే అని తెలిపెను.

4. ఫలము: జీవబ్రహ్మైక్యమే ఫలము.

నష్టోమోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।
స్థితోస్మి గత సన్దేహః కరిష్యే వచనం తవ ॥

నీ అనుగ్రహం వలన నా మోహములు నశించినవి. నాకు గత సందేహములు అనగా కర్మలు మోక్షమునకు సాధనములను సంశయ, విపరీత

భావములు తొలగినవి. నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త స్వరూపమే నేను అను స్మృతి కలిగినది. "కరిష్యే వచనం తవ" నీవు చెప్పినట్లే చేస్తాను అని అర్జునుడు పలికెను. అనగా నిష్కామకర్మాచరణము ద్వారా అపరోక్షజ్ఞానమునకు ప్రయత్నించి జీవబ్రహ్మైక్యమును పొందెదననెను. ఇచ్చట మోహము నశించి సంశయ, విపరీత భావనలు తొలగిన ముక్త స్వరూపమే నేను అనే జ్ఞాని చేయవలసినది ఏముండును అని శంకరాగా...

శ్రుతి విప్రతి పన్నాతే యదాస్థాస్యతి నిశ్చలా ।
సమాధా వచలా బుద్ధిః స్తదాయోగ మవాప్స్యసి ॥

గత సందేహములు నశించగా కేవల నిర్గుణ బ్రహ్మమునందే నిత్యనిరంతరము ప్రజ్ఞాస్థైర్యముతో నిశ్చలము, నిర్వికారముగా నుండే జ్ఞానమే ఫలమని తెలిపెను.

5. అర్థవాదము: "జ్ఞానే పరిసమాప్యతే" స్వరూపమును తెలుసుకోవడం కన్న ఇక రెండవ కర్తవ్యమేదియు లేదని తెలిపెను. సుషుప్తివత్ జీవుడు బ్రహ్మమే అని తెలిపెను. సుషుప్తిలో నిర్వికారమై, నిశ్చలమై, ఆనందమై యున్నదేదో అదే బ్రహ్మము. జీవుడు సుషుప్తిలో సకలేంద్రియములు లయించగా నిర్వికారమై, నిర్గుణమై యున్నాడు. జీవబ్రహ్మములకు ఉపాధి బేధమేగాని చైతన్యరూపేణా ఇరువురూ ఒక్కటే. రెండు ఆకాశాలు వుండనట్లుగా రెండు చైతన్యాలు లేవు. ఉన్నది ఒకే ఒక చైతన్య స్వరూపము.

అట్టి చైతన్య స్వరూపుడైన జీవుడు బ్రహ్మమే అని భగవద్గీత బోధించినది.

మత్కర్మ కృన్మత్పరమో మద్భక్త సఙ్గ వర్జితః ।
నిర్వైర స్సర్వ భూతేషు యస్స మామేతి పాణ్డవ ॥

స్వస్వరూపాన్ని శ్రవణం, మనన, గురుబోధ ద్వారా తెలుసుకొనుటయే భగవత్ప్రీతికరమగు కర్మలు చేయుట. సత్, చిత్, ఆనందమే పరమాత్మ లక్షణా లను పరమగతిగా నమ్మి అట్టి లక్షణాలను తన యందే గలవాడు

మత్పరుడు. స్వస్వరూపమందే భక్తి కలవాడు మద్భక్తుడు. ఈ అనాత్మ వస్తునంతటిని బ్రహ్మంగానే అనుసంధానమును విడిచినవాడే సంగవర్జితుడు. సర్వత్రా బ్రహ్మభావముచేత దేనియందును వైరము లేనివాడు నిర్వైరుడు. అట్టివాడే నన్ను చేరగలడని తెలిపెను.

ఉపపత్తి అనగా యుక్తి: సర్వులకు అనుభవములో యున్న యుక్తుల ద్వారా ఆత్మతత్త్వాన్ని తెలిపి జీవుడు శాశ్వతుడు అని చెప్పెను.

ఇన్ద్రియాణి పర్యాణ్యాహు రిన్ద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరాబుద్ధిర్యో బుద్ధేః పరతస్తుసః ॥

దేహముకన్న ఇంద్రియములు, ఇంద్రియములకన్న మనస్సు, మనస్సుకన్న బుద్ధి, బుద్ధికన్న ఆత్మ గొప్పది. కాలిన యినుపగుండు అగ్నివలె చెలామణి అయినట్లు ఆత్మయొక్క సుషుప్తి అనుభవాన్ని బుద్ధి నా అనుభవం అనుచు నేను హాయిగా ఉన్నాను అనుచున్నది. సుషుప్తిలో మనోబుద్ధులు లేకున్నను ఆత్మ సత్తాతోనే ఈ మనోబుద్ధులు ప్రకాశించుచున్నవని గురుబోధ ద్వారా యుక్తులతో గ్రహించి అట్టి స్థితిలో నిత్యనిరంతరము ప్రజ్ఞాస్థైర్యముతో నుండుమని భగవద్గీత బోధించినది.

2అ-11శ్లో. "అశోచ్యానన్వ శోచస్త్వం" అను శ్లోకంతో భగవద్గీత ప్రారంభించాడు భగవానుడు. ఋషిన్యాసములో "అశోచ్యానన్వ శోచ స్త్వమితి" బీజం అని చెప్పుట ద్వారా జీవుని వ్యథ తొలగించి తన స్వస్వరూపాన్ని తెలియజేస్తూ స్వానుభవానికి నిరూపణగా భగవద్గీతను శంకరులు నిధిధ్యాసన గ్రంథమని ఉద్ఘాటించారు.

మావద్ద లభించు గ్రంథములు

1. వ్రతకథలు - పూజలు

శ్రీ వినాయక వ్రతం	వెల రూ. 5
శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం	20
శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో)	9
లక్ష్మీగణపతి పూజాకల్పం	...
వరలక్ష్మీ వ్రతం	5
కేదారేశ్వర వ్రతం	5
త్రినాధ వ్రతం(కలర్)	5
త్రినాధవ్రతం(సాదా)	3
క్షీరాబ్ధి వ్రతం	5
మంగళ గౌరీవ్రతం	9
వైభవలక్ష్మీ వ్రతం ఫోటో యంత్రంతో	15
శ్రీలక్ష్మీ కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో)	15
కనకమహాలక్ష్మీ వ్రతం (కామేశ్వరీపాటతో)	15
సంతోషీమాతా వ్రతం	15
ఏడు శనివారాల వ్రతం	15
సత్యనారాయణవ్రతం	15
శ్రీ సువర్చలాహనుమద్దీక్ష	15
శివదీక్ష	9
మార్గశిర లక్ష్మీవారాలవ్రతం	...
శ్రీ వేంకటేశ్వర (దీక్ష) గోవిందమాల	...
కాత్యాయనీ వ్రతం	15
సౌభాగ్య గౌరీవ్రతం	15
తిరుప్పావై (ధనుర్మాసవ్రతం)	30
స్త్రీల వ్రతకథలు	25
స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి(నేదునూరిగంగాధరరావుగారి)	45
స్త్రీలపాటలు (కామేశ్వరీపాటతో)	27
సర్వదేవతా పూజావిధానం	15
ఆరువ్రతాలు	25
ధన్వంతరీ వ్రతకల్పం	9
రాహుకాలంలోదుర్గాదేవీపూజా	9
పార్వతీ నిత్యపూజ	9
తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు	9
శ్రీ చక్రపూజ	9
శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్	30
శ్రీచక్ర పూజావిధానం(పెద్దది)	30
లక్ష్మీ - గౌరీ నిత్యపూజ	9
శ్రీలలితా నిత్యపూజ(లలితాసహస్రనామస్తోత్రంతో)	9
శ్రీ గాయత్రీ నిత్యపూజ	9
అన్నపూర్ణ నిత్యపూజ	9
శ్రీ బాలాత్రిపురసుందరీ నిత్యపూజ	9
శ్రీ సరస్వతీ నిత్యపూజ	9
మహిషాసుర మర్ధనీపూజ	9
రాజరాజేశ్వరీ నిత్యపూజ	9
శ్రీ దుర్గానిత్యపూజ	9
కాలభైరవ నిత్యపూజ	9
శివపూజ	9
వీరభద్ర పూజ	9
ఆంజనేయ నిత్యపూజ	9
నాగేంద్ర స్వామి పూజ	9
సుబ్రహ్మణ్య నిత్యపూజ	9
రామదేవుని కథ	9
శివదేవుని కథ	9
విష్ణుపూజ (విష్ణుసహస్రనామస్తోత్రసహితం)	9
శ్రీకృష్ణ పూజ, గోపూజ	9
లక్ష్మీనరసింహపూజ	9
రాఘవేంద్రపూజ	9
విశ్వకర్మపూజ	9
శనైశ్చరపూజ	9
వేంకటేశ్వరపూజ	9
బ్రహ్మంగారి నిత్యపూజ	9
సూర్య నిత్యపూజ	9
నవగ్రహ నిత్యపూజ	9
సకలదేవతా అష్టోత్తర శతనామావళీపూజ	9
పంచాయతన పూజ	45
రుక్మిణీ కల్యాణం	15
అష్టనాగపూజ	30
ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి?	30
ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి?	30
ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి?	30
ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ?	30
సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం	20
పంచముఖ ఆంజనేయనిత్యపూజ	15
హనుమద్ వ్రతం	30
28 వ్రతములు	99
పూజలు ఎందుకుచేయాలి ?	30
కలశపూజలు (9ఒకేసారి)	150
కలశపూజలు (విడివిడిగా)	150
ఉమామహేశ్వర వ్రతం	30

2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు	31
సర్వదేవతా స్తోత్రమంజరి	99
సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63)	20
విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్)	20
లలితా సహస్రనామ స్తోత్రమ్(క్రౌన్)	30
లలితా సహస్రనామములు	18
లక్ష్మీ సహస్రనామములు	18
దుర్గా సహస్రనామములు	18
ఆంజనేయ సహస్రనామములు	18
శివ సహస్రనామములు	18
విష్ణు సహస్రనామములు	18
గణపతి సహస్రనామములు	18
సుబ్రహ్మణ్య సహస్రనామములు	18
గాయత్రి సహస్రనామములు	18
లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు	18
శ్రీరామా సహస్రనామములు	18
లక్ష్మీనృసింహసహస్రనామములు	18
సరస్వతి సహస్రనామములు	18

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

లక్ష్మీగణపతి సహస్రనామములు	18
సూర్యసహస్రనామములు&ఆదిత్యహృదయం	18
శ్రీవేంకటేశ్వరసహస్రనామములు	18
మణిద్వీపవర్ణన (పెద్దది)	18
సంధ్యావందనం	18
మంత్రపుష్పమ్	18
హనుమాన్ చాలీసా	7
(పాకెట్) మణిద్వీపవర్ణన	7
ఆరు చాలీసాలు	9
శివారాధన (శివస్తోత్రాలు)	7
వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్)	7
ఆరుదండకాలు	5
వేంకటేశ్వర గోవిందనామములు	5
అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్	7
దేవీఖడ్గ మాలాస్తోత్రమ్(మహిషాసురమర్దనీ స్తోత్రంతో)	7
నమశ్శివాయ గేయామృతం	5
బాలాత్రిపుర సుందరీ స్తోత్రకదంబం	81
సుందరకాండ (పాకెట్)	9
భగవద్గీత మూలం	18
రామరక్షాస్తోత్రమ్	18
స్తోత్ర రత్నావళి	30
పురాణపండలలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్ (మినీ)	8
పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్ (మినీ)	8
పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్	8
పురాణపండ ఆదిత్య హృదయం	8
మంత్రపుష్పం (మినీ)	8
శివానందలహరి-సౌందర్యలహరి	30
కుజదోషం	9
కాలసర్ప దోషం	9
మీ అప్పులు తీరాలా?	9
దృష్టిదోషాలు నివారణ	9
సర్వదేవతా ధ్యానశ్లోకములు	9
పంచసూక్తములు	9
సంధ్యావందనం	9
శ్రీరామదూతంశిరసానమామి(తాత్పర్యంతో)	9
రుద్రనమకమ్-చమకమ్	9
మన్యుసూక్త-మంత్రపారాయణం	9
గాయత్రీమంత్రాలు	9
పంచరత్న స్తోత్రాలు	9
కరావలంబ స్తోత్రాలు	9
దశావతార స్తోత్రాలు	9
అష్టోత్తర శతనామస్తోత్రాలు	9
భుజంగ స్తోత్రాలు	9
ప్రాతఃస్మరణాలు	9
జపమంత్రాలు	9
సర్వదేవతా సుప్రభాతములు	9
ద్వాదశ నామస్తోత్రాలు	9
కుమారస్వామి స్తోత్రమాల	9
సుదర్శన స్తోత్రమాల	9

హయగ్రీవ స్తోత్రమాల	9
దక్షిణామూర్తి స్తోత్రమాల	9
పంచముఖఆంజనేయస్తోత్రమ్	9
దండక రత్నాలు	9
ద్వాదశ జ్యోతిర్లింగాలు-పంచారామాలతో	9
శ్రీసూక్తం పురుష సూక్తం	9
పంచ అధర్వణ శీర్షములు	9
ప్రార్థనా శ్లోకములు	9
గణపతి స్తోత్రమాల	9
శ్రీ గురుగీత	9
సర్వదేవతా కవచములు	9
సర్వదేవతా అష్టకములు	9
హిందూ సంస్కృతిసంప్రదాయాలు	9
విష్ణు స్తోత్రమాల	9
దేవీ స్తోత్రమాల	9
శివస్తోత్రమాల	9
విష్ణు స్తోత్రములు	9
భర్తృలహరి సుభాషితాలు	9
నవవిధ భక్తిమార్గాలు	9
నవదుర్గలు	9
దశమహావిద్యలు	9
తిరుపతి వెళదాం	9
నవగ్రహస్తోత్రమాల	30
మహాన్యాసమ్	30
సుందరకాండ గానామృతం	30
సంధ్యా వందనం (పెద్దది)	30
పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం	
లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,,	36
లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,,	36
స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్)	81
మూకపంచశతీ	81
పురాణపండవారి సౌందర్యలహరి	
(శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో)	108
గోమాతపూజావిధానము	7
ఆనందసిద్ధి - శ్రీదేవీ స్తోత్రమాల	108
3. శ్రీ సాయి దత్త గ్రంథములు	
శ్రీ సాయిబాబా సచ్చరిత్ర	99
సంపూర్ణ శ్రీ గురు చరిత్ర	99
బొమ్మల గురుచరిత్ర	...
బొమ్మల సాయిచరిత్ర	...
బాలలబాబా శ్రీ సాయిచరితం	9
శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం	99
శ్రీసాయీసన్నిధిద్వారకామాయిలీలలు	....
శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్)	50
శ్రీ గురుచరిత్ర (క్రౌన్)	50
దాసగణకృత శ్రీసాయి చరిత్ర	30
నవనాథ చరిత్ర	90
శ్రీ సాయిచరిత్ర(బైండు)ప్రయాణపుపారాయణగ్రంథం	50
శ్రీ గురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	50

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

సత్యదత్తవ్రతం దత్తాత్రేయ పూజాకల్పం,సహస్రంతో	15
అనఘాదేవీ వ్రతం	15
శ్రీ సాయిసచ్చరిత్ర గానామృతం	15
శ్రీ గురుచరిత్ర గానామృతం	45
భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు	25
మనసులోనిప్రశ్నకుశ్రీసాయిబాబాజవాబులు	25
అక్షరక్రమములో శ్రీసాయిసూక్తులు	25
శ్రీసాయి అష్టోత్తరశతనామావళీమాహాత్మ్యం	25
శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో)	15
శ్రీ సాయిభజనమాల	15
శ్రీ సాయి భజన్స్	15
శ్రీ సాయిభక్తి గీతాలు	15
శిరిడిహారతులు (భావంతో)	15
ప్రతిగురువారంసాయినిత్యపూజ	8
"శ్రీసాయి"కోటి	15
"శ్రీసాయిరామ్"కోటి	12
ద్వారకామాయి భక్తిగీతాలు	9
శ్రీ సాయిబాబా భక్తిమాల	9
శ్రీలక్ష్మీ సాయిభక్తిమాల	9
శ్రీ ద్వారకామాయిభక్తిమాల	9
శ్రీ శిర్డీభక్తిమాల	9
శ్రీ సాయిబాబా భక్తిమాల	9
శ్రీ సాయినాథ స్తోత్రమంజరి	9
శ్రీ సాయివేయినామాలు	4
శ్రీ సాయి సహస్ర నామావళి	9
శ్రీ సాయి చాలీసా-సుప్రభాతం	9
శ్రీ సాయినాథ చాలీసా	9
శ్రీ సాయి హారతులు (పాకెట్)	9
శ్రీ సాయి నిత్యపూజ (పాకెట్)	9
శ్రీ దత్తాత్రేయ నిత్యపూజ F	9
శ్రీ సాయి సూక్తులు	9
శ్రీ సాయి స్తవనమంజరి	9
శ్రీసాయి నక్షత్రమాలిక	9
హిందీ శ్రీ సాయి హారతులు	10
భక్తుల సందేహాలకుబాబా సమాధానాలు	45
శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం	45
శ్రీ షిర్డీసాయి లీలామృతం (VG)	25
ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు	10
షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం	90
సాయిపూజావిధి	30
సాయిమహిమ	....
సాయిసత్యవ్రతం	15
సాయి అనుగ్రహమ్	116
నవగురువారాల వ్రతకల్పము	12
శ్రీదత్తలీలామృతము	72
హృదయంలో సాయి	12
శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్చరిత్ర)	81

4. జ్యోతిషాలు

'శుభసమయ' గంటల పంచాంగం	30
సనాతన వైదిక బ్రాహ్మణ పంచాంగం (వంగిపురపువారి పత్రికసైజ్‌పంచాంగం)	69
'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ)	50
చిత్రాలగురుమూర్తిగుప్తాపంచాంగము	50
గ్రహభూమి పంచాంగము (గార్గేయ)	116
శ్రీచక్ర పంచాంగము(రాష్ట్రతొలిమహిళపంచాంగకర్త)	30
వేంకట్రామా&కో సిద్ధాంతుల రేలంగితంగిరాలవారి గంటలపంచాంగము	30
తంగిరాల పెద్దపంచాంగం	39
కాలచక్రం జ్యోతిష క్యాలండర్	20
గ్రహబలం క్యాలండర్(శ్రీనివాసగార్గేయ-భక్తిటివి)	20
శుభలగ్నం (తంగిరాల) క్యాలండర్	20
శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్	20
సాదా క్యాలండర్	5
పాకెట్ క్యాలండర్	10
తాజకనీలకంఠీయమ్	100
40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి	207
40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి	150
కేరళ జ్యోతిష రహస్యాలు	150
జ్యోతిష బ్రహ్మ రహస్యాలు	150
మానసాగరి జాతకపద్ధతి	150
వరాహమిహిర జాతకపద్ధతి	150
వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు	81
సింపుల్ రెమిడీస్	....
హోరాసార	.....
శంభు హోరప్రకాశిక	.....
పూర్వ పరాశరి	100
పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం	200
1940-60వరకు పాతపంచాంగములు	225
ప్రశ్న సింధు	90
నక్షత్ర విశేష ఫలితాలు	36
సర్వార్థ ఫలచంద్రిక	90
సూర్యసిద్ధాంత పంచాంగగణితంచేయడంఎలా?	150
దృక్సిద్ధాంత పంచాంగగణితం చేయడంఎలా?	150
ఆయుర్దాయ నిర్ణయం	36
పంచప్రాచీన జ్యోతిషాలు	36
జాతక గణిత ప్రవేశిక	30
భృగు సూత్రాలు	36
జ్యోతిషమర్మబోధిని	45
జ్యోతిష ప్రశ్నోత్తరమాల	45
ముహూర్తం నిర్ణయించడంఎలా?	45
జాతక మకరందం	30
జ్యోతిష సరస్వతి	30
మీజననకాల విశేషాలు	30
ముహూర్త విజ్ఞాన భాస్కరం	30
జ్యోతిష స్వయంబోధిని	30
శుభముహూర్త శిరోమణి	30

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

నక్షత్ర ఫలమంజరి	30
పంచాంగం చూసే విధానం	30
సర్వార్థ జ్యోతిషం	30
ప్రాథమిక జ్యోతిషం	30
నవరత్నములు శుభయోగములు	30
జ్యోతిషభావఫలచంద్రిక-1	...
శుభశకునాలు	20
హస్తరేఖాఫలితాలు	30
సంఖ్యల్లో భవిష్యత్	30
ముహూర్త దీపిక	81
పుట్టుమచ్చలు ఫలితాలు	20
కలలు ఫలితాలు	20
నిత్యజీవితంలో అదృష్ట సంఖ్యలు	9
నిత్యజీవితంలో నక్షత్రాలు	9
జాతక చక్రం వేయడం ఎలా?	30
మానసాగరి(ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు	250
జ్యోతిషశాస్త్ర చిట్కాలు	90
గుప్తా శతాబ్ది పంచాంగం(1940-2050)	900
ప్రశ్నచండేశ్వరమ్	45
జాతకాలంకారం	36
జ్యోతిష వైద్య రత్నావళి	36
ద్వాదశభావ ఫలచంద్రిక	250
జాతకచక్రం మీరే వేసుకోవచ్చు	30
జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు)	90
అంగసాముద్రికం	30
హస్త సాముద్రికం	40
వధూవర గుణ సమ్మేళనం	....
లాల్ కితాబ్	81
జాతకరాజము	36
శకునశాస్త్రం	36
ఆధునికప్రశ్నశాస్త్రం	100
పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం	150
అష్టకవర్గు	45
బృహత్జాతకం(ప్రాచీనప్రతికిపునర్ముద్రణ)	200
లగ్నరత్నాకరం	36
షట్పంచాశిక	120
40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం	150
40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు	207
కె.పి.జ్యోతిషం (పరిచయం)	45
ముహూర్తచింతామణి	81
సూర్యచంద్ర గ్రహణములు	45
ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప)	150
అదృష్టరెమెడీస్	99
ములుగువారిరాశిఫలితాలు(12రాశులువారికి)	36
ములుగువారిరాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి	10
గ్రహసంచార ఫలనిర్ణయదీపిక	36
జ్యోతిష రెమిడీస్	300
జాతక రహస్యాలు	250
జాతకమార్తాండం (కొండపల్లి)	250
జ్యోతిషవిద్యాప్రకాశిక (కొండపల్లి)	250
గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ	90
శనిగ్రహరెమిడీస్	90
జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని	90
నాడీజ్యోతిషం	45
వివాహజ్యోతిషమంజరి	45
గార్గేయం మీ గ్రహబలం రెమిడీస్	....
మీ పుట్టినతేదీనిబట్టి మీ జీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్)	81
నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	45
లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	45
గౌతమసంహిత	45
హోరరత్నమాల	45

బి.వి.రామన్ గారి గ్రంథములు

జ్యోతిష విద్యారంభం	50
గ్రహభావ బలములు	50
కాలచక్రదశ	50
అనుభవ ప్రశ్నాజ్యోతిషం	50
జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు	50
పురోగామి జాతకం	50
భావార్థరత్నాకరం	75
భారతీయజ్యోతిష సర్వస్వం	75
అష్టకవర్గ పద్ధతిః	75
జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు	75
ప్రశ్నతంత్ర	75
ముహూర్తం	75
విశిష్ట జాతకములు	125
భారతీయఫలితజ్యోతిషం	125
300 ముఖ్యమైన యోగములు	125
జాతకంపరిశీలించడంఎలా ?	250

రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

బృహత్పరాశరహోరాశాస్త్రము-1	రూ.200
బృహత్పరాశరహోరాశాస్త్రము-2	200
బృహత్పరాశరహోరాశాస్త్రము-3	200
బృహత్పరాశరహోరాశాస్త్రము-4	200
భావార్థరత్నాకరము	75
ముహూర్త చింతామణి	150
స్వప్న శాస్త్రము	30
శతయోగమంజరి	75
వ్రతనిర్ణయకల్పవల్లి	250
వాస్తుశాస్త్రవివేకము-1	150
వాస్తుశాస్త్రవివేకము-2	150
వాస్తుశాస్త్రవివేకము-3	150
వాస్తుశాస్త్రవివేకము-4	150
అనుభవసులభవాస్తు - 1	75
అనుభవసులభవాస్తు - 2	125

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

5. వాస్తులు

40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి	180
వాస్తుశాస్త్ర రహస్యములు (బైండు)	108
వాస్తునుబట్టి మీ ఇల్లు	30
మీరూ మీ వాస్తు	30
గృహవాస్తు చిట్కాలు	30
వాస్తు పూజ	30
వాస్తు సూత్రములు	30
వాస్తుశాస్త్ర రహస్యాలు	30
వాస్తు సూక్తులు	10
గృహవాస్తు వర్గులు	90
డోలనవిద్య ఉపయోగాలు (డౌజింగ్)	36
విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు	45
విశ్వకర్మ వాస్తు శాస్త్రరీత్యా మీ ఇండ్ల ఆయములు	81
విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాల)	....
ప్రాచీన వాస్తుశాస్త్రములు	36
ఆధునిక గృహవాస్తు	81
శుభవాస్తు	207
శుభవాస్తు సలహాలు	36
వాస్తుయంత్ర రత్నావళి	90
వాస్తుశాస్త్రం	45
హౌస్ ప్లాన్లు	30
గృహవాస్తుసారం	30
గృహవాస్తు చంద్రిక	30
గృహవాస్తు దర్పణం	30
జ్యోతిష - గృహవాస్తు చంద్రిక	....
వాస్తురత్నాకరం (కొండపల్లి)	...
వాస్తు శిరోమణి ,,	...
శ్రీకృష్ణవాస్తు ,,	....
పంచవాస్తు పారిజాతం ,,	90
వాస్తుడిండిమమ్ ,,	45
వాస్తుదుందిభి ,,	90
విశ్వకర్మవాస్తుశాస్త్రము ,,	...
కృష్ణవాస్తుశాస్త్రము	45
శల్యవాస్తు,జలవాస్తు(దంతూరిపండరీనాథ్)	81
మయవాస్తు (గోరసవీరభద్రాచార్య)	120

6. మంత్రశాస్త్రాలు

శ్రీ లక్ష్మీ తంత్రమ్	360
శ్రీ గురు తంత్రం	108
సర్ప (నాగ)తంత్రం	250
మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్)	360
మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్)	360
శ్రీ దుర్గ తంత్రమ్	200
మంత్రసిద్ధి	90
మంత్రసాధన	45
తంత్రజాలం	45
యక్షిణీ తంత్రం	45
పాశుపత తంత్రం	90
మంత్రానుష్ఠాన చంద్రిక	45
సర్వదేవతా మంత్రకవచములు	45
మంత్రాక్షరాలరహస్యం(బీజాక్షరనిఘంటువు)	45
సర్వదేవతా మంత్రరత్నావళి	45
దత్తాత్రేయ మూలికాతంత్రమ్	45
సదాచార దీపిక	45
గాయత్రీ తంత్రమ్	108
గుప్త సాధన తంత్రం	45
యంత్రసిద్ధి	333
మంత్రశక్తి	45
దత్తాత్రేయ తంత్రవిద్య	45
మంత్రశాస్త్రం (గ్రంథము)	250
తాంత్రిక పంచాంగం	45
హవన తంత్రం	250
పంచదశ మహాఖడ్గ తంత్రం	90
మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు	150
ప్రత్యంగిరాకృత్యాతంత్రం	360
షోడశనిత్యతంత్రం	250
శాక్తేయతంత్రం	250
యోగినీ-వామకేశ్వరతంత్రం	45
రుద్రయామళతంత్రం	250
ప్రపంచసారతంత్రం	45
బదనిక తంత్రమ్	45
ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్	45
రుద్రాష్టాధ్యాయః	90
పరశురామతంత్రమ్	108
లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్	250
గంధర్వ తంత్రమ్	45
హిరణ్యశూలినీ తంత్రమ్	250
మాయాప్రత్యంగిరా తంత్రమ్	250
శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్	250
కామధేనువు తంత్రం	360
శూలినీదుర్గాతంత్రం	360
సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి)	45
మహామంత్రశాస్త్రసంగ్రహః	150
యంత్ర మంత్ర తంత్ర	45
శూలినీదుర్గాతంత్రం (చిన్నది)	100

7. గ్రంథాలు - ఆరాధనలు

భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం	45
గణేశ ఆరాధన 1	90
గణేశోపాసన 2	90
నవగ్రహారాధన	144
నవగ్రహవైభవం	90
నవగ్రహ రెమెడీస్	90
నవగ్రహ వేదం	90
శనిగ్రహారాధన	90
ఆదిత్యారాధన	90
సుబ్రహ్మణ్యారాధన	90
శ్రీ శివ ఆరాధన	90
లక్ష్మీ ఆరాధన	90

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

హనుమదారాధన	90
లలితారాధన	90
శ్రీ చక్రారాధన	...
గాయత్రీ ఆరాధన	90
వీరభద్రారాధన	90
కాలసర్ప యోగం	90
నిత్య జీవితములో రుద్రాక్షలు	90
నిత్య జీవితములో నవరత్నాలు	90
సుందరకాండ వచనం	90
వేదసూక్తములు	90
అష్టాదశపురాణములు	...
వేమన పద్యసారామృతం	90
పండగలు పర్వదినాలు	90
కుజగ్రహారాధన	90
భైరవారాధన	90
సూక్తిరత్నాలు	90
మనుధర్మ శాస్త్రం (వచనంలో...)	144
పురాణపండ రామాయణం	90
పురాణపండ భారతం	90
పురాణపండ భాగవతం	90
శ్రీ లక్ష్మీసన్నిధి	90
సర్వదేవతా స్వరూపుడు వేంకటేశ్వరుడు	90
హనుమచ్చరిత్ర	90
పంచముఖ హనుమత్ వైభవం	45
శ్రీ దేవీ సప్తశతి	90
మానవధర్మాలు	.....
గరుడపురాణం	36
మాఘపురాణం	30
శివపురాణం	30
వైశాఖపురాణం	30
స్థూలాక్షరి మాఘపురాణం	45
స్థూలాక్షరి శివపురాణం	45
స్థూలాక్షరి వైశాఖపురాణం	45
కార్తీక పురాణం	25
సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ	45
మహామృత్యుంజయఅమృతపాశుపతమ్	150
పెద్దబాలశిక్ష	36
గాయత్రీ మహిమ	30
మత్స్య యంత్ర మహిమ	45
పురాణనామ చంద్రిక	......
వేదమంత్ర సంహిత	108
వృక్షదేవతలు	36
హనుమద్విజయం	30
హనుమద్వైభవమ్	30
యాజుష స్మార్త సంస్కార చంద్రిక	150
సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్	150
నవగ్రహ దర్శనమ్	90
నిత్యజీవితంలో నవగ్రహాలు	90
సాలగ్రామములు	90

చతుర్వేదములు	108
సహస్రలింగార్చన	120
బృహత్ శివ స్తోత్ర రత్నాకరము	200
బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము	200
బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము	200
కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు	36
పంచమవేదం మహాభారతం	81
దేవుళ్ళు డాట్ కామ్	81
తాళపత్ర సమాహార గోపురం	144
శ్రీ హయగ్రీవ ఆరాధన	90
శ్రీలక్ష్మీనరసింహ ఆరాధన	90
దైవారాధన	90
(సూరి) వాల్మీకి రామాయణం	90
గణపతిభాష్యం	90
దక్షిణావృత శంఖములు	45
108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని	30
ధర్మసింధువు(కేస్‌బైండింగ్)	240
గీతారాధన	90
యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి	90
శ్రీ శివగీత	108
భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని	100
చిలుకూరి బాలాజీచరిత్ర	30
నవయోగులు	90
ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు	90
సకలదేవతా అష్టోత్తరశతనామావళి(పెద్దది) -(108 అష్టోత్తరశతనామావళులతో)	90
భగవత్‌స్తుతి	90
సూర్యోపాసన	30
8. వైద్య గ్రంథాలు	
ఆహారం ఆరోగ్యం	30
మూలికావైద్య చిట్కాలు	30
ఆయుర్వేద వైద్య చిట్కాలు	20
ఆయుర్వేద వైద్యం	30
గృహవైద్య రహస్యాలు	30
ఆయుర్వేద వైద్యచింతామణి - సెట్	...
గృహవైద్యసారం	30
హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స)	45
ప్రకృతివైద్యం	30
ఆహారం-వైద్యం	81
సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం	81
ఆయుర్వేదమ్	30
అనుపానతరంగిణి	....
ఆయుర్వేద మూలికావైద్యదీపిక	90
దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు	
వాకడం - ఉపయోగాలు	90
ఆకుకూరలు	...
వనమూలికావైద్యం	300
ఏకమూలికావైద్యం	90
అష్టాంగ హృదయం(4భాగాలు)	1200

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

రహస్యసిద్ధయోగవైద్యసారమ్	90
ప్రాథమిక హోమియోవైద్యం	90
ఒబెసిటి	90
హెల్త్‌గైడ్	90
ఆయుర్వేదం-జీవనవేదం	90
ఫుడ్‌థెరపి	90
న్యాచురల్‌థెరపి	90
సంపూర్ణఆరోగ్యానికి 20ని॥	90
కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే...	90
యోగామంత్ర	90
యోగా సండే టు మండే	90
హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే	90
హెల్త్‌ఫైల్	108

9. అయ్యప్ప - భవానీ రకాలు

శ్రీ అయ్యప్ప లీలామృతం	25
శ్రీ అయ్యప్ప ఆరాధన	45
శ్రీ అయ్యప్ప యాత్రా విశిష్టత	45
శ్రీ అయ్యప్ప భజనపాటలు	45
శ్రీ అయ్యప్ప పూజాకల్పం	15
శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు	15
శ్రీ అయ్యప్ప దీక్ష F	9
శ్రీ అయ్యప్ప భజనమాల F	9
శ్రీ అయ్యప్ప నిత్యపూజ P	9
శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P	6
శ్రీ భవానీ లీలామృతం(దుర్గాభవానీదీక్ష)	25
దేవీలీలామృతం	81
శ్రీ దేవీ పూజాకల్పం	15
దేవీ భక్తిగీతాలు	15
జై భవానీదీక్ష F	9
భవానీదీక్ష P	6
దేవీ భక్తిమాల	9
శ్రీ అయ్యప్ప భజనావళి	99
అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో)	15

10. భజనలు - కీర్తనలు

అన్నమయ్య కీర్తనలు (బిగ్)	15
అన్నమయ్య కీర్తనలు (చిన్నవి)	9
శ్రీరామదాసు కీర్తనలు (బిగ్)	15
శ్రీరామదాసు కీర్తనలు(చిన్నవి)	9
త్యాగయ్య కీర్తనలు	9
సర్వదేవతా మంగళహారతులు	20
వసుంధర మంగళ హారతులు	20
సర్వదేవతా భజనలు	30
జానపదగీతాలు	20
చిట్టి పొట్టి పాటలు	9
జాతీయ గీతాలు	9
శివభక్తి మాల	9
విష్ణు భక్తిమాల	9
దేశభక్తి గీతాలు	30
సౌభాగ్య దేవతా మంగళహారతులు	30
పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు	30
గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు	30
గానవిద్యాబోధిని	90
అన్నమయ్య సంకీర్తనలు	90
పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు	30
భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్)	30
సర్వదేవతాభక్తిమణిమాల	30
బతుకమ్మ ఉయ్యాల పాటలు(జానపదగీతాలు)	30

11. హిట్స్ సాంగ్స్

ఘంటసాల భగవద్గీత	15
ఘంటసాల సుమధురగీతాలు	90
పి. సుశీల సుమధురగీతాలు	90
ఎస్.పి. బాలు సుమధురగీతాలు	90
ఎస్.జానకి సుమధురగీతాలు	90
వేటూరి సుందరరామమూర్తిహిట్స్	90
సిరివెన్నెల సీతారామశాస్త్రి హిట్స్	....
సినీభక్తిగీతాలు	90

12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

శ్రీకాంతామణి వంటలు (వెజ్)	45
శాకాహార వంటలు	20
మాంసాహారవంటలు	20
చిట్టిచిట్కాలు	20
అందానికి చిట్కాలు	20
పిల్లల పేర్లు (పెద్దది)	20
పిల్లల పేర్లు (చిన్నది)	9
లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్	30
లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్	30
చిన్నారులకు చిరుతిళ్ళు	20
పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు	20
పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు	20
వేపుళ్ళు-ఇగుర్లు	20
శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్)	45
ఇంగ్లీషులోఆడపిల్లలపేర్లు	36
ఇంగ్లీషులో మగపిల్లలపేర్లు	36
బ్రేక్‌ఫాస్ట్ వంటలు	20
పండుగలలో చేసుకొనే పిండివంటలు	20
మైక్రోవోవెన్ వంటలు	81
సర్వదేవతాభక్తిమాల	30
పిల్లలపేర్లు (బాబు)	30
పిల్లలపేర్లు (పాప)	30
మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్)	30

వివిధ రకాలు

ఎందరోమహానుభావులు	150
యోగాసనాలు	30
సూర్యనమస్కారములు	30
పొడుపుకథలు (పెద్దది)	20
పొడుపు కథలు (చిన్నవి)	5
కాలజ్ఞాన తత్త్వాలు	20
హిందీ-తెలుగు-స్వబోధిని	15

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని	15
జనరల్ నాలెడ్జ్	15
నూరు ఎక్కాలు	7
1-100 టేబుల్ బుక్	7
శ్రీరామకోటి	25
శ్రీశివకోటి	25
మేజిక్	20
అంకెలతో గారడీ	20
ప్రేమకథలు	20
యువతరంగాలు (యువతరంకోసం)	20
ప్రేమా నీకు జోహార్లు (లవ్‌డిక్షనరీ)	20
హృదయస్పందన (కవితలు)	20
వాత్స్యాయన కామసూత్రాలు	30
ఎ.పి.టూరిస్ట్ గైడు	30
ఇంద్రజాల రహస్యాలు	25
మహేంద్రజాల రహస్యాలు	25
విజయం మీదే	30
కలిసి జీవిద్దాం	30
నాదబ్రహ్మోపాసన (ధ్యానం+సంగీతంమేలు కలయిక)	90
శరీరభాష (బాడీ లాంగ్వేజ్)	90
క్రియాయోగం	30
ఆనందంగా జీవిద్దాం	81
హరిశ్చంద్ర నాటకం	45
మ్యాజిక్‌గైడ్-ట్రిక్కులు,తమాషాలు-కపటిప్రపంచం	90
చదరంగం	90
వాత్సాయనకామసూత్రాలు	90
పంచసాయకం	90
రతిరహస్యాలు	90
అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్)	90
శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్)	90
మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి)	90
మంత్రశాస్త్రమహోదధి	90
అసతోమయ సద్గమయ	36
గాయత్రీవిజ్ఞాన్	90
చింతామణి (నాటకం)	50
పాండవ ఉద్యోగం (నాటకం)	45
బాలనాగమ్మ (నాటకం)	50
కాళహస్తి స్త్రీల వ్రతకథలు	30
కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి)	45
కాళహస్తి గోవింద నామాల భగవద్గీత	25
కాళహస్తి గృహవాస్తు చింతామణి	90
కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు)	45
కాళహస్తి శివపురాణం	90

కాళహస్తి దేవీభాగవతం	90
కులార్ణవ తంత్రమ్	150
ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం(ఒరిజనల్)	250
యోగాసనాలు (VG/TNL)	30
రామరాయ వాస్తుశాస్త్రం (ముద్రగడ రామారావు)	90
ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా	9
ఎం.ఎస్.ఆర్.సుందరకాండ	70
అష్టముఖ గండభేరుండతంత్రం	75
బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల)	75
తరిగొండవెంగమాంబవిరిచిత-శ్రీవేంకటాచలమాహాత్మ్యం	150
శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం	36
గీతాంజలి (రవీంద్రనాథ్‌ఠాగూర్)	45
కాశీరామేశ్వర మజిలీ కథలు	75
శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)	500
శ్రీదేవీభాగవతం బైండు	261
శ్రీశివపురాణం బైండు	260
ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము -ఫలితజాతక సూత్రములు	595
విశ్వకర్మ ప్రకాశము	106
ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన	250
గుప్తవాస్తు వాస్తువిజ్ఞానజ్యోతి	150
నారద సంహిత	150
రాహుకేతువులు సమస్త ప్రభావములు	100
అంగారకుడు (కుజుడు)	45
పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య)	150
విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు ,,	225
వాస్తు విజ్ఞాన చంద్రిక	,,100
మహాదశా పారిజాతం	,,100
25సం॥ పంచాంగం (2000-2025)	,,250
Latitude - Longitude (English)	,, 50
జాతక నారాయణీయం(వాద్రేవువారివి)	రూ.150
వాస్తు నారాయణీయం ,,	120
యోగావళీఖండం ,,	120
ముహూర్త సింధువు ,,	150
జయభారతి (పురాణపండశ్రీనివాస్)	21
జయహే...జయహే... ,,	27
జయతు...జయతు... ,,	27
సాయి... ,,	45
శ్రీమాలిక ,,	20
ఆరతిసాయిబాబా ,,	25
అంగారకుడు	45
శుక్రుడు	45
రాహుకేతువుల సమస్త ప్రభావాలు	100

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.